సంపుటి: 18
సంచిక: 2

ఫోన్ నెం:
36959

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) రూ. 39/-
ఉచిత చందా ,, ,, 180 రూపాయలు.

సెప్టెంబరు, 1974

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదరరెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
సుజనశ్రీ
వాసవదత్త
కంచర్ల రమణ

తొలిమాట

నమస్కారము. ఈ నెల "సప్లిమెంట్"లో నాలుగు చక్కటి వెరైటీ నవలలు అందించాము. ఒక నవల హిమాలయా పర్వతాలపై మంచుకొండలలో జరుగగా, మరో నవల చంబల్‌లోయ అడవులలో నడుస్తుంది. ఆడదాని కోసం పరుగులెత్తి అష్టకష్టాలుగొని తెచ్చుకొన్న ఓ మిలట్రీ ఆఫీసరు విషాదగాధను మూడవ నవలలో చదివితే, హాస్య ధోరణిలో సాగుతుంది నాలుగవ నవల.

అనేకమంది పాఠకుల కోరికపై "హోమ్ డెలివరీ" పోటీ నిబంధనలలో ఒక చిన్నమార్పు చేశాము. 'అపరాధ పరిశోధన పోటీ', 'మీరే ఎన్నుకోండి' బ్యాలెట్‌లలో మాత్రం అందరూ పాల్గొనవచ్చును. మిగతా పోటీలలో సభ్యులకు మాత్రమే అవకాశం వుంటుంది.

హోం. డె. సభ్యులకు యీ నెలనుండి మరో సౌకర్యం కల్గించాము. సభ్యులకు పాతకాపీలు ఏవైనా కావలిస్తే వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపించే ఏర్పాటు చేశాము. ఎక్కువ కాపీలు కావలసిన వారికి కొద్దో గొప్పో కాన్సెషన్ కూడా లభిస్తుంది. 1973, 1974 సంవత్సరాలలోని కాపీలు మాత్రమే పరిమితంగా వున్నాయి. ఇతరులైతే రిజిస్ట్రేషన్ ఖర్చులు వారే భరించిడబ్బు ముందుగా పంపవలసి ఉంటుంది.

చాలామంది హోం. డె. సభ్యత్వము తీసుకోకుండా పోటీ జవాబులు పంపుతున్నారు. అవి ఎంతమాత్రం పరిశీలించబడవని మరోసారి మనవి చేస్తున్నాము. సెలవామరి—

మీ, శ్యామ దామోదర్ రెడ్డి

ఈ సంచికలో ....

కథలు

4. బూచాడొస్తాడు — వి. ఎస్. చెన్నూరి.
34. పరాయి ఆడది — వసుంధర.
70. 10 గంటలసేపు ప్రపంచానికే ప్రమాదం — కొమ్మూరి సాంబశివరావు.
92. మరణ ముహూర్తం — కంచర్ల రమణ.
146. బావమరుదులు — ఏ. వీ. మోహన్రావ్.
168. బలికోరిన వజ్రాలు-మల్లాది వెంకటకృష్ణమూర్తి.
182. గడ్డితినే మనుష్యులు — సుజనశ్రీ.

శీర్షికలు

11. అపరాధ పరిశోధన పోటీ-74.
23. పాఠకుల ప్రశ్నలు?
26. హోమ్ డెలివరీ.
59. పాఠకుల పరిశోధన పోటీ.
65. ఈ నెల జోక్స్ — ఎస్. వాహిద్.
87. మీ తీర్పు ఏమిటి?
119. అపరాధ పరిశోధన పోటీ-72 (ఫలితాలు)
125. హమేషా-హంగామా.
155. మీరే ఎన్నుకోండి? (బ్యాలెట్ ఫలితాలు)
162. ఈ నెల జోక్స్ — ఎస్. జి. బాష.
179. రీడర్స్ క్లబ్.
204. క్రాస్‌లో తమాషాలు.
221. ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ.
222. లేఖలు.

ఇంకా-చంద్ర కార్టూన్లు, చెప్తావినండి, చెప్పుకోండి చూద్దాం, వింతప్రపంచం, మరెన్నో ఆకర్షణలు!!!

బూచాడొస్తాడు!

రాత్రి 10 గం॥ లయింది. ఆలస్యంగా యింటికి చేరుకున్న ఎస్. ఐ. నాయుడు అప్పుడే స్నానపానాదులు ముగించు కుని, వరండాలో వాల్చిన కుర్చీలో మేనువాల్చాడు.

హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు, ఫోర్ నాట్ త్రీ అబ్దుల్ రహీం జోడు గుర్రాల్లా పరుగెత్తుకుంటూ వచ్చి నాయుడి ముందు ఆగారు. ఎటెన్షన్‌లో నిల్చొని "ఖూనీ సార్! ఖూనీ!" అన్నారు ఇద్దరూ ఒక్కసారిగా.

"ఏమిటి?" నాయుడు కంగారుగా తలెత్తి పోలీసు ద్వయం కేసి చూశాడు.

"అవును సార్. అవును! ఎవరో ఖూనీ చేశారు సార్!" అన్నారు ఇద్దరూ కోరస్ పాడుతున్నట్లు.

నాయుడికి వొళ్లు మండుకొచ్చింది. "ఆ చెప్పేదేదో శాంతంగా యేడవరాదూ?" నాయుడు కోపంగా చూశాడు.

ఏడుకొండలు నిజంగానే ఏడుపు ముఖం పెట్టాడు.

అబ్దుల్‌రహీం జిరాఫీలా మెడ ముందుకు సాచి, గుడ్లు మిటకరిస్తూ, భయం భయంగా గడ్డం పీక్కున్నాడు.

"మరేమరి, కళ్యాణసింగ్ ప్రొప్రైటర్ గ్లాస్ ఫ్యాక్టరీ ఇంట్లో ఖూనీ జరిగింది సార్, ఖూనీ!" ఏడుకొండలు తడుముకోకుండా నోటికొచ్చిందేదో గబగబా వాగేశాడు.

నాయుడికి నవ్వాలో ఏడవాలో తోచలేదు. కంగారు పడితే ఏడుకొండలు నోటినుండి తబ్బిబ్బు మాటలు తప్ప, సరియైన జవాబు రాదని నాయుడికి తెలుసు. అందుచేత రెండు నిమిషాల పాటు కళ్లు గట్టిగా మూసుకుని గప్‌చిప్పున వుండి పొయ్యాడు.

హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు తన్నుతాను సంబాళించు కున్నాడు.

"ఊఁ-ఇప్పుడు చెప్పు!" అన్నాడు నాయుడు తలెత్తి

ఏడుకొండలు కేసి చూస్తూ.

"మరే, మరి, గ్లాస్ ఫ్యాక్టరీ ప్రొప్రైటర్ కళ్యాణసింగ్ లేడూ. ఆయన యింట్లో ఖూనీ జరిగిందట సార్. స్టేషనుకి ఫోన్ చేశారు" అన్నాడు ఏడుకొండలు.

"అవునూ సార్, అవును" అన్నాడు అబ్దుల్‌రహీం.

నాయుడు ఐదు నిమిషాల్లో బట్టలు తొడుక్కుని సైకి లెక్కాడు. పోలీసులిద్దరూ లాఠీలు విసురుకుంటూ జోడు గుర్రాల్లా సైకిలు వెంటపడ్డారు.

సైకిలు ఊరిబైట ఓ విశాలమైన ఆవరణంలో అందంగా నిర్మించబడిన ఓ బంగళా ముందు ఆగింది. నాయుడ్ని చూడ గానే దర్వాను లేచి నిల్చుని సెల్యూట్ చేసి గేటు తలుపులు తెరిచాడు.

నాయుడు కాంపౌండు గేటు దాటుకుని లోపలికి నడిచాడు. ఇంటి యజమాని కళ్యాణసింగ్ నాయుడికి ఎదురొచ్చి లోపలికి తీసుకెళ్లాడు.

పందిటి మంచం పక్కన నేలమీద ఓ వ్యక్తి వెల్లకిలా పడి వున్నాడు. అతని గుండెల్లో ఓ కత్తి దిగబడి వుంది. ఎగజిమ్మిన రక్తంతో అతని బట్టలు తడిసి వున్నాయ్.

నాయుడు శవం దగ్గర గొంతుకూచుని శవంకేసి పరి శీలనగా చూశాడు. తరువాత గదినంతా కలయ జూశాడు. టేబుల్ మీద ఇనుప తీగలతో వొంచిన ఓ కోట్ హేంగర్, ఫెల్ట్‌హేటూ కనిపించాయి. టేబుల్ క్రింద వుండగా చుట్ట బడిన ఓ నల్లని లాంగ్ కోటూ, పిల్లలాడుకునే ఓ ప్లాస్టిక్ విజిలూ కనిపించాయి. టేబుల్ ప్రక్కనే ఓ హేండ్‌స్టిక్ వుంది.

నాయుడు రెండు నిమిషాల పాటు వాటికేసే చూస్తూ నిల్చుండి పొయ్యాడు.

శవం పక్కన నల్లగా ఏవో మిలమిల లాడాయి. నాయుడు గబుక్కున వొంగి వాటిని ఏరి తన పాంటుజేబులో భద్రం చేశాడు. మెల్లగా పక్కకి తిరిగి ఇంటి యజమాని కళ్యాణ సింగ్ కేసి చూశాడు.

"ఇతడు మా అన్నయ్య కర్తార్‌సింగ్. కలకత్తా నుంచి వచ్చి వారం రోజులైంది. అన్నయ్య తనకై ప్రత్యేకింప బడిన యీ గదిలో నిద్ర పోతూండగా బైటినుండి వూచల్లేని ఆ కిటికీ గుండా ఎవడో లోపలికి ప్రవేశించి అన్నయ్యని హత్య చేశాడు" అన్నాడు కళ్యాణసింగ్, ఎదురుగా బార్లా తెరిచి వుంచిన ఫ్రెంచ్ విండో కేసి చూపుతూ.

నాయుడు తిన్నగా ఫ్రెంచ్ విండో కేసి నడిచి విండో లోంచి బైటికి తొంగి చూశాడు.

కళ్యాణసింగ్ అన్నట్టు హంతకుడు బైటినుండి ఆ కిటికీ గుండా లోపలికి వచ్చి హత్య చెయ్యడానికి అనువుగానే వుంది. కాని హంతకుడి తాలూకు అడుగుజాడలు కానీ వస్తువులు కానీ ఏమీ కనిపించ లేదు.

నాయుడు గిరుక్కున వెనక్కి తిరిగి తిన్నగా శవం వద్దకి చేరుకున్నాడు.

"మీ అన్నయ్యకి శత్రువు లెవరైనా వున్నారా?"

"ఏమో నాకు తెలీదు. కాని అలాంటి వారికి శత్రువు లుండడంలో ఆశ్చర్యం లేదు. అన్నయ్య చిన్నప్పటి నుండి అలగాజనంతో చేరి అల్లరి చిల్లరగా తిరిగేవాడు. ఇంటి పట్టున వుండేవాడు కాదు. పెళ్లీ పెటాకుల్లేవు. ప్రస్తుతం కలకత్తాలో వుంటున్నాడు. ఏం వ్యాపారం చేస్తున్నాడో తెలీదు" అన్నాడు కళ్యాణసింగ్.

నాయుడు పక్కకి తిరిగాడు. అతని పక్కనే తలుపు నానుకుని నిల్చుని వుందో యువతి. ఆమెను చూడగానే

నాయుడి కళ్ళు జిగేలు మన్నాయ్.

సన్నని పంజాబీ దుస్తుల్లోంచి పచ్చటి శరీరం. అందమైన శరీరపు వొంపులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బెదిరిన లేడి కళ్ళకి మల్లే ఆమె విశాల నేత్రాలు కదులుతున్నాయి. నల్లని కురులు నుదుటి మీద జీరాడుతున్నాయి. ఎత్తుగా, బలిష్టంగా, పోతపోసిన బంగారు విగ్రహంలా వుంది.

నాయుడు క్షణకాలం ఆమెకేసే చూస్తూ నిల్చుండి పొయ్యాడు.

"ఈమె నా మిసెస్-కల్యాణి!" కల్యాణసింగ్ ఆమెను నాయుడికి పరిచయం చేశాడు.

'కల్యాణి అంత అందగత్తె కాబట్టే ప్రధమ కళత్రం చనిపోయిన తరువాత దాదాపు ఐదేళ్లపాటు ఎవరెంత చెప్పినా పెళ్ళి చేసుకోనని భీష్మించుకు కూర్చున్న కళ్యాణసింగ్, చుట్టం చూపుగా కలకత్తా వెళ్ళి, తలవని తలంపుగా కలుసుకున్న కల్యాణిని ప్రేమించి, క్షణాల మీద ముహూర్తం పెట్టించి పెళ్ళాడాడు' అనుకుంటూ అక్కడ్నించి ముందుకి కదిలాడు నాయుడు.

అంతలో పైనుండి ఏదో చప్పుడు వినిపించగా అందరూ మెట్లకేసి చూశారు. మేడమీద గదిలోంచి వినిపిస్తోందా చప్పుడు. ఎవరో దబదబా తలుపులు బాదుతున్నారు.

"ఎవరక్కడ?" నాయుడు మెట్లకేసి అడుగేశాడు.

"అమ్మాయి! ఆమె ఆరోగ్యం బాగోలేదు. శవాన్ని చూస్తే భయపడుతుందేమోనని గదిలో పెట్టి తలుపు వేసి వచ్చాను" అన్నాడు కల్యాణసింగ్ కంగారుగా.

నాయుడు సాలోచనగా తల పంకించి గబగబా మెట్లెక్క సాగాడు. కల్యాణసింగ్, అతని భార్య కల్యాణీ నాయుడ్ని అనుసరించారు.

నాయుడు బైట గొళ్ళెం తీసి తలుపులు తెరిచాడు.

సన్నగా. పొడుగ్గా అస్థిపంజరంలాంటి ఓ ఆకారం బైట కొచ్చింది.

గుంటకళ్ళు. చప్పి దవడలు. చీపురు పుల్లలాంటి చేతులు. గుంటల్లో మిలమిలలాడుతున్న కళ్ళు!—

ఆమెకు పన్నెండేళ్ళుండవచ్చు. ఆమెవొంటిమీద గిల్లె త్తను కండలేదు. ఆయాసంతో రొజుతోంది. నడవలేక తూలుతోంది. వెర్రిచూపులు చూస్తోంది.

నాయుడుకేసి తేరిపారజూచి "ఎవరు? ఇన్‌స్పెక్టరా? ఎందుకొచ్చారు? పెదనాన్నని హత్యచేసిందెవరో తెలుసు కునేందుకు వచ్చారా? తెలుసుకొని అరెస్టుచేసి తీసుకుపోదా మని వచ్చారా? మీవల్లకాదు! అతడ్ని మీరు అరెస్టు చెయ్య లేరు? నాకుతెలుసు అతడు ఎవరికీ దొరకడు! అతడ్ని అరెస్టు చెయ్యాలంటే బ్రహ్మదేవుడితరంకూడా కాదు! అవును! నాకు బాగా తెలుసు!" అంటూ చప్పట్లుచరుస్తూ అడుగు ముందుకి వెయ్యబోయి ముందుకి తూలబోయింది.

నాయుడు ఆమెను పట్టుకొన్నాడు. "ఎవరు పాపా? మీ పెదనాన్నని హత్యచేసిం దెవరు? నువ్వు చూసావా?" అని ప్రశ్నించాడు.

"నేను చూడకేం? చూసాను? ఇంకెవరు? బూచాడు! ఇంతవాడుగా కనిపించి. అంతెత్తుకి ఎగిరిపోతాడేవాడు! కత్తి తీసుకొని పెదనాన్న గుండెల్లో పొడిచేసాడు! ఎందుకోతెలుసా బూచాడంటే పెదనాన్నకి భయంలేదు. అందుకని బూచాడికి పెదనాన్నంటే కోపం!"

"ఏమిటి? బూచాడా?"

"అవును. బూచాడే! మీరెప్పుడూ చూళ్లేదా? బూచాడ్ని?"

"ఊహూఁ లేదు! ఎలావుంటాడేమిటి?"

''సన్నగావుంటాడు. గాల్లో తేలుతూ, తూలుతూ నడుస్తాడు. మొదట పొట్టిగాకనిపించి చూస్తూండగానే అంతెత్తుకి ఎగిరి పోతాడు. అతన్నెవరూ పట్టుకోలేరు'' అంది అమ్మాయి.

నాయుడికేమీ అర్థంకాలేదు.

కళ్యాణసింగ్ కల్పించుకొన్నాడు—''నాయుడుగారూ! మీరు అమ్మాయి మాట వినకండి! ఆమె ఏం చెబుతున్నదీ ఆమెకే తెలీదు. ఆమె బుద్ధి ఆమె స్వాధీనంలో లేదు. ఏదేదో పిచ్చిపిచ్చిగా వాగేస్తుంది. ఆమెమాట నమ్మకండి!'' అంటూ తిన్నగా అమ్మాయివద్దకు నడిచాడు. ''నువ్వూరికే మాట్లాడకు తల్లీ! నీకు వొంట్లో బాగాలేదు. నీగదిలో రెస్టుతీసుకొంటువుగాని రాతల్లీ! రా!'' అంటూ ఆమెను బుజ్జగించ సాగాడు.

''మాశారా ఇన్‌స్పెక్టర్! ఈయింట్లో నామాట ఎవరూ నమ్మరు! అసలు బూచాడు గీచాడు ఎవరూలేదంటారు. నాకు పిచ్చిపట్టిందట. నేనేం మాట్లాడుతున్నదీ నాకే తెలీదట. పెదనాన్నకూడా ఇలాగే అన్నాడు. అందుకనే బూచాడికి పెదనాన్నమీద కోపమొచ్చింది. కత్తితోపొడిచి చంపేసాడు. ఇలాగే అంటూంటే బూచాడికి మీ అందరిమీదా కోపమొచ్చి కత్తితోపొడిచి చంపేస్తాడు. బూచాడు చాలాచెడ్డవాడు'' అమ్మాయి ఆయాసంతో వొగరుస్తూ తనగదిలోకి వెళ్ళి పోయింది.

''ఏమిటిది మిష్టర్ కల్యాణ్‌సింగ్? అమ్మాయికి జబ్బేమిటి?'' ప్రశ్నించాడు నాయుడు.

''క్రిందకి వెళదాం పదండి!'' కళ్యాణసింగ్ మేడదిగి క్రిందగదిలో చేరుకొన్నాడు. నాయుడు అతడ్ని అనుసరించాడు. ఇద్దరూ గదిలో చెరోకుర్చీలో కూర్చున్నారు.

''మీకిదివరకే చెప్పాను అమ్మాయికి ఆరోగ్యం సరిగా

అపరాధ పరిశోధన పోటీ-74

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసలు పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 30-9-'74 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు నవంబర్ '74 నెల సంచికలో ప్రకటిస్తాము.

1. ఇతనంటే అందరికీ చులకనే_? (బంట్రోతు, బఫూన్.)

2. ఈ రాష్ట్రంలో వరదల భీభత్సంవల్ల పంటలు విపరీతంగా నష్టమయ్యాయి_? (కేరళ, బెంగాల్.)

3. కత్తిలో ఇవి రికార్డు స్థాయికి చేరుకున్నాయి_? (నూనెలు, మందులు.)

4. కోర్టుకెక్కితే ఇది పోతుందని కొందరి భయం_? (పరువు, డబ్బు.)

5. అనుకరించడం వీరెక్కువగా చేస్తుంటారు_? (కన్నెపిల్లలు, పసిపిల్లలు.)

లేదని. ఎంతమంది డాక్టర్లకిచూపినా ఏంజబ్బో తెలుసుకో లేకపోయారు. రాత్రిళ్ళు నిద్రలో కెవ్వుమని కేకేస్తుంది. ఏదేదో పలవరిస్తుంది. ఎవడో సన్నగా, పొడుగ్గా, గాల్లో తేలుతూ, తూలుతూ కనిపిస్తాడట. 'నువ్వు కలగన్నావు తల్లీ' అంటే నమ్మదు. 'నేను నాకళ్ళతో చూసాను, కలగాదు, నాకురోజూ కనిపిస్తా' డంటుంది. సంవత్సరం రోజులుగా ఇలాతయారైంది. తన గదివిడిచి ఎక్కడికీ వెళ్ళదు. రోజు రోజుకీ చిక్కిపోతోంది. ఏంచెయ్యాలో అర్ధంకావడంలేదు'' అన్నాడు కల్యాణ్ సింగ్ బరువుగా నిట్టూరుస్తూ.

నాయుడు సాలోచనగా తలపంకించి కుర్చీలోంచి లేచి, తిన్నగా గదిలోంచి బైటికి నడిచాడు.

ఇంటిబైట ఆవరణచుట్టూ ఎత్తయిన మదురుగోడ, ఆవరణలో అందంగాపెంచిన పూలమొక్కలు, మధ్యమధ్య కాంతులు వెదజల్లుతోన్న ఫ్లోరోసెంట్ దీపాల వెలుగులో అందంగా నందనవనంలా వుంది పూలమొక్కలు. పిచ్చివాడికిమల్లే ఆవరణంతా కలియతిరిగి తిన్నగా గేటుదగ్గరికి నడిచాడు. రెండు నిమిషాలపాటు దర్వానుతో మాట్లాడి వెనక్కి తిరిగాడు. శవంపడివున్న గదిబైట తెరిచివున్న ఫ్రెంచ్ విండో దగ్గరికి చేరుకున్నాడు.

''మిష్టర్ కల్యాణ్ సింగ్! ఈఇంట్లో మీ ముగ్గురు తప్ప మరెవరైనా వుంటున్నారా?'' అని ప్రశ్నించాడు.

కల్యాణ్ సింగ్ లేరన్నట్టు తలూపాడు.

''అయితే హంతకుడెవడో మీకుతెలుసు! మీరు నిజాన్ని దాస్తున్నారు'' అన్నాడు అతనికళ్ళల్లో సూటిగాచూస్తూ.

కల్యాణ్ సింగ్ మాట్లాడలేదు. నిర్ఘాంతపోయి నాయుడు కేసి చూస్తూ నిల్చుండిపొయ్యాడు.

''పైవాడెవడూ యీఇంట్లోకి ప్రవేశించే వీలులేదు. గేటు

దగ్గర కాపలావున్న దర్వాను సామాన్యుడుకాడు. అతని కంట్లో దుమ్ముకొట్టి ఇంట్లోకి ప్రవేశించే ఆస్కారం పైవా డెవడికీ లేదు.''

కల్యాణ్‌సింగ్ మాట్లాడలేదు. అతని కళ్ళల్లో నీళ్ల తిరిగాయి. ఏమాత్రంకదిపినా భావురుమనేలా వున్నాడు.

''డోన్ట్‌వర్రీ మిష్టర్ కల్యాణ్‌సింగ్!'' నాయుడు అతని భుజంమీద మెల్లగాతట్టాడు. ''నిజం నిప్పులాంటిది! సత్యాన్ని దాచడం సామాన్యుడి సాధ్యంకాదు! మీరు చెప్పకపోయినా నిజాన్ని బైటకిలాగడం నా కర్తవ్యం! నేను నా ధర్మాన్ని నిర్వహించాలిగా?'' అంటూ అక్కడ్నించి బైలుదేరి మేడ మీదకి చేరుకున్నాడు. ఒక్కొక్కగదీ పరిశీలిస్తూ మేడమీది గదులన్నీ తిరుగుతున్నాడు.

ఒకగదిలో ఓ అపురూప సౌందర్యవతి తాలూకు లైఫ్ సైజు ఫోటో కనిపించింది. నాయుడు పక్కకితిరిగి ''ఈవిడ మీ మొదటి భార్యకదూ?'' అని ప్రశ్నించాడు.

కల్యాణ్‌సింగ్ అవునన్నట్టు తలూపాడు. నాయుడు బుర్రలో ఏదో కలుక్కుమంది. అక్కడ్నించి బయలుదేరి తిన్నగా కల్యాణసింగ్ కుమార్తెతాలూకు గది వద్దకి చేరుకొన్నాడు.

''మీ అమ్మాయి పేరేమిటన్నారు?''

''సరిత.''

''సరితతో నేను కొన్నివిషయాలు మాట్లాడాలి, మీకభ్యంతరమా?''

కల్యాణ్‌సింగ్ వెంటనే జవాబు చెప్పలేదు. ''నేనిదివరకే చెప్పాను, అమ్మాయికి వొంట్లో బాగోలేదని. ఆమె ఏం మాట్లాడుతుందో ఆమెకే తెలీదు'' అన్నాడు.

''మరేం ఫరవాలేదు మిష్టర్ కల్యాణ్‌సింగ్! ఆమె చెప్పిం

దంతా నిజమని నేను నమ్మడంలేదు. కాని ఆమెనుండి తెలుసుకోవలసిన విషయాలు కొన్ని వున్నాయ్. ఆమెనుండి నిజాన్ని రాబట్టడం ఎలాగో నాకు తెలుసు'' అన్నాడు నాయుడు.

కల్యాణ్‌సింగ్ మారుపలకలేదు.

నాయుడు మెల్లగా తలుపు తట్టాడు. సరిత తలుపు తెరిచి బైటికి తొంగి చూసింది.

''నేను పాపా, ఇన్‌స్పెక్టర్ని'' అన్నాడు నాయుడు.

''మీకు బూచాడు కనిపించాడా?'' ప్రశ్నించింద సరిత.

''కనిపించాడమ్మా! నన్ను చూచి దాక్కున్నాడు! కాని నేను వాడ్ని విడిచిపెట్టను! వాడి అంతు తేల్చుకునేదాకా నే నిక్కడ్నించి కదలను!'' అన్నాడు నాయుడు.

''ఏమిటి? బూచాడు మీకు కనిపించాడా?'' ఆశ్చర్యంగా ప్రశ్నించింది సరిత.

''అవునమ్మా కనిపించాడు. నాకు మంత్రాలుకూడా వచ్చు. అందుకని నన్నుచూచి కనిపించకుండా పారిపోయి దాక్కున్నాడు.''

''ఏమిటి? మీకు మంత్రాలుకూడా వచ్చా?''

''అవునమ్మా! వచ్చు!''

''అయితే ఇకనేం! వాడ్ని అరెస్టుచేసి తీసికెళ్ళండి. ఇన్‌స్పెక్టర్! వాడు మహా చెడ్డవాడు! నాన్నగార్ని పిన్నినీ చంపుతాడు! వాడ్నెలాగైనా అరెస్టుచేసి తీసుకెళ్ళండి ఇన్‌స్పెక్టర్!'' సరిత బ్రతిమాలింది.

''నేనొచ్చింది అందుకే గదమ్మా! నేనడిగిన ప్రశ్నలకి నువ్వు సరియైన జవాబులు గనక చెబితే తప్పకుండా వాడ్ని వెతికి పట్టుకుంటాను అరెస్టు చేసి తీసికెళతాను.''

''తప్పకుండా చెబుతాను. అడగండి ఇన్‌స్పెక్టర్!''

''బూచాడు నీకు రోజూ కనిపిస్తాడుకదూ?''

"అవును. అందరూ నిద్రపోయిం తరువాత, అంతా సద్దుమణిగిం తరువాత క్రింది హాల్లోంచి బయలుదేరి వస్తాడు."

"అప్పుడు నువ్వూ నిద్రపోతూనే వుంటావుగా, నువ్వెలా చూస్తావ్?"

"అమ్మో నేనెందుకు నిద్రపోతాను? బూచాడొస్తాడని నాకు తెలుసుగా? చిన్న పిల్లలు నిద్రపోతే బూచాడెత్తుకుపోతాడు. అందుకని వాడు వెళ్ళేదాకా తలుపు సందులోంచి చూస్తూనే వుంటాను. వాడు వెళ్ళిం తరువాత తలుపు గడియ పెట్టుకుని నిద్రపోతాను. ఎప్పుడయినా వాడు రాకపోతే నేనా రాత్రంతా నిద్రేపోను నేను నిద్రపోతే వాడెత్తుకుపోతాడేమోనని భయం! ఒకవేళ వొళ్ళు మరిచి నిద్రపోయినా వాడొచ్చేవేళకి మేలుకుంటాను."

"వాడొచ్చే విషయం నీకెలా తెలుస్తుంది?"

"ఎందుకు తెలీదూ? — బాగా తెలుస్తుంది! — వాడొచ్చేప్పుడు పిల్లిలాగానో, పక్షిలాగానో కూస్తాడుగా?"

"అలాగా?" నాయుడు సాలోచనగా తల పంకించాడు. "ఇంతకీ నిద్రపోయే పిల్లల్ని బూచాడెత్తుకుపోతాడని నీకెవరు చెప్పారు?"

"ఒకరు చెప్పాలేమిటి? నాకు తెలీదూ? చిన్నప్పుడు నేను అల్లరిచేస్తే 'బూచాడొస్తాడు కళ్లు మూసుకుపడుకో' మనేది అమ్మ. 'మరి నన్నెత్తుకుపోడా?' అని అడిగితే 'నేనున్నాగా? పెద్దవాళ్ళుంటే పారిపోతాడు' అనేది. అమ్మపోయాక ఆయమ్మా. ఆ తరువాత పిన్నీ అందరూ ఆ మాటే అనేవాళ్ళు! అమ్మా, ఆయమ్మా, పిన్నీ వీళ్ళందరూ అబద్ధాలు చెప్పరుగా?" అంది సరిత.

"వెరిగుడ్! నువ్వు చాలా మంచి పిల్లవి! ఐదు నిమిషాలాగు! మంత్రంవేసి వాడ్ని బంధించి పట్టుకొస్తాను. నువ్వి

క్కడే నిల్చునీ బూచాడ్ని గుర్తుపట్టు? నేనుండగా వాడు నిన్నేమీ చెయ్యడు। భయపడకుండా చూడాలి మరి।''అన్నాడు ఆమెను బుజ్జగిస్తూ.

''ఓ। అలాగే। మరి మీరు వాడ్ని అరెస్టుచేసి తీసుకెళ తారుగా?'' అంది సరిత.

''తప్పకుండా। వాడ్ని నా వెంట తీసికెళ్ళి బంధిస్తాను. మళ్ళీ నీకు కనిపించడు। ధైర్యంగా వుంటావుకదూ?''అంటూ అక్కడ్నించి కదిలాడు నాయుడు.

''విన్నారా అమ్మాయి మాటలు?'' అన్నాడు కల్యాణ సింగ్.

నాయుడు చిన్నగా నవ్వాడు. ''మిస్టర్ కల్యాణ్ సింగ్। అమ్మాయి చెప్పిందాంట్లో అబద్ధ మేమీలేదు. ఈ యింటిని ఓ దయ్యం పట్టుకొంది. ఇంతకాలం మీ కుటుంబాన్ని నానా హింసలు పెడుతోంది. ఈ రోజుటితో దాని ఆయువు మూడింది'' అన్నాడు నాయుడు.

నాయుడు చెబుతున్నదేమిటో అర్థంకాలేదు కల్యాణ్ సింగ్ కి.

''మీరు ఇక్కడే ఆగండి। నేనిప్పుడా బూచివాడ్ని ప్రవేశ పెడతాను'' అంటూ గబగబా స్విచ్ బోర్డు దగ్గరికి నడిచి మేడమీధి దీపాలన్నీ ఆర్పేసి. మెట్లుదిగి క్రింద హాల్లోకి చేరు కొన్నాడు.

హాల్లో ట్యూబులైటు ఆర్పి మామూలు బల్బు వెలిగించాడు. పోలీస్ లిద్దరికీ ఏవో ఆదేశాలిచ్చి శవమున్న గదికేసి నడిచాడు.

లంకంత మేడలో క్రింది హాల్లోతప్ప మరెక్కడా దీపాలు వెలగడంలేదు. నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. కల్యాణసింగ్, అతని కుమార్తె సరితా మేడమీద గదిలో కూచుని మెట్ల

మీదుగా హాల్లోకి చూస్తూన్నారు.

ఉన్నట్టుండి నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఏదో పిట్ట కూత వినిపించింది.

"అదిగో! బూచాడొస్తున్నాడు! తలుపులు మూసెయ్యండి నాన్నగారూ!" అంది సరిత భయంతో కళ్ళు గట్టిగా మూసుకుంటూ.

"మరేం ఫరవాలేదమ్మా! నేనున్నాగా? బూచివాడు నిన్నేమీ చెయ్యలేడు" అన్నాడు కల్యాణసింగ్, అయోమయ స్థితిలో.

హాలు మధ్యనుండి ఓ మానవాకారం మెల్లగా పైకి లేచింది. కాళ్ళూ చేతులూ గాల్లో తేలుతున్నయ్. తూలుతూ ముందుకి కదులుతోంది.

"బూచాడొస్తున్నాడు! బూచాడొస్తున్నాడు!" అంటూ గట్టిగా తండ్రిని కావులించుకుంది సరిత.

కళ్యాణ్‌సింగ్‌కి శరీరంలో వణుకు పుట్టుకు రాసాగింది. విస్తూపోయి ఆకారంకేసే చూస్తున్నాడు కల్యాణ్‌సింగ్.

ఆకారం ముందుకి కదులుతోంది. క్షణక్షణానికీ పొడుగు పెరుగుతోంది. పిట్టలా కూస్తోంది. పిల్లిలా అరుస్తోంది. కల్యాణ్‌సింగ్‌కి అర్థంకాని భయమేదో ఆవహిస్తోంది. గజగజలాడిపోతూ కూతుర్ని గుండెలికి హత్తుకున్నాడు.

మానవాకారం ఒక్కొక్క మెట్టూ పైకెక్కుతోంది. తూలుతూ, గాల్లో తేలుతూ ముందుకి కదులుతోంది. తిన్నగా వెళ్ళి సరిత గదిముందు గుమ్మంలో ఆగింది.

"ఏం పాపా! రోజూ నీకు కనిపించే బూచాడు వీడే కదూ?" ఆకారం వెనకనుండి నాయుడి గొంతుక వినిపించింది.

"అవును, వీడే! వెంటనే యిక్కడ్నించి తీసికెళ్ళండి! నాకు భయంగా వుంది!" సరిత కళ్ళు మూసుకునే జవాబు చెప్పింది.

"నీ కెందుకమ్మా భయం? వీడి ప్రాణాలన్నీ నా చేతుల్లో వున్నాయిగా? నేనుండగా వీడు నిన్నేమీ చెయ్యలేడు. కళ్ళు తెరువ్ పాపా! కళ్లు తెరిచి బాగా చూడు!" నాయుడు గొంతుక అంది.

సరిత భయం భయంగానే కళ్ళు తెరిచింది. తక్షణం భవనంలోని దీపాలన్నీ వెలిగాయి.

"ఏమిటిది?" సరిత ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

పకపకా నవ్వుతూ నాయుడు ఆకారం వెనక నుండి బైటి కొచ్చాడు. "ఈ బూచివాడ్ని తయారు చేసింది నేనే తల్లీ! ఎలాగో తెలుసా? ఇది హాండ్‌స్టిక్! హాండ్‌స్టిక్ పై కొసకి కోట్ హాంగర్ ఫిక్స్ చేశాను. కోట్ హాంగర్‌కి లాంగ్ కోట్ తొడిగాను. లాంగ్‌కోట్ పైన హాండ్‌స్టిక్ కొసకి ఫెల్ట్ హాట్ తగిలించాను. నేను హాండ్‌స్టిక్ పట్టుకుని లాంగ్ కోటులో దూరాను. ఇప్పుడు పూర్తిగా బూచివాడు తయారయ్యాడు. నేను నడుస్తూంటే బూచివాడు నడుస్తున్నట్టే వుంటుంది. చేతులూ, తలా గాల్లో తేలుతూ వుంటాయి. నా చేత నున్న హాండ్‌స్టిక్‌ని పైకెత్తితే బూచివాడు పైకెదుగుతాడు. క్రిందికి దించితే మరుగుజ్జులా తయారవుతాడు. ఇదిగో ప్లాస్టిక్ విజిల్! దీన్ని వూదితే పిట్టలాగా పిల్లిలాగా శబ్దమొస్తుంది. ఇదమ్మా నువ్వింతకాలం చూస్తోన్న బూచివాడు. కావలిస్తే నువ్వు కూడా తయారు చేసుకోవచ్చు!" అన్నాడు.

"అలాగా? బూచివాడంటే ఏమో అనుకున్నాను! అయితే బూచివాడ్ని నేను కూడా తయారు చేసుకోవచ్చన్న మాట! భలే! భలే!" సంతోషంగా చప్పట్లు కొట్టింది సరిత.

కల్యాణసింగ్ కళ్ళప్పగించి, నోట మాటరాక అంతా వింతగా చూస్తున్నాడు.

అంతలో ఎవరో కెవ్వుమని అరిచి నట్టయితే, అందరూ ఆ శబ్దం వినవచ్చిన వేపు పరుగెత్తారు.

కల్యాణ్ సింగ్ భార్య కల్యాణి ముఖాన్ని అరచేతులలో దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలూ, ఫోర్ నాట్ త్రీ అబ్దుల్ రహీం చెరోప్రక్క నిల్చుని వున్నారు.

నాయుడ్ని చూడగానే "మరేసురి, ఈవిడగారేమో మేడ మీంచి క్రిందికి దూకి ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించింది సార్. ఈమెను క్రిందికి దూక్కుండా గట్టిగా పట్టేసుకున్నాం" అన్నాడు హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు.

"ఏమిటి? కల్యాణి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిందా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు కల్యాణసింగ్.

"అవును. తన బండారం బైటపడి పోయిందన్న భయంతో ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది" అన్నాడు నాయుడు.

కల్యాణసింగ్ కేమీ అర్థంకాలేదు.

"కల్లబొల్లి కథలుచెప్పి పసిదాని బుర్ర పాడుచెయ్యడమే గాక, బూటకపు దయ్యాన్ని సృష్టించి సరిత మానసికంగా కృంగిపోవడానికి కారకురాలైంది. మీ అన్నయ్య కల్యాణి ఆడుతోన్న నాటకాన్ని పసికట్టాడు. తన రహస్యం బైట పడిందన్న అక్కసుతో అతనిమీద కక్షకట్టింది కల్యాణి. తన రహస్యం అతనిద్వారా బైటపడక ముందే అతడ్ని హతమార్చింది!" అన్నాడు నాయుడు.

కల్యాణి మాట్లాడలేదు. ముఖాన్ని చేతిలో దాచుకొని వెక్కి వెక్కి ఏడవసాగింది.

"ఓసి, దయ్యమా! ఎంతపని చేశావ్" కల్యాణసింగ్ కళ్ళల్లో నిప్పులు కురిపించాడు.

కల్యాణి చేతులకి బేడీలు తొడగబడ్డాయ్.

నాయుడు చిన్నగా నవ్వాడు. "మిస్టర్ కల్యాణ్ సింగ్. కల్యాణి చట్టరీత్యా హంతకురాలే కావచ్చు! కాని యీ అనర్ధా లన్నింటికీ కారకులు మీరు. చనిపోయిన మీ మొదటి భార్యను మీరు మరిచిపోలేక పోతున్నారు. ఆమె ప్రతిరూప మైన సరితను మీరు అమితంగా ప్రేమిస్తున్నారు. మీరు మీఅమ్మాయి కోసమైనా మళ్ళీపెళ్ళి చేసుకోకుండా వుండవల సింది. కనీసం, మీకు వారిపైనవున్న ప్రేమను మీ ద్వితీయ కళత్రం ఎదుట వ్యక్తపరచకుండా వుండవలసింది. కాని మీరలాచెయ్యలేదు. పైగా మీ మొదటిభార్య తాలూకు లైఫ్ సైజుఫోటోని మీడ్రాయింగ్ రూములో వుంచుకొని ఆమె మీద మీకుగల ప్రేమను బహిర్గతం చేసుకోవడం యీఅనర్ధా లకు దారితీసింది.

కల్యాణి యవ్వనంలో వున్న స్త్రీ. ఇలాంటి పరిస్థితిలో ఆ వయసులోవున్న ఏస్త్రీ అయినా యీర్ష్యపడకుండా వుండదు. మీ ప్రధమ కళత్రంమీద యీర్ష్యను, ఆమె ప్రతిరూపమైన సరితద్వారా తీర్చుకోవాలనుకొంది. సరిత బుర్రపాడుచేసి, పిచ్చిపిచ్చి భయాలకు లోనుచేసి తన కక్ష తీర్చుకోసాగింది. తను చేసిన మొదటి నేరాన్ని కప్పిపుచ్చుకొనేందుకు మరో నేరం చెయ్యవలసి వచ్చింది" అన్నాడు నాయుడు.

కల్యాణ్ సింగ్ మాట్లాడలేదు.

"ఈకేసులో నాకర్ధంకాని విషయమొకటుంది. నేనిక్క డికి రాగానే ఎదురుగావున్న ఫ్రెంచ్ విండోకేసి చూపుతూ అన్నయ్య నిద్రపోతుండగా బైటనుండి వూచల్లేని ఆ కిటిక

గుండా ఎవడో లోపలికి ప్రవేశించి హత్యచేసాడని అబద్ధ మాడారు. నిజానికి ఆ తలుపు తెరిచివుంచింది మీ అన్నయ్య కాదు! మీరు! మీరెందుకు చెయ్యవలసి వచ్చిందో నా కర్థం కావడంలేదు'' అన్నాడు నాయుడు.

కల్యాణ్‌సింగ్ ఆశ్చర్యంగా కళ్లు పెద్దవిచేసి ''నిజమే! ఆ తలుపుని నేనే తెరిచి వుంచాను. కాని....''

అతడు మాట పూర్తిచెయ్యకముందే నాయుడు అందు కొన్నాడు. ''ఈ చలికాలం గదిలోవున్న వాళ్ళెవరూ కిటికీ తలుపులు బార్లా తెరిచివుంచి పడుకోరు. మరీ అంత గాలి అవసరమైతే సీలింగ్‌ఫాన్ వుండనేవుంది వుపయోగించుకోవ డానికి'' అంటూ కల్యాణ్‌సింగ్‌కేసి చూసాడు.

''నిజమే! ఆ కంగారులో నే నీ విషయం గుర్తించలేక పొయ్యాను'' అన్నాడు కల్యాణ్‌సింగ్.

''నే నడిగిన ప్రశ్నకి జవాబు చెప్పలేదు'' అన్నాడు నాయుడు.

కల్యాణ్‌సింగ్ బరువుగా నిట్టూర్చి ''అన్నయ్య శవం కంటబడగానే అమ్మాయి సరితే యీహత్య చేసిందని అను మానించాను. మతిస్థిమితంలేని ఓ అర్భకురాలు హంతకు రాలుగా నిరూపింపబడడం నాకిష్టంలేదు. అందుకనే ఫ్రెంచ్ విండో తలుపుతెరిచి అలా అబద్ధమాడవలసి వచ్చింది'' అన్నాడు.

''మీరు సరితను ఎందుకు అనుమానించారు?''

''నిన్నటిరాత్రి భోజనానంతరం అన్నయ్యా, నేనూ హాల్లో కూచుని కబుర్లు చెప్పుకొంటున్నాం. అమ్మాయి సరిత అక్కడికి పరుగెత్తుకువచ్చి బూచాడు కనిపించాడని

చెప్పింది. అన్నయ్యకి దయ్యాలూ భూతాలూ అంటే నమ్మకంలేదు. పైగా చిన్నపిల్లలతో ఎలా వ్యవహరించాలో ఆయనకి తెలీదు. పకపకా నవ్వేసి 'బూచివాడూలేడు గీచి వాడూలేడు. వెళ్ళిపడుకో!'' అన్నాడు. ఈవిషయమై అన్నకీ ఆమెకీ వాగ్వాదం జరిగింది. అమ్మాయికి అమితంగా కోప మొచ్చి 'మీరే చూస్తారుగా! రాత్రికి ఆ బూచివాడే వచ్చి పెద నాన్నను చంపేయకపోతే నాపేరు సరితే కాదు' అంది సరిత. అన్నయ్య యిదంతా నవ్వులాట కింద తీసేశాడేకాని. సీరి యస్‌గా తీసుకోలేదు. నేను శవాన్ని చూడగానే అమ్మాయి విషయం గుర్తుకొచ్చింది. పిచ్చిలో అదే ఏమైనా చేసిందేమో ననుకున్నాను'' అన్నాడు కల్యాణ్‌సింగ్.

''మిస్టర్ కల్యాణ్‌సింగ్! మీ అన్నయ్యలాంటి వ్యక్తిని గుండెల్లో పొడిచి చంపాలంటే సరితలాంటి అర్భకురాలివల్ల అయ్యే పనికాదు. మీరు హత్యా ప్రదేశాన్ని మరింత పరి శీలనగా చూచివుంటే హత్యకు కారకులెవరో యిట్టే పసికట్టి వుండేవారు'' అంటూ నాయుడు తన పాంటు జేబులోంచి నల్లని గాజు పెంకులు బైటికి తీశాడు.

''ఇవి శవం పక్కన పడి వున్నాయి. కల్యాణి మీ అన్నయ్య గుండెల్లో కత్తి దించేప్పుడు ఆమె చేతికి తొడు క్కున్న గాజులు చిట్లి రాలి వుంటాయి. ఆమె దాన్ని చూచుకోలేదు. ఆమే గనక వాటిని హత్యా ప్రదేశంలోంచి దూరం చేసివుంటే యీ కేసు ఇంత సులభంగా తేలేది కాదేమో!'' అన్నాడు నాయుడు.

కల్యాణ్‌సింగ్, నాయుడికేసి గుటప్పగించి చూస్తూ నిల్చుండి పోయాడు!

★

పాఠకుల ప్రశ్నలు

ఎన్. శ్రవణ్‌కుమార్, సోమాజిగూడ.

ధరలు ఆకాశాన్నంటేటట్లు పెరుగుతుంటే, ప్రభుత్వం ఏమిచేస్తున్నట్లు?

ఉడతాభక్తిగా తనూ కొంత పెంచుతునే వున్నదికదా ధరలు, టాక్సులు.

కె. మధుసూదనరావు, నిజామాబాద్.

ఒక్కసారి బహుమతిపొందినవారు రెండవసారి పోటీలో గెలుపొందుటకు అర్హులో, కారో తెలుపగలరు?

ఒక్కొక్కరు ఎన్ని బహుమతులైనా గెలవవచ్చును. ఇప్పటికి నాలుగైదు బహుమతులకుపైగా పొందిన పాఠకులు చాలామందే వున్నారు.

కె. క్రిష్ణ, మల్కాజిగిరి.

శ్రీమతి ఇందిరాగాంధీ బీబీనగర్ నుండి నడికుడి రైలు మార్గానికి ప్రారంభోత్సవం చేశారు. కాని నిర్మాణం ఇంకా మొదలుపెట్టలేదు. ఎందుకని?

విశాఖ ఉక్కు కర్మాగారానికికూడా శ్రీమతి ఇందిరా గాంధీయే శంఖుస్థాపన చేశారు. దానికింకా స్థలసేకరణ గూడా జరగలేదు. ఏదైనా తెలుగువారికి అదృష్టం కలిసి రావాలి.

కూచిబొట్ల శ్రీనివాసశాస్త్రి, గుడివాడ.

శ్యాంజీ! మానవుని దానవునిగా మార్చేదేమిటి?

ఆశ; అత్యాశ.

సి. హెచ్. దుర్గావరప్రసాద్, విజయవాడ.

ఎడిటర్జీ! బంగారానికి అంత విలువెందుకు?

ఆడవాళ్లు ఎక్కువగా మోజుపడతారు కాబట్టి.

కె. సుభాష్, సికింద్రాబాద్-3.

రెడ్డిగారూ! నేను ఎన్ని ప్రశ్నలు పంపినా అవి డైరెక్టుగా బుట్టాసురుని దగ్గరకే వెళ్లుచున్నవి-?

బహుశా, మీ ప్రశ్నలకు, బుట్టయ్యకు దగ్గర బంధుత్వం వుండి వుంటుంది.

ఎన్. శ్రవణ్ కుమార్, సోమాజిగూడ.

నమ్మిస్తూ మోసం చేస్తూండేవారిని ఏమనాలి గురూ?

మేకవన్నె పులులు; గోముఖ వ్యాఘ్రాలు; పయోముఖ విషకుంభాలు-ఇత్యాది సామెతలు వుండనే వున్నవి కదా!

జి.కె. లైలా, రాజమండ్రి.

"పాఠకుల పరిశోధన పోటీ''లో పాఠకుల పేర్లు ఎందుకు ప్రచురించటం లేదు?

ఇప్పుడు హోం. డె. సభ్యుల పేర్లు ప్రచురిస్తున్నందువల్ల కొంతకాలంపాటు ఆ శీర్షికలో పేర్లు నిలిపివేశాము.

యం.ఏ. గోపాల్, కూచనపల్లి.

పేపరుకొరత ఇంకెన్నాళ్లో మీరూహించగలరా?

పాపం పెరిగినట్టు పెరిగిపోతూంది-పేపరుకొరత. యీ ఒక్కనెలలోనే రీముకు మరో పదిరూపాయలు ధర పెరిగింది. అసమర్థుల పాలనలో ఇటువంటి సమస్యలకు పరిష్కారాలుంటూ యనుకోవడం వట్టిభ్రమనే.

పీసపాటి నవనీతం, కటక్.

అన్నయ్యా! మీవద్ద గత 10 సంవత్సరాల పాతకాపీలు దొరుకుతాయా?

లేవు. 1973, 1974 సంవత్సరాలవి మాత్రం దొరుకుతాయి. అంతకు క్రితంవి ఏవోకొన్ని దొరకవచ్చు. మీకు ఏవేవి కావాలో లిస్టురాసి పంపితే వాటిలో మావద్దనున్న వాటిని మీకు హోమ్ డెలివరీ వి.పి.లో పంపించి వేస్తాము.

వి. భూమారావు, బోర్గాం.

శ్యామ్‌జీ! కార్డుపైన ప్రశ్నలు, జోకులు, లేఖలు పంపవచ్చునా?

ఏ శీర్షికకైనా పోస్టుకార్డుమీదగాని, పోస్టుకార్డుసైజు తెల్లకాగితంపైగాని వ్రాసి పంపితే మాకు పరిశీలనలో సౌకర్యంగా వుంటుంది. అయితే కాగితంసైజు ఎట్టిపరిస్థితులలో పోస్టుకార్డుసైజుకంటె పెద్దదిగా వుండకూడదు.

కాళంగి మురళీమోహనరావు, గుంటూరు–2.

భగవంతుడు మానవులలో ఏదో ఒకలోపం పెడతాడు. మరి పశుపక్ష్యాదులలో పెట్టడు. కారణం?

పశుపక్ష్యాదులుగా సృష్టింపబడటం ఒక లోపమేకదా?

ఎమ్.జి. మూర్తి, విశాఖపట్టణం–8.

"అపన"లో ఎడ్వర్టయిజ్‌మెంట్లు ప్రచురించడానికి మీకున్న అభ్యంతరం ఏమిటి?

అభ్యంతరం మాదికాదు. పాఠకులది. కొన్ని కథలు, శీర్షికలు తగ్గటం పాఠకులు ఇష్టపడటంలేదు. ★

హోమ్ డెలివరి

"హోమ్ డెలివరీ" మీ కోసం, మీ సౌకర్యం కోసం ఏర్పాటు చేయబడ్డది. పాఠకులకు కలుగుతున్న అనేక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, ఎందరెందరో చేసిన సూచనలను క్రోడీకరించి, యీ స్కీమ్‌ను తయారు చేశాము. ఇటువంటి స్కీమ్ ప్రకటించటము పత్రికా ప్రపంచంలోనే మొట్టమొదటిది అవుతుంది. పూర్తి వివరాలు క్రింద యిస్తున్నాము. మీ సభ్యత్వం నేడే పంపండి.

హోమ్ డెలివరీ వల్ల మీకు లాభాలు?

1. హోమ్ డెలివరీ సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి తగ్గింపుధరలో రు. 5/-లకే లభిస్తాయి.

2. కాపీలు మీకు నెల నెలా ఖచ్చితంగా, సకాలంలో లభిస్తాయి.

3. డబ్బు ఏ నెలకానెల మీ ఇంటి వద్దనే చెల్లించి, కాపీలు కొనుక్కోవచ్చును. పత్రికలను మీ ఇంటికి పంపడానికి అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

4. పత్రికల కోసం మీరు రోజూ బజార్లు తిరగక్కర లేదు. పత్రికలే విడుదలైన వెంటనే నేరుగా మీ ఇంటికి వస్తాయి.

5. మేము నిర్వహించే అన్ని పోటీలలో, మీరు పాల్గొని బహుమతులు పొందే అవకాశం లభిస్తుంది. ఏడాదికి సుమారు 300 మంది విజేతలకు రు. 5000/-లకు పైగా

నగదు బహుమతులు పంపుతున్నాము.

6. భారతదేశంలో మీరు ఎక్కడ వున్నా, ఏ మారు మూల వున్నా, పత్రికలు ఖచ్చితంగా వచ్చి మీకు చేరతాయి.

7. పత్రికలు మీకు అతిత్వరగా చేరుతాయి.

8. పాత కాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపుతాము. ఎక్కువ కాపీలు కావలసిన వారికి కొంత కన్సెషన్ కూడా లభిస్తుంది.

హోమ్ డెలివరీ నిబంధనలు

1. మీరు రు. 3/-లు మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపి "హోమ్ డెలివరీ" సభ్యత్వము తీసుకోవాలి. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అంద జేయబడుతుంది.

2. సభ్యులకు ప్రతి నెలా పత్రిక, సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5/-లకే వి. పి. ద్వారా పంపుతాము. మీ ఇంటి దగ్గరనే పోస్టుమెన్‌కు (మణియార్డరు రుసుముతో సహా) రు. 5-20 పైసలు చెల్లించి కాపీలు పొందవచ్చును.

3. పత్రికలు నెలనెలా తప్పకుండా తీసుకోవాలి. ఎప్పుడైనా వి. పి. తిరిగి వస్తే వారి సభ్యత్వము రద్దవుతుంది. తిరిగి సభ్యత్వము పొందాలంటే రు. 3/-లు పంపాలి.

4. ఏదైన ఒకే పత్రిక తెప్పించుకునేవారికీ విదేశాలలోని వారికీ వర్తించదు.

5. మీ చిరునామాలు మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయాలి.

6. మిలిట్రీలో పనిచేసేవారికి వి. పి. పి.లు పంపే వీలుండదు కాబట్టి, పోటీలలో పాల్గొనదలచినవారు "హోమ్ డెలివరీ" సభ్యత్వము తీసుకొంటూ, రెండు పత్రికలకు చందా పైకం ముందుగా పంపేయాలి.

7. సభ్యత్వ రుసుము త్రిప్పి పంపటంగాని, సభ్యత్వం మరొకరిపేర మార్చటంగాని జరగదు.

8. చందాదారులు. ఉచిత చందాదారులు కూడా దీనిలో సభ్యులుగా చేరవచ్చును. ఒక పత్రికకు చందా వున్నవారికి రు. 3/-లు, రెండు పత్రికలకు చందా వున్నవారికి రు. 1/-చొప్పున రెండు కాపీలు కలిపి వి. పి. పంపబడతాయి.

9. సభ్యులలో ఎవరివైన కథలు, ముఖ్యమైన రచనలు ప్రచురింపబడితే, వారికి ఆ నెల వి. పి. ఒక పత్రిక ఖరీదు రు. 3/-లకు మాత్రమే పంపబడుతుంది.

10. సభ్యులు తాము జరిపే ఉత్తరప్రత్యుత్తరాలలో, పంపే రచనలపైనను, పోటీ కూపన్లపైనను విధిగా తమ సభ్యత్వము నెంబరు వ్రాయాలి.

పోటీలలో పాల్గొనే వారికి సూచనలు

1. "హోమ్ డెలివరీ" సభ్యులు మాత్రమే అన్ని పోటీలలో పాల్గొనుటకు అర్హులు. సభ్యత్వము లేనివారి కూపన్లు ఎంతమాత్రం పరిశీలించబడవు. "అపరాధ పరిశోధన పోటీ," మీరేఎన్నుకోండి' బ్యాలెట్‌లలో మాత్రం అందరూ పాల్గొనవచ్చును.

2. పోటీ జవాబులు పోస్టుకార్డు మీదగాని, పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపైగాని వ్రాసి పంపాలి. ఎట్టి పరిస్థితులలో కాగితంసైజు పెద్దదిగా వుండరాదు.

3. ఒకే కాగితంపై రెండు పోటీలకు వ్రాయకూడదు. ప్రతి పోటీకి వేరువేరు కాగితాలపై వ్రాసి, అన్నిటినీ ఒకే కవరులోపెట్టి పంపవచ్చును.

4. ప్రతి కూపనుకు వెనుకప్రక్క తమ పూర్తి చిరునామా, హోమ్ డెలివరీ సభ్యత్వము నెంబరు తప్పని సరిగా

వ్రాయాలి.

5. సభ్యత్వము ఎవరిపేరుతో వుంటె, వారు మాత్రమే పోటీలలో పాల్గొనాలి. కలం పేర్లు అంగీకరించబడవు. సభ్యత్వము రద్దుచేయబడ్డవారి కూపన్లు కూడా పోటీకి అంగీకరించబడవు.

6. ఏ విషయంలోను ఉత్తరప్రత్యుత్తరాలు జరుపబడవు. తుదినిర్ణయం సంపాదకులదే. పోటీ నిబంధనలను ఖచ్చితంగా పాటించని పోటీ కూపన్లను పరిశీలించటం జరుగదు.

7. "హోమ్ డెలివరీ" సభ్యత్వము లేని పాఠకులు కూడా వెంటనే తమ సభ్యత్వ రుసుము పంపుతూ, అన్ని పోటీలలో పాల్గొనవచ్చును. అయితే ప్రతి కూపన్‌పైన తాము సభ్యత్వ రుసుము పంపిన తేదీ మున్నగు వివరాలు స్పష్టంగా వ్రాయాలి.

హోమ్ డెలివరీ సభ్యుల పేర్లు

"హోమ్ డెలివరీ" సభ్యత్వం పొందిన పాఠకుల పేర్లు మరికొన్ని యీ క్రింది ఇస్తున్నాము. పేరుకు ముందున్న నెంబరును వారి సభ్యత్వము నెంబరుగా గుర్తించ వలెను.

(గత సంచిక తరువాయి)

81. కుమారి బి.వి సత్యవతి, చోడవరం. 82. పి.చంద్ర కిరణ్, నిజామాబాద్. 83. చంద్రు మోహనరావు, చెల్లూరు. 84. మేడెం వీరరాఘవయ్య. తిమ్మాపురం. 85. పోలిశెట్టి సత్యనారాయణ, విశాఖపట్టణం. 86. ఎమ్. గంగగౌడ్, మారాంపల్లి. 87. పి. శేషాచలం, గూడూరు. 88. పి.సూర్యారావు, విశాఖపట్టణం. 89. వహీద్‌ఖన్నా. హైద్రాబాద్. 90. గెడా రంగారావు, వేగవరం.

91. డాక్టర్ జి. క్రిష్ణారెడ్డి, అర్కెలా. 92. డాక్టర్ వి. ఎస్. శాస్త్రి, అమ్మవారికుప్పం. 93. కె. మాధవి, విశాఖ పట్టణం. 94. ఎమ్. శంకరరెడ్డి, బెల్లంపల్లి. 95. పి.వి. చలపతిరావు, రాజమండ్రి. 96. ఫ్రెండ్స్ మేగజైన్ క్లబ్, జాట్ని. 97. ఎమ్. బిక్షమయ్య, హైద్రాబాదు. 98. శ్రీ లక్ష్మి సరస్వతి బుక్ డిపో, కాకినాడ. 99. ఎమ్. వెంకటరెడ్డి, ముడుపుగల్. 100. పి. విజయలక్ష్మి. కపిలేశ్వరపురం.

101. పి. లక్ష్మి, బోనాయ్‌కెల్లా. 102. డాక్టర్ ఏ.మురళీ మోహన్, బరంపురం. 103. సి.హెచ్. కోదండరామిరెడ్డి, కొత్తపాలెం. 104. అడారి వెంకటరమణ, నారాయణపురం. 105. ఎన్. సుధాకర్‌రెడ్డి, నల్లకుంట. 106. కె.వెంకటేశం, మెదక్. 107. యు. నాగరాజారావు, ఆలూరు. 108. కొండయ్య సనగిరి, భగత్ కీ కోఠీ. 109. సి. హెచ్. బాల, చోడవరం. 110. పి.దేవేంద్రరావు, రాయపూర్.

111. జి. వి. ఎల్. ప్రసన్నాదేవి, తపాలాపూర్. 112. బచ్చుమల్లయ్య, ఉచ్చిలి. 113. ఏ. మోహన్‌కుమార్ రెడ్డి, కోటకదర. 114. పి. వేణుగోపాలరావు, విశాఖపట్టణం. 115. కడియాల సుబ్రహ్మణ్యం, మండెపులంక. 116. రవ్వ వెంకటేశం. బొంబాయి. 117. హెచ్. ఆర్. వి. ప్రసాద్, బోరగాన్. 118 వై. శివరామక్రిష్ణ, కర్నూలు. 119. శ్రీ రాఘవేంద్ర బుక్ బ్యూరో, హిందూపురం. 129. ఎమ్.గంగాధర, నరసాపురం.

121. కేప్టెన్ జి. వెంకటేశ్వరరావు, ఆర్మీ. 122 ఎస్. విశ్వనాథరావు, సునాబేడా. 123. కె.ఎస్. నాయుడు, వేపాడ. 124. సి. వెంకటేశ్వర్లు, అన్నం భోస్లావారిపాలెం. 125. ఎమ్ ఎఫ్. మహమ్మద్ గౌస్, లింగసుగూర్. 126. జె ఆర్. కె. రాజు, హైద్రాబాదు. 127. బి. శ్రీనివాసరావు, వైజాగ్.

128. వి. రాజా, కడప. 129. కె. సురేష్‌కుమార్, పెద్దాపురం. 130. బి.వి.వి.జి.ఎస్.పి. రంగా. శృంగవరపుకోట.

131. కె. జ్యోతిసరస్వతి, కాకినాడ. 132. వై. రాంజీ, జంగమారకలగుడి. 133. పి. సీతాదేవి, దొంకరాయి. 134. కూచిపూడి కోటేశ్వరరావు, ఓలేటివారిపాలెం. 135. ఎస్. కె. మొయినుద్దీన్ జహీర్, నెల్లూరు. 136. సిగ్నల్‌మేన్ కె.కె. రావ్, ఆర్మీ. 137. పి. సత్యనారాయణ, పార్వతీపురం. 138. వి. పూర్ణచంద్రరావు. శ్రీశైలం ప్రాజెక్ట్. 139. సప్తగిరి బుక్ బ్యూరో, హిందూపురం. 140. జె. శంకరయ్య. జగిత్యాల.

141. పి. రామచంద్రా రెడ్డి, తేలుకుట్ల. 142. కె. శ్రీనివాస మూర్తి, కుప్పం. 143. డాక్టర్ డి.ఎస్.ఎ. శర్మ, నిడమనూర్. 144. పి. ప్రహ్లాదరావు, చిలకలగురికి. 145. ఎమ్. వెంకటరత్నం, తాడేపల్లిగూడెం. 146. జల్దు బాబ్జీ, పార్వతీపురం. 147. టి.కె. మోహనరావు, హైద్రాబాదు. 148. ఎస్. భాస్కరరావు, విశాఖపట్టణం. 149. జి. ప్రకాశ్, రామనగర్. 150. కె. సంగారెడ్డి, తిరుమాలాపురం.

151. చెరుకుమిల్లి భాస్కరరావు, హైద్రాబాదు. 152. చంద్రకాంతి వెంకటరాజన్న, బిజ్జూర్. 153. జె. శేషగిరిరావు, మలక్‌పేట. 154. జాప్తి రవికుమార్, కోలవెన్ను. 155. టి.వి.ఎన్. శివప్రసాద్, గుంటూరు. 156. బి. మారుతీరామ్, ధర్మారం. 157. డి. వెంకటసుబ్బారావు, విజయవాడ. 158. ఆర్. మోహనదత్తు, ఆర్మీ. 159. ఎమ్. రామకోటి, పులిజాల. 160. ఎమ్. వి. సుబ్బలక్ష్మి, చిక్కడపల్లి.

161. జి. శివలక్ష్మి, గుంటూరు. 162. డి. లక్ష్మిరాజు. సూర్యాపేట. 163. ఎఫ్. ఆర్. ఏ. శౌరెడ్డి, తూబాడు. 164. కాళ్ళ గోవిందరావు, ఆమదాలవలస. 165. ఎన్. తాతయ్య,

రాజమండ్రి. 166. వై. బ్రహ్మయ్యగుప్త, మదనపురం. 167. కొంగర వెంకటేశ్వరరావు, తుని. 168. సి.సురేందర బాబు, గద్వాల. 169. బి. హెచ్. మురళీకృష్ణ, గుంతకల్. 170. కె. సంజీవరెడ్డి, పొత్తిపాడు.

171. ఎమ్. విద్యుల్లత, విశాఖపట్నం. 172, డాక్టర్ గురురాజు హోమియోపతిక్ హాస్పిటల్ స్టాఫ్ లైబ్రరీ, గుడివాడ. 173. షేక్ మహబూబ్ పీరా, కర్నూలు. 174. ఎమ్. నాగేశ్వరరావు, తణుకు. 175 జి. అంజయ్య, కరీంనగర్. 176. వి. సత్యప్రసాద్, రాజమండ్రి. 177. కె.ఎస్.ఆర్. కె. ప్రసాద్, తెనాలి. 178. జి.పి. బాబ్జీ, రూర్కెలా 179. గుడివాడ వీర్రాజు, ఏలూరు 180. హవల్దార్ ఐ.వి.జి.కె. మూర్తి, మద్రాసు.

181. కె. రామకిష్ణారెడ్డి, సుల్తాన్ పూర్. 182. టి.ఎస్. మోసెస్. విజయవాడ. 183. ఏ.వీ. రాఘవయ్య, హిందూపూర్. 184. బి. సూర్యనారాయణ, విశాఖపట్నం. 185. హెచ్.ఆర్.ఎల్. స్వామి. కోటనందూరు. 186. పోకా తిరుపాలు, ఆర్మీ. 187. మునగాల బాబూజీ, తెనాలి. 188. పి. శ్రీనివాసరావు, శ్రీశైలం ప్రాజెక్ట్. 189. పి. సత్యనారాయణ, రుద్రూరు. 190. బి. లక్ష్మిజయప్రద, ముట్లూరు.

191. కడలి వీరవెంకట సత్యనారాయణ, పుల్లేటికుర్రు. 192. పి. సంజీవి ప్రకాశ్, తిరుపతి. 193. ఎమ్.ఎస్. రసూల్, కలికిరి. 184 టి.వి. నాగేశ్వరరావు, భంజానగర్ 195. సి. హెచ్. వెంకటరాజు, హైద్రాబాదు. 196. భాగాపురం నాగేశ్వరరావు, మల్దకల్. 197. జె. క్రిష్ణారావు, అశ్వారావుపేట. 198. ఎస్. నాగేశ్వరరావు. యాదగిరి గుట్ట. 199. కొండవీటి సుధాకర్ రెడ్డి, హైద్రాబాదు.200. కురుమద్దాలి విజయలక్ష్మి, విజయవాడ.

—(మిగిలిన పేర్లు వచ్చేసంచికలో)

చెప్తా వినండి?

1. ఖాళీ కడుపుమీద విషం త్వరగా పనిచేస్తుంది.

2. ఇండియన్ స్టాండర్డ్ టైము మధ్యాహ్నం 12 గంటల సమయానికి, అలహాబాదులో గం 11.58, బొంబేలో 11.21, కలకత్తాలో 12.24, మద్రాసులో 11.51 నిముషాలు మాత్రం. దీనికి కారణం టైంజోన్స్.

3. జపాన్ పదజాలంలో "పని" అని అర్థం వచ్చే పదాలు అయిదారు ఉన్నాయి. కాని విశ్రాంతి అనే అర్థంగల పదం ఒక్కటీలేదు. ఈ మధ్యనే 'రీజా' అనే ఒక క్రొత్తపదాన్ని వారి పదజాలంలో చేర్చారట. దీనికి అర్థం విశ్రాంతి.

4. జపాన్ అంతగా అభివృద్ధి చెందటానికి కారణమేమిటో తెలుసా? వారు స్ట్రైక్ చేస్తే పని ఎగగొట్టరు. సరికదా మరింత కష్టపడి పనిచేస్తారు. తమ అసంతృప్తిని సూచించటానికి తలకు ఎర్రని పట్టీలు ధరిస్తారుట. అంతేకాక మామూలుకన్న ఓ అరగంట ముందు వచ్చి తమ అసంతృప్తిని తెలియచేసే పాటలు పాడతారుట. ఈ మాత్రానికే మేనేజిమెంట్ వారు మనసు కష్టపెట్టుకుని రాజీ బేరాలకు దిగుతారుట.

5. పరీక్షలకు చదివే విద్యార్థులు నిద్రరాకుండా టీ త్రాగుతారు. ఇది ఆరోగ్యానికి భంగకరం. క్రొత్త తేనె కొంచెం తీసుకుంటే నిద్ర దూరమౌతుంది. ఉత్సాహం కలుగుతుంది. తేనె ఆరోగ్యానికి మంచిదికూడా.

6. రోజా గడ్డం సెంటీమీటరులో 20వ వంతు పెరుగుతుందట!

—ఏ కల్యాణి.

వసుంధర
పరాయి ఆడది

రంగనాథం ఉత్సాహంచూస్తే నాకు విపరీతమైన ఆశ్చర్యం కలిగింది.

నాకేకాదు మా ఆఫీసులోని ప్రతిఒక్కరికీ కూడా రంగనాథం చలాకీతనం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎందుకంటే ఉత్సాహాన్నీ, రంగనాథాన్నీ కలిపి కనీసం ఆలోచనల్లోనైనా అంతవరకూ ఎవ్వరూ చూడలేదు.

రంగనాథాన్ని అందరూ జిడ్డుగాడనీ, దేభ్యమనీ, ఏడుపుగొట్టనీ ఇలా రకరకాల పేర్లతో పిల్చుకుంటూంటారు. అతన్ని రంగనాథంగా గుర్తుంచుకున్న ఏకైకవ్యక్తి ఆఫీసు మొత్తానికి నేనొక్కడినే అనుకుంటాను.

అదేకారణంవల్లకాబోలు అతను నా స్నేహాన్ని అపేక్షించాడు. తనకేబాధలున్నా నాదగ్గర వెళ్ళబోసుకుంటాడు. అందువల్లనే నన్ను జిడ్డుగాడి స్నేహితుడని చాలామంది అనుకుంటూంటారు.

అయితే ఆమాట నా ముఖంమీదనే ధైర్యం ఎవరికీలేదు. నాప్రవర్తన, తెలివితేటలూ-ఆఫీసులో నాకొక గౌరవస్థానాన్నుంచేయనడంలో సందేహంలేదు.

"ఏమిటండీ ఈరోజు మీలో కొత్త ఉత్సాహం కనబడుతోంది?" అని అడిగేశాను చివరికి ఉండబట్టలేక.

ఎందుకంటే ఏదైనా కొత్తవిశేషముంటే రంగనాథం నాకు చెప్పడానికి ఉబలాట పడిపోతుంటాడు. అటువంటిది ఈరోజు కనీసం నాదగ్గర రావడానికేనా ప్రయత్నించడంలేదు.

"అబ్బే-ఏమీలేదే!" అన్నాడు. రంగనాథం ఏమీలేదంటే నమ్మడమెలా? రంగనాథం కళ్ళలో మెరుపులున్నాయి. ముఖంలోకి తేజస్సు వచ్చింది. కదలికలో కొత్తచైతన్యం కనబడుతోంది. ఇవన్నీ ఏ ఒక్కరోజు కూడా రంగనాథం

దరిదాపుల్లోలేవు. ఏవిశేషమూ లేకుండా అవి అతని ప్రాంతాలకెలా వస్తాయి?

"ఏదోఉంది. మీరు నాదగ్గర దాస్తున్నారు-" అన్నాను.

"నిజం-ఏమీలేదు-" అన్నాడు రంగనాథం. అలా అంటూనే అనుకోకుండానే అతను ముసిముసిగా నవ్వు కుంటున్నాడు.

నేను అతని ముఖంలోకి తీవ్రంగాచూశాను. ఆ ముఖంలో ఏదో సందిగ్ధావస్థ ఉన్నట్లు కనబడింది. ఏదో చెప్పాలని తటపటాయిస్తున్నట్లనిపించింది. లాభంలేదు. ఈ సస్పెన్సు నేను భరించలేను. రంగనాథాన్ని ఎలాగోఅలా టాకిల్ చేయాలి. అందుకే- "రండి-టీతాగి వద్దాం!" అన్నాను.

బహుశా అతనికి చెప్పాలనే ఉన్నట్లుంది. నన్ను వెంటనే ఫాలో అయ్యాడు.

ఎవ్వరికీ చెప్పకుండా ఒక రహస్యాన్ని దాచాలని ఎవ్వడూ కోరుకోడు. రహశ్యాన్ని మరింత రహశ్యంగా మరొకడికి చేరవేయడంలోనే మనిషికి ఆనందం కలుగుతుంది. ఎటొచ్చీ కుతూహలాన్ని కనబరిచే వ్యక్తి దొరకాలి. పదేపదే అడగాలి. చివరకు రహశ్యం బయట పడుతుంది.

కావాలనే మరెవ్వరూలేని ఒకమూలకు తీసుకుపోయా నతన్ని. రెండు టీ తీసుకురమ్మని సర్వర్‌కుచెప్పి "చెప్పండి-ఏమికథ-"అన్నాను.

"ఏదోకథ ఉందని ఎందుకనుకుంటున్నారు?" అన్నాడు రంగనాథం.

ఓరి బిడ్డుగాడా-నీ బిడ్డుముఖంలో నవ్వు కనబడితే కథ వుండదని ఎంత చవటదద్దమ్మకైనా తడుతుందని మనసులో అనుకుని- "మనది కొన్నేళ్ళ పరిచయం. ఈమాత్రం

తెలుసుకోలేనా?'' అన్నాను.

''మీఊహ కరెక్టేగానీ-చెప్పడానికి సందేహిస్తున్నాను నేను. ఎందుకంటే ఇది కేవలం నాఒక్కడికే సంబంధించిన రహస్యం కాదుమరి-''

నాకు కుతూహలం మరింత పెరిగింది. ''కావచ్చు కానీ నామీద మీకు ఆమాత్రం నమ్మకంలేదా?'' అన్నాను కాస్త జాలిగా ముఖంపెట్టి. 'చెప్పండి-ప్లీజ్!' అన్నట్లు చూస్తూండి ఉంటాయి నాకళ్ళు.

''అదికాదుసార్- ఈ రహస్యం బట్టబయలైతే ఒక ఆడదాని జీవితం నాశనం చేసినవాడినవుతాను నేను-''

'ఒరేయ్ రంగనాథం-చంపేస్తున్నావురా-' అనుకున్నా మనసులో. రంగనాథందగ్గర ఒక ఆడదానికి సంబంధించిన రహాశ్య ముందనేసరికి నాలో కుతూహలంతోపాటు అసూయ కూడా కలిగింది. అయినా రెండవది వ్యక్తపరచలేనిదిగదా!

''ఇన్ని చెప్పడమెందుకు? ఇంతకాలం మనం ఆత్మీయుల మనుకున్నాను. ఈరోజే తెలిపింది -మనం మామూలు స్నేహితులమని-'' అన్నాను కాస్త నిష్ఠూరంగా.

సర్వర్ టీతెచ్చాడు. రంగనాథం మౌనంగా టీ చప్పరించ సాగాడు. నిముషం అనంతరం- ''మీకంటె నాకాప్తులెవరు సార్-చెప్పేస్తాను-'' అన్నాడు.

''వద్దులెండి-అదికేవలం మీకు సంబంధించిన రహస్యం కదా-'' అన్నాను టీ చప్పరిస్తూ.

''ఏదో సరదాకన్నాను కానీ మీదగ్గిర నాకు రహస్యమే మిటండీ-'' అన్నాడు రంగనాథం. అతని కిప్పుడు చెప్పే మూడ్‌వచ్చింది. నేను వద్దన్నా చెబుతాడు.

అతను కొద్దిగా స్వరం తగ్గించి- ''నెలరోజుల క్రితం

మాపక్కింట్లో ఎవరో దిగేరని చెప్పేను గుర్తుందా?'' అన్నాడు.

''ఊఁ''

''వాళ్ళు కొత్తగా పెళ్ళయిన దంపతు లనుకుంటాను. అతనట్టే బాగుండడుకానీ ఆమె చాలా, బాగుంటుంది. పేరు మాలతి'' అని ఒక్కక్షణం ఆగాడు రంగనాథం.

నేను కుతూహలంగా ముందుకు వంగాను. రంగనాథం స్వరం కొంచెం తగ్గించి-''ఇటీవలె మా ఆవిడ పుట్టింటికి వెళ్ళిన విషయం మీకు తెలుసుగదా. మా ఇంటినీ వాళ్ళింటినీ విడదీసేది మా బెడ్‌రూం తలుపే నని గూడా మీకు తెలుసు గదా. నాలుగు రోజుల క్రితం ఏమిటి జరిగిందంటే....''

రంగనాథం ఆగిపోయాడు. కారణం- బిల్లు తీసుకుని సర్వర్ వచ్చాడు.

బిల్లు నేనే అందుకొని ''ఊఁ ఏం జరిగింది చెప్పండి'' అన్నాను.

''ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో ఆ తలుపే తట్టిందామె-చాలా కంగారుగా. నేను గొళ్ళెం తీసి తలుపు తెరిచాను.

''ఏమండీ'' అని అడిగాను.

''తేలు....తేలు....'' అంటూ కంగారుగా ఒక మూలకు చూపించింది.

నేను అటు చూశాను.

అక్కడ....పాత బట్టలు వేసుకునే పెట్టె ఉంది. తేలు అంటే నాకూ భయమే. కానీ ఒక ఆడదాని ముందు వెలితి పడడం ఇష్టంలేక వెళ్లి ఆ పెట్టెని కదిపాను.

ఒక ఎలుక పిల్ల ఉరకలు పరుగుల మీద బయటకు

దూకింది. బహుశా ఆమె వైపే దూకిందో-ఏమో కెవ్వు మంటూ అరచింది.

నేను ఆమె వైపు నవ్వుతూ చూపిన వాణ్ణి, అలా ప్రమాన్పడిపోయాను. ఆవిడ చీర జారిపోయింది, ఒంటిమీద లంగా బాడీ తప్ప మరో అచ్ఛాదన లేదు.

నేను గబుక్కున గోడవైపు తిరిగాను.

"బట్టలు కట్టుకుంటూంటే తేలు కనిపించింది. చాలా భయం వేసింది. చీర చుట్టబెట్టుకుని త్వరత్వరగా మిమ్మల్ని పిలిచాను. ఎలకపిల్ల హఠాత్తుగా దూకేసరికి భయం వేసింది" అందామె. నేను ఇంకా వెనక్కు తిరక్కపోవడం చూపి, "మీరు వెనక్కు తిరగవచ్చు" అంది.

వెనక్కు తిరిగాను. చీర కట్టుకుని పమిట నిండుగా కప్పు కుందామె. అప్పుడే కాస్త ధైర్యంగా పరీక్షించి ఆమె ముఖంలోకి చూశాను. చాలా అందంగా ఉందామె.

"మీ ఆయన లేరా?" అన్నాను.

"బజారుకువెళ్లారు. ఇంకా అరగంట దాకా రారు." అందామె.

"మరి వస్తాను" అంటూ మా గదివైపు నడిచాను.

"మీరు చాలా ధైర్యవంతులు. నాకు ధైర్యవంతులంటే చాలా ఇష్టం" అందామె. నేనేం మాట్లాడలేదు. "మీరింకా ధైర్యంగా మసల గలిగితే నాకు ఇంకా ఇంకా ఇష్టం" అందామె.

ఆమె ఉద్దేశ్యమేమిటో నా కర్థంకాలేదు, కానీ ఆడ వారితో వ్యవహారమని గుర్తొచ్చి భయం వేసి తలుపులు వేసేశాను-" అన్నాడు రంగనాథం.

"ఇంతేనా, ఇంకా విశేషాలున్నాయా?" అనడిగాను.

ఇక ఉండకపోతే బాగుండు ననిపించింది.

"అప్పుడే ఎక్కడ- ఇది నాలుగు రోజుల క్రితం సంగతి. మూడు రోజుల క్రితం ఇంకా విచిత్రం జరిగింది. మా రెండిళ్ళకీ కామన్ బాత్రూమ్ కదా" అంటూ ఆగాడు రంగనాథం.

బాత్రూమ్ అనగానే నాలో విపరీతమైన ఆసక్తి కలిగింది. రంగనాథానికి ఏమదృష్టం తగిలిందో అన్న భయం కూడా మెదిలింది. "చెప్పండి" అన్నాను.

"బాత్రూమ్ లోంచి ఆవిడ కేకలు వినపడ్డాయి. 'రంగనాథంగారూ ఒక్కసారి ఇలా రండి.' అని. ఏమైందోనని పరుగెత్తాను. బాత్రూమ్‌కి లోపల ఇనప గడియ ఉంది. అది చాలా బిగుతుగా ఉంటుంది. ఒక్కొక్కసారి నాకే అది తీయడం కష్టమవుతూంటుంది. ఆవిడ లోపల ఉంది, గడియ తీయలేక పోతోంది. ఇంక ఒక్కటే దారి. నేను బాత్రూమ్ గోడ ఎక్కి లోపలకు దూకి తలుపులు తీయాలి.

"కళ్లు మూసుకుని లోపలకు దూకండి. అసలే నా వంటి మీద బట్టలు లేవు" అందావిడ.

కళ్ళు మూసుకోవా లనిపించలేదు. కానీ మర్యాద కోసం కళ్లు మూసుకుని గోడ దూకి తడుముకుంటూ తలుపు దగ్గరకు వెళ్లాను. గడియ నిజంగానే బిగుసుకు పోయింది. యావచ్ఛక్తి ఉపయోగించి గడియ తీసాను.

"సరదా కన్నాను కానీ కళ్లు మూసుకో నవసరం లేదు. బట్టలు వేసుకునే ఉన్నాను" అందామె.

వెంటనే కళ్లు విప్పి ఆమెను చూశాను. ఒంటిమీద నూలుపోగు కూడా లేదు. ఆమె అందానికి కళ్ళు చెదిరి పోయాయి. వెంటనే కళ్లు మూసుకున్నాను.

"మీకు బలముంది. కానీ బలానికి తగ్గ ధైర్యమున్నట్లు లేదు" అందామె.

ఏం చెయ్యాలో నాకు తెలియ లేదు. మరొక్కసారి ఆమెను చూశాను. ఆమె నిస్సంకోచంగా నావంక చూస్తోంది. ఆమె ముఖంలో నవ్వు తప్పితే సిగ్గు లేదు. అదే సమయంలో పాలవాడొచ్చి తలుపు తట్టాడు. అక్కణ్ణించి పరుగెత్తాను."

"అబ్బ. అదృష్టమంటే మీదే నండీ. ఆ తర్వాత ఏం జరిగింది?" అడిగాను క్యూరియాసిటితో.

"నిన్న రాత్రి .... నిన్న రాత్రి....ఆమెను....అనుభవించాను" అన్నాడు రంగనాథం.

"నిజం...." అన్నాను అప్రయత్నంగా. అలా ఎందుకన్నానో నాకే తెలియదు.

ఆ తర్వాతరోజు నాకు రంగనాథం చాలా చెప్పాడు. తన భార్యతో అన్నాళ్లుగా కలిసి ఉంటే కలగని థ్రిల్ ఒక రాత్రి మాలతితో గడిపిన అనుభవ మిచ్చిందట. బహుశా పరాయి ఆడదానితో గడిపితే అలా థ్రిల్ కలుగుతుందేమోనన్నాడు రంగనాథం.

నిజమే ననిపించింది నాకు. కాస్త ఆలోచించి ఈ సిట్యుయేషన్ని ఎనలైజ్ చేయడానికి ప్రయత్నించాను. ఇది నాది. దీని మీద నాకు సర్వహక్కులూ ఉన్నాయి అని తెలిసినప్పుడు మనిషికి ఆ వస్తువు మీద అంత ఆసక్తి ఉండదు. అలా కానప్పుడు ఎక్కడలేని ఆసక్తీ పుట్టుకొస్తుంది. అందులోనూ ఆ వస్తువు పరాకరిదైనప్పుడు మరీను.

మాలతి పరిచయం రంగనాథం ప్రవర్తననే మార్చివేసింది, అతనిప్పుడు ఏమాత్రమూ జిడ్డుగాడు కాదు. అదే

విధంగా నేను జిడ్డుగాడి స్నేహితుణ్ణి కాదు.

మరో విధంగా కూడా నేను జిడ్డుగాడి స్నేహితుణ్ణి కాను. ఎందుకంటే రంగనాథం పట్ల నాకిప్పుడు అసూయ కలిగి దిన దినాభివృద్ధి చెందుతోంది. అతనిలాంటి జిడ్డుగాడిని ఒక అందమైన మాలతి వరించినప్పుడు నన్ను మాత్రం మరో మాలతి ఎందుకు వరించదు అనిపించసాగింది.

ఈ ఆలోచన క్రమంగా నాలో వింత వింత మార్పులు తీసుకు రాసాగింది.

నాకు చాలామంది స్నేహితులున్నారు. కుటుంబంతో సహా వాళ్ళు మా ఇంటికి వస్తూంటారు. మా కుటుంబమూ వాళ్ల ఇంటికి వెడుతూంటాం. ఎంతో ఆప్యాయంగా సర దాగా కాలం గడుపుతూండే వాళ్ళం. ఐతే ఇప్పుడు నా ఆలోచనలు మారాయి. నా స్నేహితుల భార్యల వంక నేను కొత్త రకంగా చూస్తున్నాను. వాళ్ళలో ఎవరికైనా నా పట్ల వాంఛ ఉన్నదా అని వెతుకుతున్నాను.

రంగనాథం నాలో ప్రతిష్ఠించిన వ్యభిచారభావాలు నన్నొక మానసిక వ్యభిచారిని చేశాయి.

ఐతే ఈ వ్యభిచార భావాలను ఎవరితోనో ఒకరితో చెప్పు కోవాలి. అప్పుడుగానీ నా కసి తీరదు. అందుకు నా భార్యని ఎన్నుకున్నాను. మేమిద్దరం ఏకాంతంగా ఉన్నప్పుడు తెలిసిన ఇతర స్త్రీలగురించి కొద్దిగా అసభ్యంగా మాట్లాడుతూండడం, నా భార్య శరీరావయవాల పరిమాణాలతో ఆ స్త్రీలని పోల్చడం చేస్తూండేవాడిని. ఆ పోలికలలో నా భార్యనే ఎక్కువ చేస్తూండడంవల్ల ఆమె ఈ మాటలు కుతూహలంగానే వినేది. కొద్దిగా గర్వపడేదికూడా-అసలు సిసలు స్త్రీమూర్తి తనేనని.

ఐతే క్రమంగా నేను మితిమీరాను. ఫలానా ఆమె నన్ను

చూడగానే కావాలని పైట జారుస్తుందనీ, మరో స్త్రీ ద్వంద్వార్థాలతో మాట్లాడుతుందనీ అనేవాడిని. ఐనా నా హృదయ రాణివి నీవే ననేసరికి నా భార్య గర్వపడేది.

మనకు తెలివితేటలుండాలి కానీ ఏ మాటలకైనా ఏ రకమైన అర్థమైనా తీయవచ్చు. స్నేహితుల ఇంటికి వెళ్ళి వచ్చాక అక్కడి స్త్రీలు మాట్లాడిన మాటలకు అర్థాన్ని వివరించి చెబుతూండేవాడిని నా భార్యకు.

ఈ మాటలన్నీ నా భార్యదగ్గరే ఎందుకు చెప్పుకునేవాడినంటే-మగవాడిదగ్గర ఇలాంటి మాటలు చెబితే ప్రమాదం. ఆ విన్నవాడు నా భార్యనుకూడా అలా చూసే ప్రమాదముంది. ఇలాంటి మాటలు ఆడవాళ్ళ దగ్గరే అనాలి. నాకు ఆడవాళ్ళలో ఇలాంటి మాటలు చెప్పుకునేటంత సన్నిహితులెవరున్నారు-నా భార్య తప్ప!

క్రమంగా నా భార్య నా మాటలకు సంతోషించడం తగ్గించింది. ప్రతిదానికీ క్రాస్ ఎగ్జామినేషన్ మొదలుపెట్టింది.

"నాకు మామూలుగానే ఉన్నమాటల్లో మీ కలాంటి అర్థమెందుకు కనిపించాలి? అంటే మీరుకూడా ఆ అర్థాలకోసం వెతుకుతున్నారనేగా?" అనేది. "ఆమె పైట జార్చినట్లూ అదీ మీ కోసమేననీ ఎలా గమనించారు? అసలు మీ దృష్టిలో ఉంది దోషం" అంటూండేది.

"నా బాధ నీకేం తెలుసు. నా స్నేహితులెందరికో పరాయి ఆడదా న్ననుభవించిన థ్రిల్ లభించింది. నా ఒక్కడికే-" అంటూ ఆవేశంలో నోరు జారాను.

అంతే! నా భార్య కళ్ళు ఎర్రబడ్డాయి.

"అదా సంగతి? పరాయి ఆడదానికోసం ప్రాకులాటన్నమాట! ఇక ఈ ఇంట్లో నేను ఒక్క క్షణంకూడా ఉండను.

ఈ వేళే పుట్టింటికి వెళ్ళిపోతున్నాను'' అంది తీవ్రంగా.

ఏం మాట్లాడాలో నాకు తోచలేదు. అనుకోకుండా నోరు జారాను. ఇప్పుడేమనీ లాభంలేదు. అదీకాక ఇప్పటి నా మానసిక స్థితికి ఒకవిధంగా భార్యదగ్గరుండక పోవడమే మంచిదనిపించింది.

రంగనాధంలాగే మాకూ ఒక పక్కిల్లు ఉంది. మాలతి అంత అందంగానూ ఉండే ఒక కోమలి ఉంది. ఏమో- ఎప్పుడే అపకాశం వస్తుందో ఎవరు చూడొచ్చారు.

అందుకే-''పోతే పో!'' అనలేదు నేను. అలా అంటే నా భార్య వెళ్ళదు. ఉండిపోతుంది.

బ్రతిమాలడం మొదలుపెట్టాను. తను లేకపోతే ఒక్క క్షణంకూడా గడవదన్నాను. తనను పెళ్ళి చేసుకున్నాకే నా జీవితానికో అర్థం కనిపించిందన్నాను.

నేను బ్రతిమాలినకొద్దీ నా భార్య చెట్టెక్కింది. చిట్ట చివరకు నిస్సహాయుడిలా ముఖంపెట్టి ''నిన్నెలా ఆపాలో తోచడంలేదు. ఏమీ పాలుపోవడం లేదు'' అన్నాను.

''నన్ను మీరు ఆపలేరు'' అంది గర్వంగా శ్రీమతి. నేను ఆపదల్చుకోలేదని మాత్రం ఆమెకు తెలియదు. అందుకే ఆమె వెళ్ళిపోయింది.

ఆరోజు రాత్రి ఏడుగంటలకు పక్కింటి కోమలి మా ఇంటికి వచ్చింది. ''అక్కగారూ, అక్కగారూ'' అంటూ తలుపు తట్టింది.

వెళ్ళి తలుపు తీశాను. ''అక్కగారు లేరాండీ!'' అనడిగింది.

వరస బాగానే ఉందే, అనుకున్నాను. ''లేదు. ఈరోజే పుట్టింటికి వెళ్ళింది'' అన్నాను. మా శ్రీమతి పుట్టింటికి వెళ్ళ

నట్లు కోమలికి తెలిసే ఉంటుందని నా అనుమానం.

"అరె. అలా అర్ధాంతరంగా వెళ్లిపోయారేమిటీ. ఎప్పుడు వెళ్లినా నాతో చెప్పే వెళ్ళేవారు" అంటూ ఆశ్చర్యంగా నిల బడిపోయింది కోమలి.

నేనేం మాట్లాడలేదు.

"మీ తమ్ముడీరోజే క్యాంపుకు వెళ్ళారండీ. ఏమీ తోచడంలేదు. ఏమైనా పుస్తకాలుంటాయేమోనని అడిగి తీసుకు వెడదామని వచ్చాను" అంది కోమలి.

"దానికేముంది? గదిలోకి వెళ్లి మీ క్కావలసిన పుస్త కాలు తీసుకోండి" అన్నాను.

కోమలి నిస్సంకోచంగా లోపలకు వచ్చింది. అందంగా నడుచుకుంటూ డ్రాయింగు రూంలోకి వెళ్లింది. పుస్తకాలు ఎక్కడుంటాయో ఆమెకు తెలుసు. నేను గుమ్మందగ్గరే ఉండిపోయాను కానీ, నా మనసు తీవ్రంగా పనిచేస్తోంది.

కోమలి భర్త ఊళ్ళో లేడు. నా భార్య ఊళ్ళోలేని సమయంచూసి పుస్తకాల వంకతో ఇంట్లోకి నిస్సంకోచంగా ప్రవేశించింది. నా భార్యను అక్కా అని పిలిచి నాకు మరద లైంది. ఇప్పుడేమిటి చేయడం?

ఐదు, పది, పదిహేను నిమషాలు గడిచినా కోమలి ఇంకా బయటకు రాలేదు.

పుస్తకాలు తీసుకోడానికి ఇంతసేపెందుకు? ఒకవేళ ఆమె నా కోసం ఎదురుచూస్తోందేమో. తీరా వెడితే బాగుం టుందో, బాగుండదో. కానీ నాలో ఏదో తొందర చేస్తోంది. అందుకే ధైర్యంచేసి ఆ గదిలోకి వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి కోమలి ఇంకా పుస్తకాలను పరిశీలిస్తూనే ఉంది. నన్ను చూస్తూనే "వెధవది. జ్ఞాపకశక్తి బాగా తగ్గి

పోయిందండీ. ఏది చదివానో, ఏది చదవలేదో సరిగా గుర్తుండి ఏడవడంలేదు. ప్రతీదీ ఓ రెండు పేజీలు చదివి చూసేసరికి చదివినట్లే ఉంటోంది. మీకు తోచిన మంచి పుస్తకాలేవైనా ఉంటే ఇద్దురూ'' అంది.

ఒక్క పిసరు హతాశుడ నయ్యాను. రంగనాథం కళ్ళ బడ్డలాంటి దృశ్యం చూస్తానని నేనూ ఆశపడ్డాను. కానీ అలా జరగలేదు. ఐనా కోమలి ఇంకా నా గదిలోనే ఉంది. ఆమె భర్త ఊళ్లో లేడు. చూడాలి, నా అదృష్ట మెలాగున్నదో.

నేను వెళ్లి పుస్తకాలు వెదకడం మొదలుపెట్టాను. ఆమె కూడా నా పక్కనే ఉండి పుస్తకాలు వెదుకుతోంది.

నిజం చెప్పాలంటే మేమూ, కోమలి దంపతులూ ఏక కుటుంబంలా కలిసి ఉంటున్నాము. ఇద్దరిలో ఎక్కడా అర మరికలు లేవు. ఇదివరలోకూడా చాలాసార్లు నా దగ్గరకు కోమలి చనువుగా వచ్చింది.

ఐతే అప్పట్లో నా దృష్టి వేరుకాబట్టి ఆమెపైన దురభి ప్రాయాలేమీ కలుగలేదు. కానీ ఈరోజు చెప్పలేని ఆవేశం కలుగుతోంది. ఆమెను దగ్గరగా లాక్కుని గట్టిగా కౌగలించు కోవాలని పదేపదే అనిపించసాగింది. కానీ అలా చేయలేక పోతున్నాను. పుస్తకాలు వెతుకుతున్నానన్న మాటే గానీ, ఏం చూస్తున్నానో నాకే తెలియదు.

అలా ఐదు నిముషాలు గడిచేక చేతికి తోచిన పుస్తకాలు రెండు తీసి ఆమెకు ఇచ్చాను.

రెండు పుస్తకాలనూ పరీక్షగా చూసి, పేజీలు తిరగేసి ''చాలా థాంక్సండీ. ఇవి నేను చదవనివే'' అంటూ ఆమె వెనుదిరిగింది.

'వెళ్ళిపోతున్నావా కోమలీ' అనుకున్నాను మనసులో.

పరుగెత్తుకువెళ్ళి ఆమెను ఆపాలనిపించింది. కానీ ఏమీ చేయలేకపోయాను.

వీధి గుమ్మందాకా వెళ్లి ఒక్కసారి ఆగి వెనక్కు తిరిగి "వస్తానండీ. రెండుమూడు రోజుల్లో ఇచ్చేస్తాను పుస్తకాలు" అంది కోమలి. అనేసి నేను చూస్తూండగానే వెళ్లిపోయింది.

'ఒరేయ్, రంగనాథం! నువ్వెంత అదృష్టవంతుడివిరా!' అనుకున్నాను మనస్సులో.

తర్వాత కోమలికోసం ఆశగా నాలుగురోజులు ఎదురు చూశాను. కానీ ఫలితం లేకపోయింది.

ఐదోరోజున "తలనొప్పిగా ఉంది. మీ ఇంట్లో ఏమైనా టాబ్‌లెట్సు ఉన్నాయా" అనికూడా వెళ్లి అడిగాను. రెండు నోవాల్జిన్ బిళ్లలు నా చేతిలో పెట్టింది కోమలి.

"చాలా థాంక్స్. నొప్పివల్ల ఈ రోజు ఆఫీసుకుకూడా సెలవు పెడుతున్నాను" అని చెప్పి మా ఇంట్లోకి వచ్చేశాను.

నా సెలవుకు కారణం తలనొప్పికాదు. కోమలి వస్తుందని ఆశ. ఉదయం సుమారు పదిగంటలకు తలుపు చప్పుడయింది. వెళ్ళి తలుపు తీశాను.

కోమలి—నిజంగా కోమలి!

నా హృదయం పరవళ్లు తొక్కింది. ఉత్సాహాన్ని ముఖంలో కనపడనీయకుండా జాగ్రత్తపడ్డాను. "ఇంకా తగ్గలేదు తలనొప్పి" అన్నాను నీరసంగా.

"అందుకే మీ కోసం వేడివేడి మిరియాల చారు తెచ్చాను. వెంటనే భోంచేసేయండి- భోజనం అయిపోయివ్వంటే చారు కొద్దిగా తాగండి. గ్లాసు సాయంత్రం పంపిద్దురుగాని" అని గ్లాసు టేబిల్‌మీద పెట్టి వెళ్ళిపోయింది కోమలి.

ఈసారి నిజంగా నీరసం వచ్చింది.

తలుపులు వేసి కొద్దిగా చారు తాగాను. కోమలి చేతి వంట అమృతం. గ్లాసు కాళీ అయిపోయింది. గ్లాసు ఇవ్వడం కోసం కోమలి ఇంటికి అప్పుడే వెళ్లాలనిపించినా- అలా చేయలేదు. మంచం మీద పడుకుని ఆలోచిస్తూండగా ఎప్పుడో నిద్రపట్టింది.

ఎవరో తలుపు తడుతున్న చప్పుడికి మెలకువ వచ్చింది.

టయిము చూసుకున్నాను- రాత్రి ఎనిమిదిన్నరయింది. తలుపు తడుతున్న చప్పుడు స్పష్టంగా వినబడుతోంది. ఆ తడుతున్నది గాజులున్న చేయి అనికూడా స్పష్టంగా తెలుస్తోంది. నాలో ఏదో ఆశ అంకురించింది.

తలుపులు తీసి చూసి హతాశుడనయ్యాను.

ఎదురుగా శ్రీమతి. "నువ్వా?" అన్నాను నీరసంగా.

"ఏం- పరాయి ఆడదనుకున్నారా?" అంది శ్రీమతి వెటకారంగా. ఆమె లోపల అడుగు పెట్టి తలుపులు వేసి నా దగ్గరగా వచ్చింది.

ఒక రకమైన ఆవేశంలో ఆమెను నా దగ్గరగా లాక్కున్నాను. ఆమె నా చెంపలు నిమురుతూ నా కళ్ళలోకి చూస్తోంది. ఆ కళ్ళలో కాంక్ష ఉంది. కొత్త మెరుపు ఉంది. నేను మరింత గట్టిగా ఆమెను హత్తుకున్నాను.

ఆమె కన్నులు మూతపడ్డాయి. తన చేతులతో నా భుజం మీద గట్టిగా నొక్కుతూ "బావా!" అంది పరవశంగా.

ఉలిక్కిపడ్డాను. ఆమెకూడా చటుక్కున నాలిక్కరుచుకుంది. నా పట్టు సడలింది. సాలోచనగా వెళ్లి కుర్చీలో కూర్చున్నాను.

శ్రీమతి పుట్టింటినుంచి వస్తోంది. వాళ్ళింట్లో ఆమె బావకూడా ఉన్నాడు.అతగాడక్కడుండి రీసెర్చి వెలగబెడు

తున్నాడు. మగవాడు కౌగలించుకున్నప్పుడు కలిగిన పరవశంలో 'బావా' అనడం ఆమె కీ నాలుగు రోజుల్లోనూ బాగా అలవాటయింది!

"బావా ఏమిటి అసహ్యంగా?"

"అదేంటండీ- మీరు నాకు బావకాదా" అంది శ్రీమతి. ఆమె మాట్లాడుతూంటే కొత్తరకంగా ఉంది నాకు. బహుశా నాలో తల ఎత్తిన అనుమానమే అందుక్కారణం కావచ్చు.

"కావచ్చు. కానీ ఇదివర కెన్నడూ అలా పిలవలేదు నువ్వు!"

"నీ కిష్టం లేకపోతే అననులే బావా!" మళ్ళీ నాలిక్కొరుచుకుంది శ్రీమతి.

నాకేదో అనుమానం వచ్చింది. శ్రీమతి నన్ను 'నువ్వు' అంది. 'బావా' అంది. ఈ సారి పొరపాటు నటించినా- అది పొరబాటుకాదనీ, కావాలనే అన్నదనీ నాకు అనిపించసాగింది. అంటే....

ఒక్క క్షణం ఆలోచించేసరికి ఏదో అర్థమయిందనిపించింది. నేను పదేపదే పరాయి ఆడదాని ప్రసక్తి తీసుకొస్తూన్నందుకు ప్రతిగా తనూ పరాయి మగవాడి ప్రసక్తి తీసుకురావాలని నన్ను దెబ్బకొట్టాలని ప్లాను వేసిందేమో!

ఇది తట్టగానే నాలో నేను నవ్వుకుని- "ఏమిటి విశేషం అలకమీద వెళ్ళి నాలుగు రోజుల్లోనే వెనక్కు వచ్చేశావ్!" అన్నాను వెటకారంగా.

"మీమీద మోజుకొద్దీ" అంది శ్రీమతి.

నిజం చెప్పొద్దూ—ఆ క్షణంలో శ్రీమతిని చూస్తూంటే ముద్దుపెట్టుకోవాలనిపించింది. కానీ అలా చేయలేదు. చేస్తే ఆమెకు లోకువైపోతాను. ఆమె నన్ను ఏడిపించదలచు

కుంది. నేనూ ఆమెను ఏడిపించాలి.

అందుకే నాలోని కోర్కెల గుర్రాలకు తాళం వేసి ఒక్కణ్ణే సెకండ్‌షో సినిమాకు పోయాను, ఇంట్లో ఉంటే శ్రీమతికి లొంగిపోతానని.

అట్టే జనంలేరుగానీ-సెకండ్‌షోకి అప్పుడే చాలా పెద్ద క్యూ ఉంది. ఆ క్యూ మధ్యలో నాకు సుబ్రహ్మణ్యం కనబడ్డాడు. అతను నన్ను చూడలేదు.

సుబ్రహ్మణ్యం భార్యపేరు పుల్లాయమ్మే కానీ మనిషి సినిమాస్టారులా ఉంటుంది. ఉండడమే కాదు - అలాగే చూస్తుందికూడా. అనేకపర్యాయాలు ఆమె నావైపు కాంక్షతో నిండినచూపులు చూసింది. అదివరలో పట్టించుకోలేదు.

బుర్రలో ఏదో తళుక్కున మెరిసింది. గిరుక్కున వెనక్కి తిరిగాను.

నా అడుగులు సరైనమార్గంలోనే పడుతున్నాయి. దారి పొడుగునా-బాత్‌రూంలోని రంగనాధం, మాలతి కళ్ళముందు మెదుల్తున్నారు. 'సరదాకన్నాను కానీ కళ్ళు మూసుకోనవసరంలేదు. నేను బట్టలువేసుకునే ఉన్నాను' అంటోంది మాలతి.రంగనాధం కళ్ళు తెరిచాడు. ఆ తలపుకే పరవశంతో నాకళ్ళు మూతలుపడ్డాయి.

ఆడవాళ్ళలో ఇలాంటి వారుంటారనీ, రంగనాధంవంటి దేభ్యంగాడికి అలాంటి అవకాశాలు వస్తాయనీ తెలిసుంటే-నేను మొదట్నుంచీ ఇటువంటి దృష్టిలో ఉండి ఉండేవాణ్ణి. కాస్త ఆలస్యంగా అయితేమాత్రం-మేలుకోగలిగాను.

అదే సుబ్రహ్మణ్యం ఇల్లు. తలుపు తడదామా అనుకుని-ఎందుకైనా మంచిదని ఒకసారి తోసిచూశాను.

ఎందుకంటే తనభార్యకు తలుపుగడియవేసే అలవాటు లేదని సుబ్రహ్మణ్యం చాలాసార్లు నా దగ్గర వాపోయాడు.

ఎందుకంటే ఆమెకు విపరీతమైన నిద్రట. ఒకోసారి సుబ్రహ్మణ్యం ఆఫీసునించి ఇంటికి వచ్చేసరికికూడా నిద్రపోతూం టుందిట. తలుపుతట్టి ఆమెను మేల్కొల్పడం అసంభవం కాబట్టి - ఆమె తలుపులు వేయకుండానే వదిలేస్తుంది.

సాధారణంగా సుబ్రహ్మణ్యం ఇంటికి ఎవరూ రారు కాబట్టి ఫరవాలేదు. అనేక పర్యాయాలు మేమిద్దరం కలసి అతనింటికి వెళ్ళినప్పుడు తలుపు తోసుకునే లోపలకువెళ్ళాం.

నా అదృష్టం బాగుంది. తలుపు తెరుచుకుంది. నేను నెమ్మదిగా లోపలకు అడుగుపెట్టాను.

అది వరండా. దాన్నానుకునే వాళ్ళబెడ్ రూమ్ ఉంది.సాధారణంగా అతిధుల్ని వరండాలోనే కూర్చోపెడతారు కానీ నాకుమాత్రం సరాసరి అతని బెడ్ రూమ్‌లో అడుగుపెట్టే అధికారముంది. వంటింట్లోకి వెళ్ళడానికి బెడ్రూమేదారి నేనెప్పుడూ వాళ్ళవంటింట్లోనే కాఫీ తీసుకుంటూంటాను.

నేను చప్పుడుచేయకుండా అడుగులువేసుకుంటూ వాళ్ళ బెడ్ రూమ్‌లో అడుగుపెట్టాను.

అంతే-నాకళ్ళను నేనే నమ్మలేకపోయాను. పుల్లాయమ్మ వీపు నావైపుకు ఉంది. ఆమె టర్కిష్‌టవల్‌తో ఒళ్ళు తుడుచుకుంటోంది. ఇది కలా. నిజమా, నాకూ్కడా రంగ నాధంలాంటి అవకాశమా?

కొద్దిగా అడుగులు చప్పుడుచేస్తూ వరండాలోకివచ్చి చిన్నగా దగ్గాను. "ఎవరూ?" అంటూ పుల్లాయమ్మ తలుపుదగ్గ రకు వచ్చింది. ఆమె టవల్‌ని శరీరానికి చుట్టబెట్టుకుని ఉన్నప్పటికీ-అది సరిపోలేదని తెలుస్తూనే ఉంది.

"వెరిసారీఅండీ - సుబ్రహ్మణ్యం ఉన్నాడేమోనని-" అంటూ నసిగాను.

"ఫర్వాలేదు-రండి. కాఫీతాగి వెడుదురుగాని" అందామె.

"సుబ్రహ్మణ్యం........"

"అలా బయటకు వెళ్ళారు. ఇప్పుడే వచ్చేస్తారు కానీ కొంచెం తలుపు గడియవేసిరండి-" అంది పుల్లాయమ్మ.

నా శరీరం వేడిగా ఉంది. బుర్ర పనిచేయడంలేదు. వెళ్ళి తలుపులు గడియవేసి వచ్చాను. ఈలోపుగా పుల్లాయమ్మ వంటికి చీర చుట్టబెట్టుకుని వరండాలోకివచ్చి ఒక కుర్చీలో కూర్చుంది. నేనూ ఒకకుర్చీలో కూర్చున్నాను కానీ నావళ్ళు వణుకుతోంది.

పుల్లాయమ్మ నవ్వుతూ-"చూడండి. ఆయన ఇంట్లోలేరు. మీరూనేనూ ఉన్నాం. మీరు తలుపు గడియవేసివచ్చారు. నే నేమనుకోవాలి?" అంది.

"మీరే వేయమన్నారు గడియ!" అన్నాను తడబడుతూ.

"పోనీ. ఐతే మీరేమనుకోవాలి?" అంది పుల్లాయమ్మ.

నాకు జవాబు తోచింది. లేచి ఆమె దగ్గరకు వెళ్ళి "మీరు చాలా అందంగా ఉంటారు" అన్నాను.

ఆమె నవ్వి "మీ భార్య గురించి మావారూ అదేమాట అంటారు" అంది.

ఉలిక్కిపడ్డాను. ఒక్కసారిగా నాలోని ఆవేశం దిగజారి పోయింది. ముఖం అదోలా మారిపోయింది. వెంటనే వెనక్కి తిరిగాను.

"ఆగండి!" అంది పుల్లాయమ్మ. "నేను మగవాడి బల హీనత గురించి మాట్లాడుతున్నాను తప్పితే మిమ్మల్ని వెళ్ళి పొమ్మనలేదు. మీ బలహీనతలు మీరు అర్థం చేసుకోవడమే కానీ, మా బలహీనతలు అర్థం చేసుకోరు. మావారికంటె మీరే నాకు అందంగా కనబడతారు" అంటూ పుల్లాయమ్మ లేచి నా దగ్గరకు వచ్చి "చూడండి, ఇప్పుడు వారు వచ్చి తలుపు తడితే మీరు వెళ్ళి తలుపుతీస్తే ఆయన ఏమను

కుంటారు?'' అంది. నేను జవాబు చెప్పేలోగానే నన్నొక సారి గట్టిగా కౌగలించుకుని "ఇంతసేపు ఇలా ఉన్నామను కుంటారు కదూ!'' అంది.

ఆమె అలా మాట్లాడకుండా ఉండివుంటే ఆ కౌగిలి నాకు చాలా బాగుండివుండేది. ఆమె మాటలమధ్య ఆ కౌగిలి నాకు కొంచెం కంపరంగా ఉన్నమాట నిజం. ఐనా వదిలిపించు కోవాలని మాత్రం అనిపించలేదు. అందులోనూ అప్పుడే రంగనాధం, మాలతి గుర్తు రాగా ఆవేశంగా నా చేతులు ఆమె నడుంచుట్టూ బిగించాను.

పుల్లాయమ్మ మళ్లీ అంది. "ఇప్పుడు మావారు వచ్చి మనల్ని దశలో చూస్తే మనల్ని తప్పుపట్టరు. కానీ తక్షణం మీ ఇంటికి వెడతారు.''

లాభంలేదు. ఈ పుల్లాయమ్మ కౌగిలి నాకు నప్పదు. మరి ఏంచేయాలి? ఆమె ఉద్దేశ్యమేమిటో తెలియదు కానీ. చూస్తూ చూస్తూ ఆ కౌగిలి వదులుకో బుద్ధి కావడంలేదు. అంతలోనే ఎవరో నిజంగా తలుపు తట్టారు.

ఒక్కసారి ఆపాదమస్తకం వణికిపొయ్యాను. "మావారే అయుంటారు'' అంది పుల్లాయమ్మ. నెమ్మదిగా చెవిలో మళ్లీ అంది "దొడ్డిదారిన వెళ్లిపొండి!'' అని.

ఆమెను వదిలి బెడ్‌రూంలోంచి వంటింట్లోకి వెళ్ళాను. కానీ, హఠాత్తుగా నాలో కొత్తఆశ రేగింది. ఆ వచ్చినది సుబ్రహ్మణ్యం కాకపోతే—

సుబ్రహ్మణ్యం సినిమా టాకీసుదగ్గర క్యూలో వున్నాడు. టికెట్టు దొరక్కపోతే బ్లాకులో ఐనా కొనుక్కు వెళ్ళి పోతాడు తప్పితే వెనక్కురాడు. మరి ఆ వచ్చినదే ఆడవాళ్లో ఐతే!

అందుకే వంటింట్లో ఆగాను. ఎందుకంటే పుల్లాయమ్మ

నాకు లొంగుతుందన్న ధైర్యం కలిగిందిప్పుడు. వీధితలుపు గడియవేసిన చప్పుడు ఎవరో బెడ్ రూమ్‌లోకి వస్తున్న చప్పుడు ఐంది. జాగ్రత్తగా వంటింట్లోంచి తొంగిచూశాను. పుల్లాయమ్మతోపాటు ఎవరో పురుషుడు.

''చూడు మోహన్! నీ కోసమని మా ఆయన రమ్మని ఎంత బలవంతపెట్టినా వినకుండా సినిమా మానేసి ఇంట్లో ఉండిపోయాను. తలుపులు దగ్గరగా జేరవేసిఉంచాను. కానీ నువ్వువచ్చే లోగానే మరో మగపురుగు ఇంట్లో దూరింది. నీ కోసం తయారుగాఉన్న ఈ శరీరాన్నిచూసి లొట్టలు వేసింది. ఊరించి ఊరించి బెదరగొట్టి పంపేశాను'' అంటోంది పుల్లాయమ్మ. మోహన్ ఆమెను బలంగా ముద్దుపెట్టుకుంటున్నాడు.

నేను మౌనంగా వంటింట్లోంచి దొడ్లో అడుగుపెట్టి దొడ్డిగుమ్మం ద్వారా బయటపడ్డాను.

పుల్లాయమ్మ పతివ్రతకాదు. కానీ మాలతికి రంగ నాధంలా ఆమెకో మోహన్ ఉన్నాడు. నా కా అదృష్టంలేదు. ఆమె దృష్టిలో నే నొక మగపురుగును.

ఏమైతేనేం పుల్లాయమ్మ తలుపులు వేయకుండా ఉండ డానికి కారణం తెలిసింది నాకు.

ఇంటికి వెళ్ళాను కానీ మనసేం బాగుండలేదు. నేను లోపలకు రాగానే తలుపులువేసి నన్ను తనకు హత్తుకుంది శ్రీమతి. కానీ పిలవకపోయినా ఆమె నన్ను బావా అని పిలిచినట్లనిపించింది. అందుకే ఆమెను విదిలించుకున్నాను.

''మీ కోసం రంగనాధంగారు వచ్చారు'' అంది శ్రీమతి.

''ఎప్పుడు?'' అన్నాను.

''మీరు అటువెళ్ళగానే వచ్చారు. మీ కోసం ఓ గంట సేపు ఎదురుచూశారు.''

రంగనాథం మా ఇంటికి వచ్చేడంటే నాకు భయం వేసింది. వెధవ అసలే మాలతిని మరిగిఉన్నాడు. వాడి కింక ఆడదానిమీద గౌరవమేం ఏడుస్తుంది? నా భార్యకేసి వాడెలా చూశాడో ఏమో అదీకాక వాడికిప్పుడు ఆడవాళ్ళను వశపరచు కునే ట్రిక్కులు కూడా తెలిసిఉంటాయి.

"అంతసేపూ ఏం చేశాడు?" అనుమానంగా అడిగాను.

"కబుర్లు చెప్పుకున్నాం. కాఫీ కలిపిస్తే తాగారు."

శ్రీమతి వాడికి కాఫీ ఇచ్చింది. అప్పుడు చేతికి వేళ్లు తగిలేవుంటాయి. వెధవకి ఎటువంటి ఆలోచనలు కలిగాయో ఏమో! నేను కోమలి గురించి ఆలోచించినట్లుగా, నా భార్యను గురించి రంగనాథం ఆలోచించి ఉంటాడేమో నన్న అను మానం కలిగే సరికి నా వొళ్ళంతా తేళ్ళూ జెర్రులూ పాకి నట్లయింది.

"నేను ఎనిమిదిన్నరకే ఇల్లు వదిలేనని చెప్పేవా?"

"చెప్పాను."

నేను ఎనిమిదిన్నర ప్రాంతంలో ఇల్లువదిలి సినిమాకి వెళ్లేనని వాడూహించి ఉండాలి. సినిమాకు వెడితే రాత్రి ఒంటిగంటదాకా రానని తెలుసు. అయినా గంటసేపు వుండి వెళ్ళిపోయాడు.

అంటే వాడి ఉద్దేశ్యం? కొంపదీసి వాడెదురు చూసిన అవకాశం కానీ లభించలేదు కదా!

అనుమానంగా శ్రీమతి వంక చూశాను. ఆమె ముఖం నిర్మలంగా ఉంది.

శ్రీమతిని అనుమానించటం తప్పు. ఆమె చాలా మంచిది. నా మనసే తప్పుడు ఆలోచనలు చేస్తోంది. అందుకే అందరి గురించీ తప్పుగా ఆలోచిస్తున్నాను.

భోజనాలయాక మడత మంచం పట్టుకెళ్ళి వీధిలో వేసుకున్నాను. శ్రీమతి గురించి బాగా తెలుసు. ఒక్క రాత్రికి వీధిలో పడుకుంటే రేపుదయానికి కాళ్ళమీద పడుతుంది.

"మీ స్నేహితు లెవరేనా వస్తున్నారా?" అనడిగింది శ్రీమతి.

"కాదు, నాకోసమే!" అన్నా నేను.

శ్రీమతి ముఖం అదోలా పోయింది. నేను కోరుకున్నదీ అదే.

"ప్లీజ్! ఈ రాత్రికి ఇంట్లో పడుకుందాం, రండి"అంది.

"ఈ ఉక్కపోతలో ఇంట్లో పడుకుంటే చస్తాను" అన్నాను చిరాగ్గా.

"చస్తే స్వర్గానికే గదా వెళ్ళేది. నేను బ్రతికుండగానే మీకు చూపించ గలను" అంది శ్రీమతి.

"నీ సంగతి నాకు తెలియదనుకోకు-ఎప్పుడో కనిపెట్టేశాను. అందుకే వీధిలో పక్క!"

శ్రీమతి కళ్ళలో ఆశ్చర్యం కనిపించింది. మరేం మాట్లాడ లేదామె.

ఆ రాత్రి చాలాసార్లు ప్రయత్నించింది శ్రీమతి. నేను లొంగలేదు. అయితే నిగ్రహం చూపించడానికి చాలా కష్ట పడవలసొచ్చింది.

రాత్రి తెల్లవార్లూ నాకు సరిగా నిద్ర పట్టలేదు. మాలతి రంగనాథాలతో పాటు, మోహన్, పుల్లాయమ్మలు కూడా కళ్ళ ముందు మెదులుతున్నారు. మనసు క్రమంగా పుల్లాయమ్మ మీదకు పోతోంది. సుబ్రహ్మణ్యం లేని సమయం చూసి మరోసారి పుల్లాయమ్మ దగ్గరకు వెళ్ళాలి. పుల్లాయమ్మ ఎటు

వంటిదో తెలిసింది గదా. ఆమే నాకు అందుబాటులో ఉన్న పరాయి ఆడది మరి?

ఎప్పుడో నిద్ర పట్టింది. వీధిలో పడుకోవడం వల్ల చచ్చినట్లు పెందరాళే లేవ్వాలసి వచ్చింది. పని మనిషి, పాల వాడు....ఇంట్లో ఇంక హడావుడి ప్రారంభం.

మండుతున్న కళ్లతో, రగులుతున్న హృదయంతో కాల కృత్యాలు తీర్చుకుని ప్రొద్దున్నే ఒక మిత్రుడు దగ్గరకు వెళ్లి, అక్కడి నుండి అటే ఆఫీసు చేరాను. గవర్నమెంటాఫీసులో ఉద్యోగస్తుణ్ణి కాబట్టి హాయిగా ఆఫీసులో నిద్ర పోగలిగాను. ఆఫీసులో మంచి విశ్రాంతి లభించింది.

సాయంత్రాని కల్లా ఇల్లు చేరుకున్నాను.

తలుపు తట్టగానే నవ్వుతూ తలుపు తీసింది శ్రీమతి. నేనూ ఆమెను చూసి నవ్వాను.

తలుపు వేసి నా దగ్గరగా వచ్చింది శ్రీమతి.

"మీకు నేనంటే ఎంత ప్రేమండీ" అంటూ శ్రీమతి నా మెడచుట్టూ చేతులువేసి నన్ను అల్లుకుపోయింది.

నే నాశ్చర్యపోయాను. కానీ శ్రీమతి ఇంకా మాట్లాడు తోంది.

"మీ మాటలు నిజ మనుకొని కోపమొచ్చి పుట్టింటికి పోయాను. అసలు సంగతి ఎవరికీ చెప్పలేదుకానీ మా చెల్లెలు రేవతికి చెప్పాను. అది నవ్వి 'మగాళ్ళలా అంటారు కానీ చేతలు వచ్చేసరికి శూన్యం. నా మీద నీకు నమ్మక ముంటే పరాయి ఆడదానితో బావ ప్రవర్తన ఎలా ఉంటుందో తెలుసుకువస్తా' అంది. సరేనన్నాను.

"దాన్ని మీరు అతి సులువుగా గుర్తుపట్టికూడా తెలియ

నట్టు నటించారుట. దాన్ని వదుల్చుకుందుకు మధ్యాహ్నం సినిమాకు పోయారుట. ఎంత బ్రతిమాలినా వినకుండా వీధిలో పడుకున్నారుట. మీరు వీధిలో పడుకున్న విషయం అమ్మలక్కల ద్వారా రూఢి అయింది. 'ఇంతటి ఏకపత్నీ వ్రతుణ్ని పట్టుకుని పరాయి ఆడదానికోసం ప్రాకులాడతా డంటావేంటి?' అంటూ తిట్టింది నన్ను. నేను మధ్యాహ్నం వచ్చేశాను. మీ ముఖం చూడ్డానికి సిగ్గేసి. ఎంత చెప్పినా వినకుండా నాలుగు గంటల బస్సులో వెళ్ళిపోయిందది.''

తెల్లబోయాను.

నిన్న ఇంట్లో గడిపిన వ్యక్తి శ్రీమతి చెల్లెలు రేవతి అన్నమాట! అయినా శ్రీమతికి రేవతి అనే ఒక కవల చెల్లె లున్నదన్న విషయం- 'బావా' అని ఆమె పిలుస్తూంటేనైనా నా కెందుకు స్ఫురించలేదు. ఉయ్యాల్లో పిల్లాణ్ణి పెట్టుకుని ఊరంతా వెదికినట్లు గొప్ప అవకాశంపోయింది నాకు.

నాలాంటి భర్తను పొందిన తన అదృష్టానికి మురిసి పోతోంది శ్రీమతి. నిన్నటిలాంటి అవకాశం పోగొట్టుకున్న దురదృష్టానికి కృంగిపోతున్నాను నేను.

అయితే— శ్రీమతి నన్ను దేవుణ్ణి చేసి పొగిడేస్తోంది. తన చెల్లెలు నన్నేవిధంగా పొగిడినదీ చెబుతోంది.

ఆ మాటలు నాలో వివేకాన్ని కలిగించేయి. పరాయి స్త్రీని అనుభవించడంద్వారా తాత్కాలిక సుఖం లభించవచ్చు. కానీ కాదనడం ద్వారా మగవాడి ఔన్నత్యం ఎంత పెరుగు తోందో అనుభవపూర్వకంగా తెలిసింది నాకు.

ఉత్సాహంతో నా మనసు పరవళ్ళు తొక్కింది.

శ్రీమతిని గబాలున హృదయానికి హత్తుకుని ముద్దుల వర్షం కురిపించాను. ★

పాఠకుల పరిశోధన పోటీ

54. ముగ్గురు అనుమానితులు?

(బహుమతి రు. 50/-లు నగదు)

దేశంలో తలెత్తిన శత్రువుల మతాతాలూకు రహస్యాలు కనుగొనేందుకు స్పెషల్ బ్రాంచ్ ఏజంట్ మాధవన్ నియమించబడ్డాడు.

అయితే అతను హోటల్ నటరాజ్ గదిలో హత్యచేయబడ్డాడు. ఉదయం ఆ వార్త తెలిసి ఇన్‌స్పెక్టర్ అర్జున్ హుటాహుటీగా హోటల్ రూం నెంబర్ 125 కి చేరుకున్నాడు.

బెడ్ మీద వెల్లకిలా పడివున్నాడు మాధవన్. మెడమీద రెండు రంధ్రాలు కనబడ్డాయి. చుట్టూ నెత్తురు మడుగుకట్టింది. రివాల్వర్‌తో రెండుసార్లు కాల్చి చంపబడ్డాడని ఊహించాడు.

హతుని ఎడమచేయి బైబిల్ మీద, కుడిచేయి భాగవత గ్రంథం మీద వేసివున్నాయి. కుడిచేతి ప్రక్కగా కురాన్ పుస్తకం ఒకటి పడివుంది.

ఇన్‌స్పెక్టర్‌కి ఆ రెండిటిమీద హతుడు ఎందుకు చేతులు వేసాడో అర్థంకాలేదు, కాని ఆ మూడు గ్రంథాలు హతుడి చుట్టూ వుండటంలో ఏదో ప్రత్యేకత వుందనిపించింది. ఒకటి క్రైస్తవమత గ్రంథం, ఇంకొకటి హిందూ మత గ్రంథం, మరొకటి మహమ్మదీయుల మతగ్రంథం.

అవి అలా వదిలి ఇంకేమైనా, క్లూస్ దొరుకుతాయేమో

నని జాగ్రత్త. వెతికాడు. బెడ్ క్రిందవున్న రివాల్వర్ అతన్ని ఆకర్షించింది. అది .38 కాలిబర్ రివాల్వర్.

వ్రేలిముద్రలు చెరగకుండావుండే విధంగా తీసి, రివాల్వర్‌ని పరిశీలించాడు. దాంట్లో నాలుగు గుళ్లే ఉన్నాయి. దాన్ని కాల్చిన గుర్తులు కనిపించాయి. మిగిలిన రెండు గుళ్ళు హతుడి శరీరంలోనికి రవాణా చేయిబడ్డాయని ఊహించాడు.

డాక్టర్, ఫింగర్‌ప్రింట్ ఎక్స్‌పర్ట్ లోనికొస్తూ, ఇన్‌స్పెక్టర్ అర్జున్‌ని చూచి విష్ చేశారు.

గదిలో నుండి బయటికి వచ్చాడు ఇన్‌స్పెక్టర్. గది బయట హోటల్ మేనేజర్ నిల్చున్నాడు. "ఈ గదిలోని వ్యక్తి కోసం, ఎవరైనా వచ్చారా!? ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"ఎవరూ రాలేదు. కాని మీకు వివరాలు కావాలంటే ఆ ప్రక్క గదుల్లో ఉన్నవారిని ప్రశ్నించండి?" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ 121 నెం గది దగ్గరకు వెళ్లి తలుపుతట్టాడు. సుమారో పది నిముషముల తరువాత, ఎర్రగా, బలిష్టంగా నున్న వ్యక్తి తలుపు తీసాడు. ఇన్‌స్పెక్టరుని చూచి గతుక్కుమన్నాడు. అతడు షేర్వాణి తొడుక్కున్నాడు.

"మిస్టర్ ఈ హోటల్‌లో హత్య జరిగింది," అన్నాడు ఇన్‌స్పెక్టర్ గంభీరంగా.

"మైగాడ్," విస్మయంగా అన్నాడా వ్యక్తి.

"125వ గదిలోని మాధవన్ మీకు తెలుసా?" చురుగ్గా అడిగాడు అర్జున్.

"అబ్బే. నాకు అంత బాగా తెలియదు. ఈ హోటల్ లోనే పరిచయమయ్యాడు. అతనెలా హత్య చేయబడ్డాడు?"

ఇన్‌స్పెక్టర్ సమాధానం చెప్పలేదు అతడికి.

"మీ పేరేంటి, ఏం చేస్తుంటారు?" తిరిగి ప్రశ్నించాడు.

"నాపేరు, అహమ్మద్ షా. నేనొక మెడికల్ రిప్రజెం టేటివ్ని. కొన్నికంపెనీల మందులు ప్రకటించడానికి, ఈ వూరు వచ్చాను" చెప్పాడు అతను.

ఇద్దరూ కలిసి శవంవున్న గదిలోనికి అడుగుబెట్టారు. "పాపంచాలా ఘోరంగా చంపబడ్డాడు" అన్నాడు అహ మ్మద్ షా శవాన్నిచూసి.

"ఇతణ్ని ఆఖరిసారిగా ఎన్నింటికి చూసారు, హత్య చేయబడకముందు. ఇందాకకాని అతన్ని కలుసుకున్నారా?"

"నో. రాత్రి 9-30దాకా, ఇతనితోనే గడిపాను.తరువాత నాగదిలోనికి వెళ్ళిపోయాను. తిరిగిమీరు ఇప్పుడు తలుపు తట్టినప్పుడు మెలకువ వచ్చింది."

"అరేరే! మాధవన్ చంపబడ్డాడా.ఎవరో అనుకున్నాను" అన్న మాటలువిని, వెనక్కితిరిగి చూసాడు ఇన్ స్పెక్టర్.

ఇద్దరు వ్యక్తులు నిలుచుని వున్నారు. ఒకతను తెల్లగా పొడవుగా వున్నాడు. నైట్ డ్రెస్‌లో వున్నాడు. అప్పుడే నిద్రలేచినట్లు కళ్లు ఎర్రగా వున్నాయి. ఇంకొకవ్యక్తి పొట్టిగా నల్లగా వున్నాడు. అతనుకూడా అప్పుడే నిద్రలేచినట్లున్నాడు.

"మీరెవరు?" ప్రశ్నించాడు, ఇన్ స్పెక్టర్.

"నాపేరు సబాస్టియన్. ఈపక్కనే 126నెం గదిలో వుంటున్నాను. ఏదో గొడవ విని, మెలకువ వచ్చింది." అన్నాడు తెల్లగానున్నతను.

"నాపేరు రాఘవ్. నేను 124 నెంబర్ గదిలో నుంటు న్నాను. మామూలుగా లేచిచూసేసరికి పోలీసులు కన్పించారు. ఏం జరిగింది?" అన్నాడు రెండవ అతను.

"చనిపోయిన మాధవన్‌తో మీకు బాగా పరిచయముందా?" ఇన్ స్పెక్టర్ ప్రశ్న.

"నాకు ముందునుంచి తెలియదు. ఈ హోటల్లోనే పరిచయమయింది. పరిచయం అయిన కొద్దిసేపటికే మంచి స్నేహితుడై పోయాడు. ఎవరీ ఘోరానికి ఒడిగట్టారు!"

"ఇతణ్ణి ఆఖరిసారిగా ఎన్నింటికి చూసారు?"

"విన్నరాత్రి మేము నలుగురం అంటే, నేను, సబాష్టియన్, అహమ్మద్ షా, మాధవన్, రాత్రి తొమ్మిదిన్నరదాకా గడిపాము. ఆ తరువాత ఎవరిగదులకి వాళ్లు వెళ్ళిపోయారు. నేను నాగదికి వెళ్ళకుండా సబాష్టియన్‌తో, రాత్రి పన్నెండు దాకా పేకాడేను. తరువాత నాగదికి వెళ్ళిపోయాను" అన్నాడు రాఘవ. సబాష్టియన్ కూడా ఇంచుమించు అదేలా చెప్పాడు.

"ఇంతకీ మీరేం చేస్తూంటారు" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"బిజినెస్ చేస్తూఉంటాను. నేనుచేసే బిజినెస్‌లో వాటాదారుగా చేరడానికి, రాఘవ్ ఒప్పుకొన్నాడు. ఆ టెర్మ్స్ మాట్లాడ్డానికి, రాత్రి నా గదికి వచ్చాడు" అని చెప్పాడు సబాష్టియన్.

"మీముగ్గురికీ రివాల్వర్ లైసెన్స్ ఉందా!?" మళ్ళీ ప్రశ్న వేసాడు అర్జున్.

"నాకు ఉంది" అని అహమ్మద్ షా జేబులోంచి రివాల్వర్ తీసి ఇచ్చాడు. నిండా ఉన్నాయి గుళ్లు. వాడినట్టు లేదు.

"నాకుకూడా రివాల్వర్ లైసెన్స్ఉంది. కాని నా రివాల్వర్ ఇంతవరకు ఒక్కసారికూడా వాడలేదు" అని రాఘవ తనగదికేసి నడిచాడు.

లోపల అన్నిపెట్టెలు వెతికి, ఒక సూట్‌కేస్ అడుగు లోంచి, రివాల్వర్ తీశాడు. అది కొని చాలారోజులైనట్టుంది. ఆయిల్ చేయకుండా ఉంది. ఖాళీగా ఉంది.

ఈలోపల సబాష్టియన్ తన గదంతా వెతికి నల్లని మొహంతో వచ్చాడు. "సారీ! ఇన్‌స్పెక్టర్. నా రివాల్వర్

కనిపించడంలేదు. రాత్రి నాజేబులోంచి తీసి దాచాను. తీరా చూస్తే పెట్టినచోటలేదు.''

అనుమానంగా చూసాడు ఇన్‌స్పెక్టర్. ఏదో ఆలోచించి, హత్యాప్రదేశంలో దొరికిన రివాల్వర్‌ను రుమాలులో తెచ్చి, సబాష్టియన్‌కి చూపించి, ''ఇది మీదికాదా?'' అని అడిగాడు.

సబాష్టియన్ దాన్ని పరిశీలించి, ''వాటెహెల్! ఇదినాదే. కాని ఇక్కడికెలా వచ్చిందో. నాకు అర్థంకావడం లేదు'' అతని మొహం చెమటలు పట్టింది.

ఇన్‌స్పెక్టర్ ముగ్గురి వేలిముద్రలూ తీసుకొన్నాడు. డాక్టర్, వ్రేలిముద్రల నిపుణుడు తమ ఫలితాలనందించి వెళ్ళిపోయారు.

గంటక్రితం అంటే 5-30-6.గంటల మధ్యలో ప్రాణం పోయింది.

రివాల్వర్‌మీద ఒకేఒక వేలిముద్ర తప్పించి మరెక్కడా వ్రేలిముద్రలులేవు. అది సబాష్టియన్‌ది.

ఈహత్య ఆముగ్గురిలోనే ఎవరోఒకరు చేశారు. ఎవరా హంతకుడు?

* * *

[ఇదీ కథ. దీనిలో మాధవన్‌ను హత్యచేసిన దెవరో సహేతుకంగా ఒక పోస్టుకార్డుపైగాని, పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపైగాని వ్రాసి యీ నెల 20 వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. 'హోమ్ డెలివరీ' సభ్యులు మాత్రమే పాల్గొనాలి. కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన ఐదుగురు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10-లు చొప్పున నగదు బహుమతి పంపగలము. ఫలితాలు నవంబర్ 74 నెల సంచికలో ప్రచురించబడతాయి. —ఎడిటర్.]

పోటీ నెం. 52 [ఫలితాలు]

హంతకుడు—బి. ఆనంద్.

ఈ కేసులో ఆనంద్, బెనర్జీ ఒక్కరే. అంటే ఆనంద్, బెనర్జీ వేషంలో వచ్చి కరుణాకర్‌ని హత్యచేశాడన్న మాట.

ఆనంద్ చేసిన ముఖ్యమైన పొరపాటు. బెనార్జీ వేషంలో నున్న ఆనంద్, కరుణాకర్‌ని హత్యచేసి, విలాసంగా సిగరెట్ త్రాగుతూ వెళ్తాడే కానీ తను కరుణాకర్‌కి ఇచ్చి, సిగరెట్ కాలగా మిగిలిన ఫిల్టర్ పీకను తీసుకెళ్ళడు. అతడి చేతులకు గ్లవుస్ లేవు కనుక, సిగరెట్ పీకపై అతడి వేలి ముద్రలే అతడిని పట్టిస్తాయి. గ్లవుస్ లేనందున అతడి వేలి ముద్రలు ఇంకా కుర్చీపైన, డోర్ హాండిల్స్‌పైన కూడా లభించవచ్చు. ఎందుకంటే, అది సౌండ్ ప్రూఫ్ గది కావటం వల్ల డోర్‌కు ఆటోమేటిక్ లాక్ సిస్టం వుంటుంది. హాండిల్ త్రిప్పి, గట్టిగా నెట్టనిదే డోర్ తెరుచుకోదు. *

మాకు వచ్చిన జవాబులలో, యీ కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింది ఐదుగురు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/—లు చొప్పున నగదు బహుమతి యీ నెలాఖరులోగా అందజేయబడుతుంది.

1. శ్రీ ఎన్ రామ్మూర్తి, స్టేషన్ మాస్టర్, కోరాపూట్.
2. శ్రీ యు. కె. కుమార్, క్లర్క్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుడివాడ-521301 (కృష్ణాజిల్లా)
3. శ్రీ జె. ప్రసాదరెడ్డి, 81, విశ్వకర్మ హాస్టల్, బనారస్ హిందూ యూనివర్శిటీ, వారణాశి-5 (ఉత్తర ప్రదేశ్)
4. శ్రీ బి. బాలక్రిష్ణ, బి. కాం. రెం. సం., ది నోబుల్ కాలేజ్, సీయర్ హాస్టల్, మచిలీపట్టణం-521001.
5. శ్రీమతి ఎన్. సావిత్రీదేవి, 40-12-73, ధర్మనగర్, వాల్తేరు, విశాఖపట్టణం-530001.

★

ఫానీలు జోక్స్

—ఎస్. వాహిద్

సగం రేటు ముందుగా కడితే రేడియో ఇస్తారని, మిగతా సగం వాయిదాలలో తీర్చాలనీతెల్సి, లక్ష్మీనారాయణ ఓ రేడియో తెచ్చుకున్నాడు; సగంధర చెల్లించి. అటుపై వాయిదాలు కట్టలేదు.

ఓ మూడు వారాలు చూచి ఆ రేడియో షాపువారు ఆయన కావిషయం గుర్తుతెస్తూ "మా రేడియోని మేం తీసుకెళ్లిపోతే, మీ ఇరుగు పొరుగువారు ఏమనుకుంటారో కొంచెం ఆలోచించుకోండి" అని వుత్తరం రాశారు.

వారం రోజులకి లక్ష్మీనారాయణ ఆ షాప్‌వాళ్లకు జవాబురాశాడు. "నా వద్దనుంచి మీరు రేడియో తీసుకెళ్ళడం గూర్చి మా ఇరుగుపొరుగు వారిని విచారించాను. మీ అల్పత్వం అని అంటున్నారు వాళ్ళు."

* * *

'సూర్యచంద్రబాబు'లుగా వాసికెక్కిన ముగ్గురు మిత్రుల్లో సూర్యానికి ఓ రెండొందల రూపాయలవసరం పడింది. చంద్రశేఖర్‌ని అప్పడిగాడు. బాబు పూచీవుంటే ఇస్తానని అతను చెప్పగా, బాబువద్దకి వెళ్ళాడు. పూచీ విషయం ప్రస్తావించాడు.

బాబు బాధగా మొహం పెట్టి అన్నాడు. "సూర్యం: ప్రాణానికి పాణం మనం. మన స్నేహం ఈనాటిదా? స్నేహ

ధర్మం అయినా ఎంచక నువ్వు చంద్రంవద్దకి అప్పుకెళ్ళావా? నేనేమయాననుకున్నావ్? చచ్చిపోయాననుకున్నావా? వెళ్ళు. ఆ చంద్రంనే పూచీ ఇవ్వమను. డబ్బు నే నిస్తాను."

* * *

"ఈ హోటల్‌లో ఈ రోజునుంచి కొత్త మేనేజ్‌మెంట్ అని ప్రకటించారే! మళ్ళీ పాత మేనేజరే వున్నాడేమిటి?"

"ప్రకటన విషయం నిజమేనండి! కాని ఈ మానేజర్ గారికి నిన్ననే వివాహమైంది."

* * *

సినీనర్తకి 'దీపసిరి' ఏదో ప్రోగ్రాం విషయంగా కాకినాడ వచ్చింది. ఓ ప్రఖ్యాత లాడ్జిలో రూం తీసుకుంది.

సుబ్బారావ్ - ఆమె ఫాన్, ఓ పూలగుత్తితో ఆ లాడ్జికి వెళ్ళాడు. రూం బయట బాయ్‌వున్నాడు. పూగుత్తి ఆ బాయ్ చేతికిచ్చి 'దీపసిరి'కి ఇచ్చి రమ్మన్నాడు.

బాయ్ అందుకుంటూ "ఇది పదహారో మారు ఇలాటివి రావడం" చెప్పాడు యధాలాపంగా.

"ఆఁ! ఎవరెవరు తెచ్చారేమిటి?"

"వాళ్లేవో పేర్లు చెప్పారనుకోండి....మర్చిపోయి అమ్మ గారితో చెప్పలేదు."

"సరే" ఓ రెండ్రూపాయలనోటు తీసి అతని పరం చేస్తూ, "అవి కూడా పంపింది నేనేనను. ఇదిగో నా విజి టింగ్ కార్డ్."

* * *

"అయితే....తులసి మళ్ళీ భర్త దగ్గరికి వెళ్ళిందన్న మాట!"

"ఆఁ! ఆమె అలిగి వచ్చేశాక అతడు మహాసుఖపడ్తున్నా డని తెల్సి, సహించలేక వెళ్లింది."

* * *

"ఎక్కడికి కెళ్ళావ్; ఈ రెండు గంటలూ?"

"నన్ను ప్రేమించమని పొరుగింటి కమల్ని అడగడానికి!"

"ఏమందేమిటి?"

"ఆస్తిఎంతనిఅడిగింది. రెండులక్షలైతే ప్రేమిస్తానంది."

* * *

"మన జడ్జిగారి బస్ట్ సైజ్ ఆయిల్ పెయింటింగ్ ఇది. ఎలా వుంది?"

"ఊం....జడ్జిగారింకా చూశ్చేదా?"

"లేదు."

"అయితే, చూపకు!"

"ఏం?!"

"ఆర్నెల్లు శిక్ష వేయొచ్చాయన నీకు."

*   *   *

ఓ లెక్చరర్‌గారు హఠాత్తుగా మరణించారు. శవ సంస్కారానికి డబ్బుల్లేవని తెల్సి, కొందరు పెద్దలు చందాలు వసూలు చేయ నారంభించారు.

ఓ విద్యార్థి వాళ్లని పిల్చి అడిగాడు. "మనిషికి ఎంత వసూలు చేస్తున్నారు?"

"ఒక్కొక్కరికి ఒక రూపాయి."

"ఇదిగోండి, పది రూపాయలు. ఐదుగురి లెక్చరర్లని దహనం చేయండి."

*   *   *

సిగ్గు దొంతర్ల మధ్య నా భార్య సూర్జహాఁ అడిగింది నన్ను.

"ఏమండీ! నేను ముసలిదాన్నయినా నన్నిలా ప్రేమిస్తారా?"

"ప్రేమించడమా! పిచ్చి! పూజిస్తాను. నిన్ను దేవతని చేసి ఆరాధిస్తాను. నువ్వుండే చోటుని పవిత్ర క్షేత్రంగా.... ఆఁ! ఇంతకూ వయసొచ్చాక మీ అమ్మలా తయారవవు కదా?"

*   *   *

"కమలతో మూడేళ్ల క్రితం పరిచయమైంది. లవ్ అట్ ఫస్ట్ సైట్ కాకున్నా సంవత్సరానికి ప్రేమించు కున్నాం. ఆ

సంవత్సర కాలంలో మా ఆలోచనలు, అభిప్రాయాలు, అభిలాషలూ అన్నీ ఒకటేనని తెల్సుకుని ప్రేమించుకోసాగాం. ఈ రెండేళ్ళూ ఒకర్నొకరం వదిలి వుండలేనంతగా ఆత్మల్ని కలుపు కున్నాం. ఇప్పుడు పెళ్ళాడాలనుకుంటున్నాం. ఏమిటి నీ అభిప్రాయం నాన్నా?'' ఓ కాలేజీ ప్రేమపక్షి తనగోడు చెప్పుకున్నాడు తండ్రితో; సినీస్టయిల్లో.

''ఫూల్! ప్రేమంటే ప్రేమే! పెళ్ళి చేసుకుని దాన్నెందుకు నాశనం చేసుకుంటావ్? చేసుకోకు.''

* * *

ఓ సేల్స్‌మాన్ కష్టమర్‌తో తగువు పెట్టుకోడం దూరాన్నించి చూచి, సేల్స్ మేనేజర్ అటు వచ్చాడు.

కష్టమర్‌ని శాంతపర్చి పంపేశాక, సేల్స్‌మాన్‌తో ''కష్ట

మర్సుకి విలువివ్వాలి మనం. అతన్దే రైటనిపించి, వస్తువులు కొనిపించాలి. ఆ! ఇంతకీ అతనేమన్నాడు?''

''మీ సేల్స్ మేనేజర్ ఓ 'బ్లడీఫూల్' అనన్నాడు.'' ★

10 గంటల సేపు ప్రపంచానికే ప్రమాదం

కొమ్మూరి సాంబశివరావు

11

"నన్ను, రాజునీ, ఇంకా ఎన్నోరోజులు, ఇక్కడ, యీ గదిలో వుంచుతారు! మాకు పూర్తి ఆరోగ్యం వచ్చింది" అన్నాడు యుగంధర్.

"సంతోషం. డాక్టర్‌గారు మిమ్మల్ని డిస్చార్జి చేస్తేకాని, ఇక్కణ్ణించి వదలడానికి వీలులేదు" అన్నాడు బండార్కార్.

"పదిరోజులు గడిచిపోయాయి. నాకు పూర్తిగా జ్ఞాపక శక్తి వచ్చేసింది. టైం వృథా చేస్తున్నాము."

"క్షమించండి యుగంధర్. నిన్నటివరకూ మీకు పూర్తి జ్ఞాపకశక్తి రాలేదు. అప్పుడప్పుడూ - జ్ఞాపకశక్తిపోయి, మాట్లాడుతున్నారు. మాటలు ఆపేసి, శూన్యంలోకి చూస్తూ కూర్చున్నారు. డాక్టర్ని అడిగాను. ఇరవై నాలుగు గంటల సేపు మీకు మెమరీలాప్స్ రాకుండా ఉండాలని చెప్పారు. అప్పటివరకు డిస్చార్జి చెయ్యనన్నారు. కనుక ఆవిషయం చర్చించి ప్రయోజనంలేదు. విశ్రాంతి తీసుకోండి!" అన్నాడు బండార్కార్.

"ఆల్‌రైట్! జ్ఞాపకం ఉన్నంతవరకూ, జ్ఞాపకం వచ్చినంతవరకు మీకు జరిగినది చెప్పాను. మీరేమైనా చర్యలు తీసుకొన్నారా?" అడిగాడు యుగంధర్.

"మా డిపార్టుమెంటు ముఖ్యఏజంట్లని ఇద్దర్ని పిలిపించి దర్యాప్తు అప్పగించాను."

"వాళ్ళు ఏమైనా తెలుసుకొన్నారా?"

"లేదు. మిమ్మల్ని, విశ్వనాథ్‌ని, ఎవరు ఎత్తుకు వెళ్లారో ఎక్కడికి తీసుకువెళ్ళారో తెలుసుకొనేందుకు ఏ సూచనా లేదు. ఇప్పటివరకూ ఫలితాలు లేవు" అన్నాడు బండార్కార్.

"ప్లీజ్ గివ్ మీ ఎ సిగరెట్" అని అడిగి, సిగరెట్ వెలిగించి, అయిదు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించి. "మళ్ళీ ఒకసారి చెప్పండి బండార్కార్! విశ్వనాథ్‌కి జ్ఞాపకశక్తి రాగానే ఏం చెప్పాడు?" అని అడిగాడు యుగంధర్.

"విశ్వనాథ్ డాక్టర్ దగ్గరకు వెళుతున్నాడట. అతని పక్కకివచ్చి ఒక కారు ఆగిందట. 'ఎక్కడికి వెళుతున్నారు మిష్టర్ విశ్వనాథ్?' అని కారు డ్రైవరు అడిగాడట. విశ్వనాథ్ చెప్పాడు. 'కమ్‌ఆన్ ఐవిల్ డ్రాప్‌యు' అనగానే, విశ్వనాథ్ కారు ఎక్కాడు, ఆ కారుడ్రైవ్ చేస్తున్నది ఎవరో అతనికి తెలియదట. కంఠస్వరంకూడా గుర్తుపట్ట లేదట. అయినా, తనకి పరిచయంఉన్న మనిషే అయి ఉండాలి. లేకపోతే తనని కారులో ఎందుకు దింపుతానంటాడు అనుకొన్నాడు. విశ్వనాథ్‌కి అనుమానంకాని,భయం కాని కలుగలేదు. కారు ఎక్కాడు-కారు కదిలింది. వెనక సీటులో ఎవరో కూర్చునుండడం అప్పుడు గమనించాడు. రెండు చేతులు అతని మొహంమీదకి వచ్చాయి- అరవడానికి ప్రయత్నించాడు; నోరు నొక్కేసారు; తర్వాత స్పృహ పోయింది. అదీ జరిగింది" అన్నాడు బండార్కార్.

"తర్వాత ఏం జరిగింది?" అడిగాడు యుగంధర్.

"అతనికి స్పృహ వచ్చేసరికి ఒకగదిలో ఉన్నాడట. మంచినీళ్ళు; కాఫీ; ఫలహారాలు; తువ్వాళ్ళు బాత్‌రూం ఎటాచ్‌డ్‌గది. అతనికి కావలసినవన్నీ గదిలో వున్నాయట. స్పీకర్లోంచి మాటలు వినపడ్డాయట. ఆమాటల సారాంశం. 'విశ్వనాథ్. నీకుకాని, నీవాళ్ళకికాని, ఎటువంటి హాని జరగదు. మాతో నువ్వు సహకరిస్తే, భయమేమీ లేదు.' గంటతర్వాత గదిలోకి ఎవరోవచ్చి, విశ్వనాథ్ కళ్ళకి గంతలుకట్టి, గది లోంచి తీసుకెళ్లారు. ఇంకోగదిలోకి వెళ్ళిన తర్వాత కళ్ళకి

గంతలు విప్పేశారట. ఆ గదిలో రెండు బల్లలు, కుర్చీలు, పుస్తకాలు, ఇంకాకొన్ని యంత్రాలు వున్నాయట. ఆగదిలో స్పీకర్ వుందిట. స్పీకర్లోంచి ఎవరో ప్రశ్నలు వెయ్యడం ప్రారంభించారు. అణుశక్తికి సంబంధించిన ప్రశ్నలు. అణుశక్తి గురించి విశ్వనాథ్‌కి ఎంత తెలుసో పరీక్షించే ప్రశ్నలు. అలా ప్రశ్నల పరంపర- విశ్వనాథ్ జవాబులు చెపుతూనే వున్నాడట. గంటతర్వాత అతన్నిమళ్లీ అతని గదికి తీసుకెళ్ళారు. మధ్యాహ్నం కొన్ని కాయితాలు ఇచ్చి, వాటికి జవాబు వ్రాయమన్నారట. వ్రాసి ఇచ్చాడు. ఇలా వారంరోజులు గడిచాయట. వాళ్ళప్రశ్నలకి జవాబులు చెప్పక పోతే, తన భార్యకీ, పిల్లాడికీ హాని జరుగుతుందని భయపడి, వాళ్లు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పాడు. తొమ్మిదవరోజున; "మిష్టర్ విశ్వనాథ్! కావలసి; మమ్మల్ని మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నారా?" అని అడిగాడట స్పీకర్లోంచి.

"లేదు. నాకు తెలిసినంతవరకూ, మీరు అడిగిన ప్రశ్న లకి జవాబులు చెప్పాను. మోసం చెయ్యలేదు."

"మీ ఆఫీసులో మీగురించి, మీపర్సనల్ ఫైలులో వ్రాసి ఉన్న వాక్యాలు చదువుతాను. వినండి. 'విశ్వనాథ్ చాలా తెలివైనవాడు. మేధావి అనవచ్చు. ఇతనికి బాధ్యతగల పనులు చెప్పవచ్చు. ప్రమోషన్‌కి అర్హుడు.' మిమ్మల్ని గురించి, మీ అధికారులు ఇంతగొప్పగా వ్రాసారు. నేను తరిచి, తరిచి, మిమ్మల్ని ప్రశ్నించాను. న్యూక్లియర్ ఫిజిక్స్ గురించి, అణుశక్తి గురించి. మీకు కాలేజీలో చదువు కుంటున్న విద్యార్థికి ఎంతతెలుసో, అంతే తెలుసు అనిపిస్తోంది. మీ తెలివితేటల గురించి మీ అధికారులు పొరబడ్డారా? లేక, మీకు ఏమీ తెలియదన్నట్లు మీరు నటించి, మమ్మల్ని

మోసం చేస్తున్నారా?'' అని అడిగాడట అతను.

''మిమ్మల్ని మోసం చెయ్యలేదని మరొకసారి చెపుతున్నాను.

నా తెలివితేటల గురించి మా అధికారులు పొరబడలేదనే అనుకుంటున్నాను. నేను, తెలివైనవాణ్ణి అనీ; ప్రమోషన్ యివ్వవచ్చనీ, బాధ్యతగల పనులు ఇవ్వవచ్చనీ, వ్రాశారు. అంటే ఇంతవరకూ నాకు బాధ్యతగలపనులు చెప్పలేదని అనుకోవాలి. అంటే,పుస్తకాలలో చదువుతున్న విషయాలు తప్ప, అణుశక్తి గురించి, నాకు ఎక్కువ తెలియదని తెలుస్తోంది ఆ రిపోర్టునిబట్టి అన్నాడు విశ్వనాధ్.

అంతే-ఆ తర్వాత యింకేమీ మాట్లాడలేదుట. విశ్వనాధ్‌కి మళ్ళీ స్పృహ లేదు. జ్ఞాపకశక్తి వచ్చేసరికి; ఆస్పత్రిలో వున్నాడు. అదీ జరిగింది'' అని ముగించాడు బండార్కర్.

''మైడియర్ బండార్కర్! మాకు ఆ ముఠానాయకుడు చెప్పిన విషయాలూ మీకు చెప్పానుగా?'' అన్నాడు యుగంధర్.

బండార్కర్ తల వూపాడు.

''విశ్వనాధ్ అనుభవం, మా అనుభవం; యీ రెండూ కలిపి ఆలోచిస్తే మీకు ఏమిటి అనుమానం కలుగుతోంది'' అడిగాడు బండార్కర్.

''ఎవరో కొంతమంది, ఒక ముఠాగాచేరి; ప్రభుత్వాన్ని తమ హస్తగతం చేసుకోవడానికి పన్నాగం పన్నుతున్నారని అర్థం అవుతుంది. ఆ ముఠాకి డబ్బు చాలా వుంది. అంగబలం కూడా చాలా వుంది. అణుశక్తిని తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నారనీ తెలుస్తోంది'' అన్నాడు బండార్కర్.

''కరెక్టు. బండార్కర్ మీకు భయం వెయ్యడం లేదు?''

అడిగాడు యుగంధర్.

బండార్కర్ నవ్వాడు. "లేదు యుగంధర్ లేదు. ఎవరో కొందరు-ఒక ముఠాగాచేరి, మన ప్రభుత్వాన్ని, తమ హస్త గతం చేసుకుంటారనిగాని, చేసుకోగలరనికాని, నాకు ఏ మాత్రం భయంలేదు. కారణాలు చెప్పమంటారా? వినండి. ఈ ఆరురోజులుగా మా డిపార్టుమెంటు మనుష్యులే కాక, సెంట్రల్ బ్యూరో ఆఫ్ యిన్వెస్టిగేషన్ ఉద్యోగులూ; వివిధ రాష్ట్రాలలోని పోలీస్ సి. ఐ. డి. ఉద్యోగులూ; ఆర్మీ యింటిలిజెంస్ ఉద్యోగులూ, రాత్రనక, పగలనక పని చేశారు. దేశంలో అన్ని అణుశక్తి శాస్త్రజ్ఞుల నందర్నీ ఒక కంట కనిపెడుతున్నాము—ఎవరయిన, అనుమానం కలి గించేటట్టు ప్రవర్తిస్తున్నారేమో నని. అటువంటిదేమీ లేదు. విదేశాల నించి రహస్యంగా, అణుశక్తి శాస్త్రజ్ఞులు యీ దేశం వచ్చారేమోనని, 'యింటర్‌పోల్', వారు దర్యాప్తు చేశారు. అదేదీ జరగలేదు. సైనికాధికారులు కొందరు, ఆ ముఠా వారితో చెయ్యి కలిపి, ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రయత్నిస్తున్నారేమో నని, ఆర్మీ యింటలినిజెంస్ వారు వెయ్యి కళ్లతో కనిపెట్టారు. అదీ లేదు. ఉన్నత ప్రభుత్వ వుద్యోగులు, ఆ ముఠా వారితో చేరి, ప్రభుత్వానికి వెనక గోతులు తీస్తున్నారేమోనని, పోలీస్, సి.ఐ.డి బ్రాంచివారు, సి.బి.ఐ వారు దర్యాప్తు చేశారు. అదీ లేదు. మీరు భయపడు తున్నంత ప్రమాదమైన పరిస్థితి ఏమీ లేదు యుగంధర్. అన వసరంగా కంగారు పడకండి!'' అన్నాడు బండార్కర్.

"మీకున్న ధైర్యం నాకు లేదు బండార్కర్. వాళ్ల పథ కాలన్నీ పూర్తి అయ్యాక మీరు దర్యాప్తు చేశారేమో! అందు వల్లే ఏమీ తెలియలేదేమోననిపిస్తోంది'' అన్నాడు యుగంధర్.

అంతవరకూ మాట్లాడకుండా ఉన్న రాజు, గొంతు సవ

రించుకున్నాడు. "ఏమిటి రాజూ?" అడిగాడు బండార్కర్.

"నేను బండార్కర్‌తో ఏకీభవిస్తాను. ఇంత పెద్ద దేశాన్ని పాతికేళ్లు పెరిగి, పునాదులు వేసుకున్న మన ప్రజాస్వామ్యాన్ని, ఎవరో కొద్దిమంది కలిసి, దేశాన్ని, ప్రభుత్వాన్ని తమ హస్తగతం చేసుకోగలరంటే నాకు నమ్మకం కుదరడం లేదు" అన్నాడు రాజు.

"అవును. ఎవరో కొద్దిమంది కలిసి, విప్లవం తీసుకు వస్తారన్నా, తీసుకు రాగలరన్నా నాకూ నమ్మకం లేదు. మన సైనికాధికారులు, కుట్ర పన్ని, ప్రభుత్వాన్ని తమ హస్తగతం చేసుకోడానికి ప్రయత్నించరనీ, ప్రయత్నించినా ఫలించదనీ నాకూ తెలుసు రాజూ" అన్నాడు యుగంధర్.

"మరేమిటి మీ భయం?" అడిగాడు రాజు.

"కొన్ని వందల మంది ప్రయాణీకులున్న విమానాన్ని ఒకరో యిద్దరో ఎలా తమ హస్తగతం చేసుకుంటున్నారు- ఆలోచించావా? అదే పద్ధతి ఒక దేశాన్ని తమ హస్తగతం చేసుకోడానికీ ప్రయోగించ వచ్చనీ, అనిపించిందా?" అడిగాడు.

"హైజాకింగా? ఒక దేశాన్ని హైజాక్ చేస్తారా? ప్రిపాస్టరస్. అబ్సర్డ్, ఫాంటాస్టిక్ నాన్ సెన్స్. వాళ్ళు యిచ్చిన మందుల వల్ల మీ బుద్ధి మందగించడమే కాక, లేని పోని, వూహించుకున్న భయాలకి లోనయింది. మీకు విశ్రాంతి కావాలి. మీకు ఆరోగ్యం పూర్తిగా రాలేదు. క్షమించండి యుగంధర్ యిలా అన్నందుకు. రేపో ఎల్లుండో మళ్ళా మాట్లాడుదాం" అన్నాడు బండార్కర్.

యుగంధర్ చిన్న నవ్వు నవ్వాడు.

బండార్కర్ లేచి, నిలబడి, "మళ్లీ సాయంకాలం వస్తాను. టేక్ రెస్ట్" అని వెనక్కి తిరిగాడు.

అప్పుడే గదిలోకి నర్సు వచ్చింది. "మిస్టర్ బండా

ర్కార్?'' అడిగింది.

''యస్. నేనే.''

''ఢిల్లీ నించి ట్రంక్ కాల్ వచ్చింది మీకు. రిసెప్షన్‌కి వచ్చి అక్కడనించి మాట్లాడతారా లేక యిక్కడికి కనెక్షన్ యివ్వనా?'' అడిగింది.

''థాంక్ యు. ఇక్కణ్ణించే మాట్లాడుతాను.''

''ఒక్క నిముషం-'' అని నర్సు వెళ్ళిపోయింది.

''బండార్కార్ మళ్లీ వచ్చి కూర్చున్నాడు. నర్సు టెలిఫోన్ తెచ్చి, ప్లగ్ చేసింది.

''టేక్ ది కాల్ సర్'' అని రిసీవర్, బండార్కార్‌కి యిచ్చి వెళ్ళిపోయింది.

''యస్ బండార్కార్ హియర్. స్పీకింగ్... యస్ సర్ యస్ సర్!....దట్ యీజ్ ఆల్‌రైట్ సర్....యింకా ఆస్పత్రిలోనే వున్నారు. యింక ఒకటి రెండు రోజులు.... అవును ...విశ్రాంతి... వెరీగుడ్.... సర్....ఆ....ఆలస్యం చెయ్యను సర్....యస్ సర్'' బండార్కార్ రిసీవర్ హుక్ మీద పెట్టేశాడు. యుగంధర్‌వైపు తిరిగి, ''డిఫెన్స్ మినిస్టర్ మాట్లాడారు. వెంటనే ఢిల్లీ రమ్మన్నారు. ఏర్‌ఫోర్స్ విమానం తయారుగా వుందిట. ఇంస్ట్రక్షన్స్ యిచ్చారుట. క్షణం ఆలస్యం చెయ్యకుండా వెంటనే బయలుదేరి రమ్మన్నారు. ఎందుకు - ఏమిటి అంత మునిగిపోయిన పని చెప్పలేదు. చెప్పడానికి-ఫోన్‌మీద వీలులేదు అన్నారు'' అన్నాడు.

''వెళ్ళండి బండార్కార్. తక్షణం వెళ్ళండి. నేనూ, రాజూ యిక్కడ బాగానేవున్నాం'' అన్నాడు యుగంధర్.

''నన్నేకాదు. మిమ్మల్నీ, రాజునీ తీసుకురమ్మన్నారు. చెప్పాను. మీకు యింకా పూర్తిగా ఆరోగ్యం రాలేదనీ, ఒకటి రెండు రోజులు విశ్రాంతి కావాలనీ. ఆ విశ్రాంతి

ఢిల్లీలోనే తీసుకోవచ్చునసీ, అవసరమైతే; యిక్కడ డాక్టర్‌ని మీ యిద్దరి ఆరోగ్యం చూసుకునేందుకు కూడా తీసుకు రమ్మనీ, చెప్పారు. కనుక మనం వెంటనే బయలుదేరాలి. ఎందుకయినా మంచిది డాక్టర్‌ని కూడా రమ్మంటాను'' అన్నాడు బండార్కర్.

''మై డియర్ బండార్కర్. నాకూ మెడిసిన్ గురించీ, న్యూరాలజీ గురించీ, కాస్త తెలుసునని మర్చిపోయారు! నేను, రాజు, యిప్పుడు పూర్తిగా కోలుకున్నాం. డాక్టర్ మన కూడా రావలసిన అవసరం లేదు. పదండి వెళదాం'' అన్నాడు యుగంధర్.

* * *

డిఫెన్స్‌మంత్రి ప్రయివేట్ శెక్రటరీ; ఏర్‌ఫోర్స్ విమానాశ్రయానికి వచ్చాడు.

''మిమ్మల్ని. తిన్నగా సెక్రటరియేట్‌కి తీసుకురమ్మన్నారు'' అని చెప్పాడు బండార్కర్‌కి. ఆర్మీ జీపులో బయలుదేరి వెళ్ళారు అతనికూడా, యుగంధరూ, రాజు, బండార్కర్.

''దయచేసి, కూర్చోండి! మిస్టర్ యుగంధర్, రాజూ, మీ ఆరోగ్యం ఎలావుంది!'' అడిగాడు డిఫెన్స్‌మంత్రి నారాయణ పిళ్ళై.

''థాంక్ యు. వి ఆర్ ఆల్‌రైట్!'' అన్నాడు యుగంధర్.

''వెరీగుడ్ - గుడ్‌న్యూస్. మీరాక కోసమే కాచుకుని వున్నాను. మిస్టర్ బండార్కర్. ఆటమిక్ రిసెర్చి కేంద్రంలో మన సెక్యూరిటీ మెజర్స్‌లో చాలా లోపం వున్నది. ఇది ఎలా జరిగింది - ఎలా సాధ్యమైంది అర్థం కాకుండావుంది'' అన్నాడు డిఫెన్స్ మంత్రి.

"ఎక్స్‌క్యూజ్‌మి సర్. అణుశక్తి కేంద్రంలో సెక్యూరిటీ మెజర్స్‌తో మా డిపార్టుమెంట్‌కి కానీ, నాకు కానీ ఎటువంటి సంబంధంలేదు. తమరు ఏమనుకోకపోతే డిఫెన్స్ మినిస్టరీకీ సంబంధం లేదనుకుంటాను. అణుశక్తికి సంబంధించిన మినిస్టర్ శాఖ వేరేవుంది కదా!" అన్నాడు బండార్కార్.

"యు ఆర్ రాంగ్ బండార్కార్. మీ స్పెషల్ బ్రాంచికి అన్ని శాఖల రక్షణతోనూ సంబంధం వుంది. దేశక్షేమానికి విరుద్ధంగా ఎక్కడ ఏం జరుగుతున్నా, తెలుసుకోవలసిన బాధ్యత; అటువంటి చర్యలు ఆపుచెయ్యవలసిన బాధ్యత మీ డిపార్టుమెంటుకే వున్నది. బాధ్యతని యింకొకళ్ల మీదకి తోసి పుచ్చడానికి ప్రయత్నించకండి. అది సహించను" అన్నాడు మంత్రి చాలా కోపంగా.

"అసలు ఏం జరిగిందీ - తెలిస్తే, పొరపాటు ఎవరు చేసింది తర్వాత తెలుస్తుంది" అన్నాడు యుగంధర్.

"ఇప్పుడు పొరపాటు ఎవరు చేశారని కాదు. ఎవరు చేస్తే నేం జరిగింది, జరిగింది. ఇటువంటిది యిక మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. అదీ ముఖ్యమైన పని. అసలు ఏం జరిగింది చెపుతాను వినండి. నిన్న పొద్దున్న నాకు ఒక వుత్తరం వచ్చింది. పోస్టులో సామాన్యమైన వుత్తరం అయితే నా పి. ఏ తనే జవాబు వ్రాసేవాడు. ఈ వుత్తరం" అంటూ ఒక కాయితం బండార్కార్‌కి యిచ్చి, "చదవండి, తెలుస్తుంది" అన్నాడు మంత్రి.

బండార్కార్ చదివి, యుగంధర్‌కి యిచ్చాడు. యుగంధర్ చదివి రాజుకి యిచ్చాడు.

"డిఫెన్స్ మంత్రిగార్కి,

పార్లమెంట్ హవుస్ వెనక, సరిగా మూడు గజాల

దూరంలో, డ్రెయినేజ్ హోల్ వుంది. ఆ మేన్ హోల్‌లో ఒక బాంబు వున్నది. అది పేల్చేందుకు ఎలక్ట్రికల్ కనెక్షన్ యివ్వబడ్డాయి. ఆ వైర్స్‌నిబట్టి మీకే తెలుస్తుంది. జాగ్రత్త. అణుశక్తి నిపుణులని పిలిపించండి. ముందు ఎలక్ట్రికల్ కనెక్షన్ డిస్కనెట్ చేయించి. తర్వాత బాంబుని పరీక్ష చెయ్యండి.

అది అణుబాంబు.''

యుగంధర్ వుత్తరం డిఫెన్స్ మంత్రికి యిచ్చాడు.

''ఎవడో, అల్లరికి-జోక్‌కి-ఈ వుత్తరం వ్రాశాడని అనుకుని, బుట్టలో పారేశాను. నిజం చెప్పాలంటే యీ వుత్తరం నేను సీరియస్‌గా తీసుకోలేదు. ఆ వుత్తరం నాకు అందిన గంట తర్వాత, నా టెలిఫోన్, అన్‌లిస్టెడ్ (డైరక్టరీలో నెంబర్ వుండదు) నెంబర్ మోగింది. "మిస్టర్ నారాయణ పిళ్లా, నేను వ్రాసిన వుత్తరం చదివారా! నేను యదార్థమే వ్రాశాను. జాగ్రత్త పడండి! లేదా ఆ ఆటంబాంబు పేలుతుంది'' అని పెట్టేశాడు. క్షణంపాటు ఆ ఫోన్‌కాల్ నాకు అర్థం కాలేదు. మిగతా పనుల హడావిడిలో ఆ వుత్తరం విషయం మర్చిపోయాను. ఎవరతను? అతనికి నా టెలిఫోన్ నెంబర్ ఎలా వచ్చింది?

నేను ఆ వుత్తరాన్ని బుట్టదాఖలు చెయ్యడం పొరపాటు పనేమో; అనుకుంటూ బాస్కెట్లోంచి, ఆ వుత్తరం తీసి, మరొకసారి చదివి, మినిస్టర్ ఫర్ ఆటమిక్ ఎనర్జీకి ఫోన్ చేసి, వుత్తరం విషయం, నాకు వచ్చిన ఫోన్‌కాల్ విషయం చెప్పి, ఆ ఉత్తరం ఆయనకి పంపించాను. నిన్న సాయంకాలం అత్యవసరంగా మంత్రివర్గ సమావేశం కోరారు ఆటమిక్ ఎనర్జీ మినిస్టర్. ప్రధాని నగరంలో లేకపోవడం వల్ల, సీనియర్ మినిస్టర్‌గా నేనే, మంత్రివర్గ సమావేశానికి

అధ్యక్షత వహించాను. ఆటమిక్ మినిస్టర్ మంత్రి వర్గానికి రిపోర్టు చేశారు. ఆ ఉత్తరంలో వ్రాసినట్టు అదే చోట, భారీ శక్తి కలది కాకపోయినా; ఆటంబాంబు వున్నదనీ; చాలా చాకచక్యంతో తీగెలు, డ్రైనేజ్ తూము పక్కగా, అతికించుకుంటూపోయి, వెనక రోడ్‌మీద వున్న యింకో మాన్ హోల్‌లో ప్రయోగించేందుకు- అంటూ ప్రేల్చడానికి వీలుగా స్విచ్ ఏర్పాటు చేశారనీ, చెప్పాడు. తీగెలు డిస్కనెట్ చేసి అణుశాస్త్రజ్ఞులు ఆ బాంబుని, తమ పరిశోధనా కేంద్రానికి తీసుకువెళ్ళి, పరీక్ష చేశారనీ, అది ఆటంబాంబు, అందులో సందేహంలేదని చెప్పారనీ నివేదించారు. ఇప్పుడు అర్థమయిందా? ఎవరు ఆటంబాంబుని చెయ్యగలిగారు? ఎవరికి ఆ లోహాలు దొరికాయి? ఎవరికి ఆ జ్ఞానముా శక్తీవున్నాయి? ఇది ఎలా సాధ్యమయింది? పార్లమెంట్‌హౌస్ వెనక ఎలా- ఎవరికీ తెలియకుండా, ఆ బాంబుని పెట్టగలిగారు? ఎందుకు! ఉద్దేశం ఏమిటి! పెట్టినవారు దాన్ని పేల్చకుండా ఎందుకు చెప్పేశారు? అది పేలివుంటే ఏం జరిగేది! ఎంతదూరం రేడియేషన్ వుండేది! పార్లమెంట్‌సభ్యులు, మంత్రులు రేడియేషన్‌కి గురి అయ్యేవారా! దాదాపు రాత్రి రెండు గంటలవరకూ మంత్రివర్గం చర్చిస్తూనే వుంది. యీ విషయం మాకేమి పాలు పోలేదు. వేటికీ జవాబులు దొరకలేదు. మిమ్మల్ని వెంటనే రమ్మన్నాను. ఈ బాంబు ఎలా తయారు చేశారు? ఎవరు తయారుచేశారు: ఎలా అక్కడ పెట్టగలిగారు! ఎందుకు ఆ విషయం నాకు చెప్పారు! విటికి నాకు వెంటనే జవాబులు కావాలి. మీ యిష్టం- అన్ని డిపార్టుమెంట్సునీ. ప్రభుత్వంలోని ఏ వుద్యోగిని కావలిస్తే వాళ్ళని వుపయోగించుకొండి. ఈ ప్రశ్నలకి నాకు జవాబులు కావాలి"

అన్నాడు రక్షణమంత్రి ఆవేశంతో.

"అణుశక్తి బాంబు విషయం ఏమైనా చెప్పగలిగారా?" అడిగాడు యుగంధర్.

"అంటే?" అడిగాడు మంత్రి.

"ఈ దేశంలో తయారుచేసినదా? దాని నిర్మాణ విధానంలో ప్రత్యేకత ఏమైనా ఉన్నదా? విదేశీయుల-"

"నో! నో! అదేమి లేదు, ఏమీ తెలియ లేదు. ఆ విషయాలన్నీ మీరు తెలుసుకోవాలి. ఇదిగో! మీకూ, రాజుకీ అధికార పత్రాలు. మీకు ఒక సైనికవిభాగం కావలిస్తే అడగండి-లేదు విమానదళం అంతా మీకు కావలిస్తే చెప్పండి. ఐవాంట్ రిజల్ట్స్ - అండ్ దట్ టూ క్విక్" అన్నాడు పిన్హా.

"ప్రధానమంత్రికి తెలుసా?" అడిగాడు యుగంధర్.

"తెలుసు. ఈరోజు పొద్దున్నే వచ్చారు. రాగానే చెప్పాను, మీ సహాయం కోరుతున్నాననీ చెప్పాను. తన ఆమోదన తెలియజేశారు" అన్నాడు పిన్హా.

బండార్కర్ కుర్చీలోంచి లేవడానికి కుర్చీ జరిపాడు.

యుగంధర్ కదలలేదు. "ఇంకా ఏమైనా అడగాలా?" ప్రశ్నించాడు మంత్రి.

"ప్రధాన మంత్రికి చెప్పి, వెంటనే మంత్రివర్గ సమావేశం రహస్యంగా ఏర్పాటు చెయ్యడం మంచిది" అన్నాడు యుగంధర్.

"ఎందుకు? నిన్న ప్రధాని తప్ప మిగతా మంత్రులం అందరం కలిపి చర్చించాం. కొత్త విషయాలు ఏమున్నాయి చర్చించేందుకు?"

"ప్రధానికీ, యితర మంత్రులకీ- మీకూ నేను కొన్ని విషయాలు చెప్పాలి" అన్నాడు యుగంధర్.

నారాయణ పిన్హా యుగంధర్ని పరీక్షగా చూశాడు. "ఆ కొన్ని విషయాలు ఏమిటో ముందు నాకు చెప్పండి. ప్రధాని, యితర మంత్రివర్గ సభ్యులు వినవలసిన విషయాలు అని నాకు తోస్తే నేను చెపుతాను. లేదా మిమ్మల్ని ప్రధాని దగ్గిరకి పంపిస్తాను."

"క్షమించాలి. మీకు చెప్పలేను. మీరు అడిగిన ప్రశ్నలలో కొన్ని ప్రశ్నలకి సమాధానం చెప్పగలను అనుకుంటాను. ఆ సమాధానాలు చెప్పడం కాని, చర్చించడం కాని; క్షమించాలి, ఏ ఒక్కరితోనూ చర్చించదలుచుకోలేదు. మంత్రివర్గ సభ్యులు అందరూ వుండాలి" అన్నాడు యుగంధర్.

"కారణం-నామీద నమ్మకం లేదా మీకు?"

"ప్రస్తుతం నాకు ఎవరిమీదా నమ్మకంలేదు."

సత్యనారాయణపిన్హా మొహం పాలిపోయింది; తర్వాత ఎర్రనయింది. "మిష్టర్ యుగంధర్! ఆమాట మీరు ఎవరితో అంటున్నారో తెలుసా? భారతదేశ రక్షణమంత్రితో. దేశరక్షణ శాఖని ప్రధాని నాకు ఒప్పచెప్పాననీ, దేశరక్షణ కోసం నేను సర్వశక్తులూ ధారపోస్తానని నేను ప్రమాణ స్వీకారం చేశాననీ మర్చిపోయారా! నావల్ల దేశరక్షణకి ఆపద కలుగవచ్చునని మీరు అన్నమాటకి—" ఇక కోపం పట్టలేక, పిడికిలితో బల్లగుద్దాడు నారాయణ పిన్హా.

"ఆవేశం తెచ్చుకొని ప్రయోజనంలేదు మిష్టర్ నారాయణ పిన్హా. ప్రమాణస్వీకారం చేశారు కనుక; రక్షణ మంత్రిగా ఉన్నారు కనుక; మీ చిత్తశుద్ధిని;మీ ప్రజ్ఞని ఎవరూ శంకించరాదని అనడం అవివేకం. ఇది ప్రజాస్వామ్యం. ఈదేశంలో పుట్టి, పెరిగిన, భారతీయుణ్ణి అయిన నాకూ, దేశరక్షణ విషయంలో బాధ్యత ఉన్నది" అని క్షణం ఆగి, "అయినా

నేను మిమ్మల్ని అనుమానిస్తున్నానని అనలేదు. నేను చెప్ప వలసిన విషయాలు; ఏఒక్కరికీ చెప్పననే అన్నాను. అంతే."

"ప్రధానికి కూడా చెప్పరా?"

"చెప్పను" అన్నాడు యుగంధర్.

"ఇది మొండి ధైర్యమో, అహంకారమో, తెలియ కుండా వుంది. ఈ విషయం ప్రధానితో చెప్పకపోతే మంత్రి వర్గ సమావేశం ఏర్పాటు చెయ్యకపోతే-?"

"నేనే ప్రధానిని కలుసుకోవడానికి ప్రయత్నిస్తాను."

"ప్రధాని కూడా అత్యవసర మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చెయ్యకపోతే?" అడిగాడు.

"అప్పుడు ఆలోచిస్తాను — ఈ దేశాన్ని విపత్తులోంచి తప్పించేందుకు ఏం చెయ్యాలా అని. సైనికాధికారులని కలుసుకుంటానేమో!"

"దిస్ యీజ్ టూ మచ్. సైనిక తిరుగుబాటు తీసుకు రావడానికి కూడా సిద్ధం అన్నమాట. డిఫెన్స్ ఆఫ్ ఇండియా చట్టం క్రింది మిమ్మల్ని తక్షణం జైలులో పెట్టడం వివేక మైన పని అనిపిస్తోంది."

"నన్నే కాదు. రాజునీ— బండర్కర్‌నీ." నవ్వాడు యుగంధర్.

సత్యనారాయణపిన్హా కాస్సేపు మౌనంగా వుండిపోయాడు.

"అవును. మీరు బాధ్యతారహితంగా ప్రవర్తించారు. మాట్లాడారు. తగిన కారణం లేనిదే అత్యవసర మంత్రివర్గ సమావేశం కోరరు. ఆల్‌రైట్ - ప్రధానికి చెపుతాను. ప్రధానిని వెంటనే కలుసుకుంటాను" అని టెలిఫోన్ తీశాడు. "నారాయణ పిన్హా హియర్. ప్రధానిని వెంటనే కలుసుకోవాలి. వస్తున్నాను. అలాగా... ప్రధాని గదిలోనేనా- అత్యవసర మంత్రివర్గసమావేశమా! వస్తున్నాను. వెంటనే"

అని రిసీవర్ పెట్టేసి, "మిస్టర్ యుగంధర్ - మీరు ప్రత్యే కంగా కోరకుండానే, ప్రధాని అత్యవసర మంత్రివర్గ సమా వేశం ఏర్పాటుచేశారు. ఆ సమావేశంలో చెపుతాను ప్రధా నికీ, యితర మంత్రులకీ, మీరు చెప్పిన విషయాలు. వారు అంగీకరిస్తే మీకు ఫోన్‌చేస్తాను" అని సత్యనారాయణ సిన్హా లేచి నిలబడ్డాడు.

"నేను మీకూడ వస్తాను. బయట నిలుచుంటాను. ప్రధానికీ ఇతర మంత్రులకీ చెప్పండి నేను అక్కడే ఉన్నా నని. చాలు అనుకొంటాను" అన్నాడు యుగంధర్ లేచి. మంత్రితోపాటు నడుస్తున్నాడు.

ప్రధాని గదిముందున్న విజిటర్స్ రూంలో నిలుచున్నాడు యుగంధర్. సత్యనారాయణ సిన్హా లోపలికి వెళ్లాడు. ఇతర మంత్రులు ఒక్కొక్కరూ వెళుతున్నారు లోపలకి. ఒకరిద్దరు మంత్రులు తప్ప-తతిమా వారంతా యుగంధర్‌కి పరిచయం. చిరునవ్వినవాళ్లు-నమస్కారం పెట్టినవాళ్లు తప్ప - ఎవరు మాట్లాడలేదు. అత్యవసర సమావేశం.

అయిదు నిమిషాలు గడిచిపోయాయి. పది నిమిషాలు గడిచిపోయాయి. తలుపు తెరుచుకుంది.

"మిస్టర్ యుగంధర్ రండి" అన్నాడు సత్యనారాయణ సిన్హా. అతనిలో మార్పు గమనించాడు యుగంధర్.

పెద్ద బల్లకి ఒకవైపు ప్రధాని, రెండువైపులా కుర్చీలలో ఇతర మంత్రులు.

"మిస్టర్ యుగంధర్! అత్యవసర మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చెయ్యమనీ, దేశానికి సంబంధించిన విషయాలు మంత్రివర్గానికి చెప్పాలనీ మీరు రక్షణమంత్రికి చెప్పారట. ఏమిటా విషయాలు?" అడిగాడు ప్రధాని.

యుగంధర్ అందరి మొహాలు చూసాడు. ఆందోళన-కొందరిలో; భయం కొందరిలో; "ఇంకా కొంత వ్యవధి వుంటుందనీ మనమంతా కలిసి ఆలోచించి తగిన చర్యలు ముందుగానే తీసుకోవచ్చు అనుకొన్నాను. మీ ఆందోళన చూస్తే అంత వ్యవధి లేనట్టు తోస్తోంది" అన్నాడు యుగంధర్.

"అంటే?" అడిగాడు ప్రధాని.

"భారత దేశాన్ని హైజాక్ చేస్తామని బెదిరింపా?" అడిగాడు యుగంధర్.

అందరూ యుగంధర్ని ఆశ్చర్యంతో చూసారు.

"కూర్చోండి యుగంధర్" అన్నాడు ప్రధాని.

అదే మొదటిసారి. కేంద్రమంత్రివర్గ సమావేశంలో మంత్రివర్గ సభ్యుడు కానివాడు వచ్చి కూర్చోవడం.

(ఇంకా వుంది)

ఓ యువతి హాస్పిటల్ కెళ్ళి కన్సల్టింగ్ రూంలో కూర్చున్నతన్ని డాక్టరనుకొని, తనకు భుజం నొప్పిగా వుందని, పరీక్షించమని కోరింది.

ఆ వ్యక్తి ఆమె వళ్ళంతా తడిమి చూడసాగాడు.

దాంతో ఆ యువతికి కోపం వచ్చి "డాక్టర్! నాకు నొప్పి భుజంలో వుంటే వళ్ళంతా తడిమి చూస్తారేమిటి?" అని అడిగింది.

"ఊరికే మీరు చూడమన్నారని చూశాను. నేను డాక్టర్ని కాను. వారితో పనివుండి వచ్చాను," అన్నాడా పెద్ద మనిషి.

—జోక్స్ మేకర్, మహబూబాబాద్.

(బహుమతి రు. 50/- లు నగదు)

1

నిత్యానందం ఒక వ్యాపారి. రౌడీ రంగడు ఆ ఊళ్లో కెల్ల పేరుమోసిన రౌడీ. ఒకరోజు అతను నిత్యానందం దుకాణానికి వెళ్లాడు. అప్పుగా వందరూపాయ లిమ్మని అడి గాడు. అప్పులు చెయ్యటం, వాటిని ఎగవెయ్యటమూ రంగ డికి మామూలే. అతను అడిగినపుడు కాదనే ధైర్యమూ, తిరిగి ఇమ్మని అడిగే గుండెలూ ఆ గ్రామంలో ఎంతో మందికి లేవు.

అయితే నిత్యానందం దృఢకాయుడు, బలిష్టుడు. తన బలమైన కండరాలు ఒకసారి చూసుకుని 'ఇవ్వను' అన్నాడు రౌడీ రంగడితో. ఒకవేళ ఎదిరించినా రంగడిని త్రిప్పికొట్ట గలడు నిత్యానందం.

"అయితే ఇవ్వ వన్నమాట!" అన్నాడు రంగడు కోపంగా. అతనికి కళ్లు ఎరుపెక్కాయి. జేబులోంచి బటన్ నైఫ్‌తీసి, బటన్ నొక్కాడు. సర్రమని పైకి దూసుకు

వచ్చింది బ్లేడ్. దానితో చేతిలోఉన్న జామకాయ కోసుకు తినటం మొదలుపెట్టాడు.

కత్తిని చూడగానే నిత్యానందానికి గుండె జారిపోయింది. చేసేది లేక వందరూపాయలు తీసిఇచ్చాడు. నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు రంగడు.

అతడలా వెళ్ళగానే పోలీసు రిపోర్టిచ్చాడు నిత్యానందం.

ఎసాల్ట్ నేరానికి అరెస్టుచేశారు రంగడిని.

"నేను వందరూపాయలు అప్పు అడిగాను. ముందు లేదన్నా తరువాత ఇచ్చాడు. ఇందులో నేను చేసిన నేర మేమిటి?" అన్నాడు రంగడు

"నీవు కత్తి తీయలేదూ?" ఉరిమాడు పబ్లిక్ ప్రాసి క్యూటర్.

"తీశాను, జామకాయ తినటానికి. కాని నేను నిత్యానం దాన్ని బెదిరించలేదు" అన్నాడు రంగడు.

మీ రేమని తీర్పు ఇస్తారు?

2

4 మార్చి 1970న ఆనంద్ ప్రామిసరీ నోటువ్రాసి, శ్రీధర్‌వద్ద వెయ్యి రూపాయలు అప్పుగా తీసుకున్నాడు.

2 మే '72న ఆనంద్‌కు పిచ్చి ఎక్కింది. 4 డిశెంబర్ '73న ఆ పిచ్చి కుదిరి ఆనంద్ మామూలు మనిషయ్యాడు.

డిశెంబర్ 5వ తారీఖున శ్రీధర్, ఆనంద్‌ను తన బాకీ చెల్లించమని కోరగా ఆనంద్ నిరాకరించాడు. అందువల్ల శ్రీధర్ ఆనంద్‌పై 6 డిశెంబర్ '73న దావా తెచ్చాడు.

అయితే "ప్రామిసరీ నోటుకు 3 సంవత్సరాలలో కాల దోషం పడుతుంది. కనుక 4 మార్చి '73 లోపల ఈ దావా తేలేదు కనుక కాలదోషం పట్టిం"దని ఆనంద్ వాదించాడు.

"4 మార్చి'73 నాటికి ఆనంద్‌కు మతి స్థిరంగాలేదు కనుక తానీ దావా తేలేక పోయానని" శ్రీధర్ అన్నాడు.

మరి, మీ తీర్పేమిటి?

3

వసుంధరకు ఓ అందమైన బ్యూక్ కారుంది. ఆ కారుకు కావలసిన పెట్రోలును ఒకే డీలర్‌వద్ద వసుంధర అరువుగా తీసుకుంటుంది ఎప్పుడూ. అలా అరువుగా తీసుకున్న మొత్తం వెయ్యి రూపాయలు దాటింది.

ఇక అరువు ఇవ్వనన్నాడు పెట్రోలు డీలర్.

వసుంధర నెల రోజుల తర్వాత డేట్ వేసిన చెక్ ఒక టిచ్చి, అవాల్టికి పెట్రోలు పోయించుకుంది.

పెట్రోల్ డీలర్ నెల తర్వాత ఆ పోస్ట్ డేట్ చెక్‌ను బాంక్‌కు పంపగా బాలన్స్ లేదనే జవాబుతో ఆ చెక్ తిరిగి వచ్చింది. పెట్రోలు డీలర్ మండిపడి, వసుంధరపై చీటింగ్ నేరం క్రింద కేసుపెట్టాడు.

మీ తీర్పెలా ఇస్తారు?

* * *

[పై మూడు కేసులకు మీ తీర్పు ఎలా ఇస్తారో, వివరంగా ఒక పోస్టుకార్డుసైజు తెల్లకాగితంపై వ్రాసి, యీ నెల 20వ తేదీ లోగా మాకు చేరేటట్లు పంపండి. సరియైన తీర్పు ఇచ్చిన హోం. డె. పాఠకుల పేర్లు నవంబర్'74 నెల సంచికలో ప్రకటిస్తూ, అత్యుత్తమ తీర్పు నిచ్చిన పాఠక న్యాయ నిర్ణేతకు రు. 50/-లు నగదు బహుమతి పంపగలము. తుది నిర్ణయం సంపాదకులదే. —ఎడిటర్.]

జూలై '74 నెల విూ తీర్పు?

(1) లత నిర్దోషి।

. లత మేజరు కనుక, ఒకరి కష్టడీలో వుండవలపిన అవ సరంలేదు. లత తన ఇష్టంవచ్చిన చోట ఉండవచ్చును.

(2) శేఠ్ దోషి।

కందిపప్పులో పురుగులు పట్టుట ప్రకృతి సిద్ధంగా జరిగి నప్పటికీ, Food Adulteration చట్టం క్రింద అది కల్తీ కందిపప్పు కాబట్టి శేఠ్ శిక్ష అనుభవించవలసిందే.

(3) శేఠ్, కొట్లో కుర్రాడు ఇద్దరూ శిక్షార్హులే।

శేఠ్, కొట్లోకుర్రాడు అమ్మినపుడు లేకపోయినను, లా ప్రకారం, సర్వెంట్సు చేసిన పనులకు యజమానులు బాధ్యు లగుదురు. సరియైన ధర తెలుసుకొని అమ్మకుండా, ఎక్కువ ధరకు అమ్మినందుకు కుర్రాడుకూడా దోషియే.

—పై విధంగా అత్యుత్తమ తీర్పునిచ్చిన పాఠక న్యాయనిర్ణేత: శ్రీమతి డి. స్వర్ణకుమారి, టెలిఫోన్ ఆపరే టర్, బుకింగ్ ఆఫీసు, ఇండియన్ ఎయిర్‌లైన్స్, బషీర్ బాగ్, హైద్రాబాద్-1 గారికి బహుమతి పైకం రు. 50-లు యీ నెలాఖరులోగా అందజేయబడుతుంది.

పై మూడు కేసులకు సరియైన తీర్పు చెప్పగలిగిన ఇతర పాఠక న్యాయనిర్ణేతలు:

1. పి. గోపాలరావు, (అడ్వొకేట్) నెల్లూరు. 2. శ్రీమతి కురుమద్దాలి విజయలక్ష్మి, (రచయిత్రి) విజయవాడ. 3. కె. కమలాకర్. (బి.యస్.సి.) తెనాలి. 4. కె. పుషోత్తంపాత్రో (టైమ్‌కీపర్) విశాఖపట్టణం. 5. నీలం రామమూర్తి (స్టేషన్ మాస్టర్) కోరాపుట్. 6. బి. సరాశ్రీ. రుద్రంపూర్. 7. ముద్దాసు రేష్, (బి,కాం.) కాకినాడ, 8. పి. ఆనందరావు, (జూనియర్‌క్లర్క్) ముషీరాబాద్. 9. బి. రామారావు, (టెలిఫోన్ ఆపరేటర్) ఖమ్మం. 10. టి.ఎల్.ఎస్. నారా యణరావు, (టి.టి.ఇ.) కాజీపేట.

11. శ్రీమతి ఎమ్.వి. సుబ్బలక్ష్మి, (బి.ఏ.) చిక్కడపల్లి 12. శ్రీమతి పి. హెచ్ శోభారాణి, (బి.ఎస్‌సి.) రాజమండ్రి 13. ఆకొండి సత్యనారాయణమూర్తి, (బి.కాం.) పిఠాపురం 14. పి.యస్.ఆర్. మూర్తి, (ఎల్.ఐ.సి.) కాకినాడ. 15. ఎమ్. ఎస్. ప్రకాశరావు, నల్లగుట్ట. 16. ఎన్. వాసుదేవాచార్, (ఉడిపి హోటల్) ఆలూరు. 17. వెంపటి బ్రహ్మయ్యశాస్త్రి, తుని. 18. కె. లక్ష్మిరెడ్డి. (అడ్వొకేట్) నల్లగొండ. 19. మిట్టపెల్లి నిరంజన్, (టర్నర్ ఆపరేటర్) సికింద్రాబాద్. 20, కూచిపూడి కోటేశ్వరరావు, (క్లాత్ మర్చంట్) ఏలేటివారిపాలెం.

21. కూచిబొట్ల శ్రీనివాసశాస్త్రి (బి.ఏ.) గుడివాడ 22. మిస్.ఆర్. సంపత్ కుమారి, హిందూపురం. 23. శ్రీమతి ఎ. హేమలత, పలాస. 24. ఎమ్. శంకరరెడ్డి (న్యూస్ ఏజెంట్) బెల్లంపల్లి, 25. డి. శేషాద్రి, (టైమ్‌కీపర్) బొంబాయి. 26. ముద్దా రమేష్, (బి.ఎస్‌సి) కాకినాడ. 27. ఆర్. చిదంబరగుప్త, బళ్ళారి. 28. వి. రమణరావు, బొబ్బిలి, 29. బి.వి. ప్రకాశరాజు, (టీచర్) చింతపల్లి. 30. ఏ.వీ. రాజా, (యు.డి. క్లర్క్) శ్రీకాకుళం.

31. శ్రీమతి కోకా అన్నపూర్ణ, (బి.యస్.సి., టీచర్) ఖైరతాబాద్. 32. శ్రీమతి కె. కల్యాణి, (సేల్స్‌గరల్) హిమాయత్‌నగర్. 33. బి. శౌరయ్య, (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్) హైద్రాబాద్. 34. డాక్టర్ బి, కేశవరావు (ఎమ్.బి. బి.యస్.) సికింద్రాబాద్. 35. శ్రీమతి ఎన్. సావిత్రీదేవి, వాల్తేరు. 36. జె. క్రిష్ణారావు, పాన్‌షాప్, ఆశ్వరావుపేట. 37. కోనే నాగవెంకట ఆంజనేయులు, (బి.కాం.) ఏలూరు. 38. ఎన్. లక్ష్మిరెడ్డి, ప్రొద్దుటూరు. 39. ఎస్. వాహీద్, కడప. 40. పి. దేవేంద్రరావు, రాయచూర్-తదితరులు. ★


మరణ ముహూర్తం
కృష్ణ రమణి

"నా పేరు విశ్వనాధం. మెయిన్‌రోడ్డులో ఉన్న విశ్వం ప్రొవిజనల్ స్టోర్సు నాదే. దొండపర్తిలో ఉంది మా యిల్లు" చెప్పాడు ఆ వ్యక్తి.

'చెప్పండి' అన్నట్టు చూశాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి.

విశ్వనాధం ఓ క్షణం దేనిగో ఆలోచిస్తున్నట్టు ఆగి "నన్ను చంపాలన్న ప్రయత్నం జరుగుతోందని నా అనుమానం. మీ సహాయం కావాలి" అన్నాడు.

ఒట్టి అనుమానాలమీద మనుషుల్ని అరెస్టు చెయ్యడానికి గాని, కనీసం వాళ్ళకు వార్నింగ్ యివ్వడానికి గాని రూల్సు ఒప్పుకోవు. పైగా, చాలా అనుమానాలకు ఆధారాలుండవు.

అమాటే విశ్వనాధంతో చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

విశ్వనాధం మొహం ముడుచుకుపోయింది.

"నిరాధారమైన అనుమానాలమీద రాలేదు యిక్కడికి. ఖచ్చితంగా నామీద హత్యాప్రయత్నం జరుగుతోందని చెప్పగలను." అన్నాడు ఆవేశంగా.

ఆ విషయం అర్థం చేసుకున్నాడు సీతాపతి.

"ఇంతకీ మిమ్మల్ని ఎవరు చంపాలనుకుంటున్నారు? ఎప్పుడు చంపాలనుకుంటున్నారు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి.

"మా అబ్బాయి రమేశ్! వాడు నా మరణానికి ముహూర్తం ఎప్పుడైనా పెట్టవచ్చు!" చెప్పాడు విశ్వనాధం సీరియస్‌గా మొహంపెట్టి.

"మీ అబ్బాయా? మిమ్మల్ని హత్య చెయ్యాలనుకుంటున్నాడా? ఏమిటండీ మీ రంటున్నది?"

"అవును. మా అబ్బాయి రమేశ్ నన్ను చంపాలని చూస్తున్నాడు."

''నేను నమ్మలేనండి. తండ్రిని చంపాలనుకునే కొడుకుంటాడా?'' తల విదిలిస్తూ విశ్వనాథం అనుమానాన్ని తను నమ్మలేనట్టు ప్రకటించాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి.

''ఇందులో నమ్మడానికి, నమ్మకపోవడానికి యేం లేదు. ఇది పచ్చి నిజం. మా అబ్బాయి నన్ను హత్య చెయ్యాలని చూస్తున్నాడు'' రెట్టింపు సీరియస్ అయిపోయాడు విశ్వనాథం.

అతని సీరియస్‌నెస్ చూసి, యిహ అతన్ని తేలిగ్గా తీసుకోవడం భావ్యం కాదనుకున్నాడు సీతాపతి.

''మీవాడు మిమ్మల్ని ఎందుకు చంపాలనుకుంటున్నాడు?''

''డబ్బుకోసం.''

''అంటే?''

''వాడు కోరినంత డబ్బు నే నివ్వలేదని.''

''మీ కెంతమంది పిల్లలు?''

''రమేశ్ ఒక్కడే నా సంతానం.''

''మీ శ్రీమతిగారు ఉన్నారా?''

''ఆవిడ పోయి పదేళ్లు అయిండి.''

''మీవాడు కోరినంత డబ్బు ఎందుకివ్వడంలేదు మీరు?''

''వాడికి వ్యసనాలు పట్టుకున్నాయి. పోరంబోకు స్త్రీల తోటి సంబంధాలు, అలగాజనంతోటి స్నేహాలు కుదిరాయి వాడికి.''

అప్పటికి కేసు స్వరూపం స్థూలంగా అర్థమయిం దనిపించింది సీతాపతికి.

''మీ అబ్బాయి రమేశ్ మిమ్మల్ని చంపబోతున్నాడని అనడానికి మీకు దొరికిన ఆధారాలేమిటి?'' అడిగాడు సీతాపతి కాసేపయ్యాక.

''మీ ప్రశ్నకు జవాబు యిక్కడే చెప్పడానికి నా

కభ్యంతరం లేదు. కాని, మీరోసారి మా యింటికి వస్తే మీ కళ్లతో మీరు చూపి తృప్తి చెందుదురు గాని'' అన్నాడు విశ్వనాధం.

ఇన్‌స్పెక్టర్ సీతాపతి ఒక్కక్షణం ఆలోచించి తల పంకించాడు.

''సరే పదండి.''

ఇద్దరూ లేచారు. స్టేషను బయటికి వచ్చారు. ఖాళీ ఆటో రిక్షా పోతుంటే పిలిచాడు విశ్వనాధం.

విశ్వనాధం, సీతాపతి ఎక్కి కూర్చోగానే ఆటో బయలు దేరింది, విశ్వనాధం చెప్పిన వీధివైపుకు.

2

''సరైన ఆధారాలు లేకుండా మీ వద్దకు వచ్చాననుకుంటున్నారా?'' త్రోవలో అన్నాడు విశ్వనాధం.

జవాబివ్వలేదు సీతాపతి.

''మా అబ్బాయి రమేశ్ నాకొక్కడే సంతానం'' చెప్ప సాగాడు విశ్వనాధం.

విశ్వనాధం చెప్పింది మవునంగా, శ్రద్ధగా వినసాగాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి.

''ఒక్కడే కావడం వల్ల ననుకోండి, మరే కారణం వల్ల ననుకోండి రమేశ్ నాకు ప్రాణం. అందుకే, నా భార్య రాజ్యం పోయాక, పెళ్ళి చేసుకోవాలన్న కోరిక ఉన్నా అందుకు తగిన డబ్బు, ఆరోగ్యం ఉన్నా, నేను రెండో పెళ్లి చేసుకోలేదు. వాడికి సవతితల్లి పోరు యివ్వడం నా కిష్టం లేదు. మా రమేశ్ మొదట్నుంచీ చదువులో ఫస్ట్. ఎమ్. ఏ. ఫస్ట్ క్లాసులో పాసయ్యాడు.''

''ఆఁ... యేమిటి? మీ వాడు ఎమ్. ఏ చదువుకున్నాడా?

ఇంతవరకూ మీవాడేదో చదువూ సంధ్యాలేని జులాయి రకం అనుకున్నాను'' అన్నాడు సీతాపతి, విశ్వనాథం వాక్ప్రవాహానికి అడ్డు తగుల్తూ.

''అంతే కాదు. వాడిప్పుడు రిసెర్చ్ చేస్తున్నాడు. అదేమిటో వాడు రిసెర్చి ఆరంభించిన నాటినుండి మనిషి మారిపోయాడు. చెడు సాహవాసాలు ఎక్కువయ్యాయి. లాడ్జీలకు వెళ్ళడం ముమ్మరం అయ్యిందని. వేళకి ఇంటికి రాడు. 'యేమిటిరా ఇదంతా?' అని అడిగితే 'రిసెర్చ్ నాన్నా! రిసెర్చి అంటే ఏమిటనుకున్నావ్ మరి?' అంటూ రిసెర్చిని అడ్డం వేసుకొంటాడు. అంతటితో అయిపోతే బావుండును. లక్ష్యం లేకుండా డబ్బు ఖర్చు చేస్తున్నాడు.

వాడెప్పుడు డబ్బు అడిగినా, అడిగిన మొత్తానికి కాస్త ఎక్కువే ఇచ్చేవాడ్ని యింతకు ముందు. ఇప్పుడు వారానికి రెండువేలు ఖర్చు చేస్తున్నాడు. అదీ చాలక, యింకా తెమ్మంటున్నాడు. 'ఏమిటీ ఖర్చులు అర్థం పర్థం లేకుండా?' అని చాలాసార్లు నిలదీసి అడిగాను. మాట్లాడితే వాడికా రిసెర్చి అనే పదం దొరికింది. 'రిసెర్చి అంటే మాటలేమిటి? ఎన్నో ఖర్చులుంటాయి. మీకు రిసెర్చి సంగతి తెలీదు పొండి' అన్నాడు.

అలా డబ్బు విషయమై మాఇద్దరికీ వాగ్యుద్ధం జరగని రోజులేదు. మొన్న మాఇద్దరికీ పెద్ద దెబ్బలాట జరిగింది. 'నా ఆస్తిలో చిల్లిగవ్వ నీకు ఇవ్వను. నాఆస్తి యావత్తు అనాథ ఆశ్రమాలకు, దీనజనోద్ధరణ సంఘాలకు రాసిస్తాను' అని బెదిరించాను. అలా అంటే, నాదారికి రాకపోతాడా అని. 'మీ ఆస్తికి వారసుడ్ని నేను. మీవద్దనుంచి ఆస్తి నెలా తీసుకోవాలో నాకు తెలుసు. అనాథశరణాలయాలకు ఎలా రాసిస్తారో నేనూ చూస్తాను' అంటూ వాడు ఒళ్లు తెలీని కోపంతో అరిచి వీధిలోకి విసురుగా వెళ్లిపోయాడు.

అదీలగాయితు, మేమిద్దరం మాట్లాడుకోవడం మానేసాం. వాడు ఎదురుపడితే నేను, నేను ఎదురుపడితే వాడు తప్పించుకు తిరుగుతున్నాం. ఇప్పుడు వాడు తన ఖర్చులకోసం ఏం చేస్తున్నాడో తెలీదు. నన్ను వాడడగడంలేదు. నేను ఇవ్వడం కూడా లేదు. ఎందుకయినా మంచిదని విలువైన వస్తువులు వాడికి అందకుండా జాగ్రత్త తీసుకున్నాను.

నిన్ననెందుకో వాడి గది చూడాలనిపించింది. కుతూహలంగా లోనికిపోయి చూసాను. అక్కడకొన్ని వస్తువులు కనిపించాయి నాకు. వాడి మనస్సులో యెలాంటి భయంకరమైన ఆలోచనలు వున్నాయో అప్పటికిగాని నాకు తెలీలేదు. మొదట నాకు ఏంచెయ్యాలో తెలీలేదు. కాసేపు ఆలోచించిన మీదట, మీకు చెప్పిఉంచడం మంచిదని తోచింది. అందుకే మీవద్దకు వచ్చాను'' ఆగాడు విశ్వనాథం.

''మీ అబ్బాయి గదిలో యేం అవుపించాయి మీకు?'' అడిగాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి కుతూహలాన్ని కనబరుస్తూ.

''అవి చూపాలనే మిమ్మల్నిలా తీసుకు వచ్చాను'' చెప్పాడు విశ్వనాథం.

విశ్వనాథం ఇల్లు సమీపించినట్టుంది. ఓ ఇల్లుచూపి, అక్కడ ఆటోని ఆపమన్నాడు విశ్వనాథం.

ఆటో రిక్షా ఆగింది. విశ్వనాథం దిగి ఇంటిలోకి దారితీసాడు. సీతాపతి అతడ్ని అనుసరించాడు.

సీతాపతిని తిన్నగా మేడమీదున్న రమేశ్ గదికి తీసుకెళ్ళాడు విశ్వనాథం.

రమేశ్ గది చాలా తమాషాగా అవుపించింది సీతాపతికి. అక్కడ వాతావరణం చెప్పలేని గుబులు కల్గించిందాతడి గుండెల్లో. యూనివర్సిటీలో చదువుకొని, రిసెర్చిచేసే ఒక

విద్యార్థి స్టడీరూంలా లేదు అది. ఒక వేటగాడి గదిలా ఉంది.

రకరకాల జంతూలవీ, పక్షులవీ, అరుస్తున్నట్టు కొన్ని, మీదికి దుముకుతున్నట్టు కొన్ని, రకరకాల పోజుల్లో బొమ్మ లున్నాయి ఆ గదినిండా. చంపిన ఆయా జంతువుల చర్మాలే ఉపయోగించి, ఆ బొమ్మలు తయారయ్యాయేమో, ఆయా జంతువులు వచ్చి గదిలో నిలుచున్నాయా అన్నట్టు ఉంది.

పగటిపూట కాబట్టి సరిపోయింది గాని, అదే యేరాత్రి వేళో ఐతే గుండాగిపోతుంది.

'చూస్తుంటే రమేశ్‌ది విచిత్ర మనస్తత్వంలాగుందే' అనుకొన్నాడు సీతాపతి.

"ఇలారండి ఇనస్పెక్టర్‌గారూ!"

విశ్వనాథం పిలిచాడు. ఆలోచనల్లోంచి విడివడ్డాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి. విశ్వనాథం ఉన్నదిక్కుకు వెళ్ళాడు.

గదిలో ఓమూలనున్న టేబిలువద్ద నిలుచున్నాడు విశ్వనాథం.

ఇన్‌స్పెక్టర్ సీతాపతి ఆతన్ని సమీపించగానే, ఆ టేబులు కుడిసొరుగు లాగాడు విశ్వనాథం.

"చూడండి" అని విశ్వనాథం అనగానే సీతాపతి సొరుగు లోకి చూసాడు. అందులో ఓ పిస్టలుంది. దాన్ని అందుకుని చూశాడు. అందులో గుళ్లుమాత్రం లేవు.

"అది లైసెన్సులేని పిస్టలు. కావలిస్తే కనుక్కోండి" అన్నాడు విశ్వనాథం, ఓక్షణం పిస్టలువైపు, ఇంకోక్షణం ఇన్‌స్పెక్టర్ మొహంవైపు చూస్తూ.

"ఓహో! అల్లాగా!" తల పంకించి మళ్ళా పిస్టల్ని సొరుగులో ఉంచాడు సీతాపతి.

సొరుగు మూసేసి అక్కడకు కాస్త దూరంలో ఉన్న ఇనప బీరువావద్దకు నడిచాడు విశ్వనాథం.

బీరువా తలుపు తెరచి ''ఇవీ చూడండి'' అన్నాడు.

విశ్వనాథం వెనుకనేవచ్చి సీతాపతి అతను చూపిన దిక్కుకు చూసాడు. అక్కడ రకరకాల సీసాలున్నాయి. అందులో ఒకదాన్ని అందుకొని చూసాడు. దానిమీద 'ఎండ్రిన్' అని రాసి ఉంది.

అనాలోచితంగా ఆ సీసామూత తియ్యబోయాడు. మూత రాలేదు. సీలువేసి ఉందని అప్పుడు గ్రహించాడు.

ఎండ్రిన్ సీసాను పెట్టేసి ఇంకోసీసాను అందుకొన్నాడు. అందులో గార్డినాల్ మాత్రలున్నాయి.

ఆ సీసా మూత కూడా సీలువేసి ఉంది.

ఇహ, సీసాలు బయటకు తియ్యకుండా, వాటిమీదున్న పేర్లను వరుసగా చదివాడు.

అవన్నీ విషాల సీసాలే!

ఎండ్రిన్ మొదలు ఆర్సినిక్ వరకుగల విషాలున్నాయి ఆ సీసాల్లో. వాటన్నిటికీ సీళ్ళువేసి ఉన్నాయి.

ఆ అరలో తను చూడాల్సింది ఇంకేమీలేదని అనిపించగానే, అతనిచూపులు రెండో అర మీద పడ్డాయి. రెండో అరలో కొన్ని పుస్తకాలున్నాయి.

అవేంపుస్తకాలో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగిందాతడికి. ఓ పుస్తకాన్ని అందుకొని పేరు చదివాడు. ''డెడ్‌లీ పోయిజెన్స్ ఆఫ్ ఇండియా'' అన్నది ఆ పుస్తకం పేరు.

గబగబా మరిరెండు పుస్తకాలు తీసి వాటిపేర్లు చదివాడు.

ఆ అరలోఉన్న పుస్తకాలన్నీ, విషాలకు సంబంధించినవే అని గ్రహించాడు సీతాపతి.

గట్టిగా నిట్టూర్చి ''ఆ తరువాత'' అన్నాడు సీతాపతి.

''ఆఖరుదీ, ముఖ్యమైనదీ చూపిస్తున్నాను. చూడండి''

అంటూ ఆగదిలో ఓ మూలనున్న రేక్ లోంచి ఓచిన్న కర్ర పెట్టె తీసుకొచ్చి తెరిచి ఇన్స్పెక్టర్ సీతాపతికి చూపించాడు విశ్వనాథం.

ఆ పెట్టెలో రకరకాల కత్తులు చిన్నవీ, పెద్దవీ అనేక ఆకారాలవీ, సైజులవీ ఉన్నాయి.

విశ్వనాథం యెందుకు భయపడుతున్నాడో అర్థం చేసుకున్నాడు సీతాపతి.

తనను హత్య చెయ్యాలన్న ఉద్దేశంతోనే, రమేశ్ ఆ వస్తువులన్నీ సంగ్రహించి ఉంచాడని విశ్వనాథం అనుమానం, భయం.

కాని, హత్య చెయ్యాలనుకున్నవాడు, అంత బహిరంగంగా ఎగ్జిబిషన్‌లో వస్తువుల్లాగు, తన గదిలో అమర్చుకుని ఉంచుకుంటాడా? పైగా, ఒక హత్యకు ఇన్నివస్తువులు అవసరంలేదన్న సందేహం కలిగింది ఇన్స్పెక్టర్ సీతాపతికి.

తన సందేహం విశ్వనాథం ముందుంచాడు.

క్షణంసేపు సీతాపతి కళ్ళల్లోకి నిశితంగా చూసి "మనం అలా అనుకోవాలనే, తను చేయబోయే హత్యకు కావాల్సిన కవరుకోసం, రమేశ్ ఇవన్నీ యిలా తనగదిలో పెట్టుకున్నాడని మీ రెందుకు ఆలోచించరు?" అని అడిగాడు విశ్వనాథం.

సీతాపతి నిరుత్తరు డయ్యాడు.

ఆ కోణంలో తన ఆలోచన పోనేలేదు. అదీ సబబే ననిపించింది.

ఇద్దరూ గది బయటకు వచ్చారు.

"పూర్ణమ్మా!" మేడమీదనుంచే కేకేసాడు విశ్వనాథం.

ముప్ఫయి అయిదు,నలభైకి మధ్య వయస్సున్న ఒకామె వచ్చింది "యేమండీ!" అంటూ క్రింది వరండాలోకి.

"రెండు కప్పుల కాఫీ పట్రా."

విశ్వనాథం చెప్పగానే, ఆమె వెళ్లిపోయింది.

ఇద్దరూ మేడ దిగారు. హాలులో కుర్చీల్లో కూర్చున్నారు.

"ఈమె యెవరు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి, పూర్ణమ్మ వెళ్ళిపోయాక.

పూర్ణమ్మతో రహస్య సంబంధం కలిగివుండవచ్చని అనుమానం కగిలింది సీతాపతిలో.

"పేరుకు యీమె మా వంట మనిషి. నిజానికి యీ యింటికి ఆడదిక్కు ఆమే" చెప్పాడు విశ్వనాథం.

కాని, అతడి మాటల్లో కొత్త అర్థాలు చదివాడు ఇన్‌స్పెక్టర్.

"ఆమె యిక్కడే, మీతోనే ఉంటుందా?"

"ఆఁ....ఆమెకు నా అనేవారు యెవరూలేరు. ఆమెకు మేము కాస్త దూరపు బంధువులం అవుతాం కూడా. అందుకే, మా యింటిలో పనిమనిషిలా ఉండదామె. ఈ యింటిలో మెంబరులా ఉంటుంది."

సీతాపతిలో కలిగిన అనుమానం బలపడుతోంది. పూర్ణమ్మ ఆ యింటిలో ప్రవేశించాకనే, తండ్రి కొడుకుల మధ్య భేదాలు మొదలయి ఉండాలి. పూర్ణమ్మ మోజులోపడ్డ విశ్వనాథంకు రమేశ్ చేదుమందు అయిపోయాడు. తండ్రిని కొడుకు ద్వేషించడానికి అదో కారణం అయ్యుండవచ్చు.

"ఎన్నాళ్ళయింది ఆమె మీతో కలసి ఉండడం మొదలు పెట్టి" అడిగాడు సీతాపతి.

"సంవత్సరం పైగా అవుతుంది" చెప్పాడు విశ్వనాథం.

పూర్ణమ్మకు విశ్వనాథంకు రహస్య సంబంధం ఉందని ఖాయంగా అనుకున్నాడు ఇన్‌స్పెక్టర్.

అయితే, ఆ ఆలోచనలన్నీ "ఇదిగోండి అన్నయ్యా. కాఫీ!" అంటూ పూర్ణమ్మ అక్కడకు వచ్చేసరికి, గాలికి

దూదిపింజల్లా ఎగిరిపోయాయి, అతడి అనుమానాలన్నీ.

దిగాలు పడిపోయాడు.

కాఫీ, పూర్తయ్యాక సీతాపతి లేచాడు.

"చూడండి విశ్వనాథంగారూ! మీరేం మనసులో బెంగ పెట్టుకోకండి. అన్ని విషయాలు నేను చూసుకుంటాను"

అని చెప్పి, ఇన్‌స్పెక్టర్ సీతాపతి వెళ్ళిపోయాడు.

3

మర్నాడు యూనివర్శిటీకి వెళ్తున్న రమేశ్‌ను మధ్యలో ఆపి పోలీసుస్టేషనుకు తీసుకువెళ్లాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి.

రమేశ్‌కు యిరవైనాలుగేళ్లుంటాయి. సన్నగా, పొడుగ్గా, యెర్రగా ఆకర్షణీయంగా అవుపిస్తాడు. యూనివర్సిటీలో చదువుతున్నా, హైస్కూలు కుర్రాడి నిర్మలత్వం, పసితనం అతని మొహంలో ఉన్నాయి.

'ఇతడికి తండ్రిని చంపాలన్న కోరిక ఉందా? అసంభవం!' అనుకొన్నాడు సీతాపతి, రమేశ్‌ను చూసాక.

"మీనాన్నగారు స్టేషను కొచ్చారు నిన్న" తనకి ఎదురుగా ఉన్న కుర్చీలో రమేశ్‌ను కూచోబెడుతూ అన్నాడు సీతాపతి.

"ఎందుకు" ప్రశ్నించాడు రమేశ్.

"మీమీద రిపోర్టు ఇవ్వడానికి" చెప్పాడు సీతాపతి.

తెల్లకాగితంకన్న తెల్లగా అయింది రమేశ్ మొహం.

"ఏమని ఇచ్చారు రిపోర్టు?"

"మీరు అతన్ని హత్యచేయదల్చుకొన్నారనీ, మీనుండి అతనికి రక్షణ కల్పించమనీ."

ఆమాట వినీవినగానే "యేమిటీ?" అంటూ కుర్చీలోంచి చివాలున లేచాడు రమేశ్.

కాని, తమాయించుకోమన్నట్టుగా సీతాపతి చెయ్యి ఊప

గ్గానే, తిరిగి కుర్చీలో కూర్చున్నాడు రమేశ్.

"దిసీజ్ టూమచ్. నేనేమిటి? మా నాన్నగారిని హత్య చెయ్య దల్చుకోవడమేమిటి? ఆయనలా అంటే మీరెలా నమ్మారు ఇనస్పెక్టరుగారూ?" అన్నాడు. అతని కంఠంలో బాధ, దిగులు తొంగిచూసాయి.

"నమ్మక యేంచెయ్యమంటారు. ఆయన తగిన ఆధారాలు చూపారు" అన్నాడు సీతాపతి. తన దోషమేమీ లేదన్నట్టుగా.

"ఏం చూపారో తెలుసుకోవచ్చునా?"

"ఓయస్ చెప్తాను. మేడమీదున్న మీగదికి తీసుకెళ్లారు మీనాన్నగారు. బీరువాలో సీసాల్లోఉన్న విషాల్ని, పెట్టెలో ఉన్న రకరకాల కత్తుల్ని, లైసెన్సులేని పిస్టల్ని చూపారు."

సీతాపతి చెప్పిందాన్ని వింటూనే ఫక్కున నవ్వాడు రమేశ్.

"నిజంగా మా నాన్నగార్ని చంపాలనే అనుకొన్నాననుకోండి. అవన్నీ నాగదిలో అలా పెట్టుకొని కూచుంటానా, మీకు కన్పించేలాగు?" అన్నాడు రమేశ్.

"నేను మీలాగే అన్నాను. దానికి మీనాన్నగా రేమన్నారో తెలుసునా? మేమిలా అనుకోవాలనే మీ రా వస్తువులు అలా ప్రదర్శనలాగు పెట్టుకొన్నారట."

రమేశ్ వెంటనే మాటాడలేక పోయాడు. మొహంలో ఆశ్చర్య ముద్రతో అలా ఉండిపోయాడు. ఇన్‌స్పెక్టర్ మొహంలోకి చూస్తూ.

"పోనీ మీరన్నట్టుగా ఆ వస్తువులు మీ నాన్నగార్ని చంపాలన్న ఉద్దేశంతో సేకరించ లేదనుకుందాం కాసేపు. అయితే, అవన్నీ ఆగదిలో ఎందుకు పెట్టుకూర్చున్నారు?" రమేశ్ కళ్ళల్లోకి నిశితంగా చూస్తూ ప్రశ్నించాడు సీతాపతి.

జవాబివ్వడానికి టైం తీసుకొన్నాడు రమేష్.

"నేనిలా యీనాడు సంజాయిషీ చెప్పుకోవాల్సి వస్తుందని అనుకోలేదు ఎన్నడూ. నాకు భయం గొల్పేవి, భీతావహం సృష్టించే వస్తువులంటే ఎంతో సరదా. అందుకే ఓ మంచి టాక్సీడెర్మిస్ట్ తయారుచేసిన జంతువుల బొమ్మలు నాగదిలో ఉంచుకొన్నాను. టేబులు సొరుగులో మీ కవుపించిన పిస్టల్ని నేను కలకత్తాలో ఓ సెకండ్‌హాండ్ షాపులో కొన్నాను రహస్యంగా. వందకుపైగా హత్యలుచేసిన ఎవరో నగ్గలైటుదట ఆ పిస్టలు. ఇహ, ఆ విషాలున్న సీసాలు అన్నీ యెవరూవాడే ప్రమాదం లేకుండా సీళ్ళువేసి ఉంచాను. అలాగే పెట్టెలోఉన్న కత్తులన్నీ నా సరదాకోసం కొని దాచుకొన్నాను" చెప్పాడు రమేశ్.

రమేశ్ యిచ్చిన వివరణ సబబుగానే కనిపించింది సీతాపతికి.

రమేశ్ లాంటి వింత ప్రవృత్తిగల మనుషులు యీ లోకంలో లేకపోలేదు. తను అతన్ని నమ్ముతాడు.

కాని, విశ్వనాథాన్ని నమ్మించేదెలా?

ఆ మాటే చెప్పాడు రమేశ్‌తో.

"ఆ విషయం నాకు తెలుసు ఇనస్పెక్టరుగారూ! ఎందుకో ఈ మధ్య నేనంటే ద్వేషం, కోపం పట్టుకున్నాయి మా నాన్నగారికి. నా చేతితో యిస్తే, పచ్చి మంచి నీళ్లు ముట్టుకోవడంలేదు. వీలయినంత మట్టుకు యింట్లో తయారయిన వస్తువులు గాని, పానీయాలుగాని తీసుకోవడం మానేసారు. ఎప్పుడయినా తప్పనిసరి అయితే, కాస్త మా పెంపుడు పిల్లికి పెట్టి చూసాకగాని, ఆయన తినడంలేదు.

పది రోజులక్రితం, మా పూర్ణత్తయ్య ఉప్మాచేసింది. ఆయన ఏదో ఆలోచిస్తూ ఉండిపోయారులాగుంది. పిల్లికి మామ్మూలుగా పెట్టడం మర్చిపోయి తినేసారు. అరగంట

పోయాక, వాంతులు పట్టుకున్నాయి ఆయనకు. మేమూతిన్నాం కాని మేం బాగానే ఉన్నాం. ఆయన మాత్రం డాక్టర్ను పిలిచి నానా హంగామా చేసారు. 'నా ఆస్తంతా నీదేకదరా. నన్ను చంపడం యెందుకురా!' అంటూ ఏవేవో వాగారు నన్ను పట్టుకుని. అదంతా ముసలితనపు పిచ్చివాగుడు అని సరిపెట్టుకుని ఊరుకున్నాను. పోలీసు రిపోర్టు వరకూ విష యాన్ని పెంచుతాననుకోలేదు'' రమేశ్ అన్నాడు.

''రమేశ్ గారూ! ఏది ఏమైనా ఒక్క విషయం గుర్తుంచు కోండి. ఈ సమయంలో మీ నాన్నగారికి ఏమైనా జరిగిం దంటే. మిమ్మల్నే మొదట అనుమానించి అరెస్టు చేయాల్సి వస్తుంది. అంచేత, మీరు జాగ్రత్తగా మసలు కోవడం అవసరం. పైగా, మీ నాన్నగారికి ఎలాంటి ప్రమాదమూ కలగకుండా చూసుకోవాలి....ఇహ మీరు వెళ్లవచ్చు నిశ్చింతగా'' అన్నాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి.

4

విశ్వనాథం పక్షం కథ తనకు తెలుసు. కాని, రమేశ్ చెప్పుకోవాల్సిందేమైనా ఉందా?

అది తెలుసుకోవడానికే రమేశ్‌ను స్టేషనుకు పిల్చాడు సీతాపతి. అడగవలసిన ప్రశ్నలన్నీ అడిగాడు. రమేశ్ యిచ్చిన జవాబుల్ని నిశితంగా పరిశీలించిన మీదట, రమేశ్‌కు తన తండ్రిని చంపాలన్న దురుద్దేశం లేదని నిర్ధారణకు వచ్చాడు.

అయితే, ఏ పుట్టలో ఏ పాముందో అన్నట్టు, రమేశ్ మంచిమనసులో కూడా ఎలాంటి భయంకరమైన ఆలోచనలు ఉన్నాయో? సీతాపతిలోని పోలీసు బుద్ధి ఆలోచించింది.

రమేశ్ ఏయే సమయాల్లో ఎక్కడెక్కడ తిరుగుతాడు?

అతనికున్న అలవాట్లు యేమిటి? విశ్వనాథం చెప్పినట్లుగా రమేశ్ వ్యసనపరుడా? మొదలైన విషయాలన్నీ శ్రద్ధగా దర్యాప్తు చేసి ఓ సమగ్రమైన రిపోర్టు యివ్వమని నలుగురు పోలీసుల్ని షిప్టులుపెట్టి నియమించాడు సీతాపతి.

వారం రోజులపాటు రమేశ్ ప్రతి కదలికనూ పరిశీలించిన మీదట ఓ రిపోర్టు అందించారు సీతాపతికి,ఆ పోలీసులు.

రిపోర్టు చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు సీతాపతి. రమేశ్ ప్రవర్తన గురించి విశ్వనాథం చెప్పిన ఒక్కమాట కూడ పోల్లుకాదు.

యూనివర్శిటీ అయిపోయాక, ఎక్కువ సమయం రమేశ్ వ్యభిచారగృహాల్లోనో, అలగాజనం గుడిసెల్లోనో గడుపుతుంటాడు.

అయితే, రమేశ్‌కు త్రాగుడు మాత్రం అలవాటులేదు.

రిపోర్టు చేతిలోఉంచుకుని, రమేశ్‌ను మళ్ళీ స్టేషనుకు పిలిపించాడు సీతాపతి.

"మా వాళ్ళను మీ ప్రవర్తన గురించి రిపోర్టు యివ్వమని చెప్పాను. వాళ్ళిచ్చిన రిపోర్టు యిది. యేమంటారు మీరు?" అడిగాడు సీతాపతి.

"అంటే. మా నాన్నగారు నా విషయంలో చెప్పిందంతా నమ్ముతున్నారన్నమాట" అన్నాడు రమేశ్ చిన్నపోయిన మొహంతో.

"అక్షరాలా నమ్ముతున్నాం. మీకు వ్యసనా లున్నాయి. ముఖ్యంగా స్త్రీ వ్యసనం. రాత్రికో అమ్మాయితో గడపడం మీకు అలవాటు. మీ ఖరీదైన అలవాట్లకు డబ్బు కావాలి. మీ నాన్నగారు యివ్వనన్నారు. ఆయన్ని మీ దారికి అడ్డం తొలగించుకోవాలని అందుకే ఆరాటపడుతున్నారు" చెప్పాడు సీతాపతి,

ఏం చెప్పాలో.ఎలా చెప్పాలో అర్థం కాలేదు రమేశ్‌కు. మాటలకోసం తడబడ్డాడు.

కాసేపయాక, "చూడండి ఇన్‌స్పెక్టరుగారూ! ఆ రిపోర్టు సగంమాత్రమే నిజమని చెప్పడానికి సాహసిస్తున్నాను" అన్నాడు.

అంటే. ఆ రిపోర్టు సగం అబద్దం అనేగా! నలుగురు నమ్మకస్తులయిన పోలీసులు వారంరోజులపాటు రాత్రనక పగలనక రమేశ్‌ను వెంబడించి జాగ్రత్తగా తయారుచేసిన రిపోర్టు అది. అది అబద్ధం యెలా అవుతుంది?

"నేను వేశ్యల కంపెనీల్లోనూ, అలగాజనం ఇళ్ళల్లోనూ ఎక్కువకాలం గడపడం నిజమే. అయితే, అదంతా నేను వ్యసనాలకు బానిసయి చేస్తున్నది మాత్రంకాదు. అదంతా నా రిసెర్చికి సంబంధించిన వ్యవహారం.సమాజంలో అక్రమ జీవితాలు గడిపేవారి జీవనరీతుల గురించి విషయసేకరణ చేస్తున్నాను" చెప్పాడు రమేశ్.

"నో. నో. అలా కావడానికి వీలులేదు. ఐ డోంట్ బిలీవిట్" కోపంతో అరిచాడు సీతాపతి.

"నమ్మండి. నమ్మకపోండి. ఇది పచ్చి నిజం" తాపీగా ధీమాగా అన్నాడు రమేశ్.

"సరే. మీరు ముండల కంపెనీలకు, పోరంబోకుగాళ్ళ గుడిసెలకు రిసెర్చికోసం మాత్రమే వెళ్తున్నారని నిదర్శనాలు చూపగలరా?" రెట్టించి అడిగాడు సీతాపతి.

"అలాగే! అయితే. మీరొకసారి యూనివర్సిటీకి రావాలి."

"ఎందుకు?"

"మా ప్రొఫెసర్‌గార్ని కలుసుకొని మాట్లాడుదురుగాని" అన్నాడు రమేశ్.

5

మర్నాడు యూనివర్సిటీ సోషియాలజీ డిపార్టుమెంట్‌లో రమేశ్‌ను కలుసుకోవడం కష్టంకాలేదు సీతాపతికి.

ఇన్‌స్పెక్టర్ సీతాపతిని తన ప్రొఫెసర్ రంగారావుకు పరిచయం చేశాడు రమేశ్.

"ఏమిటిసార్! మావాడు వాళ్ళ నాన్నగార్ని హత్యచేయ చూస్తున్నాడని అంటున్నారట?" అన్నాడు రంగారావు, సీతాపతిని కూచోబెట్టి మర్యాదచేసిన పిదప.

"ఏం చెయ్యడం సార్? వాళ్ళ నాన్నగారు మాకు అలా రిపోర్టు చేసారు. మేం ఆరాతీయగా తేలిందేమంటే రమేశ్‌కు కొన్ని తగని అలవాట్లు, స్నేహాలు ఉన్నాయి. దీనికి మీ సంజాయిషీ ఏమిటని అడిగితే,ఇదంతా నా రిసెర్చికి సంబంధించింది అంటున్నాడు రమేశ్."

"చూడండి ఇన్‌స్పెక్టర్‌గారూ! రమేశ్ నా విద్యార్థులందరిలోనూ శ్రేష్ఠుడు. ఒక్క చదువులోనే కాదు. గుణంలో కూడా. అలాంటివాడు తండ్రినే హత్యచెయ్యాలని చూస్తున్నాడని మీరు అంటుంటే, నన్నేమీరు అంటున్నట్టుగా బాధపడుతున్నాను" అన్నాడు ప్రొఫెసర్ రంగారావు.

ఇన్‌స్పెక్టర్ మాట్లాడలేదు.

"అప్పన్నా! టేప్ రికార్డరు, మన రమేశ్ రిసెర్చిటేప్స్ యిలా తీసుకురా" కేకేసాడు రంగారావు, ప్యూనుద్దేశించి.

ప్యూను అప్పన్న టేప్‌రికార్డరు, చిన్న కార్టన్‌తో ఉన్న టేప్స్ తీసుకొచ్చి రంగారావు ముందున్న టేబులు మీద వుంచి వెళ్ళిపోయారు.

కార్టన్ లోంచి ఓ టేప్ బయటకు తీసి, రికార్డరు మీద

ఉంచి ఆన్ చేస్తూ "ఇవన్నీ రమేశ్ టేప్స్. ఆయా వ్యక్తుల్ని ఇంటర్వ్యూచేసి సంగ్రహించిన భోగట్టా వీటిలో ఉంది." అన్నాడు రంగారావు.

అత్యంతాసక్తితో టేప్‌ను విన్నాడు సీతాపతి. ఒక వ్యభిచార స్త్రీతో రమేశ్ నేర్పుగా అవీ యివీ మాట్లాడి, తనకు కావాల్సిన విషయం రాబట్టాడు. ఆ టేప్‌లో ఆ యిద్దరి సంభాషణ ఉంది. టేప్ చివర ఆ స్త్రీ పేరు, లాడ్జింగు పేరు, ఆమె వయస్సు, ఇంటర్వ్యూ జరిపిన తేదీ మొదలైన వివరాలు రమేశ్ కంఠంతోనే రికార్డు చేయబడి ఉన్నాయి.

సీతాపతి ఆశ్చర్యానందాలకు అంతులేదు. ఎండ పొడ తగలగానే విడిపోయిన మబ్బులాగు, రమేశ్ మీద కేసు తేలిపోయింది.

తనకు వాళ్లు చూపిస్తున్న నిదర్శన లోపరహితమూ దృఢమైనదీ అని తెలుసుకోవడం కోసం. ఆ టేప్ రెండు మూడు సార్లు పెట్టించుకుని విన్నాడు. ఆ టేప్‌గాక ఇంకో రెండు టేప్స్ కూడా పెట్టించుకుని విన్నాడు.

"మీ అనుమానం యిహ తీరినట్టే అనుకుంటాను" అన్నాడు రంగారావు టేప్ రికార్డరు కట్టేస్తూ.

"వెరీగుడ్ సార్, రమేశ్ కేరక్టరు గురించి నాకింకేం అనుమానం లేదు" అన్నాడు సీతాపతి ఉత్సాహంగా లేస్తూ.

6

"చూడండి, విశ్వనాథంగారూ! మీ అబ్బాయి ప్రవర్తన విషయంలో క్షుణ్ణంగా పరిశీలన జరిపించాం. చివరకు తేలిందేమంటే, మీరనుమానించినట్టు స్త్రీ వ్యసనంగాని, అలగా జనంతోటి స్నేహంగాని మీ అబ్బాయికి లేవు. అంతేకాదు, మీ అబ్బాయికి మిమ్మల్ని చంపాలన్న దురుద్దేశం ఏ కోశానా

లేదు. ఇహ మీరు నిశ్చింతగా ఉండవచ్చు'' చెప్పాడు సీతాపతి.

విశ్వనాథం మొహం సీరియస్‌గా మారిపోయింది.

''అంటే, మీరు నా అనుమానాలు నిరాధారమనుకుంటున్నారన్న మాట యింకా?'' అన్నాడు విశ్వనాథం.

''మీ అబ్బాయి మీద మీరు తెచ్చిన అభియోగం తాలూకు నిజానిజాలు పరిశీలించాము. మా దర్యాప్తులో తేలిందేమంటే మీ వాడు సత్ప్రివర్తన గలవాడు''చెప్పాడు సీతాపతి.

విశ్వనాథం మాట్లాడలేదు సీరియస్‌గా ఆలోచిస్తూ ఉండిపోయాడు.

అయిదునిముషాల తరువాత, ''అయితే, మీరు కూడా ఆ గేంగ్‌తో చేరిపోయారన్నమాట!'' అన్నాడు విశ్వనాథం.

''ఏమిటి మీ రంటున్నది?'' అయోమయంగా అన్నాడు సీతాపతి.

''ఏమీలేదు. ఇన్‌స్పెక్టరుగారూ! ఈ రోజుల్లో డబ్బుకు దొరకందిలేదు. సరియైన ధర పెడితే, బజార్లో మనుషుల్నే కొనుక్కోవచ్చు.''

ఆ పదాల్లోని అంతరార్థం సూటిగా సీతాపతి గుండెకు తగలాలనే, తాపీగా నొక్కి నొక్కి మాట్లాడాడు విశ్వనాథం.

అప్పటికి విశ్వనాథం యేమంటున్నాదో బోధపడింది సీతాపతికి.

తనకు డబ్బిచ్చి తనను రమేశ్ కొనేసుకొన్నాడు. అది అతని ఉద్దేశం!

సీతాపతి రక్తం ఉడుకెత్తిపోయింది ఒక్కసారిగా.

''విశ్వనాథంగారూ! జాగ్రత్తగా మాట్లాడటం నేర్చుకొండి. వస్తా!'' అంటూ విసురుగా లేచి వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి.

7

"టుటౌన్ పోలీసుస్టేషన్ ఎస్. ఐ సీతాపతివి నువ్వేనన్న మాట?" అడిగాడు డి.వై.యస్.పి సోమసుందరం, సీతాపతిని మ్రింగేసేలాగు చూస్తూ.

"యస్ సార్!" అన్నాడు ఎటెన్‌షన్‌లో నిలబడ్డ సీతాపతి.

సీతాపతి పై ప్రాణాలు పైనేపోయాయి.

సాధారణంగా పెద్ద ఆఫీసర్లకు యేదైనా కావల్సివస్తే చిన్న కాగితంమీద తమకేం కావాలో రాసి పంపిస్తారు. అంతేగాని, తమను అర్జంటుగా ఆఫీసులో కల్సుకోమంటూ కబురు పంపరు.

సోమసుందరం తనను పిలిపించాడంటే, తన అదృష్టం పుచ్చిందన్నమాట: నగ్జలైట్లున్న శ్రీకాకుళంలోని ఏ కొండ ప్రాంతానికో తనకు బదిలీ తప్పదు!

రేసు గుర్రం డెక్కల చప్పుడు చేస్తోంది ఇన్‌స్పెక్టర్ సీతాపతి గుండె.

"విశాఖపట్నంవచ్చి ఎన్నాళ్లయింది?" అడిగాడు డి. వై. యస్. పి. కుర్చీలో వెనక్కి జారగిలబడుతూ.

"మూడేళ్లు కావస్తోందండి" పూడుకుపోయిన సీతాపతి గొంతులోంచి యెలాగో మాటలు పెగిలాయి.

"అందుకే నేమిటి డ్యూటీ అంటే నిర్లక్ష్యం? లా అండ్ ఆర్డర్ అంటే వేళాకోళం?" కటువుగా మ్రోగింది సోమసుందరం గొంతుక.

సీతాపతి మాట్లాడలేదు.

"యేం? మాట్లాడవేం?" గయ్యిమన్నాడు సోమసుందరం.

సీతాపతి గుండె ఒక్కనిమిషం ఆగిపోయి వెంటనే అతి

తొందరగా కొట్టుకో నారంభించింది.

"అబ్బే లేదుసార్! జాగ్రత్తగానే ఉంటున్నాను సార్!" అతివినయంగా, అతి కణకువగా జవాబిచ్చాడు సీతాపతి.

"ఏదీ జాగ్రత్త? విశ్వనాథం కేసులో వాళ్ళబ్బాయి ఇచ్చిన లంచంమేసి కేసూలేదు,గీసూలేదు అని విశ్వనాథాన్ని దబాయించేసావు. అవునా?" అన్నాడు సోమసుందరం.

"క్షమించండి సార్! మీరు వింటానంటే అంతా మనవి చేసుకొంటాను" అన్నాడు సీతాపతి, ధైర్యం పుంజుకునే ప్రయత్నం చేస్తూ.

"అలాగే. వింటాను. చెప్పు అదేమిటో?" అన్నాడు సోమసుందరం.

తను విశ్వనాథం కేసు ఎలా దర్యాప్తు చేసిందీ వివరంగా చెప్పాడు సీతాపతి..

"నోనో. అదో డీప్ ప్లాట్. నాకు విశ్వనాథం అంతా చెప్పాడు. వాడిద్వారా అంతా విన్నాకే నిన్ను పిలిపించాను" సీతాపతి చెప్పిందంతా ఒక్కమాటలో కొట్టిపారేసాడు సోమసుందరం.

విశ్వనాథాన్ని 'వాడు', 'వీడు' అంటున్నాడు డి. వై. యస్. పి. అంటే యిద్దరూ బాగా స్నేహితులన్నమాట! మనస్సులో నోట్ చేసుకున్నాడు సీతాపతి.

అయిదు నిముషాలు పోనిచ్చాక "సార్! నాదో చిన్న మనవి సార్!" అన్నాడు సీతాపతి.

"ఏమిటది?" నొసలు చిట్లించి అన్నాడు సోమసుందరం.

"ఏం లేదుసార్! మీరోసారి యూనివర్శిటీకివచ్చి ప్రొఫెసర్ రంగారావుగారి వద్దనున్న టేప్స్ వినండి సార్!" చెప్పాడు సీతాపతి.

"వినడం యెందుకు అనవసరంగా? విశ్వనాథం చెప్పాడు. వాడ్ని నేను నమ్ముతున్నాను."

పచ్చి వెలగకాయ గొంతులో పడినట్టయింది సీతాపతికి. వెంటనే ఏమీ మాటాడలేదు.

"మీరు స్వయంగా ఆ టేప్స్ ఓసారి వినండి సార్! తరువాత నేను తప్పుచేశానని అనిపిస్తే, మీరేం శిక్ష విధించినా భరిస్తాను." అన్నాడు అర్థిస్తున్నట్టుగా సీతాపతి.

మొదటిసారి లాగానే సీతాపతిని కసరి పారేయబోయాడు సోమసుందరం. కాని, ఆలోచించాడు ఒక్క క్షణం.

"సరే! పద. యిప్పుడే వెళ్దాం" అన్నాడు సోమసుందరం, కుర్చీలోంచి తక్కున లేచి నించుని.

క్షణం ఆలస్యం చెయ్యకుండా, సోమసుందరాన్ని ప్రొఫెసర్ రంగారావువద్దకు తీసుకువెళ్ళాడు సీతాపతి. పరిచయం చేసాడు. ఆ మీదట "మా దొరగారికి ఆ టేప్స్ విన్పించండి సార్" అని రంగారావుని కోరాడు.

ప్రొఫెసర్ రంగారావు ప్యూను ద్వారా టేప్స్, టేప్ రికార్డరు తెప్పించాడు. 'ఇహ చాలు' అనేంతవరకు సోమసుందరానికి, అతను ఎన్నికచేసి యిచ్చిన టేపల్లా విన్పించాడు.

ఆ టేప్స్ దొంగటేప్స్ కావని, పరిశోధనకోసమే తయారయినవని సోమసుందరానికి గట్టినమ్మకం కలిగింది. విశ్వనాథం కేసుకు సంబంధించిన అతని సందేహాలన్నీ నివృత్తి అయిపోయాయి.

ప్రొఫెసరు రంగారావుకు థేంక్స్‌చెప్పి వెనుకకు మరలారు, సోమసుందరం, సీతాపతి.

8

"ఒరేయ్! విశ్వనాథం! నా మాట విను. మీ వాడు

నిన్నేదో చంపజూస్తున్నాడన్న భయం వదులుకో.'' అంటూ సౌమ్యంగా రమేశ్ మంచితనం గురించి నచ్చచెప్తున్నాడు సోమసుందరం.

కాని ఫలితం సున్న. అప్పటికే అరగంటనుంచీ విశ్వనాథంతో వాదించి విఫలుడయ్యాడు.

"లేదురా సోమసుందరం. నువ్వెన్ని చెప్పినా వినను. మీరుచేసిన పరిశోధనలో ఎక్కడో దోషముంది. నా మనస్సు చెప్తోంది నాకు గట్టిగా. రమేశ్ నన్ను హత్యచెయ్య జూస్తున్నాడు. మీ రెవరూ ఛేదించలేని పథకంవేసి ఉంచాడు రమేశ్'' అన్నాడు విశ్వనాథం సీరియస్‌గా, మొండిగా.

విశ్వనాథం మొండి వాదన చూసి సోమసుందరం కూడా మొండికెత్తి పోయాడు. వాదన నిలిపివేయక, యింకా పొడిగించాడు.

"మా పరిశోధనలో తప్పు ఉందంటున్నావు. ఉండొచ్చు. కాదనను. ఎక్కడుందో ఏమిటో చెప్పు. ఇంకా ఇంకా దర్యాప్తు జరిపిస్తాను'' అన్నాడు సోమసుందరం.

"ఆ టేప్స్ ఉన్నాయి చూసావూ. అవి రమేశ్, ప్రొఫెసరు రంగారావు కలపి కూడబలుక్కుని మీ డిపార్టుమెంటునీ, నన్ను తప్పుత్రోవ పట్టించాలని తయారుచేసినవి. ఆ విషయం అరాతీసావా?'' అడిగాడు విశ్వనాథం.

"చూడరా విశ్వనాథం. అలాంటి మోసం ఏదైనాఉంటే ఒక టేప్ తయారుచేస్తారు. రెండు తయారుచేస్తారు. కాని వందలటేప్స్ తయారు చెయ్యరు.''

"చూసావా. చూసావా. మనం అలా అనుకోవాలనే అన్నిటేప్స్ తయారుచేసారు వాళ్లు'' అన్నాడు విశ్వనాథం మెరుస్తున్న కళ్ళతో.

తనకో బలమైన పాయింట్ దొరికిందన్న సంతోషం

ఉందా కళ్ళల్లో.

"నో. నో. నో నేనలా అనుకోను....నీలాగే నేను మొదట అనుమానపడ్డాను. కానీ, తరువాత ఆ టేప్స్ విన్నాను స్వయంగా. అవి నిజంగా రమేశ్ పరిశోధనకు సంబంధించినవే" అని ఓ నిముషం ఆగి "ప్లీజ్ నాతో వచ్చి ఆ టేప్స్ నీవూ వినగూడదూ. నీ అనుమానాలు నివృత్తయిపోతాయి" అన్నాడు సోమసుందరం.

విశ్వనాధం ఆ మాటలకు తల అడ్డంగా వూపుతూ "ఒరేయ్! నేను వాటిని వినాల్సిన అవసరం లేదురా! అవి రమేశ్, రంగారావు కలసి లోకాన్ని మోసపుచ్చడానికి తయారుచేసినవి" నిశ్చయం నిండిన కంఠంతో అన్నాడు విశ్వనాధం.

సోమసుందరం సహనం కోల్పోయాడు.

"ప్లీజ్, నీ వనుకుంటున్నట్టే అవి నన్ను, నిన్ను అందర్నీ మోసం చెయ్యడానికే తయారయ్యా యనుకుందాం. ఓ సారి నువ్వొచ్చి వింటే వచ్చిన నష్టం యేమిటి?" గొంతుకలో చిరాకు కన్పరుస్తూ అన్నాడు సోమసుందరం.

"ఉహూ!....విననుః అనవసరశ్రమ అందరికీ. నా మనస్సుకు తెలుసు ఏది నిజమో, ఏది అబద్ధమో! యూనివర్సిటీకిపోయి ఆ టేప్స్ విన నవసరంలేదు." అన్నాడు విశ్వనాధం, యెప్పటి ధోరణిలో.

సోమసుందరం ఊరుకోలేదు. విసుగుచెందలేదు. విశ్వనాధంమీద ఒత్తిడిపెంచాడు.

"అలాకాదు. నా మీద గౌరవముంచిరా! టేప్స్‌విను."

"వద్దు, వద్దు. వద్దు" గట్టిగా అరిచాడు విశ్వనాధం.

అతడి మొహం యెర్రబారింది. అతని కళ్ళల్లో వెర్రి ఆవేశం చిందులువేస్తోంది.

"మీరందరూ ఒకటే. అందరూ కట్టగట్టుకు రమేశ్ ప్రక్కకుచేరారు....మీ కందరికీ రమేశ్ ఏం మంత్రం వేసాడో, ఏం ఆశపెట్టాడో తెలీదుగాని వాడి కట్టుకథల్ని నమ్ముతున్నారు....కాని, నేను నమ్మను. మీరంతా యేకమై ముక్తకంఠంతో నా చెవిలో బాకాలూదినా నేను నమ్మను. నా మనస్సాక్షికి తెలుసు, రమేశ్ నన్ను హత్యచెయ్య చూస్తూన్నాడని. మీ డిపార్టుమెంటుకు రిపోర్టుచేస్తే నా కేదో రక్షణ కల్పిస్తారనుకున్నాను. కాని, మీరంతా వాడిప్రక్కనే పలుకుతున్నారు. ఆఖరకు నా స్నేహితుడివి నువ్వుకూడా వాడ్నే వెనకేసుకొస్తున్నావు. మీరు నన్ను రక్షించలేరు.... కాని, నన్ను నేను రక్షించుకోగలను. ఇక నీ స్నేహానికో నమస్కారం. నీసాయం నాకేమీ అక్కర్లేదు! వెళ్లొస్తా!" అంటూ ఆవేశంతో వెళ్లిపోయాడు విశ్వనాథం.

సోమసుందరానికి నోట మాటరాలేదు.

9

"మామయ్యగారూ! మామయ్యగారూ!" ఎవరో ఆత్రతగా పిలిచిన పిలుపు వినబడింది.

అది రమేశ్ పిలుపు!

"రావోయ్!రా! ఏమిటిలా వచ్చావు?" నవ్వుతూ రమేశ్‌ను పలకరించాడు డి.వై.యస్.పి. సోమసుందరం.

"ఇవాళ మానాన్నగారి చేతిలో చచ్చిపోయేవాడ్నండి" చెప్పాడు రమేశ్ భయంగా, కంగారుగా, దిగులుగా.

"ఏమయిందోయ్? ఏమిటి? చెప్పు" అన్నాడు సోమసుందరం కుతూహలంగా, రమేష్‌ను ఓ కుర్చీలో కూచోబెట్టి.

"నేను మామ్మూలుగా మేడమీద గదిలో చదువుకొంటున్నానండి. మా నాన్నగారు లోనికి ఎప్పుడు వచ్చారో నేను

గమనించలేదు. నేను నా చదువులో మునిగిఉన్నాను. కాని, హఠాత్తుగా నాకెందుకో అనిపించింది, నావెనుక యెవరో నిలుచుని ఉన్నారని. చప్పున వెనుదిరిగి చూసాను. ఇంకే ముంది? నా గుండాగిపోయింది. మా నాన్నగారు. ఎత్తిన అతని చేతిలో మెరుస్తూఉంది ఓ కైజారు. అతను పొడవ డమే తరువాయి. కుర్చీలోంచి బయటకు ఒక్కదూకు దూకాను. లేకపోతే, అతని కత్తికి బలై పోయేవాడ్నే. అక్కడ్నుంచి పిచ్చిగా పరుగెత్తాను భయంకొద్దీ. ఎక్కడి కెక్కడికో పరుగెత్తాను, కాసేపటికి మీరు గుర్తొచ్చారు. వెంటనే ఇలా పరుగెత్తుకొచ్చాను" చెప్పాడు విపులంగా రమేష్.

అంతా విన్నాక సోమసుందరం మొహంలో ఆశ్చర్యం కన్పరుస్తూ "బావుందోయ్ మీ తండ్రీ కొడుకుల తంతు! ఇన్నాళ్ళూ నువ్వు అతన్ని చంప జూస్తున్నావని పోలీసు రిపోర్టిచ్చి మీనాన్న నానాఅల్లరి చేసాడు. ఇప్పుడు మానాన్న చంపబోయాడందోయ్ అంటూ నువ్వు తయారయ్యావు" అని అన్నాడు.

రమేష్ చప్పున ముందుకువంగి సోమసుందరం చేతులు పట్టుకొన్నాడు.

"మామయ్యగారూ! ఈ విపత్కర సమయంలో మీరు గాక నాకు దిక్కెవరు?" దీనంగా అన్నాడు రమేష్.

సోమసుందరం మనస్సు కరిగిపోయింది.

ఎప్పుడు ఇంటికి వచ్చినా, తనను స్వంత సోదరుడిలా ఆహ్వానించి ఆదరించే రమేష్ తల్లి ఆ క్షణంలో అతడికి జ్ఞప్తికి వచ్చింది. రమేష్‌మీద అనురాగంతో అతని హృదయం నిండిపోయింది.

"అయామ్ సారీ!" అంటూ తన విచారం వ్యక్తపరచి

"రమేష్! చెప్పు నావల్ల యేం సాయం కావాలో చెప్పు" అన్నాడు సోమసుందరం.

"మా నాన్నకేదో పిచ్చిపట్టినట్టుంది సార్! ఎందుకో, ఏమిటో నాకర్థం కావడంలేదు. అతన్ని ఎవరైనా సైకియాట్రిస్టుకు చూపించి బాగుచేయిద్దాం" చెప్పాడు రమేష్.

"అందువల్ల ప్రయోజనం ఉంటుందంటావా?"

"ఉంటుంది సార్! మా నాన్నగార్ని పట్టుకొన్న అనుమాన పిశాచం వెనుక ఏదో కాంప్లెక్స్ ఉంది. అదేమిటో తెలుసుకొని బాగుచెయ్యగలిగేది, ఒక సైకియాట్రిస్ట్ మాత్రమే అని నా అభిప్రాయం"

"అలాగే. చూపించు."

"నేనా?....నన్ను చూస్తేనే అతని అరికాలిమంట నెత్తికెక్కుతుంది. ఇహ, సైకియాట్రిస్ట్ వగైరా మాటలు అతనితో చెబితే, అతన్ని చంపడానికి కొత్తపన్నాగమేదో పన్నుతున్నానని అనుకొంటారు."

"సరేలేవోయ్! ఆ బాధ్యత నా కొదిలేవోయ్ ...అంత వరకూ మీ నాన్నగారిదగ్గర ఉండడం చాలాప్రమాదం. ఏం చేద్దామనుకొంటున్నావ్?"

"అదీ ఆలోచించానండీ. హాస్టల్లో ఉండాలనుకొంటున్నాను" చెప్పాడు రమేష్.

10

ఉదయం పదీ పదకొండు అవుతుండగా పదిమంది పోలీసుల్నీ, ఇద్దరు సబిన్స్పెక్టర్లనీ వెంటబెట్టుకొని వెళ్ళి విశ్వనాథం ఇంటి తలుపు తట్టాడు డి.వై.ఎస్.పి. సోమసుందరం.

విశ్వనాథం ఇంటివద్దనే ఉన్నాడు. తలుపుతీసాడు.

పోలీసు బృందంతో ఎదురుగా నిలుచున్న సోమసుంద

అపరాధ పరిశోధన పోటీ—72 [ఫలితాలు]

జులై '74 నెల "అపరాధ పరిశోధన పోటీ—72" కి సరియైన సమాధానాలు:

1. ప్రతిపక్షాలు.
2. కాల్పులు.
3. ప్రతిభ పెరిగింది.
4. కీర్తి గడిస్తావు.
5. అన్యాయం చేయటానికి.

పై జవాబుల ప్రకారం నలుగురుమాత్రం ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి అక్టోబరు '74 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక గాని, "సప్లిమెంట్" గాని ఉచితంగా పంపబడు తుంది. "సప్లిమెంట్" పొందగోరిన విజేతలు ఆ విషయం యీ నెల 15 వ తేదీలోగా మాకు తెలియ జేయగోర్తాము.

(1) మిస్. ఆర్. సంపత్ కుమారి, తండ్రి పేరు_ ఆర్. సి. సింగ్, పోస్టుమాస్టర్, శ్రీనివాసనగర్, హిందూపురం (అనంతపురం జిల్లా.)

(2) శ్రీ జి. ఆనంద ప్రసాద్, క్లర్క్, 2/271_3వ రోడ్, అనంతపురం.

(3) శ్రీ బి. పరమేశ్వర్, ఇండియన్ ఆయిల్ డీలర్, నాగర్ కర్నూలు (మహబూబ్ నగర్ జిల్లా.)

(4) శ్రీ కె. వి. ప్రసన్నం, క్వార్టరు నెంబరు_ జి. 143, సెక్టర్_7, సునాబేడా_2 (ఒరిస్సాస్టేట్.)

రాన్ని చూడగానే, నిర్ఘాంతపోయాడు విశ్వనాథం.

"ఏమిటిది? ఇలా వచ్చారేమిటి?" కంగారుగా అడిగాడు విశ్వనాథం.

"మిస్టర్ విశ్వనాథం. నిన్న మీ అబ్బాయిని చంపాలని కత్తిదూసావు. అవునా!" అన్నాడు సోమసుందరం గద్దింపు స్వరంతో.

విశ్వనాథం అవుననలేదు. కాదనలేదు. పోలీసుల మొహాల్లోకి వెఱ్ఱిచూపులు చూస్తూ నిలుచున్నాడు.

"కమాన్! మిస్టర్ విశ్వనాథం. మర్యాదగా మావెంటరా. లేదా నీకు బేడీలువేసి వీధిలోంచి యీడ్చు కెళ్ళాల్సివస్తుంది." అన్నాడు సోమసుందరం.

ఆ మాటలు విశ్వనాథంమీద పని చేసాయి.

విశ్వనాథాన్ని పోలీసులు తీసుకుపోతుంటే నోటమాట రాక కళ్ళల్లో నీళ్లు కుక్కుకుని చూస్తూ నిలుచుండిపోయింది పూర్ణమ్మ.

'ఈ యింటికేదో శని పట్టుకుంది' అనుకుంది మనసులో, వీధి తలుపులు వేస్తూ.

సోమసుందరం విశ్వనాథాన్ని తిన్నగా పోలీసుస్టేషనుకు కాకుండా సైకియాట్రిస్ట్ రామారావు క్లినిక్‌కు తీసుకువెళ్లాడు.

మర్యాదగా, స్నేహంగా ఎలాంటి సలహాయిచ్చినా విశ్వనాథం నిరాకరిస్తాడని పాత అనుభవం ఉంది సోమసుందరానికి.

అందుకే, తన పోలీసు బలగంతో విశ్వనాథం యింటిమీదబడి, అతన్ని అరెస్టుచేసి స్టేషనుకు తీసుకుపోతున్నట్టు నాటకమాడి, సైకియాట్రిస్ట్‌వద్దకు లాక్కెళ్ళాడు.

తీరా క్లినిక్‌కు వచ్చాక రామారావు చేయదల్చుకున్న సైకోయెనాలిసిస్ కాదనే దమ్ము లేకపోయింది విశ్వనాథానికి.

వారంరోజులపాటు విశ్వనాథంమీద సైకోయెనాలిసిస్ సాగింది.

తను జరిపిన యెనాలిసిస్ ఫలితాలు తెలియజేస్తానంటూ ఏడోరోజున సోమసుందరానికి కబురు పంపాడు రామారావు.

సాయంకాలం అయిదు అవుతుండగా రామారావు క్లినిక్ కు వచ్చాడు డి.వై.ఎస్.పి. సోమసుందరం.

బిస్కెట్ తిని టీ త్రాగుతూ "చెప్పండి డాక్టర్! మీ సైకోయెనాలిసిస్ ఫలితాలు యేమిటి?" అడిగాడు సోమ సుందరం.

"విశ్వనాథానిది చాలా తమాషా అయిన కేసు. ఒహవేళ చరిత్రలో ఓ మనిషితాలూకు గిల్టీనెస్ అతన్ని పట్టించేకేసు ఏదన్నా ఉంటే అది విశ్వనాథంగారిది" చెప్పసాగాడు రామారావు.

ఒళ్ళంతా చెవులు చేసుకొని సోమసుందరం వినసాగాడు.

"సరిగ్గా ఇరవై యేళ్ళ క్రితం అంటే విశ్వనాథానికి అతని అబ్బాయి రమేష్ వయస్సు ఉన్నప్పుడు, ఆయన ఓ నేరం చేసారు."

"నేరమా? విశ్వనాథం మంచివాడేనే" ఆశ్చర్యంగా అన్నాడు సోమసుందరం.

"లేదు. మీరనుకొన్నంత మంచివాడుకాదు విశ్వనాథం. ఇప్పుడు రమేష్కు ఏ వ్యసనాలున్నాయని ఆయన అంటు న్నాడో, అవన్నీ ఆయనకు ఉండేవి."

"అంటే?"

"అంటే, వ్యభిచారగృహాలకు పోవడం, అలగాజనంతో స్నేహాలుచేసితిరగడం-అంతేగాదు-త్రాగుడుకూడా వుండేది."

"అరే! నాకీ సంగతులు తెలీవే?"

"విశ్వనాథంతో మీకుస్నేహంఏర్పడి ఎన్నాళ్ళవుతుంది?"

"చాలా యేళ్ళవుతుంది."

"అదికాదు. అప్పటికి వాళ్ళ నాన్నగారు ఉన్నారా?"

"లేరు. చనిపోయి అయిదేళ్ళయి ఉంటుంది."

"విశ్వనాధం తండ్రిగారు చనిపోయి, ఆస్తి అతని చేతికి రాగానే, అతను పూర్తిగా మారిపోయాడు."

"అంటే?"

"మీరుచూపిన పెద్దమనిషి విశ్వనాధం తయారయ్యాడు."

"అలాగా....అసలు సంగతి చెప్పండి" ఆత్రంగా అన్నాడు సోమసుందరం.

"విశ్వనాధం తండ్రి వీరవెంకట సత్యన్నారాయణగారు మహా పిసనారి. అయితే, అతనికి ఎలాంటి కొడుకు కలిగాడంటే, అతనికి లోకంలోఉన్న సుఖాలన్నీ కావాలి. అందుకు డబ్బు లక్ష్యంలేకుండా ఖర్చుచేస్తాడు. ఆయనకు అందమైన అమ్మాయిలు కావాలి. ఖరీదైన విదేశీయ మత్తుపానీయాలు కావాలి. తన మాటకు ఎదురుచెప్పే వాళ్ళుగానీ, తనంటే అమర్యాదగా ప్రవర్తించే వాళ్ళుగానీ ఉంటే నాలుగు తన్నులు తన్ని వాళ్ళకు బుద్ధిచెప్పేందుకు రౌడీవెధవల స్నేహాలు కావాలి. అవన్నీ వీరవెంకట సత్యన్నారాయణగారికి పడవు" ఆగాడు రామారావు గాలిపీల్చుకోవడానికి.

"అయితే ఆ ఇంట్లో పెద్ద డ్రామా జరిగి ఉండాలే" అడిగాడు సోమసుందరం అణుచుకోలేని కుతూహలంతో.

"ఉండాలే యేమిటి జరిగింది. ఖర్చుకు కొడుకు డబ్బు అడుగుతున్నప్పుడల్లా పెద్దయెత్తున పోట్లాట జరిగేది ఇంట్లో. విశ్వనాథం తండ్రిగారు గొప్పపట్టుదలగల మనిషి. తను ఏదైనా అనుకొన్నాడంటే, లోకం అంతా ఏకమై ఎదురు నిలిచినా, చేసి తీరుతాడు. కొడుకు ఖర్చులకు డబ్బు ఇవ్వ గూడదని నిశ్చయించుకొన్నాడు. అంతే! ఇవ్వలేదు, కొడుకు

ఎంత గింజుకున్నా."

"అయితే ఎవరు నెగ్గారు చివరకు?"

"విశ్వనాథం."

"అదేం?" ఎలాగు?"

"వీరవెంకట సత్యన్నారాయణగార్కి అన్నంలో ఆర్సినిక్ కలిపి చంపేసాడు విశ్వనాథం."

"ఆఁ" ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టి బొమ్మలా ఉండి పోయాడు సోమసుందరం.

"తండ్రిని మార్చడం తన తరం కాలేదు విశ్వనాథానికి. కొన్నాళ్ళయ్యాక, తన వైఖరే మార్చుకున్నాడు. అణకువగా, నమ్రతగా తండ్రివద్ద మసలసాగాడు. 'కొడుకు మారక యేం చేస్తాడు?' అనుకున్నాడు వీరవెంకట సత్యనారాయణ. అయితే అది నిజమైన మార్పుకాదు. తండ్రిని హత మార్చడానికి అవకాశం కోసం తెచ్చుకొన్న మార్పు."

"అయితే, యిదన్నమాట విశ్వనాథం అనుమానం వెనుక గల రహస్యం?"

"అవును. ఏ మనిషయినా తన 'అనుభవం ద్వారానే లోకాన్ని అర్థం చేసుకుంటాడు. ఉదాహరణకు. ఓ మనిషికి అంతా దగాకోర్లే స్నేహితులుగా తగిలారనుకోండి. అలాంటి వాడి దృష్టికి స్నేహితులందరూ దగాకోర్లే. ఎవర్నీ నమ్మకూడదు అనుకుంటాడు. అంతేకాదు. అతనికి నిజంగా ఓ మంచిస్నేహితుడు ఉన్నా, అతడ్ని దగాకోరుగా అనుమానిస్తాడు. అతడి మంచితనాన్ని కుయెత్తుగా పరిగణిస్తాడు. విశ్వనాథం విషయంలోనూ అంతే జరిగింది. తాను తన తండ్రిని హత్యచేసాడు కాబట్టి, తన కొడుకు తనను హత్య చెయ్యడా సమయంవస్తే అనుకున్నాడు. ఆ అనుమానానికి తగ్గట్టుగానే, తండ్రీ కొడుకుల మధ్య డబ్బుకోసం దెబ్బ

లాటలు, రిసెర్చికోసం రమేష్ తిరుగుళ్లు జరిగాయి. దాంతో అతని అనుమానం అతని మనస్సుకు ఓ నిజమయి కూచుంది.''

''అందువల్లనేనా రమేష్ మంచితనం గురించి యెంత చెప్పినా విశ్వనాధం విన్పించుకోలేదు?''

''అవును. అందువల్లనే అతని అనుమానపు రంగుకళ్ళద్దాలకు యింకో రంగు అవుపించలేదు. రమేష్ అతని దృష్టిలో ప్రాణాలు తీయడానికి పొంచిఉన్న హంతకుడు. పోలీసు రిపోర్టు యిస్తే రమేష్‌ను మీరు అరెస్టుచేసి తనకు బాధ తొలగిస్తారనుకున్నాడు. కాని అతని అనుమానం తాలూకు నిజా నిజాలు తెలుసుకోవడానికి మీరు పూనుకుని, రమేష్ మంచివాడే అని మీరు అనటంతో, విశ్వనాధం నిరుత్సాహపడ్డాడు. అయితే అతని భయం తొలగిపోలేదు. రమేష్ తన ప్రాణాలు తీసేముందు తనే అతని ప్రాణాలు తీసేస్తే. ఆ ధోరణే రమేష్‌ను హత్య చెయ్యాలన్న ప్రయత్నానికి విశ్వనాధాన్ని పురిగొల్పింది ....ఇక్కడ నాకో సందేహం.''

''ఏమిటది?''

''ఎప్పుడో యిరవైయేళ్ళ క్రితం జరిగింది హత్య. పైగా దాని సంగతి సైకోయెనాలిసిస్‌లో బయటపడింది. మీరు విశ్వనాధాన్ని అరెస్టు చేస్తారా?''

''తప్పకుండా. మీ ఎనాలిసిస్ రిపోర్టు యివ్వండి ఏక్షను తీసుకుంటాం.''

సోమసుందరం, రామారావువద్ద శెలవుతీసుకున్నాడు.

విశ్వనాధం కేసు ఓ కొలిక్కివచ్చినందుకు సంతోషం ఒకప్రక్క, తన స్నేహితుడు విశ్వనాధం హంతకుడు అన్న బాధ అతన్ని చుట్టుముట్టాయి. ★

హమేషా హంగామా

"ప్రతీకారం"

రచన : జి. రఘురాం రెడ్డి

ఎర్రగా కాలుతూంది సిగరెట్ అతని పెదాలమధ్య, కొలిమి లోని నిప్పులకి మల్లే.

అనౌన్సర్ మళ్ళీ అనౌన్స్ చేసాడు, ఇంకా రెండు నిమిషాలలో ప్లేన్ బయలుదేరబోతున్నట్లుగా.

అతను ఓసారి తన రిస్టువాచీవంక చూసుకొన్నాడు. సిగరెట్‌ను చివరిసారిగా గుండెలనిండా పొగవచ్చేటట్లు రెండు దమ్ములులాగి, పూర్తిగా కాలిన సిగరెట్‌ను పారేసి తన బూటుకాలితో నలిపేశాడు, ప్లేన్‌వైపు బయలుదేరడానికి ఉద్యుక్తుడవుతూ.

గబగబా అడుగులు వేసాడు, ప్లేన్‌వంక. అతని వదనం ఓ నిర్ణీతమైన దృక్పథాన్ని వ్యక్తపరుస్తోంది. ఓవర్‌కోటు వేసుకొన్నాడు. దానిక్రిందుగా కనిపించే ప్యాంటు చివరనుబట్టి అతను నీలంసూటు వేసుకొని ఉండాలని తెలుస్తోంది.

అతని పేరు సుదర్శన్.

బాంబేనుంచి లండన్‌కి వేయబడ్డ హైవే-గేజ్ ఇంటర్‌నేషనల్ ఫ్లైట్‌లో లండన్ వరకు వెళ్తున్నాడతను. లాడర్ మీదుగా ఎక్కి, తన సీటు నెంబరు చూసుకొని కూర్చున్నాడు సుదర్శన్.

మరో నిమిషంలో ఎయిర్-ఇండియా వారి ప్లేన్ శాంతా క్రూజ్ విమానాశ్రయాన్ని వదిలి గగనవీథిలోకి దొచ్చుకు పోయింది, వేగం పుంజుకొంటూ.

సుదర్శన్ చుట్టూరా పరికించాడు. ఓ యువజంట-క్రొత్త పెళ్ళితాలూకుదేమో కిలకిలమంటోంది బాక్‌సీట్లో. ఓ అర డజను సాహిత్యప్రియులు పుస్తకాల్లోకి అదేపనిగా తీక్షణంగా చూస్తున్నారు. ఓ వినాయకుడు హాయిగా గురకపెట్టి నిద్ర పోతున్నాడు, సుదర్శన్ ముందుసీట్లో. ఇద్దరు, ముగ్గురు కబుర్లు చెప్పుకొంటున్నారు. మిగతావారు అటు, ఇటు చూస్తున్నారు ఏమీ తోచక.

తనక్కావల్సిన వ్యక్తి ముందుసీట్లో వున్నాడనుకొన్నాడు సుదర్శన్.

అంతవరకూ ప్రసన్నంగావున్న అతని మొఖం అప్రసన్నంగా, ఆవేశపూరితంగా మారిపోయింది. కళ్ళలో రేఖామాత్రంగా ప్రతీకార జ్వాలలు తారాడాయి. మనస్సు గతంలోకి జారిపోయింది అయాచితంగా.

* * *

'టక్! టక్!'

వెళ్ళి తలుపు తెరిచాడు సుదర్శన్, చదువుతున్న పుస్తకాన్ని ప్రక్కన పెట్టేసి. ఆగంతకుడు లోపలికివచ్చి అన్నాడు, బ్లాక్ సూటులో:

"మీ నాన్నగా రున్నారా?"

"వున్నారు. దేనికి?"

"ఇటు పిలవండి. వారితో పనుంది" చెప్పాడతను, గదిని జాగ్రత్తగా పరిశీలిస్తూ.

"అలాగే" అని లోపలికి వెళ్ళాడు సుదర్శన్. మరో నిమిషంలో ఓ మధ్యవయస్కునితో తిరిగి వచ్చాడు.

"ఎవరు మీరు?" అడిగాడు సుదర్శన్ తండ్రి, కుర్చీలో కూర్చుంటూ. అరనిమిషం ఆగి చెప్పాడు ఆగంతకుడు, కర్కశంగా.

"నీ పాలిటి మృత్యువుని" చేతిలో నల్లటి రివాల్వర్‌తో. అతని మాటలకీ, చేతిలోని దానినీ చూసి పులిని చూచిన దుప్పుల్లాగ బెదిరిపోయారు. మిగతా ఇద్దరు. వారిద్దరికి ఆ ఆగంతకుని ప్రవర్తన అనూహ్యంగా వుంది.

"అంటే?" అదురుతున్న గుండెలని అరచేతిలో చిక్కబట్టుకొని అడిగాడు సుదర్శన్ తండ్రి, ఎంతో ప్రయత్నం మీద గొంతుపెగల్చుకొని.

ఓసారి రివాల్వర్ విలాసంగా ఎగిరేసి పట్టుకొన్నాడు నల్లసూటు వ్యక్తి, విషపు చిరునవ్వు చిందిస్తూ.

"ఇంకా వివరంగా చెప్పాలా?" కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

సుదర్శన్‌కి పరిస్థితి అవగాహన కావడానికి నిమిషంకన్నా ఎక్కువ పట్టలేదు. అతని బుర్ర చకచకా పని చేస్తూంది, తప్పించుకొనేందుకు మార్గం ఆలోచించడానికి.

"ఈ రివాల్వర్‌లోని గుళ్ళకు నిన్ను ఆహుతి చేస్తాను" చెప్పాడు ఆగంతకుడు రివాల్వర్ గురిపెడ్తూ.

సుదర్శన్ తండ్రి పైప్రాణాలుపైనే ఎగిరిపోయాయి. ముఖాన్నంతటా చెమటలు ఆవరించాయి.

"దేనికి?" భయాందోళనలతో అతని స్వరం విచిత్రమైపోయింది.

"నీకు కారణం చెపాల్సినంత అవసరం కనపడటంలేదు నాకు" మరుక్షణం ఆగంతకుని చేతిలోని రివాల్వర్‌లో అమర్చబడిన సైలెన్సర్ తన కర్తవ్యాన్ని నిర్విఘ్నంగా నెరవేర్చింది.

"నేను ఇక్కడ్నుంచి పోయేవరకు పిచ్చి ప్రయత్నం ఏదైనా చేశావా, నీకువేరే చెప్పనవసరం లేదనుకొంటాను. మీ తండ్రికి కలిగిన దుస్థితి నీకూ ఏర్పడుతుంది" వెనక్కి నడుస్తూ అన్నాడు ఆగంతకుడు.

నిస్సహాయంగా చూస్తుండటం తప్ప. ఏమీ చేయలేక పోయాడు సుదర్శన్.

ఆ తరువాత పోలీసువారు శవాన్ని స్వాధీనపర్చుకోవడం, హంతకుని గురించి ఓ నెల్రోజులు ఆరా తీయడం, నేరస్థుడు పట్టుబడకపోవడం, కేసు మూసివేత చివరికి. షరా అంతా మామూలుగానే జరిగిపోయింది.

సుదర్శన్ ఎంత ఆలోచించినా. తన తండ్రి హత్యకు కారణం కన్పించలేదు.

* * *

హంతకుని రూపురేఖలు, ఆకారం సుదర్శన్‌కి స్మృతి పథంలోంచి చెరిగిపోలేదు. ఓమారు వాచీవంక చూసుకొని అచేతనంగా, ఆవేదనాభరితంగా వెనక్కి వాలిపోయాడు సుదర్శన్. సీటుపై.

అతనిలోని ప్రతీకారం, కక్ష అనే భయంకర దావాగ్ని పర్వతాలు ఏ క్షణంలోనైనా బ్రద్దలయి సంఘర్షణలు చెల రేపడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఆలోచిస్తూ నెమ్మదిగా నిద్రలోకి జారుకొన్నాడు. అలా ఎంతసేపు నిద్రపోయాడో అతనికే తెలియదు.

సుదర్శన్ ఉలిక్కిపడ్డాడు, నిద్రలోంచి తేరుకొని. ప్లేను ప్రయాణించడం లేదని, ఎక్కడో లాండయిందని అను కొన్నాడు, సగంవరకూ ఖాళీ అయిన సీట్ల వంక చూసి. చుట్టూరా పరికించాడు, తనక్కావల్సిన వ్యక్తికోసం. అతని దృష్టి ఓసీటువద్ద ఆగిపోయింది. తృప్తిగా నిట్టూర్చాడు.

"ఏ నగరం ఇది?" అడిగాడు సుదర్శన్ తన ప్రక్క-న్నున్న పాసింజర్‌ని.

"కైరో" చెప్పాడతను.

సుదర్శన్ క్రిందకి దిగి ఓ సిగరెట్ వెలిగించుకున్నాడు సిగరెట్ పాకెట్‌లోంచి. గట్టిగా దమ్ముపీల్చి పొగ గాలిలోకి వదిలాడు స్టయిలుగా.

చేయవలసిన కార్యక్రమాన్ని ఓసారి నెమరు వేసుకొని, ఎలాంటి తప్పు లేదని తృప్తిగా తల పంకించుకొన్నాడు. అందరితోపాటువెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు, తనక్కా-వలసిన వ్యక్తి దృష్టి పథంలో పడకుండా, ప్లేన్ కదిలే ముందు.

ప్లేన్ రన్‌వే మీద పరుగెత్తి నిశీథిలోకి దూసుకుపోయింది. సుదర్శన్ తన ప్లాన్‌ని మరోమారు తిరగేసుకొన్నాడు.

పావుగంట తరువాత తన సేఫ్టీబెల్ట్సని విప్పుకుంటుంటే అడిగింది హోస్టెస్, సుదర్శన్‌ని-

"ఎందుకు విప్పుకొంటున్నావు?" అని ఇంగ్లీషులో.

"ఊరికే" చెప్పాడు చిరునవ్వుతో, ఇంగ్లీషులోనే.

"ఊరికే, దేనికి?"

"మహా ఇబ్బందిగా, కట్టేసినట్లుగా వుంది."

"అలాచేస్తే ప్లేన్ అన్-బేలెన్స్‌డ్‌గా వున్నప్పుడు తూలిపడి గాయపరుచుకోవడం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం వుంది."

"ఫర్వాలేదు, అప్పుడు నేను నిలద్రొక్కు-కోగలను" అంటూ పైకిలేచాడు. హోస్టెస్ ఎలాంటి అభ్యంతరం వ్యక్తపరచక పోవడంతో తన పని మరింత తేలిగ్గా అవుతుందనుకున్నాడు. కాక్‌పిట్ వైపు నడిచాడు.

చల్లగా, కరుగ్గా మెడకు ఏదో తగిలేసరికి తన పనిలోంచి వెనక్కి తిరిగి చూసాడు పైలెట్. ఆగంతకుడ్ని చూసి నివ్వెరపోయాడు.

"చేతులెత్తు" చెప్పాడు సుదర్శన్, రివాల్వర్ మొనని మరింత గట్టిగా నొక్కుతూ మెడకి. చేతులెత్తాడు పైలెట్. కోపైలెట్‌నికూడా అలాగే చేశాడు సుదర్శన్. అతను కాక్‌పిట్‌లో బాగా లోపల వుండడంవల్ల, అతని చర్యలని పాసింజర్స్ గమనించే అవకాశం లేకపోయింది.

"ప్లేన్ ఇప్పుడు సహారా ఎడారిమీదుగా పయనిస్తుందనుకుంటాను" అడిగాడు సుదర్శన్, పైలెట్‌ని.

"అవును" చెప్పాడు పైలెట్, తనముందున్న మీటర్ డయల్స్‌వంక నిమిషంసేపు చూసి.

"క్రిందికి పోనియ్యి ప్లేన్‌ని."

"దేనికి?" విభ్రమంతో అడిగాడు.

"చెప్పినట్లుగా నడుచుకోపోతే నాకు కోపం వస్తుంది" చెప్పాడు కటువుగా.

"కాని ఎడారిలో లాండ్ అవడం చాలాకష్టం."

"ఎందుకు?"

"ఇసుకలో కూరుకుపోవడం వంటి ప్రమాద పరిస్థితులేర్పడతాయి."

"అయినా దించక తప్పదు" చెప్పాడు మొండిగా.

పావుగంట తర్వాత నిర్మానుష్యమైన, భయంకర ఇసుక దిబ్బలపై వాలింది ప్లేన్. పాసింజర్స్ ఎయిర్ హోస్టెస్ అంతా ఆశ్చర్యపోయారు.

సుదర్శన్ కాక్‌పిట్‌నుంచి బయటకు నడిచి దాని డోర్ క్లోజ్ చేశాడు, చేతిలో రివాల్వర్‌తో. ప్లేన్‌లోనివారు మరింత అదిరిపోయారు.

"ఆ డోర్ తెరువ్!" ఆజ్ఞాపించాడు హోస్టెస్‌ని సుదర్శన్ ప్లేన్ ద్వారాన్ని ఉద్దేశిస్తూ. హోస్టెస్ బదులు చెప్పకుండా. డోర్ తెరచింది. ప్రయాణికులందరు ఊపిరి బిగపట్టి చూస్తున్నారు ఏం జరుగుతుందోనని.

సుదర్శన్ ఓవ్యక్తి వద్దకు నడిచాడు. అతను సుదర్శన్ తండ్రిని చంపిన హంతకుడు.

"డోర్‌వద్దకు నడువ్!" చెప్పాడు సుదర్శన్.

"దేనికి?" బెదిరిపోయాడతను.

"అధిక ప్రసంగం చెయ్యకు. చెప్పినట్టు నడుచుకో" కటువుగా అన్నాడు.

ఆ వ్యక్తికి చెప్పింది అనుసరించక తప్పలేదు. డోర్ వద్దకు నడిచాడు. సుదర్శన్ అతని వెనకాలే వెళ్ళి అవ్యక్తిని క్రింద పడేటట్లు ఓ తన్ను తన్నాడు. అతడు కెవ్వున అరుచుకొంటూ పడిపోయాడు ఇసుకపై.

"హోస్టెస్, తలుపు మూయండి" చెప్పాడు సుదర్శన్.

"అతను....?" అడిగింది, ఆశ్చర్యపడిపోతూ.

"మీకూ అదే గతి కల్పించమంటారా?" తీక్షణంగా అన్నాడు. హోస్టెస్ మారుమాట్లాడకుండా వెళ్ళి డోర్ క్లోజ్ చేసింది. అవతలినుండి ఆగంతకుడు వేసిన కేకలు ఆ ఎడారిలో ఎవ్వరూ వినిపించుకోలేక పోయారు.

సుదర్శన్ కాక్‌పిట్‌లోకి నడిచి పైలెట్లనిద్దర్ని బంధ విముక్తుల్ని చేసి, వారి పనులు వారికి పురమాయించాడు. ప్లేన్ మళ్ళీ గాల్లోకి ఎగిరింది. సుదర్శన్ కాక్‌పిట్‌నుంచి బయటికి నడిచాడు, కేబిన్‌లోకి.

"అలా ఎందుకు చేశారు?" అడిగాడు ఓ ముసలతను జాలి ధ్వనించేలా.

"నాలో ప్రజ్వరిల్లుతున్న ప్రతీకార వాంఛను తీర్చుకోవ

డానికి'' చెప్పాడు సుదర్శన్.

"అంతేః"

"నా తండ్రిని ఆ దుర్మార్గుడు నిష్కారణంగా చంపే సాడు" చెప్పాడు గాద్గదికంగా. "ఎడారిలో కుళ్ళికుళ్ళి చస్తాడు. తిండి తిప్పలులేక. వాడికదే శిక్ష॥"

గంట తరువాత మళ్ళీ కాక్‌పిట్‌లోకి వెళ్ళి అడిగాడు సుదర్శన్, పైలెట్‌ని.

"మెడిటేరియన్ సముద్రం దాటుతున్నామనుకుంటాం మనం. ఇప్పుడుః"

"అవును" చెప్పాడు పైలెట్, క్షణం ఆలోచించి.

సుదర్శన్ పారాచూట్ బిగించుకొని, ఎజెక్ట్ నొక్కాడు. మరుక్షణంలో అతడు ప్లేన్‌నుంచి వేరయి, గాలిలో సాగి పోయాడు. ★

కారు కావాలి!

రచనః ఆర్. నర్సింహాచారి

"నా పేరు రమణి" చెప్పిందా యువతి.

"అలాగాః ఇంతకీ మీరు వచ్చిన పనిః"

"జనార్ధనరావుగారూ, మీ దగ్గఱ క్రొత్త అంబాసిడర్ కారు అమ్మకానికుందని, సంప్రదించమని పేపర్లో వేశారే. దాని విషయమై మాట్లాడదామని వచ్చాను."

నుదుటిపై పడుతున్న ముంగురుల్ని నాజూగ్గా సవరించు కుంటూ, తేనె లొలకబోస్తూ అందా యువతి.

"అలాగాః అయితే ముందు మీరు కారు చూడండి. అరే, రామయ్యా, షెడ్ తెరిచి కారు చూపించు" షెడ్ తాళం చేతులు రామయ్యకిస్తూ అన్నాడు జనార్ధనరావు.

ఈ ప్రేమలూ - జన్మలూ -
అంతా మిథ్యగాక ఏవిటీ తల్లీ!


ఈ ప్రపంచంలో మీరు
మీ డబ్బుతో ఏమైనా
కొనుక్కోగలరని మీ అభిప్రాయం
...... నిజమే!

రామయ్య ననుసరించి వెళ్ళిందా యువతి.

జనార్దనరావు ఆలోచించ సాగాడు. "అందమయిన యువతి. ఆ ఒయ్యారం, ఆ నవీనత, ఆ సొగసు అబ్బా! తన భార్య ఉంది సుబ్బలక్ష్మి. ఒట్టి పల్లెటూరి మొద్దు. ఒక్క కారేమిటి? పది కార్లను కొనగల చురుకుదన ముందామెలో."

ఇంతలోనే వాళ్ళొస్తున్నట్లు అలికిడయింది. ఆ యువతి హుందాగా వచ్చి మొదటి స్థానంలో కూర్చుంది.

"చూడండి, జనార్దనరావుగారూ, మీ కారు నాకు బాగా నచ్చింది. అయితే, మిగిలిందేమిటంటే కారు కండిషన్‌లో ఉన్నదీ లేనిదీ పరీక్షించడమే—మీరూ వస్తే పదినిమిషాల్లో తిరిగి రాగలము" అందా రమణి.

జనార్దనరావు కళ్లు మెరిసినవి. "అంతకంటేనా?" అంటూ పైకి లేచాడు.

రమణి డ్రైవింగ్ సీట్లో కూర్చుంది. జనార్దనరావు బాక్ సీట్లో కూర్చోబోగా వారించి, తన ప్రక్కనే కూర్చోమంది.

సాయంసమయము. అందమైన జంటల్తో, రంగురంగుల, రకరకాల వాహనాలతో రోడ్లు కిటకిటలాడుతున్నాయి. రమణి వయ్యారంగా డ్రైవ్ చేస్తోంది.

"అరె, రావుగారూ.... అలా నక్కి కూర్చున్నా రేమి టండీ. ఇలా దగ్గరికి రండి. మీతో మాట్లాడాలి" అందా వయ్యారి. జనార్దనరావు కొంచెం ప్రక్కకి జరిగాడు.

"అయ్యో రామ! నా చెవులు సరిగ్గా విన్పించవండీ. ఇలా దగ్గరికి రండి."

ఈసారి రావుగారు సాహసం చేశారు. రమణికి తను పూర్తిగా తాకేలా దగ్గరికి జరిగాడు.

"రావుగారూ .... మీ కారు మాంచి కండిషన్‌లో

ఉందండీ.''

''అవునవును.''

''మీకు, తాజ్‌మహల్ హోటల్ ప్రొప్రైటర్—పూర్ణ చంద్రరావుగారు తెలుసనుకుంటాను.''

''ఆఁ.....అయితే.''

''వారు మా వారేనండీ.''

''వాట్?''

''ఏం ఆశ్చర్యపోతున్నారు?''

''ఆఁ.... క్షమించండి. ఎవరో ననుకున్నాను.''

''ఫర్వాలేదులే. మావారి దగ్గరా ఉంది ఇంపాలా. అది ఎప్పుడూ వారి దగ్గరే ఉంటుంది. చూడండి, మాకూ— అవసరాలు ఉంటాయి కదా? ఎప్పుడైనా కారు కావాలంటే టాక్సీలో వెళ్ళమంటారు. టాక్సీలో వెడితే ఏం మర్యాదగా ఉంటుంది చెప్పండి?''

''అవునవును.''

''చూడండి. ఈ కారు నేను తప్పక కొంటాను. ఎంత కిస్తారో చెప్పండి.''

''రమణిగారూ, మీ రడగడం మే మివ్వకపోవటమా? మీ కొరకు పదహేనువేలకే ఇస్తాను.''

''రావుగారూ, మరొక్క మాట. మావారు గనక మిమ్మల్నడిగితే పదివేలకే ఇచ్చానని చెప్పాలి సుమా!''

''దానికేముందండి. అలాగే.''

''అబ్బా, మీ శరీరం ఎంత వెచ్చగా ఉందండీ.''

''అవునవును. కొంచెం ఉష్ణమయింది''—రావుగారి చేతులు ఏమేమో చేస్తున్నాయి.

''మీరు భలేవారండి. మాంచి రసిక ప్రియులు.''

''ఈ మాట ఇంతవరకు చాలామంది అన్నారండి.''

"ఓ మైగాడ్!" కొరాపింది రమణి. ఆ చుట్టుప్రక్కల కొంచెం రద్దీ తక్కువగా ఉంది.

"రావుగారూ, నే నిప్పుడు మా స్నేహితురాలి బర్త్‌డే పార్టీ కెళుతున్నాను. నే నిప్పుడే పదివేలకు చెక్కు రాపి స్తాను. సరేనా?"

"మీ ఇష్టమండి."

ఆ పింగారి తన పింగారమయిన పర్స్ తెరిచి, చెక్ బుక్ తీపి సుకుమారమయిన చేతుల్తో పదివేలకు చెక్ రాపి, రావు గారిపైన, వాడిఅయిన మన్మథబాణాల్ని విడుస్తూ, వయ్యారంగా అతడి చేతిలో పెట్టి, వెచ్చగా నొక్కింది.

"రేపొచ్చి మిగతా డబ్బులిస్తాను. అన్నీ రేపే. ఓ. కే."

"ఓ. కే."

కారు వెళ్లిపోయింది.

కాని, మర్నాడు బ్యాంక్‌కెళ్లి చూస్తే, రమణి పేర ఖాతా లేదని, అసలు రమణి పూర్ణచంద్రరావుగారి భార్య కాదని తెలుసుకొని అచేతనుడయ్యాడు.

'ఈ మధ్య దొంగలు ఇంత అభివృద్ధిలోకి వచ్చారా?' అని వాపోతూ కారు పోయిందని పోలీస్ రిపోర్ట్ ఇవ్వడానికని పోలీస్ స్టేషన్‌కి బయలుదేరాడు అమాయకుడయిన రావు. ★

విగ్రహ ప్రతిష్టాపన

రచన: కర్నాటి నాగభూషణం

"నాగూ! నువ్వా! ఇక్కడికెందుకొచ్చావ్?" అడిగాడు శేఖర్ గొంతులో కాస్త కాఠిన్యాన్నే తెచ్చిపెట్టుకుంటూ.

గుమ్మం దగ్గరున్న నాగమణి బాధగా నవ్వింది. ఆమె

కళ్లలో విషాదం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఆమెకు పాతికేళ్ళు. ఎర్రగా, పొడుగ్గా, అందంగా ఉంది. ఆమె లేత పెదవులు సన్నగా కంపిస్తున్నాయి. ఆమె ఎవరోకాదు. అతని భార్యే?

"నేను విన్నది నిజమేనా అని తెలుసుకోవడానికే యిటు వచ్చాను. దారి వదలండి.... మీరు చెక్కుతున్న శిల్పం ఎవరిదో తెలుసుకొనేంతవరకూ నా ఆరాటం తగ్గదు!'' అంది మెల మెల్లగా నాగమణి. అమె శరీరం కంపిస్తోంది.

శేఖర్ గుమ్మానికి అడ్డంగా నిలబడ్డాడు.

"ఏమైంది నీకు? ఎందుకలా నీరసించిపోతున్నావ్? పిచ్చి పట్టినదానిలా ఇక్కడి కెందుకు పరుగెత్తు కొచ్చినట్టు?'' అడిగాడు శేఖర్, తన భార్య కళ్ళలోకిచూస్తూ.

"అవును నాకు నిజంగా పిచ్చెక్కింది. నా భర్త స్వయం మర్యాద, అభిమానం, రోషం గల ఒక గొప్పశిల్పి అనీ, డబ్బుకోసం గడ్డితినే నీచమనస్తత్వం లేని సుగుణవంతుడనీ ఇన్నాళ్ళు గర్వంతో పొంగిపోయాను. అయితే అది కేవలం వట్టి భ్రమేనని, మీరు ఒక సామాన్యవ్యక్తేనని తెలిస్తే పిచ్చి పట్టకుండా మరేమవుతుంది?''

"నాగూ....నువ్వు....నువ్వు దేన్నిగురించి మాట్లాడు తున్నావ్?''

"ఏమి తెలియనివారిలా నాటకం ఆడకండి. నేను ఇక్కడికి వస్తున్నప్పుడే చూశాను, నవాబుచంద్ కారు ఇంటిగేటులోనుండి బయటకు రావడం. నవాబ్‌చంద్ కూడా కారులోనే వున్నాడు. నిజం చెప్పండి. మీరు ఆ నవాబ్‌కోసం శిల చెక్కుతున్నారుకదూ!'' అడిగింది నాగమణి దీనంగా.

"ఓ అందుకేనా నీకింత కోపం?....శిల తయారుచేయా లంటే మనిషిగూడ దగ్గరుండాలిగా.... మోడల్ సెట్టింగ్

కోసం గంటక్రితం వచ్చాడు నవాబ్‌చంద్'' వివరించాడు శేఖర్, మృదువుగా నవ్వి.

''ఎంత సాధారణంగా తీసుకున్నారండి.... పైగా నవ్వు కూడానా! ఆ నవాబ్‌చంద్ ఎంత పెద్ద దుర్మార్గుడో, ఎలాంటి నీచమైన మనిషో మీకు తెలియదా? విషాన్ని వెదజల్లి ఎన్ని కుటుంబాల్ని నాశనం చేశాడో, ఎంతమందిని తన పొట్టన పెట్టుకున్నాడో, అది వాడికే ఎరుక! అలాంటి మనిషికి ఒక శిల! అదీ మీరు తయారుచేయడం!'' అంది ఆవేదన, వ్యంగ్యం మిళితమైన స్వరంతో నాగమణి.

శేఖర్ కోపంతో తల పంకించాడు. గదిలో అటూ ఇటూ పచార్లుచేస్తూ భార్యవంక సూటిగా చూశాడు. ఇలా వాగ్వివాదంలోపడితే పనిచెడిపోతుంది. మళ్ళీ మూడ్ దొరకదు.

''తెలిసింది చాలుగాని,ఇకనువ్వెళ్ళు!''అన్నాడు కఠినంగా.

''నా మొహంచూసి మాట్లాడండి. ఆ కసాయివాడు నవాబ్ ఊర్లోవాళ్ళకి ఎంత ద్రోహంచేసాడో మీకు తెలియకపోవచ్చు. అయితే మన కుటుంబంలోనే అతను రగిల్చినచిచ్చు, కలిగించిన భూకంపం ఎలాంటిదో మీకు తెలియదా? మరిచిపోయారా అప్పుడే మీరు?''

''నాగమణి!'' అరిచాడు శేఖర్.

''అరుపులతో నా గొంతు నొక్కిపెట్టగలరేమో! అయితే మీకంటూ ఒక మనసాక్షి వుందిగా? దానికైనా తగిన సమాధానం చెప్పుకోండి.... ఇలా చూడండి, సంవత్సరంక్రితం జరిగిన ఘోరం గుర్తుకు తెచ్చుకోండి.... నాస్వంత చెల్లెలు గీత పరుగు పరుగునవచ్చి మనకాళ్ళమీదపడి ఎంతగా రోదించిందో జ్ఞాపకంలేదా? ఆ నవాబ్‌చంద్ కొడుకు దాన్ని ప్రేమించాననిచెప్పి, వలలోవేసుకొని, అనుభవించినన్నాళ్ళు అనుభవించి, చివరకు మెడపట్టి గెంటివేశాడే.... అదంతా మర్చి

పోయారా మీరు?" స్వరం రెట్టించింది నాగమణి.

"నాగూ... అదంతా...."

"మరి....ఆ పాపాత్ముడి శిలను తయారుచేయడానికి మీరెలా ఒప్పుకున్నారు?"

"దానికో బలమైన కారణముంది."

"కారణం ఏమిటో అది?" ఈసడించింది నాగమణి.

శేఖర్ ఏదో చెప్పాలని నోరుతెరిచాడు. కాసేపు తటపటాయించాడు.

"ఆల్ రైట్. నాగూ! అనవసరంగా మాటలెందుకూ? నవాబుచెంద్‌కు శిలను తయారుచేయిస్తానని మాటయిచ్చాను. పైగా రెండువేలరూపాయలు అడ్వాన్సుగా తీసుకున్నాను. మనఇంట్లో ఆమధ్య కొత్తగాకొన్న రేడియో, ఫర్నీచర్ అంతా ఎక్కడనుంచి వచ్చిందనుకున్నావ్...."

"ఓహో! అలాగా....అయితే ఒక్కనిమిషం ఆగండి!"

శేఖర్ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేసాడు.

"నాగూ..ఆగు! నీ నగలన్నీ తీయడమెందుకు?" ప్రశ్నించాడతను.

"మీకు డబ్బేగా ముఖ్యం....నా కీ మాంగల్యంచాలు... ఇవిగో. వీటిని తీసుకోండి. ఆ రెండువేలు చందుగాడి మొహం మీద కొట్టండి....వాడిడబ్బు మనకు ఒక్కపైసాకూడ వద్దు. చంపినా పాపంలేదని వూరంతా అనుకునే పెద్దమనిషికి మీరు శిల్పాన్ని చేసివ్వడమా? వద్దండీ, నామాట వినండి!" అంది ఆమె.

"అంతా సవ్యంగానే ముగుస్తుంది. నువ్వెళ్ళు" అన్నాడు శేఖర్ ఓపికగా, నగలు తీసుకోకుండా.

"నేను వెళ్ళను."

"వెళ్ళవూ?....నాగూ! ఇది నా స్వవిషయం. నా చేతిపని

తనం నలుగురికి తెలియచెప్పే అవకాశం దొరుకుతుంటే దాన్ని కాదని కాలదోయటం మూర్ఖుల లక్షణం. మంచో, చెడో ఇది నావృత్తికి, నా అభివృద్ధికి చెందిన విషయం. ఇందులో పరాయివాళ్ళు కాదుగదా. నువ్వు జోక్యం కలుగ జేసుకున్నా నేను సహించను. కాదు కూడదనుకుంటె నీ ఇష్టంవచ్చిన చోటికి వెళ్ళు....అభ్యంతరంలేదు!'' అన్నాడు కోపంగా.

''ఏమండీ....ఎంత మాటంటున్నారు?'' కళ్ళు తేలవేసింది నాగమణి.

''ఈ శిల విషయంలో నా కెదురు చెబితే నాదగ్గరనుండి వచ్చేసమాధానం ఇదొక్కటే...మాట్లాడకుండా ఇంటికెళ్ళు నేను తర్వాత వస్తానుగాని!'' అన్నాడు శేఖరు గదితలుపులు దఢాలున మూసివేస్తూ.

నాగమణి కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి.

* * *

''ఏమండి పేపరు చూశారా?'' అడిగింది నాగమణి, తన భర్తని.

''లేదు ఏం?'' ప్రశ్నించాడు శేఖర్.

''మీరు శిల తయారుచేశారే, ఆ నవాబ్‌చంద్ ....''

''నాగూ, మళ్ళీ ఆ రగడ ప్రారంభిస్తున్నావా?''

''లేదు, లేదు. ఈవార్త చదవండి ఆ నవాబుచంద్ రెండు రోజులనుండి కనిపించడంలేదట!''

''ఈజిట్?''

''అవును ట్రైన్‌లో మొన్న మద్రాసుకి బయలుదేరాడట. అయితే మద్రాసుమాత్రం చేరుకోలేదు! మధ్యస్టేషన్లో ఎక్కడయినా దిగిపోయాడా, దిగివుంటే ఏమైనట్టు పోలీసులకు అంతుచిక్కడంలేదట. పరిశోధన జరుగుతోంది.''

"అరె విచిత్రంగావుందే!"

"విచిత్రమో సాధారణమో....ఆ దేవుడే నన్ను కనుక రించి, నా అభిష్టాన్ని నెరవేర్చిపెట్టాడు" అంది నాగమణి సంతోషంతో కళ్ళు త్రిప్పుతూ.

"మధ్య సీగోల ఏమిటే?" అడిగాడు శేఖరు.

"శిల తయారు కావాలంటే మనిషి దగ్గరుండవద్దూ.... ఏదో సెట్టింగ్ అనీ, మోడలింగ్ అని మీరనలేదూ?" అడిగింది ఆమే.

"అనవసరం! పని ప్రారంభంలో రూపురేఖలు చక్కగా రావడానికి మనిషిని దగ్గరుంచుకుంటానుగాని, రోజు ఎందుకు? ఆ పనులన్నీ ఎప్పుడో అయిపోయాయి. విగ్రహంగూడ తయారయిపోయింది. ఫైనల్ స్టేజీ ప్రిపరేషన్స్‌లో వున్నాను ....టచప్ వర్కు, పాలిషింగ్ మాత్రమే బాకీ!'' అన్నాడు శేఖర్ నవ్వి.

"అలాగా'' అంది ఆమె నిరుత్సాహపడిపోతూ.

"నువ్వొట్టి అమాయకురాలవు నాగూ! పాతవిషయాలు గుర్తుతెచ్చుకొని. బాధపడడం ఎందుకు చెప్పు? ఎవరి ఖర్మకు వారిని వదిలిపెడితేసరి.''

"ఏమో, అలాగని సరిపెట్టుకోలేకపోతున్నాను. మాట మాటకి గీత గుర్తుకువచ్చి నా నరాలు పొంగిపోతున్నాయి'' అంది నాగమణి నెమ్మదిగా.

"ఫర్గెట్ ఇట్! పదవతేది నవాబ్‌చంద్ పుట్టినరోజు. బహూశా, ఆరోజే విగ్రహాన్ని ఫ్యాక్టరీ ఆవరణలో ప్రతిష్టా పిస్తారనుకుంటాను. ఒకవేళ అవసరమైన పనుల్లోపడి తాను హాజరు కాలేకపోయినా వేడుకమాత్రం జరుపవలసిందని మేనేజర్‌కి స్పెషల్ ఇన్‌స్ట్రక్షన్స్ యిచ్చి వెళ్ళాడట.... ఎల్లుండి డెలివరీ చేయడం మరువద్దని అతను మరీ మరీ

చెప్పివెళ్ళాడు.'' అన్నాడు శేఖర్.

నాగు ఆ మాటలు వినదల్చుకోలేదన్నట్టుగా అక్కడీనుండి కదిలి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

* * *

ఆరోజు పదవతేదీ. ఉదయం 9 గంటలు సమయం!

టి. ఎన్. పి. ఫ్యాక్టరీ ఆవరణ అంతా హడావిడిగా వుంది.

''....కార్మికులకీ అందరికి శుభాకాంక్షలు తెలుపుకుంటూ న్నాము. అందరూ దయచేసి నిశ్శబ్దాన్ని పాటించాలని కోరు కుంటున్నాం. ఈరోజు మన ఫ్యాక్టరీ ప్రొప్రైటర్ నవాబ్‌చంద్ గారి జన్మదినం. ఈ శుభదినాన్ని పురస్కరించుకొని, ఆయన దేశసేవకి, కార్మికులపట్ల చూపే అపూర్వ ఆదరాభిమానానికి, మనసారా కృతజ్ఞతలు తెలుపుకుంటూ, అట్టి మహనీయుని నిలువెత్తు శిలావిగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్టించాము. అమాత్య శేఖరులు శ్రీ శ్రీ శ్రీ....గారు దానికి ప్రారంభోత్సవం చేయడానికి అంగీకరించారు....''

ఆ ఆవరణ అంతట ఒకటే కల కలం. పోలీసులు, ఇన్‌స్పెక్టర్లూ కూడా జనసమూహాన్ని సర్దుబాటు చేయడంలో అలసిపోతున్నారు.

''మీరేనా శిల్పి? కంగ్రాచ్యులేషన్స్! విగ్రహం మహ జోరుగా వుంది!''

''థ్యాంక్సు ఇన్‌స్పెక్టర్ సార్! పెద్దగుంపే పోగయిందను కుంటాను.''

''అవునండి! ఇదిగో మా అవస్త చూస్తున్నారుగా.... అరే, ఏమిటదీ? ఆ కానిస్టేబుల్ ఎందుకలా పరిగెత్తుకొస్తున్నాడు ఏయ్. టూ నాట్ త్రీ!'' అని పిలిచాడు. ఇన్‌స్పెక్టర్ రఘురామ్.

''సార్, సార్ ఎవరో ఒక ఆవిడచేతిలో పెద్ద ఇనుపసుత్తి

ఒకటి పట్టుకొని, శిలా విగ్రహం దగ్గరకు పరుగెత్తుతోంది పిచ్చిపట్టినదానిలా....అదిగో అవిడే...." పోలీసు వగరుస్తూ చూపించాడు.

"అరె...నాగూ! నాగూ!" అరిచాడు శేఖరు అటువైపు పరుగెత్తుతూ. అతని దృష్టి భార్య నాగమణిమీద పడింది.

"కానిస్టేబుల్ క్విక్! ఆవిడను ఎలాగైనా ఆపు చేయి! పరుగెత్తు." అన్నాడు రఘురామ్, తనుకూడ ముందుకు పరుగెత్తుతూ.

నాగమణి కళ్ళు ఎర్రబారి వున్నాయ్! ఆమె కళ్ళవెనుక తెరలలో చెల్లెలు గీత ఏడుస్తున్న దృశ్యం. కళ్ళముందు నిల బడివున్న నవాబ్‌చంద్ విగ్రహం!

ఆమె మహంకాళిలా రౌద్రరూపందాల్చి పెఢీల్, పెఢీల్ మని సుత్తితో బలంగా ఆ విగ్రహాన్ని తలమీద బాదుతోంది!

"నాగూ! ఎంతపనిచేస్తున్నావ్? కొంపముంచేశావుగదే!" శేఖర్ కేకలువేస్తూ ఆమెను పట్టుకున్నాడు. కాని అప్పటికే ఆ విగ్రహం ముక్కలైంది.

"ఆమెను పట్టుకోండి!" పోలీసుల అరుపులు.

"అరెరే... తల విరిగిపోయింది ఏమిటదీ .. మహాశ్చ రంముగావుందే....ఆ శిల.." మహాశ్చర్యంతో అంటున్నారు.

"ఘోరం. ఘోరం!... ఎక్కడ ఆ శిల్పి! అతన్నిగూడ పట్టుకోండి!పరుగెత్తండి.ఇద్దర్నీ వదిలిపెట్టకండి!"ఇన్‌స్పెక్టర్ రఘురామ్ జేబులోనుండి విజిల్‌తీసి గట్టిగా ఊదాడు.

* * *

"ఏమండీ! మిమ్మల్నిలా కటకటాలవెనుక హత్యానేరం మీద దోషిగా నిలబడివుంటే నేను చూస్తానని కలలోగూడ అనుకోలేదండి! మీనేరం బయటపడి, మీరిలా కావడానికి కారణం నేను. నేనెంత పాపాత్మురాలినండి!"

నాగమణి రోదిస్తూ జైలు తలుపులమీద తల బాదుకో సాగింది.

"ఏడవకు నాగూ ఏడవకు. నీచెల్లెలు, ఆ అమాయకురాలు గీత ఎప్పుడైతే ఆత్మహత్య చేసుకొని మనకు దూరమైందో, అప్పుడే ఆ నవాబ్‌చంద్‌గాడ్ని చంపివేయాలని శపథం పూనాను. చంపడం సులభమేగాని, ఆ హత్యానేరం బయటపడకుండా చూసుకోడమే కష్టం అనిగూడ నాకు తెలుసు. అందుకే రాత్రనక, పగలనక ఆలోచించి, ఆలోచించి చివరకు ఒక నిర్ణయానికొచ్చాను.

శిలావిగ్రహం చేయడానికి ఆ నవాబ్‌గాడ్ని ఒప్పించాను. ఆరోజు మద్రాసు బయలుదేరాడని తెలిపి కారులో బయలుదేరి కాజీపేట స్టేషన్లో అతన్ని కలుసుకున్నాను. విగ్రహం విషయమై ముఖ్యమైనపని ఒకటుందని చెప్పి అతన్ని హైద్రాబాదుకు మళ్ళీ తీసుకొచ్చాను. ఎవరికి తెలియకుండా అతన్ని గొంతునులిపి చంపేశాను. అయితే శవాన్ని ఏం చేయడం? ముందే ఆలోచించి పెట్టుకున్నట్టుగా ఆ శవానికే సిమ్మెంటు,ప్లాస్టరూ పూసి, విగ్రహంలాగా తయారుచేశాను వాసన తెలియకుండా వుండటానికి కొన్ని మందులు కలిపి మిశ్రమంలో పాలిష్‌చేశాను....దాన్నే ఫాక్టరీకి పంపించాను. నా పగ చల్లారింది నాకది చాలు నాగమణీ!" అన్నాడు శేఖర్, భార్య చెక్కిలిమీద కన్నీటిని తుడుస్తూ. ★

ఉద్యోగి: ఇంకా ఐదేళ్ళదాకా ఉద్యోగాలు లేవట?

నిరుద్యోగి: సంతోషం! ముందే చెప్పి శ్రమ తగ్గించారు!

—ఎమ్. మోహన్, సూర్యాపేట.

APM 10

బావ మరుదులు

ఏ.సీ. మోహన్రావ్

కాంపౌండింగ్ రూంలోకి పోతోతూ డాక్టరిగారి రూంకేసి చూసింది నర్స్ జయమాల. ఇంకా లైటు వెలుగుతూంది. వాచీ చూసుకుంది. పన్నెండు దాటింది. అర్ధరాత్రి కావస్తున్నా డాక్టర్‌గారు ఇంటి కెందుకు వెళ్ళలేదో అనుకుంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

మందులు కలుపుతూ వుంది. చేతులు యాంత్రికంగా పని చేస్తున్నాయి. మనసుమాత్రం డాక్టరును గురించే ఆలోచించ సాగింది.

వర్మ స్వంతంగా క్లినిక్ ప్రారంభించి రెండేళ్ళయింది. అంతకుముం దెక్కడ వున్నాడో ఎవ్వరికీ తెలీదు. ఉన్నట్టుండి రెండేళ్ళక్రితం విజయవాడలో ప్రత్యక్ష మయ్యాడు. అదీ క్లినిక్ పెట్టుకొని.

అనుభవం వున్న నర్స్ కావాలని పేపర్లలో ప్రకటించాడు. తను అప్లయి చేసింది. వచ్చి ఉద్యోగంలో చేరమని వెంటనే కబురు పంపారు కార్డురాసి. ఫలితంగా 'వర్మాస్ క్లినిక్'లో నర్సుగా చేరింది.

ఈ రెండేళ్ళలో తను గమనించిందల్లా డాక్టర్‌గారు ఎప్పుడూ ముభావంగా, అనాసక్తంగా, లౌకికవిషయాలపట్ల నిర్లిప్తంగా వుండడం. రోజూ ఏడింటికల్లా క్లినిక్‌కు వస్తాడు. రాత్రి పదింటిదాకా పనిచేస్తాడు. సంపాదించిన డబ్బంతా లెక్కపెట్టుకొని, జేబులో దోపుకుని వెళ్ళిపోతాడు.

పేరుకు క్లినిక్ మాత్రమే అయినా నాలుగైదు గదులు కూడా వున్నాయి. అందువల్ల జయమాల రాత్రంతా అక్కడే వుండిపోతూంటుంది. ఆమెకు వెనకాముందూ ఎవ్వరూలేరు. మకాం అక్కడే పెట్టేసింది.

డబ్బు సంపాదించడంలో వర్మ అఖండుడు. తన దగ్గర

కొచ్చే పేషంట్లకు, విధిగా ఒక మందులషాపు పేరు చెప్పి, అక్కడే మందులుకొని తీసుకురమ్మని బలవంత పెడతాడు. అందుకు ప్రతిఫలంగా ఆ షాపునుండి పదిశాతం కమీషను పుచ్చుకొంటాడు. అలాగే ఎక్సరేలు, పాథలాజికల్ టెస్టులు, లాంటి వాటిల్లోకూడా కమీషను సంపాదిస్తాడు.

ఇన్నిరకాలుగా సంపాదించినా, ఒకటోతేది రాగానే జయమాలకు జీతం ఇవ్వడు. డబ్బు లేదంటాడు. నెలపొడవునా నాలుగైదు దఫాలుగా ఇస్తాడు జీతం. అది తలచుకుంటే ఆమెకు అసహ్యం వేస్తుంది.

క్లినిక్‌కు అంకితమై పోయినట్లు ఇరవై నాలుగు గంటలు తను సేవజేస్తుంటే, అతను అది అర్థంచేసుకొని పదో పరకో ఎక్కువ ఇవ్వవలసింది మాని, జీతంకూడా సరిగ్గా ఇవ్వక పోవడం ఆమెకు కష్టం కలిగించింది.

ఉద్యోగం మానుకుని వేరే ఎక్కడైనా జేరదామనుకుంది. నాలుగైదు ఆఫర్లు కూడా వచ్చాయి. కానీ తనే పోలేదు. కారణం తన అందం. జయమాల ఆపిల్ పండులా ఉంటుంది. మంచి వయసులో వుండడంవల్ల ఆ అందానికి మరీ మెరుగు పెట్టినట్లుగా వుంటుంది. ఉద్యోగమిస్తామన్న డాక్టర్లకు నర్సు అవసరమయికాదనీ, తన్నెలాగైనా వల్లో వేసుకోవచ్చని ఊహిస్తున్నారనీ పసిగట్టింది. అలాంటి ప్రమాదం డాక్టర్ వర్మలో ఇంతదాకా లేదు. అందుకే అతనిదగ్గర ఇన్నాళ్ళు పనిచెయ్య గలిగింది.

ఔన్స్‌గ్లాసులో మందు పోసుకొని వెలుపలి కొచ్చింది. డాక్టర్ గదిలో లైటు వెలుగుతూనేవుంది. మూడో నెంబరు గదిలో వున్న పేషంటుకు మందిచ్చి టెంపరేచరు చూసి చార్టులో నోట్‌చేసి తిరిగొస్తూ చూసింది. ఇంకా లైటు

వెలుగుతూనే వుంది. జొన్స్ గ్లాసు రాక్ పైన పెట్టి వాష్ బేసిన్ లో చేతులు కడుక్కుంటూ ఎదురుగా బిగించిన అద్దంలో ముఖం చూసుకుంది.

అందమైన సన్నని ఎర్రని పెదాలు, పొడవుపాటిముక్కు, విశాలమైన నుదురు, చిన్నగడ్డం, గుండ్రటి, సన్నటి శంఖం లాంటి మెడ. విశాలమైన ఛాతీభాగం. దాన్ని కరచిపట్టుకున్న తెల్లటి జాకెట్ లోంచి లోయలా కనుపిస్తున్న రొమ్ముల మధ్యభాగం, చూచి మనస్సులో "రియలీ లౌలీ" అనుకుంది తన్ను తనే.

టవల్ తో చేతులు తుడుచుకుని డాక్టర్ గారి గదికేసి నడిచింది. స్వింగ్ డోర్ నెట్టి తొంగి చూపింది. కాళ్ళు రెండూ టేబుల్ పైనవేసి సిగరెట్ తాగుతూ కూర్చున్నాడు గిరగిర తిరుగుతున్న ఫాన్ వంక జూస్తూ.

"సార్!" పిలిచింది జయమాల.

సర్దుకుని సరిగ్గా కూచుని "నువ్వా! రా!" అన్నాడు.

జయమాల వెళ్ళి ఎదురుగావున్న కుర్చీలో కూర్చుంది.

"ఏమైనా ఎమర్జన్సీయా?" అడిగాడు వర్మ.

"లేదు సార్! మీ రింకా ఇంటికి పోలేదేం?" అడిగింది మాల.

"ఇల్లా?" అంటూ నిరుత్సాహంగా చూసి "అది ఇల్లు కాదు. నరకం. విధిలేక, పదిమందిలో తలవంపులు తెచ్చుకో లేక, ఆత్మాభిమానాన్ని చంపుకొని, ఆత్మగౌరవాన్ని గొంతు నొక్కి, రోజూ అయిష్టంగా అడుగులువేస్తాను ఆ కాంపౌండ్ లోకి" అన్నాడు వెక్కసంగా.

"ఏమి టలా నిరుత్సాహంగా వున్నారు."

"ఏంచేసేది మాలా! ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను.

పెళ్ళయ్యాక నాకు తా నివ్వగలదేమిటో, భార్యగా ఏమివ్వాలో మరచిపోయింది. కానీ భర్తగా నానుంచి అన్నీ డిమాండ్ చేస్తుంది. జలగలా నానుంచి డబ్బు గుంజుతుంది.''

''ఏం చేస్తుంది డబ్బుతో.''

''క్లబ్బులు, పార్టీలు, సంఘసేవ, పాషింగ్‌లు అన్నీ చేస్తుంది'' అన్నాడు వర్మ.

జయమాలకు వర్మంటే సానుభూతి కలిగింది. ఆయన నెలనెలా తనకు సరిగ్గా జీతం ఎందు కివ్వలేకపోయిందీ అర్థమయింది. అంత మంచి మనిషికి అటువంటి దుర్మార్గురాలు భార్య కావటం తలచుకొని బాధపడింది.

''పిల్లలు లేరా మీకు!'' అడిగింది మాల.

''అసలు సంసారం చేస్తే గదా! ఆమె అందం తరుగుతుందనీ, వొంటి మెరుగు పోతుందనీ ఆమెకు భయం. అందుకే నన్ను దగ్గరకు చేరనివ్వదు.''

తనకు పెళ్ళి కాకున్నా ఒకటే, ఆయనకు పెళ్ళయినా ఒకటేలాగుం దనుకుంది. అలాగే ఆలోచిస్తూ కూర్చుంది.

''నీలాంటి మనసున్న మనిషిని పెళ్ళాడి వుండవలసింది. సుఖపడేవాణ్ణి! '' అని ఆమె కళ్ళకేసి చూశాడు.

''డాక్టర్! నేను నర్సును'' అంది మాల.

''అయితే ఏం? ఆడదానివి కావా? పెళ్ళి చేసుకోవా?''

సమాధానం చెప్పలేదు జయమాల.

''జయా! నిన్ను చూసినప్పుడల్లా నాకు జీవితంపైన కోరిక కలుగుతూంది. నువ్వు కావాలి. భార్యగా నాతో బ్రతకాలి! నీ కిష్టమేనా?'' అడిగాడు వర్మ.

''మీ ఆవిడ వుందిగా?''

"ఆమె గొడవ వదిలెయ్యి. ఇం కెన్నో రోజులు నాతో వుండదు."

"ఏం? విడాకు లిస్తానందా?"

"విడిచిపెట్టి వెళ్ళిపోయేట్లుంది."

"అలాగని చెప్పిందా?"

"ఆమె స్నేహితులు చాలామంది చెప్పారు నాకు. ఆమెకు పాటలు పాడటం వచ్చు. వా డెవడో కుమార్ అని ఒకతను తరచుగా ఇంటికొ స్తున్నాడు. ఆమెను అమెరికాకు తీసుకుపోతానని చెప్పాడట. అక్కడ ఆమెకు స్వర్గం చూపిస్తా నన్నాడులాగుంది. అస్తమానం వాడి కబుర్లే. వాడితో తిరుగుతూంది" అన్నాడు వర్మ.

"వాడు ఆమెని........"

"అలా జరిగుంటుందని అనుకోను. దేనికైనా ఒప్పు కుంటుందిగానీ, దానికి ఒప్పుకోదు. ముందే చెప్పానుగా. తన అందం తరిగిపోతూందని భయపడుతూందని."

"విచిత్రమైన మనిషే!" అంది జయ టేబుల్‌పై నున్న పేపర్ వెయిట్‌ని తిప్పుతూ వ్రేళ్ళతో.

"నీ విషయం నాకు త్వరలో చెప్పాలి!"

"అంతకన్నా నాకు మాత్రం కావలసిందేముంది? మీ భార్యగా వుండేందుకు నాకు అభ్యంతరం లేదు."

ఆమాట వినగానే వర్మ లేచొచ్చి మాలను తక్కున పెదా లపై ముద్దు పెట్టుకున్నాడు. ఆమె గింజుకుంది.

"ఏం? నీకూ్కడా అందం తరిగిపోతుందని భయమా?" అడిగాడు.

"అలాంటి దేమీలేదు డాక్టర్!" అంది.

2

ఆ తర్వాత వర్మ చాలారాత్రులు క్లినిక్‌లోనే గడిపాడు. పగులంతా కన్సల్టింగ్ రూంలాగుండే గది రాత్రిళ్ళు బెడ్ రూంలా మారిపోతుంది. జయమాల యవ్వనాన్ని జుర్రుకుని త్రాగసాగాడు. ఆమెక్కూడా ఆనందంగా వుంది.

ఒకరోజు వర్మ జయమాలతో మరుసటిదినం సాయంత్రం తనభార్య బొంబాయికెళ్తుందనీ, అక్కడినించి విమానంలో అమెరికాకు వెళ్ళే ఏర్పాట్లు చేసుకుందనీ చెప్పాడు.

"అయితే రేపు రాత్రికి నేను మీ యింటికొచ్చేదా?" అడిగింది.

"వద్దు. మెల్లిగా అందరికీ ఆమె నన్ను వదిలేసిందన్న వార్త చెపుదాం. ఆ తర్వాత బాహాటంగా పెళ్ళాడుదాం. అప్పుడు మనల్ని గురించి ఎవ్వరూ ఏమీ అనుకోరు" అన్నాడు.

అతని ఆలోచన నచ్చింది జయమాలకు.

డాక్టర్ వర్మ తన స్నేహితులకు, తనభార్య ఫ్రెండ్స్‌కు, తన అర్ధాంగి అమెరికాకు వెళ్ళిపోయిన విషయం చెప్పాడు. అందరూ విని ఆనందించారు. లత ఎంతో అదృష్టవంతురాలనీ, ఆమెలా సంగీతం వచ్చివాళ్ళు చాలా కొద్దిమందే వుంటారనీ పొగడారు.

"మీ ఆవిడ ఉత్తర మేమన్నా రాసిందా?" అడిగింది జయమాల ఒకరోజు రాత్రి ఆయన వొళ్ళో పడుకుని.

"రాసింది. నిన్న వచ్చింది."

"ఏమంటుంది?"

"తను ఇక ఇండియాకు రాదలంచుకోవడం లేదనీ, అమెరికాలో చాలా బాగుందనీ రాసింది. నన్ను మరెవ్వరి

నన్నా చూసుకోమంది'' అన్నాడు.

''ఆమెకు తెలీదు మీరు ముందుగానే చూసుకున్నారని-'' అంది జయమాల కొంటెగా నవ్వుతూ.

''ఇంకొక్క వారం రోజుల్లో మనం పెళ్లికూడా చేసేసుకుందాం'' అన్నాడు వర్మ శ్రుతి కలుపుతూ.

''త్వరగా ఆ ఏర్పాట్లు చూడండి. నేను బహిష్ఠయి రెండు నెలలయింది.''

''అంటే నువ్వు తల్లివి కాబోతున్నావన్నమాట.''

''ఆఁ। అందుకే ఈ తొందర. ఆ బిడ్డ పుట్టేలోగా పెళ్లయితే, నలుగురూ నీ బిడ్డ తండ్రెవరమ్మా అని అడిగే అవసరం లేకుండా పోతుంది'' అంది జయమాల.

''అలాంటి అవసరం రాదు।'' అన్నాడు వర్మ.

3

మరుసటిదినం వర్మ క్లినిక్‌కు లేటుగా వచ్చాడు.

జయమాల చకచక తన పనులు చేసుకుపోసాగింది.

''అంత మత్తుగా నిద్రపట్టిందా?'' అడిగింది వర్మను.

''లేదు।''

''మరి చాలా ఆలస్యంగా వచ్చారే।''

''ఒక పెద్ద గొడవలో పడ్డాను. మధ్యాహ్నం భోజనాలప్పుడు చెప్తాను'' అన్నాడు వర్మ.

జయ గుండెల్లో రాయిపడింది. ఏదో గొడవని, తన్ను పెళ్లాడకుండా పోతాడేమో నని భయం పట్టుకుంది.

మధ్యాహ్నం భోజనం చేసేప్పుడు గొడవ ప్రసక్తి ఎత్తింది జయమాల.

''లతకు చిన్నతమ్ముడు వున్నాడు. జులాయి వెధవ. అప్పట్లో వాణ్ణి నేను సరిగ్గా చూడలేదు కూడా. రాత్రి ఇంటికి

వెళ్లేసరికి వాడు గుమ్మందగ్గర కూర్చునున్నాడు. నేను గుర్తు పట్టలేక పోయాను. వాడే పరిచయం చేసుకున్నాడు. వాళ్ళక్కయ్యను చూద్దామని వచ్చాడట.''

అన్నం తింటూ వింటున్నట్లు తలూపింది జయ.

మా అక్కయ్యేదని అడిగాడు. చెప్పాను. విని నాకు నమ్మకం లేదన్నాడు. అంతదూరం, అదీ దేశంకాని దేశం వెళ్ళిపోతున్నప్పుడు కనీసం మావూరొచ్చి చెప్పకుండా ఎలా వెళ్ళిందో చెప్పమని వేధించాడు. అదీ చెప్పాను వివరంగా. నాకు నమ్మకం లేదన్నాడు. వెళ్ళి ఏట్లో దూకమన్నాను. కాదు పోలీసు స్టేషనుకు పోతానన్నాడు. ఎంత ఆపినా ఆగనని మొరాయించాడు'' అన్నాడు వర్మ.

''ఆపడమెందుకు? పొమ్మనక పోయారా?''

''లతకు పాస్‌పోర్టు లేదు! బొంబాయినుంచి దొంగతనంగా ఏదో స్టీమరులో వెళ్తానన్నది. అందుకు ఆ కుమార్‌ గాడు ఏదో ఏర్పాట్లు చేశానని చెప్పాడట. ఇప్పుడీ గొడవంతా బయట పడుతుంది'' అన్నాడు వర్మ.

జయమాలకు అర్ధం కాలేదు వర్మ మాటలు.

''ఆమె మిమ్మల్ని ప్రేమించలేదు. సంసార సుఖం మీకివ్వలేదు. మీ డబ్బు జలగలా పీల్చింది. అలాంటప్పుడు ఆమెకేదో అవుతుందన్న భయం మీకెందుకు. పోలీసులకు అసలు మీరే చెప్పవలసింది. ఆమె అమెరికానుండి ఉత్తరం రాసిందన్నారుగా. అది చూపించండి. చచ్చినట్లు నోరు మూసుకుంటారు'' అంది జయమాల.

''అక్కడే నేను తెలివి తక్కువగా ప్రవర్తించాను. ఆమె దగ్గర్నుంచి వచ్చింది అదొక్కటే ఉత్తరం. అది చదివాక కోపంవచ్చి చించి పారేశాను. అలా చెయ్యకుండా

మీరే ఎన్నుకోండి? [బ్యాలెట్ ఫలితాలు]

ఆగస్టు '74 నెల "సప్లిమెంట్" లో నిర్వహించబడిన బ్యాలెట్‌లో శ్రీ రమణశ్రీ గారి 'న్యాయం మరణించదు' నవల అత్యధిక మెజారిటీతో ఉత్తమ నవలగా ఎన్నుకోబడినది. ఆ రచయితకు రు. 116/-లు బహుమతి త్వరలో అందజేయబడుతుంది.

ఈ నెలలో మొత్తం నాలుగు నవలలకు వచ్చిన ఓట్ల వివరాలు, వాటి వరుసక్రమం ఇది:

1. న్యాయం మరణించదు (73.8%)
2. చైనా దండయాత్ర (14.3%)
3. ఆశను చుట్టిన అరిష్టాలు (7.2%)
4. ముగ్గురు మూర్ఖులు (4.7%)

పై వరుసక్రమంలో నవలల ఎన్నికను సరిగ్గా చేసిన యీ క్రింది నలుగురు హోం. డె. పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/లు చొప్పున నగదు బహుమతి యీ నెలాఖరులోగా పంపగలము. హోం. డె. నెం. 18, 54 పాఠకులు తమ కూపన్లతో స్టాంపులు పంపనందున వారికి బహుమతి ప్రకటించటం లేదు.

(1) శ్రీమతి కొల్లా అరుణ (హోం. డె-61), 21-35-10, బురుజుపేట, విశాఖపట్టణం-1.

(2) శ్రీ సి. హెచ్. కోదండరామిరెడ్డి (హోం. డె-103), కొత్తపాలెం-పోస్టు, నెల్లూరు జిల్లా.

(3) శ్రీ కోనే నాగ వెంకట ఆంజనేయులు (హోం డె-71), బి. కాం., నారకొట్లసందు, మెయిన్ బజార్, ఏలూరు-1. (4) శ్రీ జి. సుబ్బరాజు (హోం. డె-12), తాడిపూడి, వసంతవాడ-పోస్టు, ఆత్రేయపురం-వయా, కొత్తపేట-తాలూకా, తూ. గో. జిల్లా.

వుండివుంటే లత తమ్ముణ్ణి ఎలాగైనా నమ్మించగలిగి వుండేవాణ్ణి'' అన్నాడు వర్మ.

"పొరపాటు చేశారు. ఇంతకూ అతను ఎక్కడున్నాడు?"

''ఏదో హోటల్‌లో దిగాడట.''

''ఈ పాటికి పోలీసుల దగ్గరకు పోయి వుంటాడేమో?''

''పోడు!'' అన్నాడు ధైర్యంగా.

''ఏమిటా నమ్మకం!''

''ఈ గొడవ గురించి మరచిపోయేందుకు పాతికవేలిమ్మంటున్నాడు. అంత డబ్బు నా దగ్గర లేదని చెప్పాను. కనీసం ఇరవై వేలన్నా ఇవ్వమన్నాడు. నా దగ్గర పదివేలున్నాయి, తీసుకొని నోరు మూసుకుని వెళ్ళమన్నాను. ఎక్కడైనా మరో ఐదువేలు అప్పు పుట్టించుకుని ఈ దినం సాయంత్రానికి మొత్తం పదిహేనువేలు సిద్ధంగా వుంచమన్నాడు'' చెప్పాడు వర్మ.

''సిద్ధం చేశారా?''

''లేదు!''

''ఏం డబ్బు లేదా?''

''ఒకతనికి ఫోనుచేసి చెప్పాను. ఇస్తానని చెప్పాడు.''

''అయితే పారేసి పీడ వదిలించుకోండి. మనంకూడా త్వరగా పెళ్ళి చేసుకోవడం మంచిది. దానిక్కూడా ఏర్పాట్లు త్వరగా చెయ్యండి'' అంది జయ.

''అలాగే!'' అన్నాడు వర్మ భోజనం ముగిస్తూ.

4

ఆ రాత్రికి జయమాలకు ఆట విడుపయింది. వర్మ సాయంత్రమే వెళ్ళిపోయాడు. పేషంట్లకు మందులివ్వడం, టెంపరేచరు చూడటంలాంటివన్నీ పూర్తిచేసివచ్చి కాంపౌం

డింగు రూంలో చేతులు కడుక్కుంటూ వుంది.

పాతికేళ్ళ కుర్రాడొకతను డోర్ కర్టెను తొలగించి "రావచ్చా!" అడిగాడు.

"ఎవరు?" అడిగింది జయ.

"వర్మగారి బావమరదిని" అన్నాడతను.

"రండి!" అంది భయపడుతూ.

అతను లోపలికొచ్చి కూర్చున్నాడు.

"ఏం కావాలి?" అడిగింది తనకేమీ తెలియనట్లు జయ.

"మీ పేరు జయమాల కదూ!" అడిగాడు అతను.

"అవును. మీ పేరు!"

"విశ్వామిత్రుడు!"

"తమాషాగా వుంది పేరు!" అంది జయ.

"మీవల్ల నాకు కొంత సాయం కావాలి!" అన్నాడు.

"మీ బావగారు కలవలేదా?"

"కలిశారు. నేను ఉదయంనుండీ ఆ ప్రబుద్ధుణ్ణి గురించి విచారించాను. ఆయన ఈమధ్య ఇంటికి రాకుండా ఇక్కడే రాత్రిళ్ళు వుంటున్నాడనీ, ఇక్కడెవరో అందమైన నర్స్ వుందనీ, బహుశా ఆమెతో సంబంధం పెట్టుకొని వుండొచ్చనీ, అన్నారు. మిమ్మల్ని చూశాక అందులో అబద్ధం గానీ, అనుచితంగానీ లేదనిపించింది."

జయ మాట్లాడలేదు.

"వర్మ నీచాతినీచుడు. మా అక్కయ్యను ఏం చేశాడో అర్థం గావడంలేదు. అమెరికాకు పోయిందని చెప్తున్నాడు. నాకు నమ్మకంలేదు."

"ఎందువల్ల!"

"అదే నిజమయితే ఇంత డబ్బు నాకిచ్చి నా నోరు

మూయించాలని ఎందుకు అనుకుంటున్నట్లు?'' అంటూ పాంటుజేబులోంచి వందరూపాయల నోట్ల బొత్తి లాగి చూపించాడు.

''ఆయన్నే అడగకపోయారా?''

''అడిగాను. ఇదీ మా అక్కయ్య క్షేమం గురించే నంటాడు. ఆమె ఇండియానుండి దొంగతనంగా ఎవరితోనో వెళ్ళిపోయిందన్నాడు. పోలీసుల దగ్గరకు వెళితే ఆమెను అక్కడ్నుంచి అరెస్టుచేసి తీసుకొచ్చి ఆజన్మఖైదు చేస్తారని చెప్పాడు'' అన్నాడు విశ్వామిత్ర.

''అది నిజం కావచ్చుగా?''

''కావచ్చు. కానీ కాదు! నేను రెండేళ్లు అమెరికాలో వుండి వచ్చాను. దొంగతనంగా అక్కడకు చేరినా, అక్కడ పాస్‌పోర్టు, వీసా లేకుండా ఇరవై నాలుగు గంటలు వుండ లేరు. అదినాకు తెలుసు.''

''అయితే మీరేం అనుకుంటున్నారు.''

''నీ మజాలో పడి, మా అక్కయ్యను ఎలాగైనా వదుల్చుకోవాలని నిర్ణయం చేసుకునుంటాడు. ఆమెను హత్యచేసి ఎక్కడో శవాన్ని పాతేసివుంటాడని నా అనుమానం'' అన్నాడు విశ్వామిత్ర.

''అంత దారుణానికి దిగజారుతాడా?''

''అతడు పరమ నీచుడు. మా అక్కయ్యను నానా బాధలు పెట్టేవాడు. ఆమె సంగీత కచేరీలు చేసి డబ్బు సంపాదించేది. ఆ డబ్బునుకూడా ఆమె ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకోనిచ్చేవాడు కాదు. అయినా ఆమె అతనితో పోరాడేది'' అన్నాడు విశ్వామిత్ర.

''ప్రేమించి పెళ్ళాడానని చెప్పాడు.''

"అబద్ధం! లక్షరూపాయలిచ్చి పెళ్ళి చేశాం. ఆమెది వీక్ హార్ట్. ఏదైనా దారుణం చేస్తే తలక్రిందులై పోతుంది. డాక్టరు గాబట్టి ఆమె కే విషమో ఇచ్చి చంపివుంటాడు" అన్నాడు విశ్వామిత్ర.

జయమాలకు భయం పుట్టింది. విశ్వామిత్ర మాటలు వింటే అతను చెప్పిందాంట్లో అబద్ధం లేదనిపించింది. అంత నీచుడ్ని తాను నమ్మి బంగారంలాంటి శరీరాన్ని అర్పించి నందుకు మొదటిసారిగా చింతించింది. ఆమెలో పెరుగు తున్న అతని ప్రతిరూపం గుర్తొచ్చి కళ్లు ఆర్ద్రమయినాయి.

"నన్నేం చెయ్యమంటారు?" అడిగింది జయ.

"ఈ దుర్మార్గుడి ఆట కట్టించాలి! అందుకు మీరు నాతో చెయ్యి కలపండి. మిగిలింది నేను చూస్తాను" అన్నాడతను.

"అలాగే! ఇందులో నష్టపోయేది నేనే! అయినా మీ అక్కయ్య గురించి బాధ పడేందుకు మీరున్నారు. నాకు ఎవ్వరూ లేరు. నువ్వు నా తమ్ముడి వనుకుంటాను" అంది జయమాల.

"థాంక్స్! వస్తాను" అన్నాడు విశ్వామిత్ర.

అతను వెళ్ళినంత దూరం చూస్తూ నిలుచుంది. అతను రోడ్ మలుపు తిరిగాక లోనికొచ్చింది. పైటకొంగుతో కళ్లు తుడుచుకొంది.

5

"నేను వాకబు చేశానోయ్. మీ అక్క రైల్లో ప్రయాణం చేసిందని తెలిసింది. ఆ టిక్కెట్టు కాన్సిల్ కాలేదు!" అన్నాడు రాయుడు.

"ఎవరైనా ఆ పేరుమీద ప్రయాణంచేసి వుండొచ్చు. ఆమెను చంపి అక్కడే ఎక్కడో దాచుంటారు!" అన్నాడు

విశ్వామిత్ర.

రాయుడికి తన బుర్రపైన కోపం వచ్చింది, అతనికి తట్టిన అనుమానం తనకు తోచనందుకు.

"అదీ పాయింటనుకో! ఎందుకైనా నువ్వు జయమాలను కనిపెట్టి వుండు. నేను వేరే ప్రయత్నాలు చేసిచూస్తాను" అన్నాడు రాయుడు.

విశ్వామిత్ర వెళ్ళిపోయాడు.

రాయుడు డాక్టర్ ఇంటికి వచ్చాడు. సాయంత్రం ఆరు గంటలయింది. ఇంటికి తాళం వేసివుంది. అదేం పెద్ద బంగళాకాదు. రెండు బెడ్ రూంలు వుంటాయనుకున్నాడు. ఎదురింటికేసి చూసాడు. క్రిందాపైనా మనుషులున్నారు. మెల్లగా క్రిందిభాగంలోకెళ్ళి తన్నుతనే పరిచయం చేసుకుని ఆ ఇంటి యజమానురాల్ని బాతాఖానీలోకి దించాడు.

ఆమె లత అందరితో కలుపుగోరుగా వుండేదనీ, తను అమెరికాకు వెళ్తున్నట్లు ఎప్పుడూ నవ్వులాటగాకూడా చెప్ప లేదనీ, ఆమె ప్రయాణమయిపోతున్న రోజుకూడా సాయంత్రం ఒంటరిగానే బజారుకెళ్ళి తిరిగి వచ్చేసిందనీ, ఉదయం నాలుగు గంటలనుండి టాక్సీగానీ, రిక్షాగానీ, మరే వాహనం గానీ, ఆ వీధిలోకి రాలేదనీ, తన భర్తకు జ్వరంగా వుంటే రాత్రంతా మేల్కొనే వున్నాననీ చెప్పింది.

ప్రక్కఇళ్ళలోకూడా వాకబు చేశాడు. వాళ్ళూ అదే చెప్పారు.

చాలాసేపు ఆలోచించాడు.

లత రాత్రి ఎనిమిది గంటలకు తిరిగొచ్చాక తిరిగి వెలుపలికి వచ్చినట్లుగానీ, మరెవ్వరికీ కనిపించినట్లుగానీ సాక్ష్యం

లేదు. అంటే ఇంట్లోనే గాలిలో కలిసిపోయిందా. ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. అక్కడ్నుంచి తిన్నగా స్టేషన్‌కు వెళ్ళాడు.

విశ్వామిత్రతో కాసేపు మాట్లాడి, అతను చెయ్యవలసింది చెప్పాడు. అతను తలూపి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి పన్నెండుగంటల ప్రాంతంలో రాయుడు నలుగురు పోలీసుల్ని వెంటపెట్టుకొని మఫ్టీలో వర్మ ఇంటికి చేరాడు. వెనుకవేపునుంచి తలుపులు పగులకొట్టారు. అన్ని గదులూ చకచకా సోదా చేశారు. బాత్‌రూంలో అడుగు పెట్టారు. రాయుడు లైటు వెలిగించాడు.

మొజాయిక్ టైల్సన్నీ ఎగుడుదిగుడుగా కనుపించాయి. ఒకటి ఎత్తుగా ఒకటి క్రిందగా వుంది. ఇల్లంతా శుభ్రంగా పాలిష్ చేసివుంది. రాయుడికి అనుమానం వచ్చింది. ఒక్క బాత్‌రూంలోనే అలా ఎందుకున్నదీ అర్థంకాలేదు. మెల్లగా ఒక్కొక్కటైల్ పైకిపీకాడు. క్రింద మట్టంతా వదులుగా వుంది. అంతకుముందే ఎవరో తవ్వి కుళ్ళబోసినట్లుంది. కానిస్టేబుల్స్ సాయంతో మట్టంతా తవ్వి పోయించాడు. మూడడుగుల లోతున అస్తిపంజరం కనుపించింది. చేతులకు బంగారు గాజు లున్నాయి, మెళ్లో తాళిబొట్టు వుంది. మట్టంతా కంపుకొట్టింది. రాయుడు ముక్కు మూసుకొని వెలుపలికొచ్చాడు.

ఆ తర్వాత వర్మను అరెస్టు చేయడానికి రాయుడికి అరగంటకూడా పట్టలేదు.

ఆ విషయం తెలియగానే జయమాల కుప్పలా కూలిపోయింది.

★

ఈనెల జోక్స్

—ఎస్. జి. బాష

ఓ ముద్దాయిని జడ్జిగారు నిర్దోషిగా విడుదల చేశారు. కొన్ని గంటలలోనే ఆ ముద్దాయి మళ్ళీ కోర్టులో హాజరయ్యాడు.

జడ్జి: నువ్వు చేసిన నేరమేమిటి?

ముద్దాయి: మీ కారులో ప్రయాణించటం.

అంతే! ఆ జడ్జి నిర్విణ్ణుడై పోయాడు.

• • •

భార్య: మన ప్రక్కింటి వారంతా 'మీరెంత అదృష్టం చేసుకొన్నారండీ? మీ ఆయన ఎప్పుడూ మీ కొంగు పట్టుకొని తిరుగుతారని అంటున్నారు.'

భర్త: కొంపదీసి నాకు రేచీకటని వాళ్ళకు చెప్పావేంటి?

• • •

పోలీసు: (భార్యతో) ఏమేయ్! హ్యాంగర్‌కు తగిలించి వుండిన నా డ్యూటీ డ్రస్సేదే?

భార్య: ఈ రోజు కొత్త సినిమా రిలీజయింది కదండీ.

పోలీసు: అయితే! గుడ్డలకూ, సినిమాకూ సంబంధం ఏమిటే?

భార్య: మీ తమ్ముడు మీ డ్రెస్ వేసుకొని సినిమాకు పొయ్యారండీ.

• • •

ఒక మనస్తత్వ శాస్త్రవేత్త ఎలుకలపైన ప్రయోగాలు చేశాడు.

ఒక బోనులో మగ ఎలుకను వుంచి, దాని ప్రక్కన ఆడ ఎలుకను వదిలాడు. అదే సమయంలో మగ ఎలుకకు స్వీట్స్ పెట్టాడు.

ఇలాచేసిన ప్రతీసారీ, మగఎలుక ఆడఎలుక దగ్గరికి పోకుండా, స్వీట్స్ దగ్గరికి పోయింది. రకరకాల స్వీట్స్ పెట్టాడు కానీ అదేవిధంగా జరిగింది. తుదకు తన విద్యార్థు లందరినీ పిల్చి యిలా చెప్పాడు:

"నేను చేసిన ప్రయోగాల ఫలితంగా ఆకలికంటే ప్రేమ ఏ విధంగానూ గొప్పది కాదని తేలిపోయింది...."

ఇంతలో ఒక విద్యార్థి ఇలా అన్నాడు:

"సార్! మీరు రకరకాల స్వీట్స్ మార్చి చూశారు కానీ, ఆడఎలుకనుగూడా మార్చి చూడాల్సింది. అప్పుడు ఫలితాలు ఎలా వుండేవో?"

• • •

"హలో! పోలీస్ స్టేషన్?"

"ఎస్! పోలీస్ స్టేషన్."

"మా నాన్నను పిలవండి."

"ఎవరు మీ నాన్న."

"పోలీస్ కానిస్టేబుల్."

"నెంబరెంత."

"420."

"అమ్మాయ్! నేనే మాట్లాడుతూంట."

"మరి నాన్నా! నా మనసు దొంగిలించినవాడు కనిపించాడు. నువ్వు వెంటనే రా."

• • •

ఇద్దరు త్రాగుబోతులు ఓచోట కల్సుకున్నారు చాన్రోజుల తర్వాత.

"మీరు ప్రత్యేకవాదులా?" ప్రశ్నించాడు మొదటివాడు, భావగర్భితంగా నవ్వి.

"కాదు" ముక్తసరిగా జవాబిచ్చాడు రెండవ అతను.

"సమైక్యవాదులా" మొదటివాని ప్రశ్న.

"కాదు" రెండవవాని జవాబు.

"మరి, అవకాశవాదులా" చిరాకుగా మొదటివాని ప్రశ్న.

"కాదు" చెప్పాడు రెండవవాడు గర్వంగా. "అచ్చం వాదిని."

"అర్థం కాలేదు నాకు" బుర్ర గోక్కున్నాడు మొదటి వాడు.

"బ్రాందీ, జింజర్, రమ్, జిన్, ఏది పుచ్చుకొన్నా వాటిల్లో సోడాలు అవేవి కలుపను."

• • •

ఓ ఖైదీకి ఉన్నట్టుండి రేపు తన పుట్టినరోజని గుర్తు కొచ్చింది.

ఆరోజు రాత్రి హడావిడిగా నిద్రనుండి లేచి పహరా కాచే పోలీసును పిలిచి చెప్పాడు.

"ఇదిగో! పోలీసాయనా! రేపు నా పుట్టినరోజు పండగ. స్వీట్ వేయమని చెప్పు వంటవాడితో."

• • •

"సీతా! ఎక్కడివే నాలుగు క్యాలెండర్లు?" అన్నాడు సుబ్రావ్ ఆఫీసునుంచి రాగానే. ఇంట్లో గోడలకు క్రొత్త క్యాలెండర్లు వ్రేలాడటం చూచి.

"మరే! వందరూపాయలు పెట్టి ఒక చీర తీసుకొంటే రెండు క్యాలెండర్లు ఉచితం అన్నారు కొత్తగా ఓపన్‌చేసిన షోరూమ్ వాళ్లు. అందుకని ఎంచక్కా నాలుగు క్యాలెండర్లు తెచ్చాను. బావున్నాయా?" అంది భార్య ఉత్సాహంగా.

• • •

ఇద్దరు విదేశీ రాయబారులు భారతదేశ దౌత్య కార్యాలయం (ఎంబసీ) లో కలుసుకొని ఈ విధంగా సంభాషణ ప్రారంభించారు:

"మా దేశంలో శాస్త్రజ్ఞులు చిత్ర విచిత్రమైన పన్లు చేసేస్తున్నారు. పుట్టుకతో చెముడున్న వారికిగూడా చెవులు తీప్పి

ప్లాస్టిక్ చెవులు కుట్టేస్తున్నారు. వారికి యిప్పుడు బాగా వినిపిస్తుంది'' అన్నాడు మొదటి అగ్రదేశానికి చెందిన రాయబారి.

''అంతేనా?'' అన్నాడు రెండవ దేశానికి చెందిన రాయబారి.

''ఏం చేస్తున్నారు మీ దేశంలో?'' మొదటివాని ప్రశ్న.

''మా దేశంలోని శాస్త్రజ్ఞులు చెడిపోయిన గుండెను తీసి క్రొత్త గుండెను వేస్తున్నారు. వారిప్పుడు హాయిగా జీవించ గలుగుతున్నారు. అయితే గుండె చేసే శబ్దంలో కొంచెం మార్పు వచ్చింది. 'లబ్, డబ్' కు బదులు, 'డబ్ లబ్' అని వినిపిస్తుంది.''

''శబ్దం అలా మారినట్టు ఎవరు విన్నారు?''

''మీ దేశంలో ప్లాస్టిక్ చెవులు వేయించుకొన్నవారే'' అన్నాడు రెండవ రాయబారి మొదటివాని ప్రశ్నకు.

• • •

''రాము! శ్రీకృష్ణుడు కుచేలుడింటికి పోయి మొదట ఏమని ప్రశ్నించాడు?'' అడిగాడు తెలుగు మాష్టారు.

''కుచేలా! ఇది నీ యిల్లా? లేక మునిసిపల్ స్కూలా?'' ఠక్కున జవాబు చెప్పాడు రాము.

★

వింత ప్రపంచం ?

1. జనవరి 10 వ తేదీన రైలులో ఒకతను నగల కోసం ఒక స్త్రీని హత్యచేసి శవాన్ని గోనెసంచీలో మూటగట్టి, శవాన్ని రైలులో వదిలిపెట్టి పారిపోయి, చివరకు తనే హత్యచేసినట్టు పోలీసులకు ఉత్తరం రాశాడు.

2. ఇంతకుముందు గ్రామాలను దోపిడీదొంగలు దోచుకుంటారని విన్నాం. కాని ఇప్పుడు కోతులు దోచుకొంటున్నాయట! చిలీలో ఒక పెంపుడుకోతి మిరియాలుతిని కారం ఎక్కువయి, మూడురోజులు ఆ ప్రాంతాన్ని విధ్వంసంచేస్తూ తిరిగి, పోలీసులకు పట్టుబడి, కోర్టుకెక్కి, ఇప్పుడు యావజ్జీవఖైదు అనుభవిస్తోంది.

3. ఫిలడెల్ఫియాలో ఒక బాంకిలో క్యాషియర్ పై, ఒక గజదొంగ దాడిచేసి, డబ్బివ్వమని బెదిరించాడు. క్యాషియర్ ఒక కవర్లో 520 డాలర్లతోపాటు చిన్న టియర్ గాస్ బాంబ్ పెట్టిచ్చాడు. అది ప్రేలి దొంగ పట్టుబడ్డాడు.

4. కేంద్రపాలిత ప్రాంతమైన లక్కదీవులలో మొట్టమొదటిసారిగా ఈ మధ్యనే ఒక హత్య జరిగింది. ఇక్కడ ఇంతకుముందెప్పుడూ హత్యలు జరుగలేదు. నిందితుడు తరపున పిటిషన్ దాఖలు చేయడానికి ఒక్క న్యాయవాదికూడ లేడట.

— సుంచు కృష్ణస్వామి.

మల్లాది
వెంకటకృష్ణమూర్తి

సీరియల్

(గత సంచిక తరువాయి)

[జరిగిన కథ: చందన్, చాణక్య ఇరువురూ అన్నదమ్ములు. లండన్‌లో రహస్య జీవితం గడుపుతున్నారు. ఒకరోజు చందన్ కు త్రాగే షాంపేన్‌లో విషం కలిపి, ఢిల్లీకి పారిపోయాడు చాణక్య. జరిగిన మోసం తెలుసుకొన్న చందన్ కూడ చాణక్యని వేటాడుతూ ఢిల్లీకి బయలుదేరాడు. వారి తండ్రి డోంగ్రేని హత్యచేశాడు చాణ్యక. ఆ కోపంతో చాణక్య ప్రియురాలు జలంధరని హత్యచేశాడు చందన్. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మ్యూజియంలో వారు దొంగిలించిన అతి విలువైన ఏడు వజ్రాలను చాణక్య తన పరం చేసుకున్నాడు. చాణక్యను పట్టుకోవడానికి చందన్ అనేక ప్రయత్నాలు చేశాడు. కాని, ఏవీ ఫలించలేదు. — ఇక చదవండి.]

నిద్ర పట్టింది వెంటనే.

రాత్రి తొమ్మిదికి లేచాను. స్నానం చేసి సూట్‌కేస్ లోంచి జీన్‌బ్రూస్ నవలకి ఆంగ్లానువాదం, షాక్ ట్రీట్‌మెంట్ తీసి చదవ సాగాను. అరవై మైళ్ల వేగంతో కారు నడుపుతూ, కారు ఏక్సిడెంట్‌లో మరణించిన ఫ్రెంచ్ రచయిత జీన్‌బ్రూస్ సృష్టించిన గూఢచారి పాత్ర హ్యూబర్ట్-OSS 117 అంటే నాకెంతో అభిమానం.

ఆ పాత్రని తెరమీద ఎంతో హుందాగా పోషించిన కెర్విన్ మేథ్యూస్ అన్నా నాకెంతో అభిమానం. బేంకాక్‌లో, హోటల్ ఇర్విన్‌లో, రూం నెంబర్ 236 లో హ్యూబర్ట్ ఎడ్వంచర్స్, డాక్టర్ పిన్‌కి సరైన ప్రత్యర్థిగా నిలచిన విధం-నేను చూసిన ఆ సినిమాగురించి ఆలోచించాను కొంతసేపు.

జేమ్సబాండ్‌కి ఏమాత్రం తీసిపోడు హ్యూబర్ట్, కాని అంత గుర్తింపు రాలేదు, ఒక్క ఫ్రాన్స్ దేశంలో తప్ప.

పుస్తకం మూసాను అరగంట తర్వాత. లేచి నిలబడ్డాను. ఓసారి వళ్ళు విరుచుకుని మేకప్ సామాను బయటికి తీసాను. అరగంట శ్రమ పడ్డాక నా రూపం మారిపోయింది బాగా.

ముప్పైఅయిదేళ్ల ముస్లింలాగా తయారయాను. నన్ను గుర్తు పట్టలేరు తెలిసినవాళ్లు కూడా కదలకుండా నించుని వుంటే. నడిస్తే నడకని బట్టి బాగా పరిచయం వున్నవాళ్లు గుర్తు పట్టవచ్చు. మాట్లాడితే కంఠస్వరం ద్వారా గుర్తు పట్టవచ్చు.

చాణక్యని వెదుకుతూ బయలు దేరాను. ఢిల్లీలోనే చాణక్య వున్నాడని నాకు నమ్మకం లేదు. ఆ విలువైన ఏడు వజ్రాలతో మరో చోటికి వెళ్ళిపోయి వుంటాడని నా అనుమానం.

ఇక ఎప్పటికీ చాణక్య వునికిని కనుక్కోలేనేమో నన్న అనుమానం నన్ను బాధిస్తోంది. తొందరపడి జలంధరని చంపేశాను ఆవేశంలో. చంపకుండా వుండి వుంటే, జలంధరని చూడకుండా వుండలేని చాణక్య వునికిని తేలికగా కనుక్కునే వాణ్ణి.

ఢిల్లీలో చాణక్య వుంటే రాత్రి చాణక్య వెళ్లే చోటు వకటి నాకు తెలుసు. నాకు తెలుసని చాణక్యకి తెలియదు. నేను రహస్యంగా వుంచాలని భావించలేదు కాని, అవకాశం రాలేదు ఎప్పుడూ తెలియడానికి.

'ఢిల్లీ నైట్‌క్లబ్' ఆ చోటు.

నాకు చాణక్య అక్కడ దొరుకుతాడనే నమ్మకం ఎంత మాత్రంలేదు. ఆచూకీ తెలుస్తుందనికూడా రూఢిగా నమ్మలేదు. ప్రయత్నం చేద్దామని బయలుదేరాను. అంతే.

స్ప్రింగ్ డోర్ తెరచుకుని లోపలకి వెళ్ళాను. లోపలకి ప్రవేశం అందరికీ లభించదు. చట్టవిరుద్ధమైన అనేక పనులు జరుగుతూంటాయి 'ఢిల్లీ నైట్‌క్లబ్'లో.

లోపల నాలుగు గదులు తిరిగి ప్లేయింగు కార్డ్సు ఆడే వాళ్ళని. పోకర్ ఆడేవాళ్ళని. డేన్స్ చేస్తున్నవాళ్ళని, గంజాయి తాగుతున్నవాళ్ళని చూసాను. వాళ్ళలో లేడు చాణక్య.

చాణక్య స్నేహితు డొకడు కనిపించాడు గంజాయి త్రాగుతూ.

చాణక్య గురించి ప్రశ్నించాను అతన్ని.

చాణక్య ఎవరో వివరంగా చెప్పాల్సివచ్చింది నేను. చివరికి ఫోటో చూపించాక గుర్తుపట్టి అన్నాడు.

''మూడు సంవత్సరాలైంది చూసి.''

మరో ఇద్దరు ముగ్గురినికూడా అడిగి, చాణక్య అక్కడకి రాలేదని నిశ్చయించుకుని బయటపడ్డాను; చాణక్య అక్కడికి ఎప్పుడైనా వస్తే వెంటనే నాకు తెలియచేసేందుకు ఒక వ్యక్తిని మాట్లాడాను—బార్ అటెండర్‌ని.

చాణక్య వస్తే నాకు ఫోన్‌చేసి చెప్తాడు వెంటనే. నే నిచ్చిన గార్డెనాల్ టేబ్లెట్ చాణక్యకిచ్చే వైన్‌లో కలిపి ఇస్తాడు. పాతిక ఎడ్వాన్స్ ఇచ్చాను ఆ పనికి, మరో పాతిక ఇస్తానని చెప్పి.

మరో నాలుగైదుచోట్ల చాణక్యకోసం విచారించాను. ఓ ప్లేయింగు కార్డ్సు క్లబ్‌లో, బ్లూ ఫిలిం థియేటర్లో, స్టాంప్సె అమ్మే రెండు షాప్సులో. చాణక్యకి స్టాంప్సె పిచ్చి ఎక్కువ. చాలా సేకరించాడు.

ఆ నాలుగు చోట్లకి చాణక్య ఎప్పుడు వచ్చినాసరే నాకు తెలియచేసే ఏర్పాటు చేసుకున్నాను రహస్యంగా. రాత్రి

రెండున్నరకి హోటల్‌కి తిరిగి వచ్చాను.

22

వారంరోజుల తర్వాత రాత్రి పదకొండు గంటలకి నా గది తలుపులు బాదుతూంటే మెలకువ వచ్చింది. ఉలిక్కిపడి లేచి అడిగాను.

"ఎవరది?"

"మీకు ట్రంక్ కాల్ వచ్చింది."

రూమ్ సర్వీస్‌బాయ్ కంఠం వినిపించింది.

"ఈ గదిలో ఫోన్ వుందిగా. కనెక్ట్ చేయండి" అన్నాను.

"ఆపరేటర్ లేడు. కింద వుంది ఫోన్."

ట్రంక్ కాల్ వచ్చిందంటే నిస్సందేహంగా నర్సునుంచే అయుంటుంది. అంటే చాణక్య వచ్చివుంటాడు శానిటోరియంకి అమ్మని చూడటానికి.

గబగబా మెట్లుదిగి కిందకి పరిగెత్తి అందుకున్నాను టేబిల్‌మీద వున్న టెలిఫోన్.

"హలో" అన్నాను.

"నేషనల్ ట్యూబర్‌క్యులోసిస్ శానిటోరియంనుంచి నర్సుని మాట్లాడుతున్నాను" నర్సు కంఠం వినిపించింది.

"చెప్పు. చాణక్య వచ్చాడా?" అడిగాను ఆత్రంగా.

"అవును. మధ్యాహ్నం వచ్చాడు" నర్సు చెప్పింది.

"వచ్చినతను చాణక్యే అని రూఢిగా తెలుసా?"

"తెలుసు. మీరు ఫొటో చూపించారుగా. అంతేకాదు, మీ అమ్మగారు నాకు పరిచయం చేసారు."

"ఏమని?"

"మన పెళ్లిగురించి చెప్పి కాబోయే కోడలుగా పరిచయం చేసారు."

"చాణక్య ఇంకా వున్నాడా అక్కడే?"

"ఉన్నాడు. అతని చూపులు చూస్తూంటేనే భయం వేస్తోంది నాకు. మీరు ఎంత త్వరగా వస్తే అంత మంచిది."

"వెంటనే బయలుదేరతాను. కాని చాణక్య నే నొచ్చే దాకా నమ్మకంగా వుంటాడా అక్కడే?"

"ఉంటాడనుకుంటాను. రేపు ఉదయం మీ అమ్మగారిని తీసుకుని ఎక్కడికో వెళ్లే సన్నాహంలో వున్నాడు."

"మా అమ్మ ఏమైనా చెప్పిందా?"

"నాకు మాత్రం ఇంతవరకూ ఏమీ చెప్పలేదు కాని, చూస్తూంటే వెళ్తారనిపిస్తోంది ఇద్దరూ కలసి. పెద్ద షెవర్లెట్ కార్లో వచ్చాడు మీ తమ్ముడు. మీ అమ్మగారు, అతను చాలా సేపు మాట్లాడుకున్నారు. నాకంతా తెలిసిపోయింది."

"ఏం తెలిసిపోయింది అంతా?"

"మీ ఇద్దరి పూర్తి వివరాలు."

"అంటే?"

"ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మ్యూజియంలో దొంగిలించిన వజ్రాల గురించి, మీరు దొంగలన్న సంగతి, మీ ఇద్దరూ ఒకరినొకరు చంపాలని ప్రయత్నంచేస్తున్న సంగతి, మీ నాన్న డోంగ్రే హత్యచేయబడ్డాడన్న సంగతి."

"ఆగు ఫోన్‌లో ఇష్టంవచ్చినట్లు మాట్లాడక."

"అన్నీ తెలిసాయి."

"తెలిసీ నాకు చెప్తున్నందుకు థాంక్స్ చాణక్యవచ్చిన సంగతి. నర్స్ నిన్ను నిజంగా పెళ్ళి చేసుకోవాలనుకుంటు న్నాను. అన్నీ తెలిసిన తర్వాత నీ అభిప్రాయం మారు తుందా నా విషయంలో!"

"బహుశ మారదు. ఇంకా పూర్తిగా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నాను."

"చాణక్య దగ్గర ఆ వజ్రాలు సంపాదిస్తే మిలియనర్స్
అవుతాం. ఆ తర్వాత మనిద్దరి జీవితం దర్జాగా గడుస్తుంది.
అఫ్‌కోర్స్. ప్రస్తుతం నాకు వజ్రాలు, నువ్వూ రెండూ
ప్రాముఖ్యమైనవే."

"చాణక్య విషపుచూపులు చూస్తుంటే నాకు భయంగా
వుంది. మీరు త్వరగా రావాలి."

టెలిఫోన్ ఆపరేటర్ మూడు నిముషాలు అయిపోయిన
సంగతి చెప్పింది.

"వెంటనే వస్తున్నాను."

ఫోన్ పెట్టేసాను.

గదిలోకివెళ్ళి బట్టలు మార్చుకున్నాను. నా రివాల్వర్,
కత్తి అందుకున్నాను డ్రాయరులోంచి. వాటిని నా దుస్తుల్లో
సర్ది, గదికి తాళంవేసి బయటకి నడిచాను. జీప్‌తాళం చెవులతో.

పావుగంటలో నేను రహస్యంగా జీప్‌ని ఆపి వుంచే ఖాళీ
స్థలం దగ్గరకి చేరుకున్నాను. జాగ్రత్తగా పరిశీలించి
చూసాను చీకట్లో ఎవరైనా పోలీసులు నక్కివున్నారేమో
నని, టార్చ్‌లైట్ వెలుగువేసి.

ఎవరూలేరు. జీప్ ఖాళీగావుంది.

అంటే పోలీసుల దృష్టి ఇంకా జీప్‌మీద పడలేదన్న
మాట.

జీప్ ఎక్కి, స్టార్ట్‌చేసి రివర్స్‌గేరులో బయటకి తీసుకు
వచ్చాను జీప్‌ని. క్షణాల్లో జీప్ ముందుకు వురికింది. నిముష
నిముషానికీ వేగం పెరిగింది, ఏక్సిలేటర్ బలంగా నొక్కడం
వల్ల.

సిగరెట్ వెలిగించాను జీప్ ఢిల్లీ పొలిమేరలు దాటగానే.
రోడ్డుమీద నా దృష్టినంతా కేంద్రీకరించి నడపసాగాను

జీప్‌ని. ఎనభై కిలో మీటర్ల వేగంతో పోతోంది జీప్ గంటకి.

ఆలోచనలలో మునిగిపోయాను, ముందు ముందు, శానిటోరియం చేరాక ఏంచెయ్యాలా అని.

దౌర్జన్యం వక్కటే జయిస్తుంది. చాణక్యచేత కక్కించాలి ఆ వజ్రాలు ఎక్కడ దాచినా సరే. మంచిగా మాట్లాడి ప్రయోజనంలేదు ఎంతమాత్రం.

కొద్దిగా ఉత్సాహంగా వుంది నాకు చాణక్య దొరకబోతున్నాడని తెలిసినందుకు. నన్ను దాటి వెళుతున్న కార్లలోకి చూస్తున్నాను జాగ్రత్తగా, చాణక్య అమ్మతో వెళుతున్నాడేమోనని.

జీప్ శానిటోరియం ప్రాంగణం చేరింది.

'నేషనల్ శానిటోరియం ఫర్ డిసీజెస్ ఆఫ్ ఛెస్ట్ ఎండ్ ట్యూబర్‌క్యులోపిస్.'

బోర్డు వుండి మెయిన్ గేటుకి.

మెయిన్ గేట్‌కి గేట్ వేసివుంది. హెడ్ లైట్లు ఆర్పి, వెలిగించి, ఆర్పి వెలిగించాను రెండుసార్లు, హారన్ కొట్టడం ఇష్టంలేక. వాచ్‌మన్ మేలుకునే వున్నాడు.

సిన్సియర్ ఫెలో.

గేట్ తీస్తూ నా వంక చూసాడు ఏం కావాలన్నట్లుగా.

జీప్‌ని గేట్‌లోంచి లోపలకి పోనించి ఆపి అడిగాను వాచ్‌మన్‌ని దగ్గిరకి పిలిచి.

"చెవర్లెట్ కారేదైనా బయటకి వెళ్ళిందా?"

లేదన్నట్లుగా తల అడ్డంగా వూపాడు.

"ఉదయం చెవర్లెట్ కారు వచ్చిందా ఏదయినా?"

"వచ్చింది."

"అది బయటికి వెళ్ళలేదుగా మళ్ళీ?"

"లేదు."

"నిద్ర పో ఐతే."

జీప్‌ని పోనిచ్చాను. కొంతదూరం కాటేజెస్‌కి చేర్చే రోడ్ మీద పోనిచ్చి. తర్వాత రోడ్ ప్రక్కనున్న మైదానంలోకి మళ్ళించాను జీప్‌ని. హెడ్‌లైట్లు ఆర్పేసి.

దాదాపు ఓ మైలు విస్తీర్ణంవున్న ఆ మైదానంలో అక్కడక్కడ కాటేజెస్ విసిరిపేయబడ్డట్లుగా వున్నాయి. ఆ కాటేజెస్‌లలో దగ్గుతూ, రోగంతో క్షీణించే టి. బి. పేషెంట్లు వున్నారు.

కొంతమందికి నయం అవుతుంది. అదృష్టవంతులు బయటపడతారు. దురదృష్టవంతులు పైకి వెళతారు.

ఆరోగ్యంగా వున్న నేను ఆ కలుషిత వాతావరణంలోకి అడుగుపెట్టడం ఇష్టం లేకపోయినా తప్పటంలేదు.

ఆపాను జీప్‌ని అమ్మవుండే కాటేజ్‌కి ఐదువందల గజాల దూరంలో. జీప్‌లో కూర్చునే చూసాను కాటేజ్ వంక. లోపల లైట్ వెలుగుతోంది. పన్నెండైనా ఇంకా పడుకోలేదన్నమాట.

పూర్ణిమ దాటి ఎనిమిది రోజులైంది. బయటికి వచ్చినా నేను వున్న జీప్ కనపడదు. చెట్టు ఒకటి అడ్డం కాటేజ్‌కి, జీప్‌కి మధ్య.

జీప్ దిగి కాటేజ్‌కి వున్న కిటికీవైపు నడిచాను నిశ్శబ్దంగా. గాలి ధారాళంగా వచ్చేందుకు అనువుగా కట్టారు ఆ కాటేజ్‌ని. గోడకి ఆనుకుని పిల్లిలా నిశ్శబ్దంగా జరిగాను కిటికీవైపు. కిటికీలోంచి చూసాను లోపలకి.

అమ్మ పక్కతే వున్నది లోపల. పడుక్కొని వుంది మంచం మీద కళ్లు మూసుకుని.

'ఈశ్వర అల్లా తేరేనామ్

సబ్‌కో సన్మతి దేభగవాన్'

గాంధీ గారికి ఇష్టమైన ప్రార్థనా గీతం పాడుతూ పడుక్కొని వుంది అమ్మ.

చాణక్య లేడు గదిలో. విజిటర్స్ చైర్ ఖాళీగా వుంది.

ఎక్కడున్నట్లు?

అమ్మ ముందు చాణక్యని హింసించ లేను. ఆ విశాలమైన మైదానంలో ఎక్కడైనా సరే. వంటరిగా చాణక్య నుంచి బయట పెట్టించాలి ఆ ఏడు వజ్రాలని ఎక్కడ దాచిందీ.

ముందర నర్స్‌ని కలవాలి.

పావు గంటదాకా అలాగే నిలబడ్డాను అక్కడే వంటరిగా ఏం చేయాలా అని అలోచిస్తూ. తర్వాత నడిచాను. నర్స్ ఎక్కడ వుంటుందో తెలుసు నాకు.

కొంచెం దూరంలో వున్న చిన్న ఖాళీ కాటేజ్‌లో వుంటుంది. అదే నర్స్ డ్యూటీ రూం. ఆ డ్యూటీ రూంనిండా మందులు కూడా వుంటాయి. పేషెంట్స్‌కి ఇవ్వడానికి ఫ్రిజిడేర్‌లో పళ్లు. ఎగ్స్‌తో పాటు ఫ్రిజ్ మీద అలారం టైంపీస్ వుంది.

నెమ్మదిగా నడిచాను ఆ ఖాళీ కాటేజ్ వైపు. నిశ్శబ్దంగా వుంది లోపల. చీకటిగా వుంది. లైట్ వెలగడం లేదు. తలుపు మూసి వుంది.

నర్స్ లోపల వుందా, లేదా? వుంటే నిద్ర పోతోందా? అలవాటు ప్రకారం జాగ్రత్త పడ్డాను. ఓ సారి చుట్టూ చూసాను. కిటికీ కూడా మూసే వుండడం కొద్దిగా విచిత్రం అనిపించింది నాకు.

నా మనస్సు నిండా ఆలోచనలు ముసురుకున్నాయి. ఏం చెయ్యాలి? తలుపు తట్టడమా, మానడమా?

చివరికి తలుపు తట్టడానికే నిశ్చయించుకున్నాను. తలుపు తట్టాను వీలయినంత మృదువుగా.

లోపల నుంచి సమాధానం లేదు.
మళ్ళీ తట్టాను.
కదలిక లేదు లోపల.
నా మనస్సు కీడుని శంకించింది.

గట్టిగా తోశాను తలుపుని. కిర్రుమంటూ తెరచుకుంది తలుపు. టార్చ్‌లైట్ వెలిగించి చూసాను.
చటుక్కున ఒక్కడుగు వెనక్కి వేసి టార్చి ఆర్పేసాను.
పళ్లు పటపట కొరికాను.
'చాణక్య. నిన్ను చంపక మానను' అనుకున్నాను మనసులో కసిగా.

మళ్ళీ లైట్ వెలిగించి చూసాను లోపల.

ఓ మానవాకారం నగ్నంగా పడివుంది లోపల. కదలిక లేదు. చలనం లేదు. జీవం లేదు.

అది నర్స్ శవం!!

—(ముగింపు వచ్చే నెలలో)

పోటీ నెం. 44

1

"వినర వినర ! జై సింహాజయము!! భూస్వామి బలము!!!"-పై మాటల్లో దేవుడున్నాడా?

—కె. విజయలక్ష్మి, విజయవాడ.

2

నా పేరు ఇంగ్లీషులో ఎనిమిది అక్షరాలు. మొదటి నాలుగు అక్షరాలు తీసేస్తే తెలుగులో ఎక్కువ అని, మొదటి అక్షరం తీసేస్తే నివాళి అని అర్థం వస్తాయి. మొదటి రెండు అక్షరాలు తొలగించినా తొలగించక పోయినా సినిమా నటినే. మొదటి మూడు అక్షరాలు తొలిగిస్తే మాత్రం మదనుడి భార్య నవుతాను.

మరి, నా పేరేమిటో చెప్పండి చూద్దాం?

—ఏ. విజయలక్ష్మి, విజయవాడ.

3

ఓ పురాతన వస్తుప్రదర్శనశాల దర్శించి వచ్చిన ఓ పెద్ద మనిషి "650 బి. పి. అని వ్రాసి వున్న ఓ అందమైన బంగారు నాణెం చూసాను. అది నాలుగు పలకలుగా, ఎంతో మందంగా, చూడ ముచ్చటగా ఉంది" అన్నాడు.

ఆయన అబద్ధమాడుతున్నాడని అది విన్న ఓ ఆర్కియాల

జీస్టు అన్నాడు. ఎందుకని?

—జి. దుర్గా బాబ్జీ, రూర్కెలా.

4

అందనిది ఆకాశం
విందారగించాడు కామేశం
పిల్లలగోల భరించుట కష్టం
కాపాడరావా గిరీశం
కరుణించుము కలకాలం
అదృష్టహీనుడు అన్నది లోకం!

—ఆంధ్ర ప్రదేశమంతటా విజయఢంకా మ్రోగించిన నేను పై మాటల్లో దాక్కున్నాను. నేనెవరో కనుక్కోండి?

—ఎ. పి. భూషన్, కడప.

* * *

[పై నాలుగు సమస్యలకు మీ జవాబులను ఒక పోస్టు కార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, యీ నెల 20 వ తేదీ లోగా మాకు చేరేటట్లు పంపండి. సరియైన సమాధానాలు వ్రాసిన హోం. డె. పాఠకుల పేర్లు నవంబర్ '74 నెల "సప్లిమెంట్"లో ప్రచురిస్తూ, లాటరీ వేసి వారిలో ముగ్గురు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/-లు చొప్పున నగదు బహుమతి పంప గలము. —ఎడిటర్.]

పోటీ నెం. 42 [జవాబులు]

(1) సున్నము, వక్క, ఆకు.

(2) హంతకుడు సూచించిన పరిష్కారం; ఇద్దరినీ చంపే యాలనటమే.

(3) 10+6, 4+3, 1+5, 2+7, 8+9.

(4) కరెన్సీని.

★

నాయుడోళ్ళింటికాడ...
నల్లతుమ్మచెట్టు కింద...
నాయుడేమన్నాడె పిల్లా..



చంటాడికి
సిగరెట్లకోసం నేను
డబ్బివ్వలేనని కాస్త
నువ్వైనా చెప్పవే చిట్టీ!

గడ్డి తినే
మనుషులు

సరకులు రవాణా నౌక "జలభారతి" లంగరు వేయబడి ఉంది. గత మూడు రోజులుగా సూర్యరశ్మి చూడలేదు నౌకలోని కొద్దిమంది నావికులు.

పెనుతుఫాను సూచనలు పసిగట్టంగానే నౌక కేప్టెన్ రజాక్ నౌకను దగ్గరలో కనుపించిన దీవివైపుగా పోనిచ్చి లంగరు వేయించాడు.

అతడి దూరదృష్టే నౌకను కాపాడింది. పెనుతుఫాను ఉధృతంగా వీచింది వరుసగా మూడురోజులు. చేరువలోని దీవి దగ్గరగా లంగరు వేయబట్టి నౌక తుఫాను భీభత్సానికి గురి కాలేదు. అదే సముద్రమధ్యంలో గనుక ఉండి ఉంటే నౌక, నౌకలోని విలువైన సరుకంతా సాగరగర్భంలో జల స్థాపితం అయిఉండేవి.

నౌకలోంచి దిగి కనుచూపుమేరలో ఉన్న దీవిలోకి పోదా మన్నారు కొందరు నావికులు.

అయితే కేప్టెన్ రజాక్ అందుకు ఒప్పుకోలేదు. ఆ దీవి ఏమిటో ఎవరికీ తెలీదు. ఆకు పచ్చని చెట్ల సముదాయం వెనుక ఏ ప్రమాదం కాచుకొని ఉందో ఎవరికీ తెలీదు.

"ఈ దీవి ఎక్కడిదో, దాని పేరేమిటో గూడ తెలీదు. దానిమీద, మనుషుల్ని నమిలి తినేసే ఆటవికులే ఉన్నారో, ఘోర సర్పాలే ఉన్నాయో లేక, రక్కసి వృక్షాలే ఉన్నాయో తెలీదు! అందుకే ఎవరూ ఆ దీవిమీదకు దిగద్దు" అన్నాడు రజాక్.

"అదీ నిజమే! ఓడలోనే కాచుకుని ఉందాం. ఎప్పుడు తుఫాను తగ్గుతుందో అప్పుడే లంగరెత్తి వేయచ్చు!" మరో నావికుడు జోసఫ్ అన్నాడు.

ఇంకా నౌకలో అయిదారుగురు నావికు లున్నారు. వాళ్ళంతా లోపల కాబిన్‌లో పడుకుని నిద్రపోతున్నారు

వెచ్చగా కంబళ్లు కప్పుకుని, జీవితంలో ఎన్నడూ నిద్ర ఎర గని వాళ్ళలా; కేవలం నిద్రపోవటానికే ఆ నౌకలోకి వచ్చి నట్టుగా నిద్రిస్తున్నారు.

కొద్ది కొద్దిగా మేఘాలు వీడిపోతున్నయ్. ఆకాశంమీద అక్కడక్కడా నక్షత్రాలు బయటపడుతున్నయ్. ఆ తారక లను చూసి అది రాత్రి కాబోలు అనుకున్నారు డెక్ మీదున్న నావికులు. ఆకాశం అంతకంతకు నిర్మలమైపోతున్నది.

''వాతావరణం ఇదే లెక్కన తేటపడితే రేపుదయమే మనం లంగరెత్తేయవచ్చు!'' అన్నాడు రజాక్, జోసఫ్‌ని ఉద్దేశిస్తూ.

''అవునవును! ఇప్పటికే మనం నాలుగురోజులు లేట్ అయాం! అక్కడ మన గురుడు మన ఓడ ఇంకా రాలేదని చిందులు త్రొక్కుతూ ఉంటాడు!'' జోసఫ్ నవ్వుతూ అన్నాడు.

''చిందులు త్రొక్కితే తొక్కనీ? అదే ఈ నౌక సము ద్రంలో మునిగిపోయి ఉంటే ఏం చేసేవాడు! ఎవరిమీదని ఎగురుతాడు? ముందుచూపుతో సరుకుని కాపాడినందుకు మెచ్చుకోలు లేకపోగా కేకలేస్తాడా?'' రజాక్ కోపంగా అన్నాడు.

జోసఫ్ బాటిల్ తీసి రెండు గ్లాసుల్లో పోశాడు. ఒకటి తను తీసుకుని మరోదాన్ని రజాక్‌కి అందించాడు. డెక్ మీద రెయిల్స్‌మీదుగా వంగి అగాధమైన నీళ్ళలోకి, అనంతమైన చీకటిలోకి చూస్తూ గ్లాసులు ఖాళీ చేశారిద్దరు.

''యొహోయ్!'' పెద్దకేక వినవచ్చింది.

రజాక్, జోసఫ్ లిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసు కున్నారు. గ్లాసులు ఖాళీచేసిన పిమ్మట ఇద్దరికీ కొంచెం మైకంగా, కొంచెం తేలికగా ఉంది. కలా, నిజమా తేల్చుకో

లేని స్థితిలో ఊగులాడుతున్నారు.

"నీవేమైనా అరిచావా?" జోసఫ్ అడిగాడు.

"ఒక సీసాకే మైకం వచ్చేటంత బలహీనుడ్ని కాదు లేరా!" రజాక్ అరిచాడు.

"మరి ఆ కేక ఎక్కడిది దంటావ్?"

"ఆ! మన చెవులకు గాలి హోరు వినిపించి ఉండవచ్చు."

"గాలి ఎక్కడిదీ! అంతా ప్రశాంతంగా ఉంటేను?"

"అదే నాకూ అర్ధం కాకుండా ఉంది."

ఇద్దరూ చెవులు రిక్కించి చుట్టూ పరికించి చూశారు.

నీళ్ళలో ఏదో జలచరం కదిలినట్టుగా నీళ్ళమీద గలగల శబ్దం వినిపించింది.

మళ్లీ అదే కేక వినిపించింది "యొహోయ్!"

ఈ తడవ ఇద్దరూ ఆ కేక నీళ్ళమీదనుంచి వచ్చిందేనని రూఢిగా అనుకున్నారు.

"ఎవర్రా అది!" రజాక్ గొంతు కర్కశంగా వినిపించింది.

"నా గురించి మీరేం భయపడక్కర్లేదు. నేను ఏ అపకారము తలపెట్టలేని అశక్తుడ్ని! నన్ను నమ్మండి!" నీళ్ళమీది నుంచి పెద్దగా అరుస్తూ ఒక వ్యక్తి సమాధాన మిచ్చాడు.

"అయితే నౌక చాటుమాటుగా దాక్కుంటావెందుకు? పైకి రారాదూ?"

"నేను పైకి రాలేను!నాకు అది ప్రమాదకరం గూడాను!"

రజాక్ గభాలున వెనక్కు వెళ్ళాడు. ఎత్తుగా వున్న కొయ్య దిమ్మమీద వున్న ఫ్లాష్ లైట్‌ని తీసుకుని మళ్ళీ రెయిల్స్ దగ్గరకు వచ్చాడు. లైట్ వెలిగించి నీళ్ళమీదకు ఫోకస్ చేశాడు.

అయితే ఈ విషయాన్ని ఆగంతకుడు ముందే పసిగట్టి

నట్టున్నాడు. లైట్ వెలుతురు రాకముందే నీళ్ళలో ఈదుతూ చాటుకు వెళ్ళిపోయాడు.

"ఎక్కడయ్యా నీవు?" రజాక్ అరిచాడు.

ఈ తడవ సమాధానం చాలా తగ్గు స్వరంలో వినిపించింది. అంటే ఆగంతకుడు దూరంగా వెళ్ళిపోయాడన్న మాట, అనుకున్నాడు జోసఫ్!

"ముందు ఆ దీపం తీసివెయ్యండి!"

"ఎవఁడ్రా వీడు! మన పాలిట శనిలాగ దాపురించాడు. ఆ ఫ్లాష్‌లైట్ తీసి యధాస్థానంలో ఉంచెయ్! వాడి సంగతేదో తేలుద్దాం!" జోసఫ్ అన్నాడు విసుగ్గా.

రజాక్ ఫ్లాష్‌లైట్‌ని ఆర్పేశాడు. దాన్ని తీసుకు వెళ్ళి కొయ్యదిమ్మ మీద పెట్టేశాడు.

నీళ్ళ మీద తెడ్లు వేస్తున్నట్టుగా చప్పుడు వినిపించింది.

"దీపం తీసేశాములే! దగ్గరకు రా!" జోసఫ్ అరిచాడు.

ఆగంతకుడు నౌక ప్రక్కకు చేరువలోకి వచ్చాడు.

"మళ్ళీ దీపం వెయ్యమని హామీ ఇస్తేనే వస్తాను!"

"వెలుగు అంటే అంత భయం ఎందుకు!"

"ఎందుకంటే...?" అతడు ఏదో చెప్పబోయేంతలో రజాక్ అడ్డుపడ్డాడు.

"ఇదిగో మిస్టర్! ఈ నిర్మానుష్యమైన ప్రదేశంలో నీవు ఒక్కడివే తారాడుతున్నావెందుకు? నీవు నరుడివా, రాక్షసుడివా? దయ్యానివా? భూతానివా? నీ వొక్కడివేనా? నీతో ఇంకెవరన్నా వున్నారా? నీనుంచి మాకే ప్రమాదంలేదని హామీ ఇవ్వగలవా?"

"క్షమించండి! నా వల్ల మీ కేటువంటి ఇబ్బంది కలుగగూడనే నా ఉద్దేశ్యం. నాతోబాటు మరో స్త్రీ ఈ దీవిమీద ఆకలికి చచ్చిపోయేలా వున్నాం!" ఆగంతకుని నుంచి జవాబు

వచ్చింది. "మీకు నామీద అనుమానంగా ఉందేమో! వెళ్ళి పోతున్నాను లెండి!" అతడు ఈదుతూన్న సవ్వడి వినపడింది.

"ఆగు! నిన్ను వెళ్ళగొట్టటం మా అభిమతం కాదు. ఇలా దగ్గరకురా! నీకేం కావాలో చెప్పు!" రజక్ సానుభూతిగా అన్నాడు.

అతని కంఠంలో ఆగంతకుని వల్ల తమకేమీ ప్రమాదం రాదన్న ధీమా గోచరిస్తున్నది.

"మాకేదన్నా తినటానికి ఇవ్వండి! చాలు!" నీళ్ళలో నుంచి మాటలు వినబడినయ్.

"అలాగే ఇస్తాం! త్రాటి నిచ్చెన మీదుగా పైకిరా! నీవు మోసుకెళ్ళగలిగినంత ఆహారం ఇస్తాం!" జోసఫ్ పలికాడు ఈమారు.

"అసలు నువ్వీ నిర్జన ప్రదేశంలోకి ఎలా వచ్చిపడ్డావ్! ఏదన్నా ఓడ ప్రమాదంలో ఇక్కడ చిక్కుపడిపోయావా?"

"అవును. వారంరోజుల క్రితమే మేము పయనించే బోటు ప్రమాదంలో చిక్కుకొని యీ దీవిలో కొచ్చిపడ్డాం. క్షమించండి! నేను పైకి రాలేను. త్రాడుతో క్రిందకు జారవిడవండి! మీ సహాయానికి చాల కృతజ్ఞుడ్ని. మీకు భగవంతుడు మేలు చేస్తాడు."

"ఆస్త్రీ కూడా నీతోబాటే, అంటే నీ వెంటే వుందా?"

"లేదు! ఆమె దీవిలోనే వుంది. ఆమెకు కదిలేందుకు గూడా ఓపికలేదు! చావు బ్రతుకుల్లో వుంది."

"ఇదిగో! తాడు చివర తినుబండారాల ప్యాకెట్ దించుతున్నాం! వాటిని తీసుకెళ్ళి ఆమెను రక్షించుకో! వాతావరణం బాగుంటే మేము రేపు ఉదయం బయలుదేరుతాం. మీరూ వస్తే మాతో తీసుకెళ్లతాము."

"క్షమించండి మేము రాలేము. వచ్చే అర్హత మాకిక లేదు" వేదనతో అన్నాడతను.

జోసఫ్ యీ లోపలవెళ్ళి రొట్టెలూ, బిస్కెట్లూ, జున్నూ మాంసం ముక్కలుతీసి ఒక కొయ్య పెట్టెలో తెచ్చాడు. దాన్ని తాడుకి చివర గట్టిగా కట్టి క్రిందకు జారవిడిచాడు నెమ్మది నెమ్మదిగా.

"ఆఁ!" అన్న కేక వినబడింది క్రిందనుంచి.

ఆ వ్యక్తి పెట్టెను విప్పుకుని సంతోషంగా అరిచాడు.

"మళ్ళీ కలుస్తాను సార్!" ఆ తర్వాత నీళ్ళమీద తేలుతున్న పెట్టెను నెట్టుకుంటూ ఈదుతూ ఆ వ్యక్తి వెళ్ళిపోయి వుంటాడని ఆ ఇద్దరు ఊహించుకున్నారు, చీకట్లో నీళ్ళమీద వినవచ్చే శబ్దాన్నిబట్టి.

* • *

రజాక్, జోసఫ్ ఏవేవో విషయాలు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. రెండు ప్యాకట్లు "పనామా" సిగరెట్లు కాల్చి పారవేశారు.

అంతలోనే నీళ్ళమీద మళ్లీ అలికిడి వినపడింది.

"అదిగో! అతడు మళ్లీ వస్తున్నట్టున్నాడు!" అని ఇద్దరూ రెయిల్స్ మీదుగా వంగి నీళ్ళలోకి చూశారు.

ఆ చీకట్లో వాళ్ళకేమీ కనబడలేదు. చీకట్లో కళ్ళ కన్న చెవులే చూస్తుంటాయ్.

"హల్లో! స్నేహితులారా! మీ సహాయానికి నేనూ నా భార్యా ఇద్దరం కృతజ్ఞులం. ఇప్పుడామె హాయిగా నిద్ర పోతోంది. శాశ్వత నిద్ర. ఆకలి దప్పులయే పరిస్థితిని దాటుకుని నన్ను ఒంటరి వాడ్ని చేసి పోయింది" ఆగంతకుని స్వరం దయనీయంగా ఉంది.

"ప్చ్! పాపం!" అన్నారిద్దరూ.

"ఇక నేనూ ఎన్నోరోజులు బ్రతుకుతాననుకోను! అందుకే నేను చేసిన పాపం మీకు చెబుదామనే వచ్చాను."

ఆగంతకుడు తన కథ చెప్పటం మొదలెట్టాడు.

* * *

"నేను కొచ్చిన్ రేవులో సరకులు దింపే కళాసీగా పని చేస్తుండే వాడిని. ఈ రోజుల్లో ఓడ రేవుల్లో అనేక రకాల సరకులు దిగుమతి అవుతుంటాయి. కొందరు ఘరానా పెద్ద మనుష్యులు విదేశీ సరుకుల్ని స్మగ్లింగ్ చేస్తుంటారనేది అందరికీ తెలిసిన రహస్యమే!

ఒకసారి ఒక పెద్దమనిషి బంగారం బిస్కెట్లతో ఓడ దిగాడు. నేను ఓడలోనుంచి, పెద్ద పెద్ద బేళ్ళను దింపు తున్నాను ఇతర కళాసీలతో బాటు, క్రేన్ సాయంతో. ఆ పెద్దమనిషి నా దగ్గరకు వచ్చి ఒక బ్రీఫ్ కేస్‌ని నాకందించాడు ఎవరూ చూడకుండా. దాన్ని బేళ్ళక్రింద దాచి ఉంచమనీ, సాయంత్రంలోగా తను మళ్లీ వచ్చి తీసుకుంటాననీ చెప్పాడు.

"ఈ పని చేశావంటే నీకు వంద రూపాయలిస్తాను. అంతే కాదు ఆ కేస్ బేళ్ళక్రింద పదిలం చేసే బాధ్యత గూడ నీదే. నేను తిరిగి వచ్చేదాకా అది అక్కడే ఉండేటట్టుగా కనిపెట్టి ఉండు. లేదా రేపు నీవు ప్రాణాలతో ఉండవు" అని ఆ పెద్దమనిషి అన్నాడు.

"అలాగేనండీ! నా బహుమతి మరి ముందరే ఇప్పించాలి!"

అతడు నవ్వాడు. వెంటనే జేబులోంచి వంద రూపాయల కాగితాన్ని నా చేతిలో పెట్టి బయటకు వెళ్లిపోయాడు.

నేను ఆ బ్రీఫ్ కేస్‌ని బేళ్ల మధ్యగా ఎవరికీ కనబడకుండా ఉండేలా దాచాను.

ఓడలోని సరకులు దించడం అయిపోయింది. ఆ ప్రత్తి బేళ్లన్నీ ఈజిప్టు నుంచి దిగుమతి అయిన మేలురకం ప్రత్తి. కేరళలోని టెక్స్టయిల్ కంపెనీ ఏదో వాటిని దిగుమతి చేసుకుంటోంది. ఆ బేళ్లు ఒకరోజు వరకూ ఖాయంగా ప్లాట్ ఫారమ్ మీదే ఉంటాయ్.

ఓడ వెళ్లిపోయింది. కళాసీలందరూ మరో బెర్త్ దగ్గర ఆగివున్న ఓడ దగ్గరకు వెళ్లి సరకులు దించుతున్నారు.

నేను మాత్రం సోమరిగా బేళ్ల దగ్గరే కూర్చుండిపోయాను. నా జేబులో నెల గ్రాసం చేరుకుని ఉందిగదా! వంద రూపాయలంటే మాటలా? నెల రోజులు సరుకులు మోస్తేగాని రాదు. ఖాళీగా కూర్చున్న నా ఆలోచనలు బ్రీఫ్ కేస్‌మీదకు పోయినయ్. అందులో ఎన్ని లక్షల రూపాయల విలువగల బంగారం వుందో. అదంతా నాదయితే ఎంత బాగుంటుంది అన్న దురాలోచన కలిగింది. నా మెదడులో పురుగు తొలుస్తోంది. నాలో సైతాన్ తాండవం చేయ సాగాడు.

ఒకవేళ ఆ బ్రీఫ్‌కేస్ కాజేసిన తర్వాత ఎలా తప్పించుకోవాలి? ఆ వ్యక్తి వెనుక పెద్ద గ్యాంగ్ వుండి వుంటుంది. వాళ్లు తనని ప్రాణాలతో వదులుతారా?

అతడు గాని సాయంత్రం లోపల రాకపోతే ఆ బ్రీఫ్ కేసుని తనే తీసుకుని ఉడాయించవచ్చు. ఈ లోపల అతడ్ని పోలీసులు పట్టుకుంటే ఎంత బాగుంటుంది? లేదా మరో గ్యాంగ్ వాళ్లు అతడ్ని హత్య చేయగూడదూ! ఇలాంటి ఆలోచనలతో మధ్యాహ్నం దాకా గడిపాను.

ఆ పెద్దమనిషి కోసం నిరీక్షిస్తూ గంటలు గడపసాగాను. అయితే సాయంత్రం వస్తానన్న వ్యక్తి మధ్యాహ్నానికే తిరిగి వచ్చాడు.

అతడు హార్బరు బయటనుంచే నా కోసం కబురంపాడు.

"చూడు కళాసీ! ఎలాగో లాగు నువ్వే ఆ సరుకుని బయటకు తీసుకురా! దానికీ బహుమతి ఉంటుంది!" అన్నాడు కారులో కూర్చునే. అతడి ప్రక్కనే మరో అందాలరాశి ఉంది. ఆమెను చూస్తూనే నా కళ్లు జిగేల్‌మన్నాయ్. లోకంలో అంతటి అందాలరాశి ఉంటుందా అనిపించింది.

"చాలా కష్టంసార్! అవుట్‌వర్డ్ షెడ్స్‌లోనుంచి తీసుకురావాలి! పట్టుకుంటే కష్టం."

"మరేం భయంలేదు. పోర్టంతా ఖాళీగానే ఉంది. అట్టే జనసమ్మర్దం లేదు!"

నాకు గత్యంతరం లేకపోయింది. తిరిగి లోపలకు వెళ్లాను. అప్పుడే ట్రాలీలోకి ఏదో పెద్ద పార్సిల్స్ లోడ్ చేస్తున్నారు. బ్రీఫ్‌కేసు చుట్టూగోతం చుట్టి దాన్ని వాటి మధ్యలోకి తోసేశాను.

"ఏయ్! కళాసీ! ఏం చేస్తున్నావక్కడ! ఇటు ప్రక్కకు వచ్చి రైట్ చెప్పుదూ!" ట్రాలీ డ్రైవర్ అరుపు వినబడింది.

మెకానికల్ ట్రాలీనిండా సరుకులన్నాయ్. అవతలవైపున ఉన్న డ్రైవర్‌కి దోవగూడ కనిపించకుండా ఎత్తుగా పేర్చారు. పెట్టెల్ని.

నేను ప్రక్కనే నిలబడి కాషన్ చెబుతూ ట్రాలీని బయటకు నడిపించాను.

నేర్పుగా మళ్లీ నా గోతాన్ని చంకలో ఇరికించుకుని ఎవరూ అనుమానించకుండా బయటపడ్డాను. బ్రీఫ్‌కేస్‌ని ఏమార్చివేద్దామనుకుంటే వీడు తనచేతనే కేస్‌ని తెప్పిస్తున్నాడు. నా ప్లాన్ భగ్నమయినందుకు హృదయం భగ భగ మండుతోంది. కారు దగ్గరకువెళ్ళి కేస్‌ని అందించాను. అతడు నా వంక అనుమానంగా చూస్తూ "నువ్వా కారులో

కూర్చో'' అన్నాడు.

డోర్ తెరుచుకుని డ్రైవర్ ప్రక్కనే కూర్చున్నాను. కారు సాగిపోయింది. చేజిక్కిన లక్షలు జారిపోతున్నాయే అనేబాధ నన్ను పీడించసాగింది.

ఆ పెద్దమనిషి బ్రీఫ్‌కేస్ తెరచి చూసుకున్నాడు. పెట్టె నిండా బిస్కెట్లు ఉన్నయ్. వాటిని చేత్తో తడిమి చూసుకుని తృప్తిగా నవ్వుకున్నాడు.

''చూడవోయ్! నేను ఇవాళల్లా ఈ ఊర్లోనే ఉంటాను, నీకు అభ్యంతరం లేకపోతే నాతో ఉండిపో ఇవాల్టికి!''

వెదుకబోయిన తీగ కాలికి తగిలినట్టయింది. అతడి వెంట నంటి ఉంటే ఏ అవకాశం వచ్చినా చాలుననే ఉద్దేశ్యంతో ఉన్న నాకు అతడి ఆహ్వానం ఆనందాన్ని కలిగించింది.

కారు ఇంపీరియల్ హోటల్ ముందు ఆగింది. అతడు డబుల్ రూమ్ బుక్ చేశాడు. నాకో సింగిల్ రూమ్ తీసుకున్నాడు. ఆ రోజు నా జీవితంలో మరపురాని రోజు. మహారాజ భోజనం. త్రాగినంత తాగ్రి అలసిపోయి బెడ్‌మీద పడుకున్నాను. నా డ్రెస్ బాగోలేదని తన దగ్గరున్న మరో జత ప్యాంటూ, స్లాకు తీసిచ్చాడు. అవి నాకు ఇంచుమించుగా సరిపోయినయ్.

ఆ హోటల్లోనే ఆ వ్యక్తి తన సరుకుని ఎవరితోనో ఎక్స్ఛేంజి చేసుకుంటాడా! ఆ తర్వాత బహుశా నా ప్రాణాలు తీసి నా ఆచూకీ తెలియకుండాచేసి పారిపోవచ్చు.

ఆ పని నేనే చేయటానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను.

ఆ పెద్దమనిషి వెంటవచ్చిన అందాలబొమ్మ నిద్రపోతున్నది బెడ్‌మీద.

నేను ఆయన దగ్గరగా వెళ్ళాను.

"సార్! నన్నుగూడ మీ వ్యాపారంలోకి చేర్చుకుంటారా? చాల నమ్మకంగా పని చేస్తాను సార్!" అన్నాను.

"నేను నాయకుడితో మాట్లాడి చెబుతాను! అంతదాకా నీ వీ విషయాన్ని ఎవరికీ చెప్పకు! తెలిసిందా?"

"తెలిసింది సార్! మరో రహస్యం! ఇందాకట్నుంచి ఇద్దరు వ్యక్తులు ఆ ఎదురు వరండాలో నిలబడి మన రూమ్ వంక చూపిస్తూ ఏవో మాట్లాడుకుంటున్నారు సార్!"

అతడు గాభరాపడ్డాడు. "ఎక్కడ? ఎక్కడ?" అంటూ లేచాడు.

"ఇక్కడనుంచి కనబడరు సార్! నా రూములోని కిటికీ లోంచి చూస్తే బాగా కనబడతారు!"

"అలాగా! పద చూద్దాం!" అతడు జేబులోని పిస్తోల్ని బయటికి లాగి చూసుకుని, నా వెంట నడిచాడు.

గది బయటకువచ్చి తలుపు లాక్ చేశాడు. ఇద్దరం నా రూమ్‌లోకి నడిచాం. నేను ముందు గదిలోకి వెళ్ళాను. అతడు ఎదురుగా వరండాలోకి చూస్తూ వెనుకగా నడుస్తూ గదిలోకి వచ్చాడు.

అతడి వెనుక వేపునుంచి నేను అతడి నోరుని గట్టిగా మూసేశాను. కాలితో తలుపును తన్నాను. తలుపు మూసుకుపోయింది. నా చేతిలోని కత్తితో అతడి వీపులో బలంగా పొడిచాను. ఆ తర్వాత మరొకటి!....మరొకటి!

ఆ వ్యక్తి పిస్తోలు తీయటానికి ప్రయత్నించాడు. అయితే ఆ విషయం నాకుముందే తెలుసు. అతడి ప్రయత్నాన్ని విఫలం చేసి మరో రెండు పోట్లతో అతడ్ని యముడి దగ్గరకు పంపాను.

ప్రాణంలేని శరీరాన్ని బాత్‌రూమ్ దాకా లాక్కెళ్ళి

అందులో పడేశాను.

నీళ్ళుతెచ్చి నేలమీది ర క్తపు మరకల్ని కడిగేశాను.

నా గది లాక్ చేసి అతడి రూమ్‌లోకి వెళ్ళాను తాళంతీసు కుని. మరో బెడ్ క్రిందఉన్న బ్రీఫ్ కేస్‌లోని బంగారం బిస్కె ట్లను సంచీలోకి పోశాను. ఆ సంచీని చూపిన వాడెవడూ అందులో లక్షల ఖరీదు చేసే 'సరుకు' ఉంటుందని వూహించలేరు.

తలుపు లోపల గడియపెట్టి నిద్రపోతున్న సుందరి మీదకు ఒరిగాను. ఆమె సగం నిద్రలో తన భర్తే అను కుందో ఏమో నన్ను దగ్గరకు లాక్కుంది. అయితే అంత లోనే మత్తు విడిపోయింది.

"నువ్వా?" కళ్లు పెద్దవి చేసి అరిచింది.

"అరవకు! మీ ఆయన బయటికి పారిపోయాడు. ఎక్సయిజ్ వాళ్లు వెంటబడితే! చీకటి పడంగానే మనల్ని గూడ రమ్మన్నాడు!"

"అయితే మటుకు? నీవు చేసే అఘాయిత్యం ఏమిటి?" ఆమె కోపంగా అంది.

"నీవూ, నీ భర్తా, లక్షలు విలువ చేసే బంగారం సుర క్షితంగా బయట పడాలని ఉంటే నన్ను కాదనకు!"

"లక్ష రూపాయల బంగారమా?" ఆమె ఆశ్చర్యంగా అడిగింది.

"ఏం అలా ఆశ్చర్య పోతావ్! నీకు తెలీదా నీ భర్త చేసే వ్యాపారం?"

"లేదు! ఏదో లాభసాటి అయిన వ్యాపారం చేస్తున్నాడనే తెలుసు! కానీ ఫలానా అని తెలీదు! అదీకాక అతడు నా భర్త కాదు. నేతని ప్రియురాల్నికాను. అప్పుడప్పుడు ఆతనితో ఇలా

వేస్తుంటాను. అంతే! అంతకన్నా నాకింకే వివరాలు తెలీవు."

ఇద్దరం అలసిపోయాం! ఆ తర్వాత నేను లేచి ఆమెకు నా పాత సంచీలోని ధనం చూపించాను.

ఆమె వాటిని చేతిలోకి తీసుకుని ఆశ్చర్యంతో మరీ మరీ చూసింది.

"నీ వంటి బంగారం ముందు ఆ బంగారం ఏపాటి?" అన్నాను నేను సగం నగ్నంగా ఉన్న ఆమె శరీరం వంక చూస్తూ.

"చాల్లే! అవు నీ పొగడ్తలు!"

"ఇదిగో! నాకు భలే అయిడియా వచ్చింది! నీవు బెడ్ మీద పడుకో!" అన్నాను ఆమె నుద్దేశించి.

"మళ్లీనా?"

"కాదు పడుకో చెబుతాను!"

ఆమె బెడ్ మీద పడుకుంది. ఆమె వంటిమీద గుడ్డలన్నీ లాగేశాను.

ట్యూబ్ లైట్ వెలుతురులో ఆమె శరీరం మెరిసి పోతున్నది. ఆ సంచిలోంచి బంగారం బిస్కట్లు తీసి ఆమె ఒంటిమీద వరుసగా పేర్చాను. ఎదురుగా అద్దంలో ఆమె శరీరం ఇంకా స్పష్టంగా ప్రతిబింబిస్తున్నది.

ఆమె తృప్తిగా నవ్వింది. "నా ఒంటి మీదున్నవన్నీ నావే!" అని అన్నది.

కాంతా కనకాల్ని రెంటినీ ప్రక్క ప్రక్కనే పెట్టి చూస్తుంటే నాలో ఆవేశం పెరిగింది.

బిస్కట్ల నన్నింటినీ బెడ్ మీదకు అటు ఇటు నెట్టేశాను. ఉద్రేకంతో ఆమెను మీదికి లాక్కున్నాను.

ఆమె చేతి గడియారంలో టైమ్ ఏడయింది. నాలో ఆవేశం చల్లారిపోయింది. ఇక ఇక్కడినుంచి బయటపడటం

ఎలా అన్న ఆలోచన వచ్చింది.

"ఇక్కడినుంచి మరో ఊరికి పారిపోతేనో!" అంది.

"లాభం లేదు! ఈ ముఠాలో వ్యక్తులు ఇంకా వుండి వుంటారు! వాళ్లు మనని వెంటాడి చంపుతారు!"

"అమ్మో! అయితే మనకు ఇక గత్యంతరం ఏమిటి?"

"చెబుతాను! నా వెంట రా!"

ఇద్దరం రూమ్ లాక్ చేసి బయటికి బయలుదేరాం. టాక్సీలో పోర్టు వేపుగా నడిచాం. లాడ్జిలో గదులకు బాడుగ మూడు రోజుల వరకూ ముందే చెల్లించాడు ఆ వ్యక్తి. కొచ్చిన్ పోర్టుకు అవతలగా బోట్ క్లబ్ వుంది. అక్కడ రెండు మూడు మోటార్ బోట్లు వుంటయ్. నా దృష్టి అంతా అటే వుంది.

ఆమె ముసుగు తలమీదకు లాక్కుంది. ఇద్దరం బీచ్ వెంబడే పోర్టు దగ్గరకు చేరాం.

రాత్రివడం మూలాన బోట్ క్లబ్ నిర్మానుష్యంగా వుంది. వాచ్ మెన్ దగ్గరకు వెళ్ళాను.

"మేం ఈ ఊరికి కొత్త! ఈ ఒక్క రాత్రికి ఇక్కడ పడుకోనివ్వు! నీకు అయిదు రూపాయలిస్తాను" అన్నాను.

అతడు అనుమానంగా మా ఇద్దరి వంకా చూశాడు. "పోనీ ఏదన్నా లాడ్జికి వెళ్లకూడదూ?" అన్నాడు.

"మేమిద్దరం భార్యా భర్తలమే! లాడ్జింగ్ల్లో పోలీసుల గొడవగా వుంటుంది. నీకేం ఇబ్బంది వుండదు మా వల్ల. కావాలంటే మరో అయిదు రూపాయలు అదనంగా ఇస్తాను."

"సరే! అలాగే వుండండి!" అని మాకు లోపలకు దారి చూపించాడు.

అతడి చేతిలో పది రూపాయలు పెట్టాను. అతడి ముఖం విప్పారింది. గదిలోంచి పరుపు నొకదాన్ని తీసుకువచ్చి

చెప్పుకోండి చూద్దాం?

1. సూర్యుడు మొట్టమొదట ఉదయించే దేశం ఏది?

2. ప్రపంచంలో అత్యుష్ణ ప్రదేశం ఏది?

3. ప్రపంచంలో అతిచల్లని ప్రదేశం ఏది?

4. ప్రపంచంలో అతిగా వర్షాలు కురిసే ప్రదేశం ఏది?

5. ప్రపంచంలో పొడవైన గోడ ఏది?

6. అతివేగంగా పరిగెత్తే పక్షి ఏది?

7. మద్రాసు, సిలోన్లలో ఎన్ని వర్ష ఋతువులున్నాయి?

8. భూమియొక్క బరువెంత?

9. ప్రపంచంలోకెల్లా పెద్ద మ్యూజియం ఏది?

(:o:)

—'సంధ్య'

జవాబులు:

1. జపాను.
2. పాకిస్థాన్‌లోని జకోబాబాద్.
3. యు. ఎస్. ఎస్. ఆర్‌లోని వర్కోయాన్స్క్.
4. అస్సాంలోని చిరపుంజి.
5. చైనాలోని గ్రేట్ వాల్.
6. స్విఫ్ట్ పక్షి.
7. రెండు.
8. 600 మిలియన్ టన్నులు.
9. లండన్‌లోని ఆల్బర్ట్ మ్యూజియం.

హాల్లో నేలమీద పరిచాడు.

"నేను వాకిట్లో వుంటాను. మీరు ఇక్కడే పడుకోండి."
అని చెప్పి అతడు బయటకు వెళ్ళాడు.

అతడ్నే కనిపెట్టి చూస్తూ కూర్చున్నాను. అతడు తలుపుకు బయట తాళం పెట్టాడు. ఆ తర్వాత నింపాదిగా అడుగులు వేసుకుంటూ రోడ్డుమీదకు నడిచాడు.

బహుశా చుక్క వేసుకోవటానికి బయలుదేరి వుంటాడను కున్నాను. నాకు కావాల్సిందీ అదే.

లేచి నాల్గు మూలలా వెదికి రెండు ఆయిల్ టిన్నులు పట్టుకొచ్చాను. వెనుక వేపు తలుపు తీసుకుని సముద్ర మట్టానికి నీళ్ళమీద ఎత్తుగా వున్న ప్లాట్‌ఫారం మీదకు నడిచాను. ఒక మోటార్‌బోట్ టాంకు మూత తీసి ఆయిల్ పోశాను. మరో టిన్నుని స్పేర్‌గా వుంచాను.

లోపలకు వెళ్ళి సుందరిని పిల్చుకు వచ్చాను. బిస్కెట్ల సంచి మూతి గట్టిగా బిగించి నడుముకు కట్టుకున్నాను. ఇద్దరం బోటులో కూర్చొని బోట్ స్టార్ట్ చేశాను. ట్రబుల్ లేకుండానే బోట్ స్టార్ట్ అయింది.

శరవేగంతో బోట్‌ని ముందు కురికించాను. తీరం వెంబడి బారులు తీరిన లైట్లు క్రమేపీ దూరమవుతున్నాయ్.

ఒక చేత్తో స్టీరింగ్‌ని పట్టుకుని మరో చెయ్యి సుందరి భుజంమీదవేసి దగ్గరకు లాక్కున్నాను. బోట్ స్పీడ్‌కి గాలి వలన చలిగా వుంది. ఆమె స్పర్శ వెచ్చగా తగుల్తోంది. ఆమె గూడ అదే స్థితిలో వుందేమో ఆమెగూడ నన్ను గట్టిగా అను కొని కూర్చున్నది.

తెల్లారేసరికి మేము చాలాదూరం వెళ్ళిపోతాము. ఆ తర్వాత మేము ఎవరికీ దొరక్కుండా వెళ్ళిపోతాం అను కున్నాను.

తెల్లారుతూనే మా బోట్ మీదకు గాలి ఉధృతంగా వీచ సాగింది. గాలి దుమారం మా వెనుకవేపు నుంచీ వీచటం వలన మా ప్రయాణం ముందుకే సాగింది.

అయితే ఆ ప్రయాణం ప్రచండమైన తుఫానులోకి అని మేం తెలుసుకోవటానికి అట్టే సేపు పట్టలేదు.

పెను తుఫానులో మోటార్‌బోటు ఊగిపోతోంది. గేర్స్ మార్చి ఇంజన్‌ని తగ్గించాను. గాలి ఎటువీస్తే అటుగా పోతు న్నది బోట్.

అంతలో పెద్ద అలలేచింది. మా బోట్ తాటిచెట్టు ప్రమా ణంలో నీళ్ళమీద పైకి లేచింది. మళ్ళీ బోటు క్రింద పడే సరికి మేమిద్దరం బోటులో లేము. మళ్ళీ మాకు బోటు కని పించలేదు. మేమిద్దరం గట్టిగా ఒకర్నొకరం పెనవేసుకు పోయాము.

మరోగంట గడిచేసరికి నీళ్ళలో మునుగుతూ మళ్ళీ పైకి తేలుతూన్న మా ఇద్దరికీ స్పృహ తప్పిపోయింది.

* * *

మాకు తెలివి వచ్చేసరికి సముద్రం ప్రశాంతంగా వుంది. మేం పచ్చని గడ్డిపై పడివున్నాం. సుందరిని గూడ లేపాను. ఇద్దరం లేచి నిలబడ్డాం. నా నడుముకున్న సంచీ భద్రంగా వున్నదో లేదో తడిమి చూసుకున్నాం. సంచీ అలాగే చెక్కు చెదరకుండా వున్నది.

గడ్డిలో నాలుగడుగులు ముందుకు వేశాం. పచ్చని తాడు లాడిదేదో మానించి కొద్ది దూరంలో కదులుతోంది నెమ్మదిగా.

"సుందరీ! తప్పుకో! అదేదో కొండ చిలువగానీ, పెద్ద పాము కానీ అవచ్చు!" అంటూ ఆమెను ప్రక్కకు లాగాను.

నిజంగా అది చిన్న సైజు కొండచిలువే. అయితే దాని ఒంటిచుట్టూ రోమాలలాగ పచ్చని నాచు మొలిచి వుంది.

ఆ పచ్చని పొరలోంచి కళ్లుమాత్రం నల్లగా మెరుస్తున్నయ్.

అంతే! ఇద్దరం కాళ్ళకు బుద్ధి చెప్పాం. పరుగెత్తి పరుగెత్తి ఒకచోట ఆగాం. అక్కడ పచ్చగడ్డికాని నాచుగాని లేదు. అంతా ఇసుకలాగ వున్నది. వంగి ఆ ఇసుకను చేతిలోకి తీసుకొని చూశాను. అది ఇసుక అనిపించలేదు. ఏదో ఖనిజ సంబంధమైన ఇసుకలా కనుపించింది.

ఏది ఏమైతేనేం! ఇక్కడకు పాములు రావనిపించింది. ఇద్దరం అక్కడే కూలబడిపోయాం.

ఆకాశంలో ఇంకా మబ్బు దట్టంగా వుంది. ఇక మాకు తిండీ తిప్పలూ ఎలాగా అని ఆలోచించాను. ఈ దీవిలో తినటానికి తిండీ, త్రాగటానికి నీరూ దొరక్క అల్లాడిపోయి చచ్చిపోతామేమో అనిపించింది.

ఎంత గాలించినాగాని ఆ దీవిలో తినడానికి పనికివచ్చే పదార్థం ఏదీ దొరకలేదు.

రెండు రోజులు ఆహారం లేకుండా గడిపాం. సుందరి నీరసంతో సొమ్మసిల్లి పడిపోయింది.

నేను ఏదన్నా జంతువన్నా దొరుకుతుందేమో అని దీవి లోపలకు వెళ్ళాను.

దీవి లోపల అంతటా పచ్చని నాచుపెరిగి ఉంది. కొన్ని చోట్ల గడ్డిలా పెరిగిఉంది. చెట్లమీదగూడ అదే పెరిగింది.

అంతలోనే ఏదో చెట్టుకొమ్మ విరిగి క్రిందపడి నిటారుగా నిలబడిందా అన్నట్టుగా ఎదో జీవి, అంతవరకూ చెట్టు కొమ్మమీద కూర్చున్నాడేమో, నన్ను చూడంగానే క్రిందకు దూకి నా వంకకు రాసాగాడు.

అతడి ఒళ్ళంతా రోమాలకు మల్లే రెండడుగుల పొడవున పైనించి క్రిందవరకూ గడ్డిలాంటి నాచు పెరిగి జడల్లాగ

క్రిందకు వ్రేలాడుతోంది. అతడి కళ్లు మాత్రమే కనబడుతున్నయ్.

బహుశా, ఆ వ్యక్తి మా లాగానే దారితప్పి వచ్చివుండాలనుకున్నాను.

ఎందుకో ఆ వ్యక్తిని చూడంగానే నాలో ఎక్కడలేని భయం పట్టుకుంది. ఏదో క్రూరమృగాన్నో. దయ్యాన్నో. భూతాన్నో చూసిన వాడిలా పరుగు లంకించుకున్నాను.

తోటి మనిషిని భయపెడుతున్న తన అవతారం వంక మరోసారి చూసుకుని ఆ వ్యక్తి సిగ్గుపడి ఉండాలి. నన్ను వెంబడించటం మాని వెనక్కు వెళ్ళి మళ్లీ చెట్టుకొమ్మమీదకు ఎక్కి కూర్చున్నాడు.

నన్ను చూస్తూనే సుందరి ఏదో తప్పు చేస్తున్నదానిలా ముడుచుకుని కూర్చుంది. నా నుంచి ఏదో దాచటానికి యత్నిస్తున్న దానిలా కనుపించింది.

నాకు ఆమెపై జాలి కలిగింది. ఆమె ఆ స్థితికి రావటానికి నేనే కారకుడ్ని. నాలోని అత్యాశ దీనికంతా కారణం. పోనీ నేనొక్కడ్నే పారిపోయి వచ్చినా బాగుండేది. సుందరన్నా నాగరిక ప్రపంచంలో సుఖంగా మిగిలిపోయి ఉండేది.

సుందరిని చూసి "ఏమిటి? ఏమయింది?" అని సానుభూతితో అడిగాను.

ఆమె మాట్లాడడానికి నోరు తెరిచింది. ఆమె నోట్లో కనుపించిన దానివంక చూసి నా హృదయం విలవిల్లాడింది. ఆ దీవిలో అడుగడుగునా పెరుగుతూన్న గడ్డిని ఆమె తింటోంది, ఆకలికి తాళలేక.

"నీవూ తిను! ఏం చేస్తాం? లేకపోతే ఆకలికి చచ్చిపోతామేమో! ఇదిగూడ తియ్యగా బాగుందికూడా తినటానికి" అంటూ గడ్డిపరకల్ని నాకు అందించింది.

నాకు నవ్వాలో, ఏడవాలో తెలియలేదు. నాకు కడుపులో ఆకలి దహించుకు పోతున్నది. రెండు రోజులుగా నోట్లో ఏమీ వేసుకోలేదు. నేనుగూడా ఆ గడ్డినే తిన్నాను.

మరునాటికి మేము తిన్న ఆహారం పనిచేయ నారంభించింది. మా ఒళ్ళంతా గడ్డిలాంటి నాచు మొలుచుకురా నారంభించింది. చిన్నకొమ్మ విరిచిన కొయ్యతో ఆ నాచుని రుద్దేశాం. కాని అది మళ్ళీ మొలచుకు వచ్చింది.

ఒకర్నొకరం చూసుకొని గుండె చెరువయేలా ఏడ్చాం. అయినా ఆ నిర్మానుష్యమైన దీవిలో మా గతి ఆలకించే నాధుడెవరు?

నాలుగురోజులలో మేము మనుష్యులలోంచి జీవరాసుల్లోకి మారాము. మా ఒంటిచుట్టూ స్పాంజిలా నాచు పెరిగిపోయింది.

మేము మామూలుగా ఉన్నప్పుడు మమ్మల్నిక్కడ నుంచీ బయటకు చేర్చగలిగిన నౌక ఒక్కటీ రాలేదు.

ఇప్పుడు మీరు వచ్చారు. కాని మేము నాగరిక ప్రపంచంలోకి రాలేని వ్యక్తుల మయిపోయాం. కుష్ఠువ్యాధి కన్న భయంకరంగా ఉన్న మా శరీరాల్ని తోటి మానవులకు ఏ ముఖం పెట్టుకొని చూపగలం? అందుకే మీకు వెలుగులో నా శరీరాన్ని చూపటం ఇష్టంలేక దీపం తీసివెయ్యమని అడిగాను.

ఇదీ మా విషాదగాధ!

* * *

ఆ వ్యక్తి తన కథను ముగించాడు.

"అయితే ఆ బంగారాన్ని ఏం చేశావ్?" జోసఫ్ ఆశగా అడిగాడు.

"దానినిండా కూడా నాచు పేరుకుపోయింది. కోపంతో ఆ సంచీని దీవిలోకి విసిరేశాను బలంకొద్దీ!"

"రజాక్! ఆ దీవిమీదకు దిగి బంగారం వెతుకుదామా?" జోసఫ్ ఆత్రంగా అన్నాడు.

"సరేలే! నీ తెలివి తెల్లారినట్టే వుంది. అతని కథంతా విసిగూడ మళ్ళీ మొదటికి వచ్చావ్! బంగారంమీది ఆశతో దీవిలోకి వెడితే ఆ విషప్రభావంవల్ల నాచురోగం మనల్నిగూడ అంటుకుంటుంది! వద్దులే బాబూ! బ్రతికుంటే బలుసాకైనా తినవచ్చు!" అన్నాడు రజాక్.

"అంతే సార్! అంతే! అత్యాశకు పోయి బంగారం లాంటి మీ బ్రతుకులు పాడుచేసుకోవద్దు!" నీళ్ళమీదనుంచి ఆ వ్యక్తిగూడ రజాక్‌ని బలపరిచి, వెనుదిరిగాడు.

"వెలుగు వస్తోంది. తెల్లవారబోతోంది గాబోలు. నౌకను రెడీ చెయ్. లంగరెత్తేద్దాం!" రజాక్ అరిచాడు.

ఆకాశంలో బాగా వెలుగు ప్రసరించింది. జోసఫ్, రజాక్ ఇద్దరూ నీళ్ళమీదకు తొంగి చూశారు.

స్పాంజ్ లాంటి ఆకారం నీళ్ళమీద తేలుతూ ఈదుతూ ముందుకు పోతున్నది, నౌకకు దూరంగా జరిగిపోతూ.

"పాపం! అతడ్ని చూసి, మనిషి అంటే ఎవరూ నమ్మలేరు గూడాను" జోసఫ్ సానుభూతిగా అన్నాడు.

"అంతేరా! ఎంత చేసుకున్న వాళ్లకు అంత! పద పద! లోపల పని చూడు!" అంటూ రజాక్ క్యాబిన్ వేపు నడిచాడు.

జోసఫ్ నిట్టూర్పు విడిచి లోపలకు వెళ్లాడు, రజాక్ వెనకాలే!

★

క్రైమ్‌లో తమాషాలు

హత్య చేయాలి?

ఫిబ్రవరి రెండవ తేదీ వుదయం పదిగంటల ప్రాంతంలో డిటెక్టివ్ జాంగో ఆఫీస్ గదిలోకి ఓ యువతి వెళ్లింది.

"కూర్చోండి" మర్యాదగా అన్నాడు జాంగో.

జాంగో చూపించిన కుర్చీలో కూర్చుందా యువతి.

"మీ పేరేమిటి?" జాంగో అడిగాడు.

"జాణ" అందామె.

"బాగుంది. నన్ను ఏం చెయ్యమంటారో చెప్పండి."

"హత్య?"

ఉలిక్కిపడి, ఏలాగో సర్దుకొని గొంతు సవరించుకున్నాడు జాంగో. "నేను హంతకుణ్ణి కాదు, డిటెక్టివ్‌ని" అన్నాడు నీరసంగా.

"మిస్టర్ జాంగో! నా మొగుణ్ణి ఈ రాత్రి పన్నెండు గంటలలోగా మీరు హత్య చేయాలి. రేపటి వెలుగుని నా భర్త చూశాడంటే, ఎల్లుండి సూర్యుడు వుదయిస్తాడో, లేదో చూడటానికి మీరుండరు ప్రాణాలతో" తాపీగా చెప్పిందా యువతి.

"నా పేరు మీ కెలా తెలుసు? ఏమిటి మీ వుద్దేశ్యం?" పిచ్చిగా జుట్టు పీక్కుంటూ అరిచాడు జాంగో.

కిలకిలా నవ్విందామె.

ముఖంమీద పట్టివున్న దట్టమైన చెమటల్ని తుడుచుకోసాగాడు జాంగో.

"ఏమంటావ్? ఫీజు ఎంత కావాలి?" ఏక వచనంలోకి దిగేసిందామె.

"అమ్మా! నీ మొగుడు నీకు చేసిన ద్రోహం ఏమిటి?"

"ఫూల్! భార్యకు భర్త ద్రోహం చెయ్యాలా? చెపుతున్నాను విను. నా మొదటి మొగుణ్ణి ఏడాది క్రితం చంపేసాను. మొదటి వాని లాగే రెండో మొగుడు కూడా 'దొంగతనాలు, కేబర్ డాన్సలు చెయ్యవద్దు' అని అంటున్నాడు నన్ను. నా భర్త బ్రతికివుండటం నా కిష్టం లేదు."

"అమ్మా! నీకో నమస్కారం. ముందు నా ఆఫీస్‌లోంచి బయటికి నడు."

ఆమె హేండ్‌బేగ్ లోంచి రివాల్వర్‌ని తీసి జాంగో గుండెలకు గురి పెట్టింది. చేతులు ఎత్తి కళ్ళు మూసుకున్నాడు జాంగో.

"నా మొగుణ్ణి హత్య చేస్తావా, లేదా?" ఆడపులిలా గర్జించిందామె.

"నన్ను చంపొద్దు ప్లీస్....నీ మొగుణ్ణి చంపుతాను" కీచుగా అరిచాడు జాంగో.

పకపక నవ్విందామె.

టకటక బూట్లు చప్పుడైంది.

జాంగో కళ్ళు తెరిచాడు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేతిలో ఆ యువతి గింజుకుంటూంది.

"ఇన్‌స్పెక్టర్! ఆమెను గట్టిగా పట్టుకో. తన భర్తను హత్య చెయ్యాలనే ప్లాన్ మీదుంది." కాలర్ సర్దుకుంటూ చెప్పాడు జాంగో.

"ఈ పిచ్చిదానికి అసలు పెళ్ళే కాలేదు. హాస్పిటల్లోంచి తప్పించుకొని, ఎక్కడో డమ్మీ రివాల్వర్ సంపాదించుకొని

ఇటువంటి న్యూసెన్సులు చేస్తూ తిరుగుతూంది. చివరికి ఇక్కడ దొరికి పోయింది'' చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

''ఆ!'' నోరు తెరిచాడు జాంగో.

—శశిభూషన్, తిరుపతి.

నేర్చుకొన్న పాఠం?

జైల్లో, కొత్తగా వచ్చిన ఖైదీతో పాత ఖైదీ మాటలు కలుపుతూ అడిగాడిలా—''చేసిన నేరం ఒప్పుకున్నావుట కదూ! నువ్వేనా?''

కొత్త ఖైదీ ''నేను నేరం చేయలేదు, నేను నిర్దోషిని'' అన్నాడు.

పాత ఖైదీ ఆశ్చర్యంతో, ''నువ్వే నేరం ఒప్పుకున్నావు గదా మరి!'' అడిగాడు.

కొత్త ఖైదీ అన్నాడు నెమ్మదిగా, ''అవు నొప్పుకున్నాను కాని నేను నిర్దోషిని.''

''అదేమిటి? నీకు పిచ్చిగానీ పట్టిందా?'' అన్నాడు పాత ఖైదీ.

''లేదు, నిజమే నేను చెప్పింది. పూర్తిగా చెబుతా నుండు'' అంటూ బీడీ వెలిగించాడు.

''కొన్నాళ్ళక్రితం ఒక కథ చదివాను. అందులో ఒకడు ఒకడిమీద పగ పెట్టుకొని, హత్య చేద్దామనుకొంటాడు. హత్యానేరం మీదపడకుండా తప్పించుకొందామని ఒక ప్లాన్ వేస్తాడు.

ఆ ప్లాన్ ప్రకారం అంతకు ముందునుంచీ ఏ హత్య జరిగినా, తానే చేసానని పోలీస్ స్టేషను కెళ్లి చెబుతుంటాడు.

కాని ప్రతిసారీ అతను హత్యచేయ్యలేదని రుజువై, అతన్ని పిచ్చివాడికింద లెక్క కడతారు పోలీసులు.

అతను చివరకు నిజంగానే అనుకున్న హత్య చేసేసి పోలీస్‌స్టేషన్ కొచ్చి తనే చేసానని చెబుతాడు యధా ప్రకారంగా. కాని అతన్ని పిచ్చోడని తన్ని తరిమేస్తారు.

నేనూ అలాగే చేద్దామనుకున్నాను. కాని మొదటిసారే, వేరే సాక్ష్యమేదీ దొరక్కపోవడంవల్ల, నాకు ఆరు సంవత్సరాలు జైలుశిక్ష వేసేసారు।'' అని ముగించాడు దిగులుగా.

— సి. కృష్ణప్రసాద్, విశాఖపట్టణం.

క్రికెట్ దెబ్బ!

ఇద్దరు మిత్రులు ఒక పార్కులో కలుసుకున్నారు.

ఒకడు: నిన్న నేను క్రికెట్ ఆడుతూ గట్టిగా బాల్‌ని కొట్టేసరికి అది వెళ్ళి దారినపోయే పెద్దమనిషికి తగిలింది.

రెండవవాడు: ఆ ఏమయ్యింది. వెంటనే వచ్చి నిన్ను బాగా చివాట్లు వేసాడా?

అతడు: కాదు। అసలు దెబ్బ తగలగానే స్పృహ తప్పి పడిపోయాడు. నేను పారిపోయొచ్చేశాను.

—తరుణశ్రీ, విజయవాడ.

కోడిదొంగ!

రమేష్ కోడిని చంకన పెట్టుకొని పోలీస్‌స్టేషన్‌లోకి అడుగెట్టాడు. అక్కడున్న హెడ్ కానిస్టేబిల్ నుద్దేశించి—

''ఇన్స్‌పెక్టర్ ఎక్కడికెళ్ళారు'' అని అడిగాడు.

''డి.యస్.పి. దగ్గర కెళ్ళారు. కాసేపుంటే వస్తారు. మీరేం పనిమీద వచ్చారు?'' హెడ్ కానిస్టేబుల్ అడిగాడు.

''మా కోడిని ఒకడు దొంగలించి తీసుకెళుతున్నాడు. వాణ్ణి పట్టి తెచ్చాము. బయట ఉన్నాడు చూడండి.''

హెడ్ కానిస్టేబిల్ బయటికి వచ్చి చూసాడు. రమేష్ స్నేహితులిద్దరు దొంగని పట్టుకొని వున్నారు.

"ఏరా కోడిని దొంగలించుకు వెళుతున్నావా" అడిగాడు.

"బాబూ. తప్పయింది. ఇంకోసారి చెయ్యను. ఈ తప్పు కాయండి" అన్నాడు ఏడుస్తూ.

హెడ్ తన చేతిలోని లాఠీతో కాళ్ళపై ఒక్కటి పెట్టాడు. వాడు 'అమ్మో!' అంటూ రాగం తీశాడు.

"వెధవా! ఏదీ నీ జేబులో ఏమేమి ఉన్నాయో తియ్యి" అని గద్దించాడు.

రెండు రూపాయల ఇరవై పైసలు తీశాడు ఆ దొంగ. హెడ్ వాటినందుకొని.

"వీణ్ణెలా పట్టుకున్నారండి" అంటూ రమేష్‌వైపు చూశాడు.

"మా తాతగారు ఆఫీసునుండి వస్తున్నారుట. ఇంటికి దాదాపు యాభై గజాల దూరము ఉండగానే, వీడు కోడిని చూపెట్టి, "కొనుక్కుంటారా" అని అడిగాడట.

అప్పుడు తాతయ్య కోడిరంగు, దానికాలికున్న ఎర్ర రంగు దారమూ చూసి, మన కోడిలాగుందే అనుకొని, చేతికి తీసికుని "ఎంతకిస్తా"వని అడిగారుట.

"పది రూపాయలు. గ్రుడ్లుపెడుతోందని" అన్నాడుట వీడు.

"ఆరు రూపాయల కిస్తావా" అని తాతయ్య అడిగితే, వీడు ఒక్కొక్క రూపాయి తగ్గిస్తూ చివరికి "సరే తీసు కోండి" అన్నాడుట.

అప్పుడు తాతయ్యకి ఇది మనకోడేనని రూఢి అయింది. ఇది దొంగలించిన కోడి కాకపోతే ఇంత తక్కువ కిస్తాడా అనుకొని, "ఇంటికి రా పైసలిస్తానని" కోడిని తనే

తీసుకొని ఇంటివైపు వస్తున్నారుట.

ఇల్లు దగ్గరవుతూంటే వీడు తన సంగతి బైటపడు తుందని భయపడి. మా తాతయ్య చేతిలోనుండి కోడిని లాక్కొని పరుగెడుతున్నాడు. నేనూ, నా ఫ్రెండ్స్‌తోవస్తూ, తాతయ్య కేకవిని వీణ్ణి పట్టుకున్నాం.''

"ఏరా దొంగ వెధవా! ఇంకోసారిలా చేశావంటే తోలు తీస్తాను. వెళ్ళు'' అంటూ రెండు అంటించాడు హెడ్.

''నా పైసలు-'' అంటూ నసిగాడు వాడు.

హెడ్ మళ్ళీ లాఠీ పైకెత్తేసరికి పరుగులంకించుకున్నాడు

''మీ కోడి గుడ్లు పెడుతోందా'' అడిగాడు హెడ్.

"అవునండి. ఇక వెళతాను'' అన్నాడు రమేష్.

''ఇంతదూరం తెచ్చి మళ్ళీ తీసుకెళతారా. ఇచ్చేసి వెళ్ళండి'' అన్నాడు నెమ్మదిగా హెడ్.

''ఎవరికీ! నీకా!"

''అహా! మా ఇన్స్‌పెక్టరుగారికే.''

''ఇన్స్‌పెక్టర్ ఇలాంటివి తీసుకోరుగా."

''అహహ నాకే. మళ్ళీ ఏం మోసుకెళతార్లెండి.''

"అదిగో వస్తున్నారుగా. నాన్నగారి నడిగి యిచ్చేసే వెళ్తాను'' అంటూ వస్తూన్న ఇన్స్‌పెక్టర్‌ను చూశాడు రమేష్.

హెడ్‌కు తెరిచిన నోరు అలాగే వుండిపోయింది.

—ఎమ్. ఎన్. ప్రకాశరావు, సికింద్రాబాద్.

మరపురాని మనిషి

తన ఫేవరెట్ హీరో సినిమా విడుదల రోజున టికెట్ దొరక్క ఆయాసపడుతున్న జగన్నాధానికి టికెట్ అందజేసి,

మిత్రుడయ్యాడు ఓంకారరావు.

ముక్కూ మొఖం తెలియని ఓంకారరావుతో స్నేహం చేసిన జగన్నాధం, ఒకనాటి సాయంకాలం కొత్తమిత్రుడితో షికారు బయలుదేరాడు.

నెమ్మదిగా నడుస్తున్నారు ఇద్దరూ.

"హల్లో రాంబాబుగారూ, బాగున్నారా" అన్నాడు ఎదురుగా వస్తున్న మనిషిని చూపి ఓంకారరావు.

"ఏమిటోయ్ రావూ నీకు చాలామంది స్నేహితులోయ్."

"అవును మిష్టర్ జగన్నాధం. వీరందరూ నేనంటే పడిచస్తారు. వీరే కాదు. నాకోసం ఇంకా చాలామంది ఉన్నారు. నా కలయికకోసం ఉవ్విళ్ళూరుతూ. అదే నా ప్రాముఖ్యత మరి. ఎవడైనా స్నేహం చేసాడా అంతే, నేనంటే పడిచచ్చేలా మార్చేస్తాను."

"నన్ను మార్చడం నీ తరం కాదోయ్" చటుక్కున అన్నాడు జగన్నాధం.

విరగబడి నవ్వాడు ఓంకారరావు.

"ఆఫ్టరాల్ నిన్నెంతోయ్ మార్చడం!"

"చూద్దామా!"

"పందెం."

"ఎంత?"

"నీ ఇష్టం."

"ఎవడు ఓడిపోతే వాడు మిలటరీ హోటల్‌లో డిన్నర్ చెయ్యాలి బ్రహ్మాండంగా."

"ఓకే."

"ఓకే."

"నిన్ను గేరంటీగా వారం రోజులలో నేనంటే పడి చచ్చేలా చేస్తాను."

ఇద్దరూ నవ్వుకున్నారు. వారిస్నేహం రోజురోజుకీ దృఢ పడ సాగింది.

వారంరోజులు అనుకొన్నట్టుగా గడిచాయి.

"జగన్నాధం!

నీవొట్టి ఫూల్‌వి! నేనంటే పడిచచ్చేలా, నన్ను మరచి పోలేనంతగా ఈ క్షణంనుంచి నిన్ను మార్చేసి పోతున్నాను. నీ గదిలోనుంచి అతిముఖ్యమైన వస్తువులు, నువ్వు దాచు కున్న 890 రూపాయలతో సహా తీసుకెళుతున్నాను. నాకోసం వెదికే వందలమందిలో నువ్వొకడివి. మరచాను. నేనేనెగ్గా ననుకొంటాను, మళ్ళీ కలిసినప్పుడు డిన్నర్ మరిచిపోకు!"

ఉత్తరం చదివిన జగన్నాధం అరటిపండు తొక్కమీద కాలేసి జారినట్టు జారిపడ్డాడు.

—పి. గోపాలరావ్, రాజమండ్రి.

దొంగ!

కటకటాల వెనకాల నిలబడి శూన్యంలోకి చూస్తున్నాడు పిక్‌పాకెట్ భీమరాజు, ఇంతలో ఒక పోలీసు వచ్చి, "నిన్ను సబ్-ఇన్‌స్పెక్టర్‌గారు రమ్మంటున్నారోయ్" అన్నాడు.

మెల్లగా గదిలోకి నడిచాడు భీమరాజు. లోపల ఇన్‌స్పెక్టర్ దర్జాగా సిగరెట్ త్రాగుతున్నాడు. అతడి చేతికి కొత్తగా ఒక పార్టీచేత కొనిపించుకొన్న రేకో, ఆటోమాటిక్ తళ తళ మెరిసి పోతూంది. "ఇదిగో భీమరాజూ! నిన్ను పొరపాటున అనుమానించి అరెస్ట్ చేశాం. కాని అసలు దొంగ దొరికిపోయాడు. ఇక నువ్ వెళ్ళొచ్చు" అన్నాడు నిర్లక్ష్యంగా.

భీమరాజుకు వళ్ళు మండిపోయింది. తమాయించు కున్నాడు. ఇన్‌స్పెక్టర్ విసిరిన రిజిష్టరులో డ్రాయర్ పై

నున్న పెన్‌తో సంతకం చేశాడు. పెన్, రిజిష్టర్ డ్రాయర్ పైన పడవేశాడు.

ఇన్‌స్పెక్టర్ కొత్తగా కొన్న వాచీ వేపొకసారి మురి పెంగా చూసి, దాన్ని తోసి టేబుల్ పైన అతిజాగ్రత్తగా పెట్టి. భీమరాజు అంతకుముందే అక్కడ ఉంచిన రిజిష్టర్ తీసుకొని అడ్డంగా తిప్పి ఏదో వ్రాయటం మొదలు పెట్టాడు.

"మరి నేను వస్తాను సార్।" అన్న మాట విని తల అడ్డంగావో. నిలువుగానో తెలియకుండా ఊగించాడు ఇన్ స్పెక్టర్. మరు క్షణం, డ్రాయర్‌పై నున్న వాచీ అతి లాఘవంగా భీమరాజు చిరుగుల చొక్కా జేబులోనికి గెంతింది.

పోలీస్‌స్టేషన్ నుండి బయట పడ్డాడు భీమరాజు. అతడి బుర్రలో ఆలోచనలు త్వరత్వరగా పరిగెడుతున్నాయి.

మరొక పావు గంటలోపలే ఇన్‌స్పెక్టర్ వాచీ పోయినట్లు తెలుస్తుంది. ఎలా? ఏం చేయాలి? బుర్ర వేడెక్కి పోతోంది. ఇంతలో తళుక్కున మెరుపు మెరిసినట్లు సుష్టుగా టిఫెన్ చేసి, సర్వర్ వేసిచ్చిన రెండున్నర రూపాయల బిల్ పుచ్చు కొని కౌంటర్ దగ్గరకు వచ్చి ఏదో గొణిగాడు.

హోటల్ మానేజర్‌కు అర్థమై పోయింది. "వీల్లేదు. పప్పు రుబ్బు" అన్నాడు. ఆఖరుకు ఎలాగైతేనేం, వాచీ తాకట్టుగా పెట్టి బయట పడ్డాడు భీమరాజు. బయటకు వస్తుంటే కూడ ఇంకో గంటలో డబ్బు పట్రమ్మని మరొక్కసారి గుర్తు చేశాడు మానేజర్.

హోటల్ నుంచి హుషారుగా ఇంటితోవ పట్టాడు, భీమ రాజు.

దారిలోనే ఇంటివైపు నుండి వస్తూ ఎదురు పడ్డారు ఇన్ స్పెక్టర్ మరియు పోలీస్.

''ఏంరా? నా వాచీ ఏం చేసావు?'' అంటూ ఇన్‌స్పెక్టర్ అడుగు తుండగానే పోలీసు గబగబా జేబులు వెతికేశాడు.

''ఇంటిదగ్గరా లేక ఇక్కడ ఇతని దగ్గరా లేకపోతే ఈ దారిలోనే అమ్మేసి ఉంటాడు'' అంటూ నిప్పులు కురిపించాడు ఇన్‌స్పెక్టర్. వెంటనే పోలీసు పరిగెత్తాడు. మరో పావు గంటలో చెమటలు కారుస్తూ వచ్చి ''అన్ని గడియారాల షాపుల్లోనూ వాకబు చేసానండి. ఎక్కడా ఎవరూ అమ్మి నట్లుగా చెప్పలేదు. ఇకపైన వస్తే మనకు తెలియ చేస్తా మన్నారు'' అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ నిప్పులు కక్కుతూ చూసి మరేమీ చేయలేక పోలీస్‌తో కలిసి స్టేషన్‌వైపు నడిచాడు, దిగాలుగా.

గబగబా ఇంటివైపు పరిగెత్తాడు భీమరాజు. ఇంట్లోనుండి డబ్బులు తీసుకొని హోటల్‌కి వస్తున్నాడు. అతడి మనస్సు ఆనందంతో పిచ్చిదై పోతూంది. తనను అనవసరంగా ఒక రోజు జైల్లో ఉంచిన ఇన్‌స్పెక్టర్‌ను మోసగించటమే కాక ఖరీదైన వాచీ కూడా సంపాదించ గల్గాడు.

హోటల్ మానేజర్ దగ్గరకు వెళ్లి రెండున్నర టేబుల్ పైన పడవేసి వాచీ అడిగాడు భీమరాజు.

మానేజర్ తాడెత్తున లేచి పడ్డాడు. ''స్కౌండ్రల్. నన్నే మోసం చేద్దామనుకున్నావా? చిరిగిన చొక్కా వేసుకున్న నీవు రేకో వాచి పెట్టుకుని వచ్చి, అదిక్కడ తాకట్టు పెట్టావంటే ఎవరైనా నమ్ముతారా? ముందు బయటికి పో'' అంటూ అరి చాడు ఎడమ చేతికి కొత్త వాచీ మెరుస్తుండగా.

—బి. శ్యామలాగాంధీ, భీమవరం.

గారడి !

ఒకసారి ఒకగారడివాడు వీధిలో కొన్ని తమాషాలు చేస్తు

న్నాడు. ఒక పెట్టెలో చిల్లపెంకులువేసి, మూతవేసి కాసే పటికి మూతతీసి "పెట్టెలో ఏముందో చూడండి" అని చుట్టూ చేరినవారిని అడిగాడు. పెట్టెలోని రూపాయి నాణె ములను చూచి అందరూ "రూపాయి బిళ్ళలు-రూపాయి బిళ్ళలు" అని ఒక్కసారిగా అరచారు.

ఆ దారిన పోతున్న పోలీసు అదివిని అక్కడకి వచ్చి గారడి వాడితో "ఏరా! ప్రజల్ని మోసంచేసి, డబ్బు తీసు కొని పోదామనుకున్నావా ఆ రూపాయిలు ఇలాతే!"అన్నాడు.

రూపాయలు తీసుకొని లెక్కపెట్టేటప్పటికి అవి కాస్త చిల్ల పెంకులుగా మారిపోయాయి. పోలీసు ముఖం వాడి పోయింది.

—ఐ. వెంకటేశ్వరరావు, నాయుడు పేట.

డబ్బాలో పిల్లల ఏడ్పులు?

తల్లితో తండ్రితో నెల రోజులనుంచి పోరుపెట్టి పెట్టి తన పంతంతో కొంచెం తక్కువ ధరలో పెద్ద సైజు రేడియో కొని తెచ్చుకున్నాడు సంతోషంతో రామరాజు.

తెస్తూనే తన చెల్లెలు తమ్ముడు కొంచెం అల్లరివారవటం వలన వారు ఎక్కడ చెడగొడుతారో అని భయంతో కొంచెం ఎత్తులో గోడకు మేకులుకొట్టి, ఓ చిన్న చెక్క అడ్డంపెట్టి, రేడియోను దానిపై పెట్టాడు. క్రొత్త సంతోషంలో రేడి యోని సౌండులో పెట్టాడు.

రేడియోలో ఒక నాటిక వస్తోంది.

ముచ్చట్లు అంటే చెవికోసుకునే రామరాజు నాయనమ్మ చేతికర్ర సహాయంతో రామరాజు గదిలోనికి వచ్చింది. ఆమె వచ్చేటప్పటికల్లా నాటకంలోని ఘట్టంలో చిన్నపిల్లల ఏడ్పులు వస్తున్నాయి.

"ఏందుకురా? డబ్బాలోంచి చిన్నపిల్లల ఏడ్పులు వస్తున్నాయి" అన్నది, రేడియోని చూస్తూ రేడియో అంటే ఏమిటో తెలియకపోవటం వలన.

కొంచెం గమ్మత్తు చేద్దామనే ఉద్దేశంతో రామరాజు.

"హా! ఏమీలేదు సోము, విజ్జీ ఆ డబ్బాలోనికి ఎక్కుతామని అల్లరిచేస్తే ఎక్కించాను. తీరా ఎక్కించిన తరువాత ఏడుస్తున్నారు దించమని. అంతే" అన్నాడు.

"ఏడిస్తే వూరుకుంటావట్రా!" అంటూ, "ఊరుకోండిరా దించుతాను" అంటూ చేతి కఱ్ఱతో డబ్బా (రేడియో)ను ఊపింది అంతే! రేడియో అంత ఎత్తునుంచి క్రిందపడి రెండు ముక్కలయింది.

ఇక చూడాలి రామరాజు ముఖం.

—హావంతీ రఘువిమల్ ప్రసాద్, బోరుగాం.

"దొంగ గాడిదలు"

కళ్ళు నులుముకొని 'టైమ్' చూసాను.

ఒంటిగంట అయింది.

బయట చిన్నగా తుంపరులు పడుతున్నాయి. కిటికీలన్నీ వేసి పడుకొన్నాను.

మరి నాకెందుకు-మెలుకువయినట్టు. మొద్దుబారిన నా బుర్ర కాస్త వేడెక్కింది.

అవును ఏవో అడుగుల చప్పుడు విన్పించింది. చెవులు రిక్కించి విన్నాను. తిరిగి అదే చప్పుడు. కనీసం నలుగురైదుగురన్నా వుండాలి. బయట వసారాలో అటు యిటు తిరుగుతున్నట్టున్నారు.

నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

ఉదయం బ్యాంక్ నుండి తెచ్చిన వెయ్యిరూపాయలు

పెట్టెలో వున్నాయి. రేపు ఆఫీసులో కట్టవలసిన పైకమది.

నాకు కంపరమెత్తింది. వారు నలుగురైదుగురుంటే నే నొక్కణ్ణి ఏం చేయాలి?

మెల్లగా లేచి తలుపు దగ్గరకు వెళ్ళి సందులోనుండి బయిటకు చూసాను.

బయట మసకమసకగా వుంది. అయినా. నా దృష్టి మూలగా నిలుచున్న నీడలపై బడింది.

వెంటనే పళ్ళు కోసుకొనే కత్తి చేతిలో తీసుకొని తలుపు తీయాలని చూసాను.

కాని వివేకం వెన్ను తట్టింది. ఉపాయంగా అందర్ని బంధించాలి. వారు పారిపోరాదు అని తలచాను.

మెల్లగా వెనుకవైపు పెరటి తలుపు వద్దకు పోయాను. వూపిరి బిగబట్టి నెమ్మదిగా తలుపుతీసి బయటపడ్డాను. తలుపు దగ్గరగా చేరవేసి కాంపౌండు గోడ దగ్గరకు పోయాను.

అక్కడినుండి ప్రక్క యింట్లోకి చూసాను.

నా ఆనందానికి అవధుల్లేవు. పరీక్షల సమయం కదా ముగ్గురు విద్యార్థులు అక్కడ కూర్చొని ఏదో వ్రాసుకుం టున్నారు.

నేను గోడదూకి వారి దగ్గరకు వెళ్ళాను. ఆవేళపుడు గోడదూకివచ్చిన నన్ను. వారు ఆశ్చర్యంతో నోళ్ళు తెరచి చూడసాగారు.

వారికి విషయం కాస్త క్లుప్తంగాచెప్పి. సహాయం చేయ మన్నాను. వారిలోని వుడుకురక్తం యింకా వేడెక్కింది. వెంటనే వారు నా వెంటవచ్చారు.

గోడవారగా నక్కుతూ మా యింటి ముందుకువచ్చిన మే మందరం ఒక్కసారిగాలేచి నిలుచున్నాము. ఎదుటి దృశ్యం చూపిన నా మొఖంలో రక్తపు చుక్కలేదు.

అక్కడ రెండు గాడిదలు నిలుచునివున్నాయి. అవి చలికి తోకలాడిస్తూ అటు, యిటు తిరుగుచున్నాయి. వాటి చప్పుడు మనుషుల అడుగుల చప్పుడువలెవుంది.

నేను సిగ్గుతో తలఎత్తి వెనుకనున్న వారికి ముఖం చూపలేకపోయాను.

కొంచం సేపలాగేవుండి నెమ్మదిగా తిరిగి చూసాను. అక్కడ ఎవరూలేరు. వారంతా నన్ను ఎగతాళిచేస్తున్నట్టుగా ఏమీ చెప్పకుండా వెళ్ళిపోయారు.

నాకు గాడిదలపై చెప్పలేనంత కోపం వచ్చింది. వాటిని బయటదాకా పరిగెత్తించివచ్చి పడుకొన్నాను.

ఆ విషయాన్నే ఆలోచిస్తూ మగతగాపడుకొన్న నాకు తిరిగి అదే చప్పుడు విన్పించింది.

సరే ఉదయం ఆ గాడిదల యజమానిని దులిపెయ్యాలని, ప్రస్తుతానికి కోపాన్ని అణుచుకొని దుప్పటి నిండుగా లాక్కొనిపడుకొన్నాను.

చప్పుడవుతూనేవుంది. కొంచం సేపటికి అదే జోల పాటగామారి నాకు నిదురపట్టేసింది.

ఉదయంలేచి చూసే సరికి నా పెట్టె తెరచివుంది. తిరిగి చూస్తే పెరటితలుపూ తీసేవుంది,

జరిగింది అర్థం చేసుకొనేసరికి.... నాకు పిచ్చెక్కుతుందేమో!

—కుమారి ఆర్. లలిత.

సంగీతపు వైకం!

నూతన దంపతు లిరువురు గాన ప్రియులు.

ఒక వెన్నెల రాత్రి తిండీ తిప్పలు మరచి గానామృతాన్ని గ్రోలుతున్నారు.

వారి ఇంటికివచ్చిన అతిధికి మాత్రం కడుపులో కోలు తోంది. అయినా సభ్యత కోసం వారు గానాలాపన ఎప్పుడు కట్టి పెడతారోనని ఎదురు చూస్తున్నాడు. చూపి చూసి విసుగుచెంది వారి చెంతకు వెళ్లాడు.

''నీవొంటి మెరుపునై నే నుండలేదా'' - భర్త గొంతు.

''నీ కంటి పాపనై నే నుంటి నోయీ'' భార్య ఆలాపన.

''మీ ఇంటి అతిధినై నే నుంటి గనుదోయీ'' కూని రాగం తీశాడు అతిధి.

అంతే, భార్యా భర్త లిరువురికి పట్టిన సంగీతపు మైకం వదిలింది.

—యం. సరళా సుదర్శన్, ఖాజాపూర్.

అపూర్వ పరిశోధన!

డిటెక్టివ్ నీరసం కిటికీలోంచి నీరసంగా చూస్తున్నాడు.

డిటెక్షన్‌కోసం తెప్పించిన జాతికుక్క టైగర్ కాళ్ళతో మన్ను తవ్వుతుండటం అతని కంటపడింది.

అతనికి మెరుపులా ఆలోచన వచ్చింది. నిజమే నిధి నిక్షేపాలు కనుగొన్నదో, శవాన్నే కనుగొందో తన టైగరు.

అతని ముఖం హఠాత్తుగా వెలిగిపోయింది.

ఒక్క పరుగులో తోటలోకెళ్ళి గునపం. పార తెచ్చాడు. పాంటు షర్టు ఊడదీసి వీధివైపున్న గోడమీదవేసి గునపంతో తవ్వడం ప్రారంభించాడు.

చెమట కారిపోతుంది. అయినా పట్టుదలగా తవ్వి పారతో ఎత్తి పారవేస్తున్నాడు.

ఎంత తవ్వినా ఏమీ కన్పించలా. అలసిపోయి ప్రక్కనే చెట్టుక్రింద చతికిలబడ్డాడు.

అంతవరకూ యజమానినే చూస్తున్న కుక్క గొయ్యి దగ్గరకి నడిచి లోపలకి తొంగి చూసింది. వెంటనే కాళ్ళతో కొంత మట్టి లోపలికి తోసి, తొట్టిలా చిన్నిగొయ్యిలా మాత్రం వుంచుకొని, దాని చుట్టూ తిరిగి తోకముడుచుకుని మట్టి చల్లదనాన్ని హాయిగా అనుభవిస్తూ తన బదులు కష్ట పడి తవ్విన యజమానిని కృతజ్ఞతగా; క్రీగంట, అరమోడ్పు కన్నులతో చూస్తూ, పడుకుంది.

తెల్లబోయి గుడ్లెళ్ళబెట్టాడు డిటెక్టివ్ నీరసం.

—లత, ఉదయ.

ఐదేళ్ల కష్టాలు!

ఒక మంత్రిగారి పనివాడు షాపుకు వెళ్ళి గ్లిసరీన్ ఇమ్మన్నాడు.

షాపు యజమాని ''మంత్రిగారికి గ్లిసరీన్ ఎందుకు? దేశ రక్షణానిధికి ఏమన్నా నాటకం గానీ వేస్తున్నారా?'' అని అడిగాడు.

పనివాడు "అబ్బే. అదేం లేదు. ఎన్నికలొస్తున్నాయిగా మళ్ళీ. ప్రజల ఐదేళ్ళ కష్టాలు ఒక్కసారి వినాలి అందు కని!'' అని జవాబిచ్చాడు.

—కుమారి మారుపాక మంజురాణి, హైద్రాబాద్.

కుక్క కరుస్తుందా!

ఒక పల్లెటూరి రైతు, పట్టణంలోవుంటున్న తన బంధు వును కలుసుకోవడానికి పట్టణం వెళ్ళాడు. అక్కడ ముందు

హాల్లో పెద్దకుక్క. గొలుసుతో కట్టివేసియుండటం చూసి గేటు దగ్గరు కాపలావాడ్ని "ఆ కుక్క కరుస్తుందా?" అని అడిగాడు.

కాపలావాడు పల్లెటూరి రైతు అనుకొని అతడ్ని హేళన చేద్దామని "అది మంచివాళ్ళను ఏమీ అనదు" అన్నాడు.

పల్లెటూరి రైతుకు కాపలావాడి హేళన అర్థమయింది.

"ఓహో, అందుకే మిమ్మల్ని ఏమి అనకుండా దాన్ని కట్టి వేసియుంచారా?"

—కుమారి మారుపాక మంజురాణి, హైద్రాబాద్-44.

"ధరలు"

తండ్రి:-రేయ్! ఈనెల నుండి డబ్బు ఎక్కువ పంపించమన్నావ్. ఏమిటి విశేషం? కాలేజీలో ఫీజులేమైనా పెంచేశారా?

కొడుకు:-అదేం లేదునాన్నా! సినిమా థియేటర్లన్నింటిలో రేట్లు పెంచేశారు, అందుకని....!!

--ఎర్ర గులాబి, నాగిరెడ్డిపల్లె.

ఇక పెళ్ళొద్దు!

ఒకడు:-నేనింక జీవితంలో పెళ్లే చేసుకోనురా?

రెండవవాడు:- ఏం? ఎవరినయినా ప్రేమించి భగ్న ప్రేమితుడి వయ్యావా?

మొదటివాడు:-కాదు. మొన్ననే నా మ్యారేజి అయ్యింది.

— పానుగంట బదరీ, విజయవాడ. ★

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి, యీ నెల 10వ తేదీలోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా వ్రాయవచ్చును.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు "హోమ్ డెలివరీ" పాఠకులకు ఒక్కొక్కరికి రు. 20/-లు చొప్పున నగదు బహుమతి పంపుతాము. ★

గత నెల పోటీ ఫలితాలు

(1) ఆగస్టు '74 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

గురిచూసి పట్టుకో!
పట్టు వదలక దోచుకో!!

పంపినవారు: శ్రీమతి కళాలక్ష్మి (హోం. డె-21), 43/3 ఆర్. టి., విజయనగర్ కాలనీ, హైద్రాబాదు.

(2) ఆగస్టు '74 నెల "సప్లిమెంట్" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

చెలిచెంత సాహసం!
చెలికాని ఆగ్రహం!!

పంపినవారు: శ్రీ యం. శంకరరెడ్డి (హోం. డె-94), మెయిన్ రోడ్, బెల్లంపల్లి, ఆదిలాబాద్ జిల్లా.

పై విజేతలకు ఒక్కొక్కరికి రు. 20/-రు చొప్పున నగదు బహుమతి యీ నెలాఖరులోగా పంపబడుతుంది.

లేఖలు

''హోమ్ డెలివరీ'' వల్ల పత్రిక కొనకుండా పోటీలలో పాల్గొనే వారందరికీ గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లే. పంచవర్ష ప్రణాళికకన్నా పటిష్టమైన మీ ప్లానుకు నా అభినందనలు.

—కురుమద్దాలి విజయలక్ష్మి, విజయవాడ.

మీరు పోటి శీర్షికలో తెస్తున్న కొత్తకొత్త మార్పులను మెచ్చుకోలేకుండా ఉండలేకపోతున్నాను .''హోమ్ డెలివరీ'' స్కీమ్ ఎక్సలెంట్.

—వహీద్ ఖన్నా, హైద్రాబాద్.

మీరు నూతనంగా అనుసరించిన ''హోమ్ డెలివరీ'' స్కీమ్ పత్రికా ప్రపంచంలోనే విప్లవాత్మకమైనది. పాఠకుల సహకారం మీకు నూటికి నూరుపాళ్ళు వుంటుందని ఆశిస్తాను.

—ఆడారి వెంకటరమణ, నారాయణపురం.

మీరు సృష్టించిన ''హోమ్ డెలివరీ'' చాలా మెచ్చుకోదగ్గది. ముఖ్యంగా మాలాంటి పల్లెటూరువారికి ఎంతో లాభదాయకంగా వుంది.

—హెచ్. ఆర్. వి. ప్రసాద్, భోర్గాం.

''హోమ్ డెలివరీ'' స్కీమ్ చాలా సౌకర్యంగా వుంది, పత్రికా లోకంలో తొలిసారిగా ఈ స్కీమ్‌ను ప్రవేశపెట్టిన శ్రీ రెడ్డిగారు ఎంతైనా అభినందనీయులు.

ఈనెల కథలలో శశికుమార్‌గారి 'బావిలో శవాలు' నాకు నచ్చిన కథ. ఎంతకాదనుకున్నా దానిలోని విమలపాత్రపై సానుభూతి చూపకుండా వుండలేం.

'న్యాయం మరణించదు' పాఠక లోకంలో గొప్ప సంచలనం కలిగించే నవల. 'ముగ్గురు మూర్ఖులు' నవల కథాగమనం బాగున్నా రచయిత నవలకి టైటిల్ నిర్ణయించడంలో మరికొంత శ్రద్ధ వహించవలసింది. అందులో ముగ్గురేకాదు. చాలామంది మూర్ఖులున్నారు. లక్షలడబ్బును పిచ్చిగా ఇంట్లో దాచుకొన్న విష్ణువర్ధన్ మూర్ఖుడు కాడా? ఆడదానికోసం అనవసరంగా ప్రాణాలు కోల్పోయిన జోన్స్ మూర్ఖుడుకాడా? సుబ్బారావు మూర్ఖుడు కాడా? నవలకి 'అంతా మూర్ఖులే' అన్న పేరు పెడితే బావుండేది.

—సి. హెచ్. దుర్గాప్రసాద్, విజయవాడ.

అరుదైన నది మన 'అపస'
పసందైనవి మన 'జోక్స్'
రావు రావు మరే మంత్లీ లో!
ధరణిలో ప్రజలుమెచ్చే ఏకైక పత్రిక
పరుగెత్తాలి అది దొరకాలంటే బజారులోనైనా!
రిక్త హస్తాలతో రావాలి ఒక్క సెకండు లేటైనా.

—మిస్. సి. హెచ్. బాల, చోడవరం.

గతనెల "సప్లిమెంట్"లోని నవలలు చాలాబాగున్నాయి. ముఖ్యంగా 'న్యాయం మరణించదు' నవల నన్నెంతగానో ఆకర్షించింది. రచయితకు నా ధన్యవాదాలు తెల్పండి.

—ఎల్. జయరాం. కల్లుగుంట.

"సప్లిమెంట్"లో నవలల స్టాండర్డు బాగున్నది. రమణశ్రీ 'న్యాయం మరణించదు' కొత్తపోకడలో రచన సుస్నితంగా. ఈజీగా సాగింది. రమణశ్రీ గారిదే 'దేవీ కటాక్షం' కథ నన్నుబాగా ఆకట్టుకొన్నది.

—జి. రాజారెడ్డి, దేవలంపేట.

ఈనెల "సప్లిమెంట్"లో ప్రచురితమైన రమణశ్రీ

08942 - 23618

గారి 'న్యాయం మరణించదు' నవల కొంగ్రొత్త పోకడల్లో నడిచి, వారి కలం-బలం వురవళ్ళు త్రొక్కింది. ఆ నవల చలనచిత్ర రూపంలో వస్తే బాగుండు ననిపించింది. రచయితకు నా అభినందనలు తెలియజేయండి.

—కొండపల్లి వెంకటేశ్వరరావు, హైద్రాబాద్.

"హోమ్ డెలివరీ" స్కీమ్ చాలా సౌకర్యంగా ఉంది. "అపన" యొక్క స్టాండర్డు రోజురోజుకు విభ్రాంతిస్తోంది. కొత్తప్రతులు రెండూ చేతిలోకి వచ్చేసరికి ఎంతో థ్రిల్లింగ్ ఫీలవుతున్నాము. ఇక వరుసగా రెండూ చదువుట పూర్తయితేగాని పుస్తకాలు వదల బుద్ధవదు. వింతకాదుకాని నెలంతాకూడా "అపన" కోసం ఎదురు చూడటమే సరిపోతుందంటే నమ్మండి.

—గుంటూరు సుబ్బరాజు, తాడిపూడి.

ఆగస్టు'71 నెల అపన, సప్లిమెంట్ల ముఖచిత్రాలు అత్యంత ఆకర్షణీయంగా వున్నవి. హఠాత్తుగా చూస్తే ఏ ఫారన్ పత్రికో అనుకోవాల్సి వస్తుంది. థ్రిల్లింగ్, సస్పెన్స్ కథాబలంలను రంగరించిన కథలను అందించటంలో 'అపనకు' ప్రత్యేక స్థానమున్నది. డిటెక్టివ్ సాహిత్య వాహినిలో ఎన్నో పత్రికలు వెలసి కొట్టుకుపోయినా, నిరాటంకంగా తన ప్రతిభను నిలబెట్టుకొన్న ఏకైక డిటెక్టివ్ మాసపత్రిక "అపన" ఒక్కటే.

—యం.బి.కె. ప్రమీల, గుంటూరు.

Edited and Published by S. DAMODAR REDDY (phone: 36959), 3-4-554 Narayanaguda Hyderabad-500029, and printed at Kranti press, Madras-1

Blank Page

Regd.no: H/HD-9

'PRABHAKAR'